


ఎ. ఐ. మెదొవోయ్

భారతదేశ ఆర్థిక వ్యవస్థ

"ప్రగతి" ప్రచురణాలయం
మాస్కో

ఎ. ఐ. మెద్వేదేవ్

భారతదేశ ఆర్థిక వ్యవస్థ

''ప్రగతి'' ప్రచురణాలయం
మాస్కో

అనువాదం నిడమర్తి ఉమారాజేశ్వరరావు

А И Медовой

ЭКОНОМИКА ИНДИИ

На языке телугу

A I Medovoy

THE INDIAN ECONOMY

In Telugu

సోవియట్ యూనియన్‌లో ముద్రింపబడింది

$M\frac{0803000000-709}{014(01)-86}336-87$

విషయసూచిక

ప్రకరణం 1

వలస ఆర్థిక వ్యవస్థ రూపొందడం

1. వలస పరాధీనతకు ముందు భారతదేశ ఆర్థికాభివృద్ధి రేఖా చిత్రం

17వ శతాబ్ది చివరి నాటికి భారత భూప్రాంతంలో అత్యధిక భాగం (దక్షిణాదిలోని కొద్ది ప్రాంతాలు తప్ప) మొగల్ చక్రవర్తుల సామ్రాజ్యంలో భాగంగా ఉంది. దాదాపు యూరప్ భూభాగమంతటితో సమానమైన ఈ విస్తృత సామ్రాజ్యపు విడి భాగాల అభివృద్ధిలో కొన్ని ఉమ్మడి లక్షణాలనుబట్టి, రూపవైవిధ్యం ఎంతగా ఉన్నప్పటికీ, మొత్తంగా భారతదేశ ఆర్థిక నిర్మాణం గురించి అంచనావేయవచ్చు.

భారతీయ ఆర్థిక వ్యవస్థలో వ్యవసాయం ప్రధాన శాఖగా ఉండేది. ప్రాచీన కాలంనుంచి భారతదేశంలో అమల్లో వున్న భూమిపైన ప్రభుత్వ స్వామ్యమే ఆ కాలంలో వ్యావసాయిక సంబంధాలనూ, యావదార్థిక వ్యవస్థనూ ప్రభావితంచేసే నిర్ణాయక అంశంగా ఉండేది.

యావత్తు భూమి, అలాగే భారీ నీటి పారుదల నిర్మాణాలూ ప్రభుత్వ స్వామ్యంలో ఉండేవి. ఆర్థిక శాఖ అధికారులు భూములన్నింటినీ రిజిస్టరులో నమోదుచేసి, వాటినుంచి రావలసిన పన్నులను నిర్ణయించేవారు. సామాన్యంగా ప్రభుత్వ వాటా పంటలో 6వ వంతును మించి ఉండేది కాదు. పన్నుల వసూలు ఫ్యూడల్ ప్రభువులకు (జమీందార్లకు) విడిచిపెట్టబడేది. వారిలో ప్రతి ఒక్కరూ దేశంలో కొంత

భాగానికి బాధ్యత కలిగివుండేవారు వసూలుచెయ్యబడిన పన్నుల్లో కొంత భాగం ఫ్యూడల్ ప్రభువుకి మిగిలేది. అందుచేత ఈ వ్యవస్థ అతని రాబడికి ఒక సాధనంగా ఉండేది. ప్రభుత్వమే భూమి సొంతదారు కనుక శిస్తు, పన్నులు ఆచరణలో ఒకటిగానే ఉండేవి ఒక ఆస్తిగా భూమి ఆర్థిక ఫలదాయకతను ప్రభుత్వం నేరుగా శిస్తు రూపంలో లేక పన్నుల రూపంలో అమలుజరిపేది రైతాంగపు ప్రతిఫలం చెల్లింప బడని అదనపు శ్రమ ప్రధాన రూపం అదే.

ఉత్పత్తి సాధనాల సొంతదారుకీ, ఉత్పత్తిదారుకీ మధ్య సంబంధాన్ని ప్రతిబింబించే అదనపు శ్రమ హరణపు నిర్దిష్ట ఆర్థిక రూపం "యావత్తు సామాజిక వ్యవస్థయొక్క అంతరాంతర రహస్యాన్ని, గుప్త ప్రాతిపదికను, దానితోబాటు సార్వభౌమత్వ, పరాధీనతల సంబంధపు రాజకీయ రూపాన్ని, క్లుప్తంగా చెప్పాలంటే, తదనుగుణమైన రాజ్యపు నిర్దిష్ట రూపాన్ని"* వెల్లడిస్తుంది. భారతదేశంలో భూమిపైన ప్రభుత్వ స్వామ్యం, ఆ కారణంగా అదనపు ఉత్పాదితాన్ని సొంతపరచుకోవడం, పంపిణీల విశిష్టత దేశంలోని ఉత్పత్తి సంబంధాల కొన్ని విశిష్ట లక్షణాలను నిర్ణయించింది. ఏవో కొన్ని చెదురు బదురు దూర ప్రాంతాల్లో మినహాయించి, భారతదేశంలో ప్రైవేటు ఫ్యూడల్ స్వామ్యం వుండేది కాదు. ప్రైవేటు భూస్వామ్యపు ప్రధాన రూపమల్లా, దేశపు కొంత ప్రాంతాన్ని వంశపారంపర్య హక్కు లేకుండా కేటాయించే జాగీరు పద్ధతి. ఈ జాగీర్దారు భూమిని స్వయంగా సేద్యం చేసేవాడు కాదు. అతను చెయ్యవలసిన ముఖ్యమైన పని శిస్తు వసూలుచెయ్యడం. అత్యున్నత పాలకుడు జాగీర్దారుకి నీటి పారుదల నిర్మాణాలు, రోడ్లు, సైనిక దుర్గాలు, వగైరాలపైన అజమాయిషీ

---

* K Marx, *Capital*, v III, Progress Publishers, Moscow, 1974, p 791.

బాధ్యతలు అప్పగించేవాడు కాగా, ఫ్యూడల్ ప్రభువులు కేంద్ర అధి కారానికి ప్రతినిధులుగా మాత్రమే వ్యవహరించేవారు ఈ కారణంగా, వారికి పరిమితమైన రాజకీయ, ఆర్థిక అధికారాలు మాత్రమే వుండేవి

పాలక కులీనుల రాబడి మూలాధారం అత్యున్నత పాలకుడి చేతుల్లో కేంద్రీకరించబడిన అదనపు ఉత్పాదితం వారివారి యోగ్యతలనుబట్టి అతను దాన్ని వారికి పంచేవాడు. అదే సమయంలో, భూమిపైన వ్యక్తి గత స్వామ్యమూ, ఒకే భూస్వామిమీద రైతు వ్యక్తిగతంగా ఆధార పడటమూ లేకపోవడం సాపేక్షంగా స్వతంత్రమైన స్వయంపాలక గ్రామ సమాజాల ఉనికికి పరిస్థితులను కల్పించాయి అలాంటి సమాజాలు భూమిపైన లేక చేతివృత్తుల్లో శ్రమ నిర్వహణయొక్క ఒక ప్రత్యేక రూపంగా యూరప్‌లోను, ఆసియాలోను విస్తృత వ్యాప్తిలో ఉండేవి

భారతదేశపు వివిధ ప్రాంతాల్లో భిన్నభిన్న రకాల గ్రామ సమాజాలు ఉండేవి అవి ఆయా ప్రాంతాల్లోని ఆర్థికాభివృద్ధి స్థాయినీ, వాటి జనాభా చారిత్రకాభివృద్ధియొక్క కొన్ని లక్షణాలనూ ప్రతిబింబించేవి. అయితే, భారతీయ గ్రామ సమాజాన్ని యూరపియన్ తరహా వాటినుంచి వేరుచేసే కొన్ని ఉమ్మడి సాధారణ లక్షణాలు ఉన్నాయి అవి భారతదేశంలో 17వ శతాబ్ది అంతంలో ఉన్న ఆర్థిక వ్యవస్థను గురించి ఒక అభిప్రాయాన్ని ఏర్పరచుకోవచ్చు భారతదేశంలోని యావత్తు గ్రామీణ జనాభా సమాజాలకు చెందివుండేది ఆ గ్రామ సమాజాలు వ్యావసాయిక శ్రమకీ, చేతిపనివాడి శ్రమకీ మధ్య పితృస్వామిక సంబంధపు ప్రాతిపదిక కలిగివుండేవి ఆ సమాజాల్లో, లేక మార్క్స్ చెప్పినట్లు ''చిన్న తరహా పొత్తులు''లో, ప్రతి ఒక్కటీ తన సొంత స్వతంత్ర జీవితం సాగించేవి గ్రామాధికారి దానికి నాయ కత్వం వహించి పోలీసు, కోశాధికారి విధులను నిర్వహించేవాడు సమా జానికి దాని సొంత గుమాస్తా, బ్రాహ్మణుడు, ఉపాధ్యాయుడు, తలారి, జ్యోతిషుడు, వగైరాలు ఉండేవారు. ఈ కొలువులు మామూలుగా వంశ

పారంపర్య హక్కు కలిగివుండేవి. వాటిని నిర్వహించేవారు సమాజపు అగ్రగణ్యులుగా ఉండేవారు. చేసిన పనికిగాను వారు వస్తు రూపంలోను, డబ్బు రూపంలోను ప్రతిఫలం పొందేవారు కొన్ని సందర్భాల్లో ఈ ఉద్యోగులకు శిస్తు చెల్లించనక్కరలేకుండా లేదా తక్కువ శిస్తుకి పొలం ఇవ్వబడేది * సమాజ సభ్యులు రెండు గ్రూపులుగా వేరుపడి ఉండేవారు: పూర్తి హక్కులు కలిగినవారు, పరిమిత హక్కులు కలిగినవారు (సాధారణంగా అన్యులు). ప్రాచీన భారతదేశంలో సాగులోకి తీసుకురాని భూమి దండిగా ఉన్న కారణంగా గ్రామ సమాజాలు అన్యులకు స్వాగతం చెప్పి కొంతకాలం గడిచాక, స్థానిక ప్రజలు అనుభవించే పూర్తి హక్కులను వారికి కూడా ఇచ్చేవి.

భూమి సమష్టిగా సేద్యం చెయ్యబడేది. పండిన పంటలో సమాజ సభ్యులు ప్రతి ఒక్కరికీ వాటా లభించేది భారతదేశం ఆక్రమించుకోబడేందుకు ముందు నీటి సౌకర్యాలు కలిగిన భూములు సమాజపు పూర్తి సభ్యుల మధ్య ఎలాంటి ప్రతిబంధకాలూ లేకుండా పంపిణీ చెయ్యబడేవి. అయితే అప్పుడు సైతం మొత్తంగా సమాజమే భూమి సొంతదారుగా ఉండేది. సమాజపు పూర్తి సభ్యుడు సమాజపు భూమిలో ఒక భాగం మాత్రమే కలిగివుండేవాడు. ఆ భూమి సమాజ సభ్యుడుగా అతనికి చెందివుండేది.

గ్రామ సమాజపు పూర్తి సభ్యులు తమ భూమిని వారసులకు సంక్రమింపజేసేవారు. బీడు భూమి, పచ్చిక బీళ్ళు, పచ్చిక మైదానాలు పన్నులేని సమష్టి ఆస్తిగా ఉండేవి రైతుల ఆర్థిక కార్యకలాపాలమీద ప్రభుత్వం ఏ పరిమితులూ విధించేది కాదు భూమి సేద్యంచేసి శిస్తు

---

* Sachin Sen, *The Tenure of Agricultural Land*, The Politics Club, Calcutta, 1937, p 9

చెల్లించడమొక్కటే రైతుల విధిగా ఉండేది భూమి సేద్యం ప్రభుత్వ విధి కేంద్ర అధికారులు ప్రధానంగా ఖజానా నింపే యూనిట్లుగానే సమాజాలపట్ల ఆసక్తి కలిగివుండేవారు ఎందుకంటే, ప్రతి సమాజమూ తన సభ్యులందరికీ బాధ్యత కలిగివుంటుంది, కనుక ఇది పన్నుల (శిస్తు) వసూలుకు హామీ కల్పిస్తుంది.

భారతీయ గ్రామ సమాజం స్వయంసమృద్ధమైన ఉత్పత్తి యూనిట్ ఈ దృష్ట్యా, ప్రతి ఒక లేక దాదాపు ప్రతి ఒక కుటుంబమూ చేతి పనుల్లోను, వ్యావసాయిక శ్రమలోను నిమగ్నమైవుండి, తద్వారా ప్రతి కుటుంబమూ ఒక స్వయం సమృద్ధ యూనిట్‌గా వుండే యూరపియన్ గ్రామ సమాజంతో భారతీయ గ్రామ సమాజం విభేదిస్తుంది ప్రతి ఒక కుటుంబమూ మిగిలిన వాటినుంచి చాలామటుకు స్వతంత్రమైనది కనుక, యూరపియన్ గ్రామ సమాజంలో పరస్పర సంబంధాలను అది చాలావరకు బలహీనపరచింది

భారతదేశంలో చేతివృత్తులకు, వ్యవసాయ కృషికి మధ్య శ్రమ విభజన సమాజ సభ్యుల మధ్యనే కాని, కుటుంబ సభ్యుల మధ్య కాదు. సమాజ సభ్యుల్లో ఒక భాగం తనీగా వ్యవసాయ కృషిలో నిమగ్నులు కాగా మిగిలినవారు చేతివృత్తులవారు చేతివృత్తులవారు పంటలో కొంత భాగం పొందేవారు అందుకు బదులుగా వారు గ్రామ సమాజానికి చేతివృత్తుల ఉత్పాదితాలను సరఫరా చేసేవారు ఈ శ్రమ వ్యవస్థ గ్రామ సమాజంలో ఆంతరిక సంబంధాలను పెంపొందించింది, దాని స్థిరత్వాన్ని, బాహ్య ప్రపంచంనుంచి దాని స్వతంత్రాన్ని పెంచింది, దేశపు ఆర్థిక విభజనను శాశ్వతం చేసింది, పట్టణాలకూ గ్రామాలకూ మధ్య శ్రమ విభజనను ఆటంకపరచింది, దేశీయ మార్కెట్ రూపొందడాన్ని, సరుకు—డబ్బు సంబంధాల అభివృద్ధిని అరికట్టింది. దీనికి తోడు, యూరపియన్ గ్రామ సమాజానికి భిన్నంగా భారతదేశంలో గ్రామ సమాజం భూమిపైన ప్రభుత్వ స్వామ్యంతో అభివృద్ధిచెందింది, అది

భూమి అమ్మకాన్నీ, కొనుగోలునూ నివారించి, తద్వారా రైతాంగపు అస్తి, వర్గ భేదాన్ని నివారించింది.

భారతదేశంలో అమల్లో వున్న కుల వ్యవస్థ కూడ గ్రామ సమాజాలకు పరిమితం కావడం స్థిరమైన ఆంతరిక సంబంధాలు పెంపొందేందుకు దోహదం చేసింది. ఈ కుల వ్యవస్థ రైతుని ఒకానొక వృత్తికి కాకుండా, ఒకానొక సమాజానికి యుగయుగాలుగా బంధించివేసింది. మతం చేత ఆశీర్వదించబడిన కుల వ్యవస్థ భారతదేశంలో శాసనప్రాయమైనది. గ్రామ సమాజాల్లో అది శ్రమ విభజనను శాశ్వతంచేసి, ఉమ్మడి శ్రమలో ప్రతి వ్యక్తి భాగస్వామ్యపు నిర్దిష్ట రూపాలను కేటాయించింది.

మార్క్స్ ఉల్లేఖించిన ఒక బ్రిటిష్ పార్లమెంటరీ నివేదికలో ఇలా పేర్కొనబడింది: ''రాజ్యాలు ముక్కలైనా, పంచుకోబడినా వాటిని గురించి ప్రజలు పట్టించుకోరు. గ్రామం విచ్ఛిన్నం కాకుండా ఒక మొత్తంగా ఉన్నంతకాలం అది ఏ అధికారానికి బదలాయించబడినా లేక అది ఏ చక్రవర్తికి దఖలు చెయ్యబడినా వారు లెక్కచెయ్యరు. దాని ఆంతరిక ఆర్థిక వ్యవస్థ ఏ మార్పూ లేకుండా అలాగే ఉంటుంది.'' మార్క్స్ ఇలా వ్యాఖ్యానించాడు: ''ఆసియా తరహా నిరంకుశత్వానికి, స్తబ్ధతకి ఇంతకంటె ఘనిష్ఠమైన పునాదిని ఊహించడం కష్టమని అనుకుంటున్నాను.''*

తత్పర్యవసానంగా, భూమి సొంతదారులుగా కేంద్ర అధికారులు తమ అస్తినుంచి ప్రతిఫలం పొందే మిక్కిలి అనువైన రూపంగా మాత్రమే గ్రామ సమాజంలో ఆసక్తి కలిగివుండగా, గ్రామ సమాజం

---

* "Marx to Engels in Manchester, June 14, 1853," K. Marx, F. Engels, *Selected Correspondence*, Progress Publishers, Moscow, 1975, p. 80.

తన వంతులో రాజ్యం ఏమవుతుందన్న విషయంలో ఎక్కువ ఆసక్తి చూపేది కాదు. కేంద్ర అధికారానికీ గ్రామ సమాజానికీ మధ్య ఉన్న ఏకైక అనుబంధం శిస్తు, లేక పన్ను ఆ శిస్తును, కేంద్ర అధికారపు ఆస్తినీ, నీటి పారుదల నిర్మాణాలు, తదితర పబ్లిక్ వర్క్స్ – వీటిని ఏ సమాజమూ తను స్వయంగా కల్పించుకోలేదు – విని యోగించుకున్నందుకు ఒక చెల్లింపు రూపంగా గ్రామ సమాజం పరిగణించేది అందుకనే, శిస్తులు వసూలుచేసే ఫ్యూడల్ ప్రభువు ఒక దోపిడిదారుగా పరిగణించబడక ఒక రెవెన్యూ అధికారిగా పరిగణింప బడ్డాడు. తమ మాదిరిగానే కేంద్ర అధికారపు ఒక సేవకుడిగా పరిగ ణింపబడ్డాడు. అది కొంతమేరకు వర్గ శతృత్వాన్ని తగ్గించి, సామా జిక ప్రగతిని నిరోధించి, భారతీయ ఫ్యూడలిజాన్ని నిలిపి ఉంచేందుకు దోహదం చేసింది.

భారతీయ గ్రామ సమాజం స్థిరమైనదే అయినప్పటికీ, 17వ శతాబ్దంలో శ్రేణీకరణ క్రమం బలం పుంజుకోసాగింది ఈ క్రమం గ్రామాల్లో ఉత్పాదక శక్తుల అభివృద్ధిని ప్రతిబింబించింది

మొదట గ్రామ సమాజం సరిహద్దులలో సరుకు మార్పిడి మొదలై, అటు తర్వాత అది గ్రామ సమాజాల్లోపలనే అభివృద్ధిచెంది, సమాజ సభ్యుల ఆస్తి, వర్గ వ్యత్యాసాన్ని పెంపొందించింది అగ్రగణ్యులు (గ్రామ పెద్ద, అతని సహాయకుడు, గుమాస్తా, తదితర ఉద్యోగులూ) గ్రామ సమాజపు భూమిని ఆక్రమించి, దాన్ని తమ ప్రైవేటు ఆస్తిగా చేసుకో నారంభించారు జనాభాలోని ఈ బృందంనుంచే ఫ్యూడల్ ప్రభువుల వర్గం తలెత్తింది. గ్రామ సమాజపు శ్రేణీకరణ సమాజపు సభ్యుల్లో అత్యధిక సంఖ్యాకుల పరిస్థితిని ప్రభావితం చేసింది పూర్తి సభ్యుల్లో ఒక భాగం (భారతదేశపు దక్షిణ, మధ్య ప్రాంతాల్లో మిరాసీదారులు, బెంగాల్లో ఖుద్‌కష్త్‌లు) భూమి విషయంలో తమ వారసత్వ హక్కులను పటిష్ఠం చేసుకున్నారు. వారు అలాంటి హక్కులను సంపాదించుకొనే

వారు, లేక భూమి పునర్విభజన తరుణాల్లో మిక్కిలి సారవంతమైన భూములను, తరచుగా పన్ను లేని వాటిని చేజిక్కించుకొనేవారు. కొందరు పూర్తి సభ్యులు గ్రామ సమాజపు సేవకులచేత — ఆచరణలో మిక్కిలి భారమూ, మిక్కిలి కశ్మలమూ అయిన పనులు చేసే బానిసప్రాయులు — వెట్టిచాకిరి చేయించుకొనేవారు, అంతేకాకుండా పచ్చిక బీళ్ళు, పచ్చిక మైదానాలు, వగైరా సమాజ భూములపైన ప్రథమ హక్కులు పొందారు. భూమి తనఖా, ఆక్రమణలు అంతకంతకు తరుచుగా సంభవించాయి. సమాజంలో ఓ కొత్త సాంఘిక బృందం — భూమిపైన ఎలాంటి హక్కూ లేకుండా భూమిని కౌలుకి తీసుకునేవాళ్ళు — అవతరించింది. సాధారణంగా, కౌలుకి గాను వాళ్ళు పంటలో సగానికి పైగా యిచ్చెయ్యవలసి వుంటుంది.

సరుకు—డబ్బు సంబంధాలు గ్రామ సమాజంలోకి చొరబడటంతో, వ్యావసాయిక శ్రమకీ, చేతివృత్తుల శ్రమకీ మధ్య నూతన సంబంధాలు తలెత్తాయి. వ్యావసాయిక ఉత్పాదితానికీ, చేతివృత్తుల ఉత్పాదితాలకీ మధ్య ప్రత్యక్ష మార్పిడి నావాటికీ ఎక్కువ తరచుగా డబ్బు వినియోగంతో కూడిన కొనుగోళ్ళ—అమ్మకాల రూపాన్ని తీసుకొంది. సమాజపు చేతివృత్తుల రంగంలో ఉత్పాదక శక్తుల అభివృద్ధీ, సరుకు మార్పిడి పెరుగుదలా చేతివృత్తుల ఉత్పాదితాన్ని దాని ఉత్పత్తిదారు చేతుల్లోని ఒక సరుకుగా మార్చాయి. ఈ సరుకు సమాజం వెలుపల మరింత విస్తృతమైన మార్కెట్టుకి, పట్టణాలకి చేరుతూ వచ్చింది. ఇందుకు ప్రతిగా, పట్టణ చేతివృత్తిపనివాడి ఉత్పాదితం గ్రామ సమాజాలకు చేరుకోవారంభించింది. తద్వారా, యితోధికమైన శ్రమ విభజన సంభవించింది.

ఈ క్రమం సరసనే మరో క్రమం సాగింది: ఫ్యూడల్ ప్రభువులు తాము పర్యవేక్షిస్తూ వచ్చిన భూములను వంశపారంపరిక ఆస్తిగా మార్చుకునేందుకు ప్రయత్నించారు. భారతదేశంలో కేంద్రీకృతాధికారం స్థానంలో

క్రమంగా వేర్వేరు రాజ్యాలు ఏర్పడ్డాయి (బెంగాల్, అయోధ్య, హైదరాబాదు, వగైరాలు). ఆ క్రమం కూడా, సరుకుల మార్పిళ్ళ పెరుగుదల, కొత్త స్థానిక మార్కెట్లు, ఆర్థిక కేంద్రాల స్థాపన ప్రాతిపదికమీదనే జరిగింది.

క్రమంగా భూమిపైన ప్రభుత్వ స్వామ్య స్థానాన్ని ప్రైవేటు ఫ్యూడల్ స్వామ్యం ఆక్రమించింది. గ్రామ సమాజం తన సంకుచిత, పితృస్వామిక రూపాన్ని కోల్పోయింది. శక్తివంతమైన ప్రజా ఉద్యమాలు మొగల్ సామ్రాజ్య విచ్ఛిన్నాన్ని త్వరితంచేశాయి. ఈ క్రమాల్లో ఏ ఒక్కటీ పూర్తికాలేదు. భారతదేశంలో యూరపియన్ దేశాలు ప్రారంభించిన వలస యుద్ధాల మూలంగా ఈ క్రమాలకు అంతరాయం కలిగింది.

గ్రామ సమాజాల్లోని విడి సభ్యుల మధ్యా, పట్టణాలకీ గ్రామాలకీ మధ్యా నూతన సంబంధాలు తలెత్తాయి. ఈ సందర్భంగా భారతదేశంలో పట్టణాల ఆర్థిక పరిణామం విశేషాసక్తిదాయకమైన విషయం.

19వ శతాబ్ది ఆరంభం నాటికి సైతం భారతదేశ జనాభాలో 10 శాతానికి మించి పట్టణాల్లో నివసించడం లేదు. సమాజం వ్యావసాయిక శ్రమకి మాత్రమే కాకుండా చేతివృత్తిపనులకు కూడా కేంద్రంగా ఉంది. భూమిపైన ప్రభుత్వ స్వామ్యం మూలంగా రాజరిక పరివారానికి వ్యక్తిగత భూములు లేకుండా పోయాయి. దానితో భారతీయ పట్టణాలు ప్రభువర్గానికి, వారి సేవకులకి, సైన్యాలకి శాశ్వత నివాస స్థలాలు అయ్యాయి. ఇది వారి ఆర్థిక నిర్మాణాన్ని, దేశపు అభివృద్ధిలో పాత్రని ప్రభావితం చేసింది.

ఫ్యూడల్ ప్రభువులకు చేతివృత్తిపనివారిపైన విశేషమైన ప్రాబల్యం ఉంది. వాళ్ళు చేతివృత్తులవారిని భూదాసులతో దాదాపు సమానంగా చూసేవారు. పాలకుడి, ఫ్యూడల్ ప్రభువుల అవసరాలకోసం ప్రధానంగా తయారుచెయ్యబడే చేతివృత్తుల ఉత్పాదితాలు, వాటి విలువతో ప్రసక్తి

లేకుండా, తరచు ఏ చెల్లింపూ లేకుండా సొంతంచేసుకోబడుతూ ఉండేవి. చక్రవర్తినుంచి పొందే జీతం తప్ప మరే ఇతర ఆదాయమూ లేని భారతీయ కులీనులు చేతివృత్తిపనివారిని మాత్రమే కాకుండా, పెద్ద వర్తకులను కూడా దోస్తూ వుండేవారు.

అలాంటి పరిస్థితులు సహజంగావే పట్టణాల్లోని చేతివృత్తుల ఉత్పాదక శక్తుల అభివృద్ధిని జాగుచేసేవి. ఎందుకంటే చేతివృత్తులవారికి తమ ఉత్పాదితాన్ని పెంచడంలో ఆసక్తి ఉండేది కాదు. ఇది విభిన్న ప్రాంతాల మధ్య వర్తక, ఆర్థిక సంబంధాల పెరుగుదలను ఆటంక పరచేది. భారతదేశంలోని పట్టణాలన్నీ ప్రభువర్గపు శక్తిని చవిచూసేవి. అయితే పాలక అగ్రగణ్యులపైన పట్టణ జనాభా పరాధీనత స్థానిక, కేంద్ర ప్రభుత్వాల ఆవాసాలైన పట్టణాల్లో, సైనిక దుర్గాలు, వగైరాల్లో మిక్కిలి బలంగా అనుభూతమయ్యేది. సంఖ్య రీత్యా అలాంటి పట్టణాలు ఎక్కువ లేకపోయినప్పటికీ, వాటిలో జీవితం దేశపు రాజకీయ జీవితంలో వచ్చిన మార్పులచేత పూర్తిగా నిర్ణయింపబడేది. రాజవంశాల్లో వచ్చే మార్పులు, రాజ ఆస్థానికుల్లో వచ్చిన మార్పులు కొన్ని సందర్భాల్లో పట్టణాల పూర్తి వినాశానికి దారితీశాయి. అలాంటి కేంద్రాల్లో మార్కెట్టు ప్రభువర్గపు, ఆస్థానపు అవసరాలచేత పరిమితం చెయ్యబడి, చేతివృత్తిపనివారల ఉత్పాదితం పట్టణపు పొలిమేరలు దాటి బయటికి వెళ్లేది కాదు. తత్ఫలితంగా చేతివృత్తులు, కొత్త శ్రమ వ్యవస్థీకరణ రూపాలూ చాలా మెల్లగా అభివృద్ధిచెందాయి.

పవిత్ర పట్టణాలు, ముస్లిం, హిందూ మత కేంద్రాలు చాలా వరకు ఇవే తరహావి. అలాంటి పట్టణాల్లో చేతివృత్తుల ఉత్పత్తి విశిష్ట ప్రత్యేకత కలిగి, దేవాలయ పాత్రలకి, రాగి వస్తువులకి పరిమితం చెయ్యబడేది. ఈ వస్తువులు సాంప్రదాయికమైనవిగా తయారయి, కొన్ని శతాబ్దాలపాటు ఏటేటా తయారుచెయ్యబడుతూ వచ్చాయి.

17, 18 శతాబ్దాల్లో వర్తక మార్గాల్లో ఆర్థిక కేంద్రాలుగా

ఆవిర్భవించిన పట్టణాలూ, రేవు పట్టణాలూ చేతివృత్తుల ఉత్పత్తి కేంద్రాలుగా నానాటికీ అధికతర పాత్ర వహించనారంభించాయి. అలాంటి పట్టణాల్లో చేతివృత్తుల కార్మికులు అప్పడే ప్రభువర్గంకోసం మాత్రమే కాకుండా భారతదేశం లోపల, దాని సరిహద్దుల బైట మరింత విస్తృతమైన మార్కెట్‌కోసం కూడా షపిచేసేవారు. అలాంటి పట్టణాల పెరుగుదల సరుకు—డబ్బు సంబంధాల కార్యాచరణ రంగాన్ని పెంచింది, సమీప గ్రామాలనుంచి చేతివృత్తి కార్మికులను, రైతులను సరుకు మార్పిడుల్లో నిమగ్నులను చేసింది. మొదట స్థానిక మార్కెట్ల ఏర్పాటును, అటుతర్వాత దేశపు వివిధ ప్రాంతాల మధ్య మరింత సన్నిహితమైన ఆర్థిక సంబంధాలను పెంపొందించింది. ఇది తిరిగి తన వంతులో వాటి మధ్య శ్రమ విభజనకు దారితీసి, వాటి వర్తక సంబంధాలను దృఢపరచింది. అలాంటి పట్టణాల్లో ఫ్యూడల్ ప్రభువర్గపు అధికారం మరింత తక్కువ ప్రాబల్యం కలిగి ఉండేది. కాగా వర్తక, వడ్డీ పెట్టుబడులు అధికతర పాత్ర వహించాయి. అక్కడ కూడ చేతివృత్తుల ఉత్పత్తి పాత రూపాలు మరింత త్వరితంగా విచ్ఛిన్నమయ్యాయి. సరుకు మార్పిడుల విస్తరణ, దేశపు విభిన్న ప్రాంతాల మధ్య నూతన సంబంధాల రూపాల ఆవిర్భావం, పెద్ద వర్తక పట్టణాల (ఢక్కా, పాట్నా, వగైరా) అభివృద్ధి — ఇవి చేతివృత్తుల ఉత్పత్తిలో ప్రగాఢమైన ఆంతరిక మార్పులు లేనిదే సంభవించి ఉండేవి కావు. పెద్ద మార్కెట్లు, టోకు వ్యాపారం, అంతే కాకుండా విభిన్న ప్రాంతాల మధ్య కొద్ది గొప్పల్లో శాశ్వతమైన సంబంధాలూ చేతివృత్తిపనివాడి స్వాతంత్ర్యాన్ని రద్దుచేసిన వర్తక, వడ్డీ పెట్టుబడి భాగస్వామ్యం లేనిదే అభివృద్ధిచెందగలిగి ఉండేవి కావు. చెదురుబదురు చిన్న తరహా ఉత్పత్తి భారీ అమ్మకాల అవసరంతో రాజీ పొసగని వైరుధ్యంలోకి వచ్చింది. నిర్దిష్ట చారిత్రక పరిస్థితుల్లో ఈ వైరుధ్యం రెండు పద్ధతుల్లో పరిష్కరింపబడగలుగుతుంది. ఒక పద్ధతి ఏమిటంటే, మరింత

ధనికుడైన చేతివృత్తిపనివాడు భారీ అమ్మకాల నిర్వహణ బాధ్యతను తనపైన వేసుకోవడం. చిన్న తరహా చేతివృత్తులవారి ఉత్పాదితాన్ని అతను కొనేసి, క్రమంగా వారిని ముడిపదార్థాల మూలాధారాలనుంచి, వారి ఉత్పాదితాల మార్కెట్లనుంచి దూరంచేసి తను పిండ దశలో ఉన్న పెట్టుబడిదారుగా అభివృద్ధిచెందేకొద్దీ వారు తనకింద పనిచెయ్యక గత్యంతరంలేని స్థితి కల్పించడం. ఉత్పత్తిదారు ఏక సమయంలో వర్తకుడు, పెట్టుబడిదారు అయినప్పుడు చేతివృత్తిపనివారిలోంచి టోకు కొనుగోలుదారు ఆవిర్భావం పాత ఉత్పత్తి విధానపు విచ్ఛిన్నాన్ని ప్రతిబింబించి, దానిమీద కొద్దో గొప్పో విలువ నియమపు ప్రభావాన్ని సూచిస్తుంది. ఈవిధంగా, ఉత్పత్తిపైన ప్రాబల్యం వహించే ధనిక చేతివృత్తి పనివారి ఆవిర్భావానికి ముందు ఉత్పత్తిలో ప్రగాఢమైన ఆంతరిక మార్పులు జరిగాయి. పాత ఉత్పత్తి విధానపు ఈమాదిరి విచ్ఛిత్తి శ్రమ వ్యవస్థీకరణ నూతన రూపాల ఆవిర్భావానికి దారితీసి, ఉత్పాదక శక్తుల అభివృద్ధికి దోహదంచేసి, ఉత్పత్తి సాంకేతిక ప్రాతిపదికను మారుస్తుంది. ఈ సందర్భంగా, ఉత్పత్తిదారు ఆస్తి హరణం అతన్ని నేరుగా వేతన కార్మికుడిగా మార్చివెయ్యడంతో వర్తక పెట్టుబడినుంచి పారిశ్రామిక పెట్టుబడికి పరివర్తన చకచకా మధ్యంతర దశలగుండా సాగుతుంది. కాని పాత తరహా ఉత్పత్తియొక్క అలాంటి మౌలిక పరివర్తనకు గణనీయమైనంతటి దీర్ఘ సన్నాహ దశ అవసరం. చాల తరుచుగా ఒక నూతన వ్యాప్తికు మౌలిక పరివర్తనకోసం పరిస్థితులు పరిణతమవడం పెరుగుతున్న మార్కెట్ అవసరాలను అందుకోలేదు. చేతివృత్తుల్లో పెట్టుబడిదారీ వ్యవస్థయొక్క ఆమాదిరి అభివృద్ధి భారతదేశానికి విలక్షణమైనది కాదు. దేశంలో సాపేక్షంగా అభివృద్ధిచెందిన బెంగాల్, గుజరాత్ వంటి ప్రాంతాల్లో పెట్టుబడిదారీ వ్యవస్థ ఈ పద్ధతిలో అభివృద్ధి చెందగలిగివుండేది.

ఈశాన్య భారతదేశంలో జౌళి, ఇనుము, పంచదార ఉత్పత్తిలో

పెట్టుబడిదారీ సహకారపు సరళ రూపాలు, కార్ఖానా ఉత్పత్తి పిండ రూపాలు ఉన్నట్లు వాస్తవాలు సూచిస్తాయి. కొన్ని సందర్భాల్లో అలాంటి ఉత్పత్తి స్వతంత్రులైన చేతివృత్తిపనివారిని కూలికి కుదుర్చుకొన్న ధనిక చేతివృత్తి కార్మికుడిచేత వ్యవస్థీకరింపబడేది. భారతదేశంలో చేతిపనుల వ్యవస్థీకరణ నిర్దిష్ట లక్షణాలను అధ్యయనంచేసిన సోవియట్ ప్రాచ్య విషయాల పరిశోధకులు అది చేతివృత్తిపనివారి శ్రేణీకరణ జరిగిన దశ అన్న నిర్ధారణకు వచ్చారు. అది "వేతన శ్రమను దోచుకునే సంపద్వంతమైన పైపొర ఒకవైపున, ఉత్పత్తి సాధనాలను కోల్పోయి తమ శ్రమను డబ్బు కూలికి కుదుర్చుకొనే చేతివృత్తిపనివారు మరొక వైపున కేంద్రీకరింపబడేందుకు"* దారితీసిందని అభిప్రాయపడ్డారు. భారతీయ చేతివృత్తుల ఉత్పత్తి పరిణామపు నిర్దిష్ట చారిత్రక పరిస్థితులు పెట్టుబడిదారీ ఉత్పత్తిలోకి భారీ స్థాయిలో కార్ఖానా ఉత్పత్తి పరివర్తనను ప్రోత్సహించలేకపోయాయి. పట్టణాల్లో ఫ్యూడల్ అధికారం యూరపియన్ దేశాల్లో కన్న చాలా బలంగా వున్న కారణంగా, భారతదేశంలో పెట్టుబడిదారీ పరిశ్రమల స్థాపన ఆలస్యమైంది. అందుచేతనే, పెట్టుబడి నిమ్నతర, నికృష్ట రూపాలు, అంటే, వర్తక పెట్టుబడీ, వడ్డీ పెట్టుబడీ అధికతర అభివృద్ధి అవకాశాన్ని పొంది, చేతివృత్తుల ఉత్పత్తిని లోబరచుకోనారంభించాయి.

సాధారణంగా, వర్తక, వడ్డీ పెట్టుబడికి చేతివృత్తుల ఉత్పత్తి లోబడడమన్నది నాలుగు దశల్లో సాగుతుంది. మొదట, యింకా స్వతం

---

* ఇ. ఎస్. కొమరోవ్, వి. య. గ్రాషె, "18వ శతాబ్ది చివరా, 19వ శతాబ్ది మొదట్లోనూ భారతదేశంలో సామాజిక శ్రమ విభజనను గురించిన, చేతివృత్తుల ఆర్థిక వ్యవస్థీకరణను గురించిన కొంత సమాచారం." – "ప్రాచ్య పరిశోధనా ఇన్స్టిట్యూట్ సంక్షిప్త నివేదికలు," మాస్కో, సం. XV, పేజి 16 (రష్యన్‌లో).

్రతులుగా ఉన్న ఉత్పత్తిదారులనుంచి చేతివృత్తుల ఉత్పాదితం కొని వెయ్యబడుతుంది; తర్వాత కొనుగోలుదారు రుణదాతగా వ్యవహరించడం మొదలుపెట్టి వర్తకాన్ని వడ్డీకి డబ్బును అప్పు యివ్వడంతో జోడి స్తాడు. చేతివృత్తిపనివాడు తరచు తను తీసుకున్న బాకీపైన వడ్డీని ఉత్పాదితం రూపంలో చెల్లించవలసివస్తుంది. వర్తకుడికీ, చేతివృత్తిపని వాడికీ మధ్య తరచు వ్యక్తిగత పరాధీనతాంశాలు తలెత్తుతాయి. క్రమంగా నగదుకి అమ్మకం, కొనుగోలు లావాదేవీల స్థానాన్ని వస్తురూపంలో చెల్లింపు ఆక్రమిస్తుంది. చివరికి వర్తకుడు, చేతివృత్తిపనివాడికి అతని పనికి అవసరమైన వస్తువుల రూపంలో చెల్లించడం మొదలుపెడతాడు. ఈ రూపాన్నే కొంత నగదు చెల్లింపుకి ముడి పదార్థాల పంపిణీ, సరుకుల ఉత్పత్తినుంచి వేరుచేసేందుకు ఇంకొక్క అడుగు మాత్రమే ఉంది. అప్పుడు చేతివృత్తిపనివాడు పెట్టుబడిదారుకోసం పనిచేసే వేతన శ్రామికుడు అవుతాడు, వర్తక పెట్టుబడి పారిశ్రామిక పెట్టుబడి అవుతుంది.

వర్తక పెట్టుబడి చేతివృత్తుల ఉత్పత్తిలోకి చొరుచుకువెళ్లే ఈ రూపాలన్నీ భారతదేశంలో సంభవించాయి. అయితే, 17వ శతాబ్దం లోనే, ఈశాన్య భారతంలో మిక్కిలి విస్తృత రూపంలో ఉన్న రూపం ఏమిటంటే, చేతివృత్తులవారికి నగదును అప్పుగా ఇవ్వడం. మరోలా చెప్పాలంటే, వర్తక పెట్టుబడి చొరబాటు వడ్డీకి డబ్బును అప్పు యివ్వడంతో ముడిపడిన రూపం అమల్లోకి వచ్చింది. చేతివృత్తిపనివారు తమ స్వాతంత్ర్యాన్ని కోల్పోయి, వడ్డీపైన డబ్బును అప్పు యిచ్చే వర్త కుడికి అధీనులవుతూ వచ్చారు.

క్రమంగా, భారతదేశంలో చెదురుబదురుగా ఉన్న స్వతంత్రులైన చేతివృత్తిపనివారు వర్తకులకు అధీనులయ్యారు. చేతి శ్రమ పరిణామవు ఈ రూపంలో ఉత్పత్తి విధానం చాలా నెమ్మదిగా మార్పు చెందింది. వర్తకుడు పరిశ్రమదారుగా కాక వ్యాపారిగా మారాడు. పాత ఉత్పత్తి

విధానాన్ని మౌలికంగా మార్చడంలో అతనికి ఆసక్తి లేకపోయింది కాని అతను దాన్ని నిర్దాక్షిణ్యంగా వినియోగించుకున్నాడు. కాగా పరిశ్రమల్లో పెట్టుబడిదారీ వ్యవస్థ అభివృద్ధియొక్క ఈ రూపం ఉత్పత్తిదారుపైన ప్రత్యేకించి భారప్రాయమైంది ఎందుకంటే, అది చేతివృత్తిపనివాడిని దీర్ఘకాలంపాటు బాధాకరంగా దోచుకోవడంతో ముడిపడివుంది

ఈ అభివృద్ధి పంథా భారతదేశానికి మాత్రమే విశిష్టమైనది కాదు కాని భారతదేశంలో పారిశ్రామిక పెట్టుబడిలోకి వర్తక, వడ్డీ పెట్టుబడి పరివర్తన యూరపియన్ దేశాలకన్న చాలా మెల్లగా సాగింది పట్టణాల్లోను, గ్రామీణ ప్రాంతంలోను ఆర్థిక వ్యవస్థీకరణను పూర్వ నిర్ణీతం చేసిన భూమిపై ప్రభుత్వ స్వామ్యం దేశపు సాంఘికా భివృద్ధిని కుంటుపరచింది

యూరప్‌లో పారిశ్రామిక పెట్టుబడి పుట్టుక, దానికి ప్రాథమిక సంచయనపు ప్రత్యేకతలు ఉండటం మూలంగా కూడా త్వరితం చెయ్య బడింది ఆవిర్భవిస్తున్న భారతీయ బూర్జువావర్గానికి యూరపియన్ దేశాల్లో మాదిరిగా వలస దేశాలనుంచి లభించిన కొల్లసొమ్ము, ప్రభుత్వ రుణాలు, రక్షణవాద విధానం, ప్రభుత్వాధికారాన్ని అన్వయించే తదితర రూపాల వంటి మూలాధారాలు అందుబాటులో లేకపోయాయి అందు చేత భారతదేశానికి ఫ్యూడల్ ఉత్పత్తి విధానాన్ని పెట్టుబడిదారీ ఉత్పత్తి విధానంలోకి మార్చి, కొన్ని మధ్యంతర దశలను మినహాయించడాన్ని త్వరితపరచగల పరిస్థితులు లేకపోయాయి.

భారతదేశంలో కార్ఖానా ఉత్పత్తి అభివృద్ధి మొదలైనప్పుడు, అది యూరపియన్ దేశాల వలసవాద యుద్ధాల మూలంగా తుంచివెయ్యబడింది భారతదేశాన్ని నిర్దాక్షిణ్యంగా దోచుకోవడం మొదలైంది వలసవాద దండ యాత్రల క్రమంలో దేశంలోని సాంప్రదాయిక ఆర్థిక సంబంధాలు తలకిందులయ్యాయి. పన్నుల రూపంలో దోపిడి విశేషంగా పెరిగింది వీట న్నింటి మూలంగా ప్రజలు అనేక బాధలకు గురయ్యారు దేశంలో

పెట్టుబడిదారీ సంబంధాల అభివృద్ధి చాలాకాలం వెనకబడింది. భారత దేశంలో ఒక నూతన దశ ఆరంభమైంది భారత ప్రజలను దీర్ఘ కాలంపాటు వలస బానిసత్వంలో ముంచిన దశ అది

2 పెట్టుబడి ప్రాథమిక సంచయన దశలో భారతదేశపు వలస దోపిడి రూపాలూ, పద్ధతులూ

భారతదేశంతోపాటు వలస దేశాల దోపిడి పెట్టుబడి ప్రాథమిక సంచయనంలో ప్రధాన పాత్ర వహించింది. భారతదేశంనుంచి తరలించుకుపోయిన అపారమైన సంపద యూరపియన్ పెట్టుబడిదారీ వ్యవస్థ, ప్రత్యేకించి బ్రిటిష్ పెట్టుబడిదారీ వ్యవస్థ అభివృద్ధిని త్వరితంచేసింది

భారతీయ సముద్ర జలాలలో ప్రవేశించిన తొలి యూరపియన్లు 1498లో వాస్కో డ గామా నాయకత్వాన పోర్చుగీసువారు నిజానికి భారతదేశంలో వలస దండయాత్ర, దోపిడీల యుగానికి నాంది పలికిన వారు పోర్చుగీసువారే. 1510లో పోర్చుగీసువారు పశ్చిమ తీరాన వున్న ప్రాచీన గోవా పట్టణాన్ని ఆక్రమించుకున్నారు ఆ పట్టణాన్ని కొల్ల గొట్టారు దాదాపు ఆ పట్టణ జనాభా యావత్తూ నశించిపోయింది. అయితే పోర్చుగీసువారు భారతదేశంలోని పెద్ద భూప్రాంతాలు వేటినీ ఆక్రమించుకోలేకపోయారు వారి వలస ప్రాంతాలు (గోవా, డామన్, డయ్యూ) 1961లో విముక్తం చెయ్యబడేదాకా మార్పులేని సరిహద్దు ల్లోపల ఉండిపోయాయి పోర్చుగీసువారు భారతదేశాన్ని గణనీయంగా ప్రభావితం చేసిన ఏకైక రంగం విదేశీ వర్తకం. 17వ శతాబ్ది ఆరంభందాకా భారతీయ వస్తువుల వర్తకంలో వారికి గుత్తాధిపత్యం ఉండేది. ప్రధానంగా పోర్చుగీసు వర్తకుల ద్వారానే భారతీయ సరుకులు విస్తృత

మైన ప్రపంచ మార్కెట్‌లోకి ప్రవేశించాయి, యూరపియన్ సరుకులు భారతదేశంలోకి చొరుచుకు రానారంభించాయి అయితే మొత్తంమీద, భారతీయ ఆర్థిక వ్యవస్థపైన పోర్చుగీసు ప్రభావం నామమాత్రమైనది. వారి వలస ప్రాంతాలు భారతదేశపు మిగతా ప్రాంతాలనుంచి వేరుపడి పోయాయి వారి రాజకీయ ప్రభావం ఈ ప్రాంతాల సరిహద్దులు దాటి బైటికి పోలేదు

డచ్చి, బ్రిటిష్ వర్తక శక్తి పెరుగుదల, తర్వాత 17వ శతాబ్ది ఆరంభంలో ఫ్రెంచి వర్తక శక్తి పెరుగుదల, వీటికితోడు ఫ్యూడల్ స్పెయిన్, పోర్చుగల్‌లు క్రమంగా బలహీనపడటం, యూరప్‌లో వాటి ప్రాముఖ్యం సన్నగిల్లడం — ఇవన్నీ భారతదేశంలో పోర్చుగీసు వర్తక గుత్తాధిపత్యాన్ని దెబ్బతీసేందుకు సానుకూల పరిస్థితులను కల్పించాయి. 17వ శతాబ్ది మొదట్లో బ్రిటిష్, డచ్చి వర్తకులు భారతదేశంలో ప్రవేశించారు ఆ శతాబ్ది మధ్యనాటికి డచ్చివారు కొలంబోను, భారతదేశపు మలబారు కోస్తాలోని కొన్ని ప్రాంతాలను ఆక్రమించుకొన్నారు. 18వ శతాబ్ది ఆరంభం నాటికి మొత్తం సింహళం వారి చేతుల్లోకి పోయింది భారత దేశంలో పోర్చుగల్ వర్తక గుత్తాధిపత్యం ముగిసిపోయింది భారతదేశం కోసం జరిగిన పోరాటంలో బ్రిటన్, ఫ్రాన్స్‌లు ప్రధాన ప్రత్యర్థుల య్యాయి 1757లో ఫ్రెంచివారూ, వారి పొత్తుదారైన బెంగాల్ నవాబూ ప్లాసీ యుద్ధంలో చిత్తుగా ఓడిపోయారు కాని భారత దేశంలో ఫ్రెంచివారి ప్రభావాన్ని పూర్తిగా తొలగించేందుకు బ్రిటిష్ వారికి మరికొన్ని సంవత్సరాలు పట్టింది భారతదేశంలో ఆంగ్ల ఫ్రెంచి వైర పర్యవసానం ఎక్కువ భాగం, యూరప్‌లో ఆస్ట్రియన్ వారసత్వం కోసం జరిగిన యుద్ధ (1756–1763) ఫలితాలచేత నిర్ణయింప బడింది ఏడేళ్ల యుద్ధంలో ఫ్రాన్స్ పరాజయం మూలంగా అది ఉత్తర అమెరికా, భారతదేశాల్లోని తన వలస ప్రాంతాలను కోల్పోయింది భారతదేశంలో దానికి కేవలం ఆరు పట్టణాలు మాత్రమే మిగిలాయి

భారతదేశంలో వలస యుద్ధాలు 19వ శతాబ్ది మధ్యదాకా కొనసాగాయి. 1848లో పంజాబు ఆక్రమింపబడిన తర్వాత మాత్రమే, భారత దేశంలో హిమాలయాలనుంచి కన్యాకుమారి అగ్రంవరకు యావత్ ప్రాంతం పైనా బ్రిటన్ తన వలస పాలనను నెలకొల్పుకొంది. 1599లో బ్రిటిష్ వర్తకులు స్థాపించిన ఈస్టిండియా కంపెనీకి భారతదేశాన్ని వలస బానిసత్వం కిందకి తేవడంలో ప్రత్యేక పాత్ర ఉంది.

ఆదిలో ఈ కంపెనీ భారతదేశంతో వర్తకంమీద గుత్తాధిపత్యంపైనా, ఈ గుత్త పెత్తనంనుంచి లభించే లాభాలపైనా మాత్రమే లక్ష్యం పెట్టింది. ఆ కంపెనీ భారతీయ సరుకులను కొని, వాటిని భారతదేశం వెలుపల అమ్మింది. అప్పట్లో భారతదేశానికి యూరపియన్ సరుకుల అవసరం లేకపోయిన కారణంగా, ఆ కంపెనీ భారతీయ సరకుల ధరను వెండి బంగారాల్లో చెల్లించేది. కాని ఆ పరిస్థితులు ఎక్కువ కాలం సాగలేదు. ఆ కంపెనీ క్రమంగా వర్తకంనుంచి భారతీయ ప్రాంతాల ఆక్రమణకూ, దేశపు ప్రత్యక్ష దోపిడీకీ మారింది. ఆ దశలో భారత దేశపు దోపిడి ప్రధాన లక్షణం సైనిక, వర్తక కొల్ల. విజేతలు రాజ భవనాలను, దేవాలయాలను, మొత్తంగా పట్టణాలను కొల్లగొట్టారు. శతాబ్దాల కాలంలో సంచితమైన సంపద వారి చేతుల్లోకి పోయింది. బంగారం బ్రిటన్‌కి, వర్తకుల, దగాకోర్ల, దుస్సాహసికుల, ఉన్నత ప్రభువుల జేబుల్లోకి ప్రవహించింది.

ప్లాసీ యుద్ధానంతరం ఈస్టిండియా కంపెనీ, నవాబును ఒక కీలుబొమ్మను చేసి బెంగాల్లో నిజానికి పౌర అధికారాన్ని హస్తగతం చేసుకొంది. భారతీయ చరిత్రకారుడు కె. ఎం. పణిక్కర్ పేర్కొన్నట్లు: "కౌన్సిల్ [కంపెనీ కార్యనిర్వాహక సంస్థ – ర||] చిత్తం వచ్చినప్పుడు డబ్బు తీసుకొనేందుకు నవాబు ఖజానా వుంది. కంపెనీ ఉద్యోగి ప్రతి వాడూ, కంపెనీ రక్షణ ఉందని చెప్పకొనే ప్రతివాడూ తన చిత్తం వచ్చినట్లు తిరుగుతూ, ఇతరులు చెల్లించవలసిన సుంకాలు తను చెల్లించకుండా

స్వేచ్ఛగా వర్తకం చేసుకొనేవాడు.''* ఆ వర్తకం ఎలా ఉండేదో బెంగాల్ నవాబు ఆంగ్ల ప్రభుత్వానికి 1762లో రాసిన లేఖనిబట్టి తెలుసుకోవచ్చు: ''వాళ్ళు [కంపెనీ గుమాస్తాలు – ర||] రైతులు, వర్తకులు, మొదలైనవారి వస్తువులను, సరుకులను వాటి విలువలో నాలుగో వంతు చెల్లించి బలవంతాన తీసుకుపోతారు. బలప్రయోగం, అణచివేత మార్గాల ద్వారా రైతులచేత ఒక రూపాయి వెల ఉండే వస్తువులకు అయిదు రూపాయలు కక్కించేవారు.''**

కంపెనీ వర్తక, వడ్డీ పద్ధతులను స్థానిక జనాభాను దోపిడీ చేసేందుకు విస్తృతంగా వినియోగించింది. దీనిలో వారు భారతీయ వర్తకుల, ఇంతకుముందే పేర్కొన్నట్లు చేతివృత్తుల ఉత్పత్తిలో బాగా లోతుకు చొరుచుకుపోయిన వడ్డీ వ్యాపారస్థుల తోడ్పాటుపైన ఆధారపడ్డారు. విస్తృత సంఖ్యలో చేతివృత్తులపనివారు కంపెనీ కట్టు కార్మికులుగా మార్చబడ్డారు. వారు తయారుచేసిన వస్తువులు స్థానిక వర్తకుల ద్వారా, వడ్డీ వ్యాపారస్తుల ద్వారా, అమల్లోవున్న మార్కెట్ ధరల్లో దాదాపు సగానికి కంపెనీ చేతుల్లోకి పోతూండేవి. చేతివృత్తుల వారు సంతకాలు పెట్టిన ఖరారునామాల ప్రకారం కంపెనీకి మాత్రమే పనిచెయ్యవలసి ఉండేది. బహిరంగ మార్కెట్లో తమ సరుకులు అమ్ముకొనేందుకు వారు అనుమతింపబడేవారు కారు. ఆ నిర్బంధ శ్రమ ఎంత భారప్రాయమైనదంటే, రోసిపోయిన తమ పని

---

* K. M. Panikkar, *A Survey of Indian History*, Asia Publishing House, Bombay, 1954, p. 195.

** Romesh Dutt, *The Economic History of India*, The Publications Division, Ministry of Information and Broadcasting, Government of India, v. 1, New Delhi, 1960, p. 16.

నుంచి తప్పుకోగలిగేందుకు "తమ [నేత కార్మికులు] బొటనవేళ్లను నరికివేసుకున్న సందర్భాలు ఉన్నాయి."*

బెంగాల్లో కంపెనీ నెలకొల్పిన ఆర్థిక వసూళ్ల యంత్రాంగం యావత్తూ కొల్ల ప్రయోజనానికి తోడ్పడింది. పన్నులే ఆదాయపు మూలాధారమయ్యాయి. ఈస్టిండియా కంపెనీ పార్లమెంటుకి సమర్పించిన నివేదిక ప్రకారం, బెంగాల్లో తన ఆరేళ్ల పాలనలో (1765 నుంచి 1771) దాని పన్ను రాబడులు 200 మిలియన్ల పౌన్లను మించింది. అవసరమైన ఖర్చులన్నీ తీరాక నికర లాభం 4 మిలియన్ల పౌన్లకు పైగా లండనుకి బదిలీచెయ్యబడింది. ఈ ఖర్చుల్లో నవాబు పోషణ, పన్నుల వసూలు ఖర్చులు, కమిషన్ల చెల్లింపు, పౌర, సైనిక వ్యయం, కంపెనీ ఉద్యోగులకు గృహ నిర్మాణం, కోటల నిర్మాణం, వగైరాలు ఉన్నాయి. అయితే, వాస్తవంలో ఈ లాభాలు యింకా అధికంగా ఉండేవి. ఎందుకంటే, పౌర, సైనిక వ్యయాలనబడే వాటిలో అధికాంశం — ఇది కంపెనీ ఉద్యోగుల ఆదాయాలతో కూడివుండేది — కూడా ఇంగ్లండుకి బదిలీచెయ్యబడేది.** కంపెనీ లాభాలు ఎంత ఎక్కువగా ఉండేవంటే, దాని వాటాదార్లకు వారు మదుపుపెట్టిన పెట్టుబడిపైన 100–250 శాతం డివిడెండ్లు చెల్లింపబడ్డాయి. భారతీయ విదేశీ వర్తకపు స్వభావం కూడా మారింది. భారతదేశపు స్వాతంత్ర్య కాలంలో అది వర్తకపు మిగులు కలిగి ఉండి, తన సరుకులకు పెద్ద మొత్తాల్లో వెండి బంగారాలు పొందగా, 18వ శతాబ్ది మధ్యలో ఒక్క బెంగాలే — ఎలాంటి నష్ట పరిహారమూ లేకుండా — తన దిగుమతుల మొత్తానికి పది రెట్లు ఎగుమతులు చేసింది.***

---

* అదే పుస్తకం, పేజి 19.

** అదే పుస్తకం, పేజి 33.

*** అదే పుస్తకం, పేజి 33.

ఈ పరిస్థితుల్లో వ్యాపార మిగులు దేశపు, దాని ప్రజల సంపద కొల్లని మాత్రమే తెలియజేస్తుంది.

ఆక్రమిత ప్రాంతాలు కూడా కొల్లకి గురి అయినవి. తమ ఆదాయాలను పెంచుకొనగోరిన కంపెనీ ఏజెంట్లు భూమిని ఆక్రమించుకొని, దాన్ని అమ్మేవారు, లేక బహిరంగ వేలాల్లో స్వల్పకాల వ్యవధులకు కౌలుకి ఇచ్చేవారు. సాధారణంగా ఆ భూమి కొత్త యజమానులు చట్టా వ్యాపారులు, వర్తకులు లేక వడ్డీవ్యాపారస్తులు అయి వుండేవారు. వారు రైతులను నిర్దాక్షిణ్యంగా దోచుకొనేవారు. రాబందుల్లాంటి చాలామంది దీనావస్థలో వున్న ప్రజలను కొల్లగొడుతున్నారని బెంగాల్ గవర్నరు సైతం స్వయంగా ఒప్పుకున్నాడు.* వలస పాలన కాలపు భావి వ్యవసాయ సంస్కరణలకి యిదే నాంది. కోట్లాదిమందికి ఆకలి, చావులే ఈ రాక్షస దోపిడి పర్యవసానం. బెంగాల్లో కంపెనీ కౌన్సిలు వేసిన అంచనాల ప్రకారం, ఒక కోటిమంది ప్రజలు, అంటే జనాభాలో మూడో వంతు మంది, 1770 దశకపు మొదటి సంవత్సరాల్లో ఆకలికి మాడి మరణించారు. ఆహార పదార్థాల వర్తకంలో తమకున్న గుత్తాధిపత్యం మూలంగా, కంపెనీ ఏజెంట్లు కరువును ఆదాయం పెంచుకునేందుకు వినియోగించుకున్నారు. భారతదేశంలోని విస్తృత ప్రాంతంలో ఉత్పాదక శక్తులు నాశనంచెయ్యబడుతున్నాయి. వ్యవసాయం, పరిశ్రమలూ పతనమవుతున్నాయి. సాంప్రదాయిక ఆర్థిక సంబంధాలు విచ్ఛిన్నం చెయ్యబడుతున్నాయి. సరుకు—డబ్బు సంబంధాల అభివృద్ధి మందగింపచెయ్యబడుతోంది. సుదూర భవిష్యత్తులోనైనా నూతన ఉత్పత్తి రూపాలు తలెత్తే అన్ని రకాల అవకాశాలూ కనీస స్థాయికి దిగజార్చబడుతున్నాయి. సాంస్కృతిక కేంద్రాలు శిథిలమై, కళలు స్తంభించి

---

* అదే పుస్తకం, పేజి 31.

పోవడంతో, భారతీయ ప్రజల పురా సంస్కృతి క్రమంగా క్షీణించ సాగింది.

3. బ్రిటిష్ పారిశ్రామిక పెట్టుబడిచేత భారతదేశపు దోపిడి

18వ శతాబ్ది చివర బ్రిటన్ శీఘ్ర పారిశ్రామికాభివృద్ధి పారిశ్రామిక బూర్జువావర్గపు ఆర్థిక, రాజకీయ స్థానాలను దృఢపరచింది. పారిశ్రామిక బూర్జువావర్గ ప్రతినిధులకు పార్లమెంటు ద్వారాలను తెరిచిన 1832 నాటి పార్లమెంటరీ సంస్కరణ దరిమిలా, బ్రిటన్ విదేశాంగ, దేశాంగ విధానాలు ప్రధానంగా వారి ప్రయోజనాలను ప్రతిబింబించనారంభించాయి. పారిశ్రామిక బూర్జువావర్గ ప్రయోజనాలను ముందుకు నెట్టిన బ్రిటిష్ పెట్టుబడిదారీ వ్యవస్థ చరిత్రలోని ఈ నూతన దశ భారతదేశపు వలస దోపిడిపట్ల వైఖరిని మార్చింది. ఆంగ్ల ప్రభువర్గం, వడ్డీ వ్యాపారులు, వర్తకుల ప్రయోజనాలకు ప్రాతినిధ్యం వహించే ఈస్టిండియా కంపెనీకి భారతదేశం ప్రధానంగా చౌక వస్తువులు, సామాన్యంగా కొల్లగొట్టడం ద్వారా లభించే ఇతర ఐశ్వర్యాలకు ఒక మూలాధారంగా అవసరమయింది. పారిశ్రామిక బూర్జువా వర్గం, భారతదేశాన్ని ప్రథమంగానూ, ప్రధానంగానూ బ్రిటన్ పారిశ్రామిక సరుకులకి ఒక మార్కెట్‌గానూ, పరిశ్రమలకు ముడి పదార్థాల మూలాధారంగానూ మార్చవలసిన క్లిష్టతర సమస్యను ఎదుర్కొంది. వర్తకులతో దీర్ఘకాలంపాటు జరిగిన నిష్ఠుర పోరాటంలో (క్లైవ్, హేస్టింగ్స్‌ల ప్రసిద్ధ విచారణలు ఈ పోరాటాన్ని ప్రతిబింబిస్తాయి) భారతదేశపు వలస దోపిడిలో పారిశ్రామిక బూర్జువావర్గం తన స్థానాలను పటిష్ఠంచేసుకొంది. ఈస్టిండియా కంపెనీ గుత్తాధిపత్యాన్ని భగ్నం చేసే తన ప్రయత్నాల్లో ఒక భాగంగా పారిశ్రామిక బూర్జువావర్గం

భారతదేశంలో దాని కార్యకలాపాలను బట్టబయలుచేసి తీవ్రంగా ఖండించింది.

భారతదేశ ప్రజల వలస దోపిడి వ్యవస్థలో పారిశ్రామిక పెట్టుబడి ప్రవేశపెట్టిన నూతన అంశాలు ఏమిటి? చౌక పారిశ్రామిక సరుకులను బ్రిటన్‌నుంచి ఎగుమతి చెయ్యడం ద్వారా వర్తక దోపిడి విధానానికి దోహదం చెయ్యబడింది. ఇది భారతీయ ఆర్థిక వ్యవస్థపైన వాస్తవంలో వినాశకర ప్రభావం కలిగించింది. 1794లో భారతదేశం బ్రిటన్‌నుంచి 156 పౌనుల విలువగల జౌళి సరుకులను మాత్రమే దిగుమతి చేసుకుంది. 20 ఏళ్ల తర్వాత, 1813లో ఈ దిగుమతుల విలువ దాదాపు 1,09,000 పౌన్లకు పెరిగింది. కార్ల్ మార్క్స్ ఉదహరించిన అంకెల మేరకు, బ్రిటన్‌నుంచి భారతదేశానికి దిగుమతి అయిన దారపు పరిమాణం 1818–1836కి మధ్య, 5 వేల రెట్లకు పైగా పెరిగింది. 1824లో భారతదేశానికి బ్రిటిష్ నూలు వస్త్రాల ఎగుమతి సుమారు 10 లక్షల గజాలు ఉండగా, 1837లో అది 6 కోట్ల, 40 లక్షల గజాలను మించింది.* 19వ శతాబ్ది మధ్యనాటికే, శతాబ్దాల తరబడి మొత్తం ప్రపంచానికి జౌళి సరుకులను, గాజు, లోహ వస్తువులను ఎగుమతిచేసిన భారతదేశం ఒక దిగుమతిదారుగా మార్చబడి, బ్రిటిష్ సరుకులను గణనీయంగా దిగుమతిచేసుకునే స్థితికి నెట్టబడింది. ''జౌళి సరుకుల అత్యున్నత ఉత్పత్తిదారు''గా మార్క్స్ పేర్కొన్న భారతదేశం బ్రిటిష్ వస్త్రాలతో ముంచెత్తబడింది. ఇది పట్టణాల్లోని, గ్రామాల్లోని చేతివృత్తులవారి వినాశానికి దారితీసింది. పాత చేతిపనుల ఉత్పత్తి రూపుమాపబడుతూం

---

* K. Marx, "The British Rule in India," in: K. Marx, F. Engels, *Collected Works*, v. 12, Progress Publishers, Moscow, 1979, p. 128.

డగా, వాటి స్థానంలో నూతన ఉత్పత్తి రూపాలు తలెత్తలేదు. భారత దేశం బ్రిటన్‌లో తయారైన చౌక పారిశ్రామిక సరుకులకు ఒక మార్కెట్‌గా మారిపోసాగింది.

ఉన్ని సరుకులు, ఇనుము కలిసిన, అయసేతర లోహాలు, గాజు వస్తువులు, పింగాణీ వస్తువులు — ఇవన్నీ కూడా బ్రిటన్‌నుంచి దిగుమతి చేసుకోబడుతున్నాయి. సాపేక్షంగా స్వల్పకాల వ్యవధిలో భారత దేశీయ మార్కెట్‌ను బ్రిటిష్ పారిశ్రామిక సరుకులు ఆక్రమించుకున్నాయి. దేశపు విదేశీ వర్తకంపై గుత్తాధిపత్యం సంపాదించడం ద్వారా, వలసవాదులు స్థానిక పరిశ్రమకు దాని సాంప్రదాయిక విదేశీ మార్కెట్లు లేకుండా చేశారు.

బ్రిటిష్ మార్కెట్‌కి సంబంధించినంతవరకు, దానికి కస్టమ్స్ సుంకాల రక్షణ ఉండేది. బ్రిటిష్ చరిత్రకారుడు విల్సన్ 19వ శతాబ్ది మొదట్లో భారతదేశ జౌళి, సిల్కు సరుకులు బ్రిటిష్ మార్కెట్లో, ఇంగ్లండులో తయారుచెయ్యబడినవాటికంటె 50నుంచి 60 శాతం తక్కువ ధరకి అమ్మినప్పటికీ లాభానికి అమ్మడం సాధ్యమై వుండేదని పేర్కొన్నాడు.* తమ సొంత పరిశ్రమల రక్షణకోసం, భారతీయ సరుకుల విలువపైన 70నుంచి 80 శాతంవరకు బ్రిటిష్‌వారు సుంకాలు ప్రవేశపెట్టారు. కొన్ని సందర్భాల్లో భారతీయ సరుకుల విలువపైన 400 శాతం సుంకాలు విధింపబడుతూ ఉండేవి.** అదే సమయంలో బ్రిటిష్ పారిశ్రామిక సరుకులు దాదాపు ఏ సుంకమూ లేకుండా భారత దేశంలో ప్రవేశించగలిగేవి. 1820 దశకంలో బ్రిటిష్ పారిశ్రామిక సరుకుల ధరపైన కేవలం 2.5 శాతం సుంకం మాత్రమే కలక

---

* పైన ఉదహరింపబడిన Romesh Dutt పుస్తకం, పేజి 187 చూడండి.

** అదే పుస్తకం, పేజి 209.

త్తాలో చెల్లింపబడింది. ఈ రక్షణవాద చర్యల ప్రాముఖ్యం గురించి వ్యాఖ్యానిస్తూ విల్సన్ అవి లేనిదే, మాంఛెస్టర్ మిల్లులను ఆవిరి శక్తితో సైతం నడపడం సాధ్యమైవుండేది కాదని వ్యాఖ్యానించాడు.* గమనీయమైన విషయం ఏమిటంటే, 19వ శతాబ్ది మొదట్లోనే బ్రిటన్ తన వర్తక విధానాన్ని మార్చి, రక్షణవాదానికి కాలం చెల్లి, అది తన ఉపయోగాన్ని కోల్పోయిందన్న విశ్వాసంతో అధికతర వర్తక స్వేచ్ఛ దిశగా సాగిపోయింది. 1820 దశకంలో దిగుమతిచేసుకోబడిన సరుకులపైన సుంకాలు 10–20 శాతం తగ్గించబడ్డాయి. భారతీయ సరుకులు మాత్రమే ఇందుకు మినహాయింపు అయ్యాయి. వాటిపైన సుంకాలు చాలా అధికంగా అలాగే ఉంచబడ్డాయి. దరిమిలా 1830 దశకంలో మాత్రమే భారతీయ సరుకులపైన సుంకాలు తగ్గించబడ్డాయి. అంటే, భారతీయ ఎగుమతులు విపరీతంగా పడిపోయి, అవి బ్రిటిష్ పరిశ్రమలకు ఇక ఎంతమాత్రమూ ప్రమాదకరం కావని తేలిన తర్వాత మాత్రమే ఈ తగ్గింపు జరిగింది. 1802లో బ్రిటన్ భారతదేశంనుంచి 15 వేల బేళ్ల జౌళి సరుకులను దిగుమతి చేసుకోగా 1829లో కేవలం 433 బేళ్లను మాత్రమే దిగుమతి చేసుకుంది.** కస్టమ్స్ సుంకాల తగ్గింపు, కొన్ని సందర్భాల్లో వాటి పూర్తి తొలగింపు ప్రప్రథమంగా ముడి పత్తి, ముడి సిల్కు, నీలిమందు వంటి ముడి పదార్థాలకు వర్తింప చెయ్యబడిందన్న విషయాన్ని నొక్కిచెప్పవలసివుంది. 1820 దశకం చివరికి భారతీయ ముడి పదార్థాల ఎగుమతి గణనీయంగా పెరిగింది. 1800లో భారతదేశం 5 వందల పత్తి బేళ్లను మాత్రమే బ్రిటనుకి ఎగుమతి చెయ్యగా, 1826లో 15 వేల బేళ్లను ఎగుమతి చేసింది. 1800లో 213 ముడి పత్తి బేళ్ళ ఎగుమతి కాగా 1828లో

---

* అదే పుస్తకం, పేజి 188.

** అదే పుస్తకం, పేజి 211.

10 వేలకి పైగా బేళ్ళు ఎగుమతి అయ్యాయి. అదే సమయంలో, ప్రపంచ మార్కెట్లో భారతదేశం నీలిమందు, టీ, నల్లమందుల మిక్కిలి పెద్ద సరఫరాదారు అయింది. వాటికింకా ఎక్కువ ప్రాముఖ్యం లేనందువ వలసవాదులు వాటిపైన కస్టమ్స్ సుంకాలను తగ్గించారు. కాని వారు చాలా కాలంపాటు స్థానిక సరుకుల ఉత్పత్తి, రవాణా, అమ్మకాలపై దేశం లోపల సుంకాల వ్యవస్థను ప్రవేశపెట్టి అలాగే ఉంచారు. జౌళి సరుకులపై దేశీయ సుంకాలు 17.5 శాతం, తోలు పాదరక్షలపై 15 శాతం, పంచదారపై 15 శాతంవరకు ఉన్నాయి. సుమారు 235 వస్తువులమీద అలాంటి సుంకాలు విధించబడ్డాయి.*

భారతదేశం క్రమంగా సామ్రాజ్య దేశానికి ముడి పదార్థాల సరఫరాదారుగా మార్చివెయ్యబడుతూ వచ్చింది. ఈ క్రమం, పారిశ్రామిక పెట్టుబడి అధికారానికి అంతిమ లొంగుబాటును పూర్తిచేసింది.

భారతదేశాన్ని తమ పారిశ్రామిక సరుకులకు మార్కెట్టుగా చేసుకోవడం ద్వారా, వలసవాదులు గ్రామ సమాజాల్లో చేతివృత్తులకీ, వ్యవసాయానికీ మధ్య ఉన్న సజీవ సంబంధాలను భగ్నంచేశారు. అంతకు ముందు కూడా, అంటే ఈస్టిండియా కంపెనీ వలసవాద ఆక్రమణల కాలంలో, పట్టణాల్లోని చేతివృత్తులకు వాటి సాంప్రదాయిక మార్కెట్లు లేకుండా చెయ్యబడ్డాయి. చౌక పారిశ్రామిక సరుకుల దిగుమతుల ద్వారా చేతివృత్తులపైన దెబ్బతియ్యబడింది. పట్టణాల్లోను, గ్రామాల్లోను చేతివృత్తుల పరిశ్రమ వినాశం, దానికి బదులుగా కార్ఖానా ఉత్పత్తిలో పెరుగుదల లేకపోవడం — ఇవి భారతదేశంలో గ్రామీణ జనాభా విజృంభణకు పునాది వేశాయి. దేశపు ఆర్థికాభివృద్ధికి ప్రధాన అటంకాల్లో దరిమిలా అది ఒకటైంది. అప్పట్లో భారతదేశ ఆర్థిక వ్యవస్థలో ప్రగాఢమైన ఆంతరిక మార్పులు సంభవిస్తున్నాయి — దేశం సామ్రాజ్య

---

* అదే పుస్తకం, పేజీలు 219–20.

దేశపు సరుకులకు ఒక మార్కెట్‌గానూ, దాని పరిశ్రమలకు ఒక ముడి పదార్థాల సరఫరాదారుగానూ బలవంతాన మార్చబడుతూ వచ్చింది.

18వ శతాబ్ది చివర భారతదేశంలో అమలుజరపబడిన భూమి, పన్నుల సంస్కరణలు కూడా ఈ క్రమంలో ఒక ముఖ్య పాత్ర వహించాయి. ఆ సంస్కరణలు దేశంలో అంతకుముందు ఉన్న ఆర్థిక సంబంధాల విచ్ఛిత్తిని విశేషంగా త్వరితంచేసి, గ్రామ సమాజాల విచ్ఛిన్నానికి దోహదంచేసి, భారతదేశాన్ని బ్రిటన్ పారిశ్రామిక సరుకుల మార్కెట్‌గానూ, దాని పరిశ్రమలకు ముడి పదార్థాల సరఫరాదారుగానూ మార్చేందుకు అనుకూలమైన పరిస్థితులను కల్పించాయి. ఈ సంస్కరణలకి కేవలం పన్ను లేక వ్యావసాయిక ప్రాముఖ్యంకంటె ఎక్కువ ప్రాముఖ్యం వుంది.

1793లో బెంగాల్, బీహార్, ఒరిస్సా రాష్ట్రాలకు సంబంధించిన శాశ్వత జమీందారీ విధానపు చట్టం ఆమోదించబడింది. ఆచరణలో ఈ జమీందారీ విధానపు అర్థం యేమిటంటే, భూమిపైన హక్కు వెనకటి పన్ను వసూలుదారులైన జమీందార్లకు దఖలుచెయ్యబడగా రైతులకు తమ భూమిపైన వంశపారంపర్యంగా వస్తున్న హక్కు రద్దు చెయ్యబడింది. ఆచరణలో రైతులు కౌలుదార్లుగా మార్చబడ్డారు. భూముల్లో కొంత భాగం ఫ్యూడల్ ప్రభువులకు వారి ప్రైవేటు ఆస్తిగా దఖలుపరచబడింది. ఆ భూములను "సీర్" లేక "ఖుద్‌కస్త్" అని పిలిచేవారు. శాశ్వత జమీందారీ ప్రాంతాల్లో జమీందారు చెల్లించే పన్ను ఒకేసారి శాశ్వతంగా నిర్ణయింపబడేది. తాత్కాలిక జమీందారీ ప్రాంతాల్లో అది ప్రతి 30–40 సంవత్సరాలకు ఒకసారి సవరించబడేది. ఈవిధంగా బ్రిటిష్‌వారు వెనకటి పాలకులనుంచి భూమిపైన సర్వాధిపత్యం పొందారు. అదే సమయంలో ఒక మాదిరి ప్రైవేటు ఫ్యూడల్ భూస్వామ్యాన్ని సృష్టించారు.

జమీందారు ఫ్యూడల్ భూస్వామి హోదాకి పెంచబడ్డాడు. అతను

భూమికి రైతునుంచి చెల్లింపు పొందుతూ వచ్చాడు ఈ సొమ్ములో కొంత భాగం భూమి పన్ను రూపంలో ప్రభుత్వానికి వెళ్ళేది కాని వలస పాలకులపట్ల అతను ప్రధానంగా డబ్బు వసూలుచేసే గుమా స్తాగా వ్యవహరించాడు. దీని అర్థమేమిటంటే, జమీందారు భూమి పన్ను చెల్లించడంలో విఫలమైతే, అతనికి భూమిపైన ఉన్న హక్కు తొలగింపబడవచ్చు ఈ సంస్కరణ జరిగిన మొదటి కొద్ది సంవత్స రాల్లో పరిస్థితి సరిగ్గా అలాగే ఉండేది. వలసవాదులు భారతదేశంలో భూమిపైన నెలకొల్పిన ఫ్యూడల్ ప్రైవేటు స్వామ్యపు నిర్దిష్ట లక్ష ణాలను ప్రతిబింబించే జమీందారుయొక్క యీ ద్వంద్వ హోదాయే, జమీందారీ విధానాన్ని బ్రిటిష్ ఎస్టేటు స్వామ్యపు వికృత ప్రతి రూపంగా వర్ణించేందుకు మార్క్సుకు ఆధారమైంది.

జమీందారీ వ్యవస్థను ప్రవేశపెట్టడంతో వలసవాదులు పన్ను రాబడిని పెంచుకోగలిగారు (జమీందార్లు రైతులనుంచి వసూలుచేసిన శిస్తులో 90 శాతందాకా అప్పగించాల్సి వుంటుంది), బ్రిటిష్‌వారినుంచి భూమి పొందిన జమీందార్లతో తమకు సామాజిక తోడ్పాటును కూడా ఏర్పాటుచేసుకోగలిగారు. శాశ్వత రెవెన్యూతో కూడిన జమీందారీ భూమి పన్ను వ్యవస్థ, బ్రిటిష్‌వారు ఒక్క పైస కూడా వెచ్చించకుండా దేశపు మిగిలిన ప్రాంతాలను ఆక్రమించుకోడాన్ని సాధ్యంచేసింది

జమీందారీ వ్యవస్థను ప్రవేశపెట్టిన మూలంగా కలిగిన మూడు ప్రధాన ఫలితాలను పేర్కొనవచ్చు 1) రైతులు భూమిపైన తమ అనువంశిక హక్కులను కోల్పోయి కౌలుదార్ల హోదాకి దిగజార్చబడిన కారణంగా రైతుల సామూహిక ఆస్తి హరణం, 2) శిస్తులు పెంచబడ టంతో దోపిడి వ్యవస్థ తీవ్రతరం చెయ్యబడటం, 3) జమీందార్లు తమ శిస్తుల వసూలు హక్కును వదులుకొని పోగుచేసిన మొత్తంలో కొంత భాగం తమకు చెల్లించే పద్ధతిలో తమ కిందివారికి దఖలుపరచ డంతో పన్ను వసూలుదార్ల సంఖ్యలో పెరుగుదల

వరుసగా కొన్ని ప్రయోగాలు జరిపినమీదట 1820 దశకంలో దక్షిణ, మధ్య భారతదేశంలో రైత్వారీ పద్ధతి ప్రవేశపెట్టబడింది.

ఈ పద్ధతిలో ఆయా ప్రాంతాల్లో సాగుచెయ్యబడిన భూమి, దాని సారాన్నిబట్టి 9 తరగతులకింద విభజింపబడింది. వాటిలో ప్రతి ఒక్క తరగతికీ దాని సొంత పన్ను ప్రమాణం ఉంది. భూమి గ్రామ సమాజాల పూర్తి సభ్యులైన మిరాసీదార్లకు శాశ్వతంగా కౌలుకివ్వబడేది. ఈ మిరాసీదార్లలో గ్రామ సమాజపు ఫ్యూడల్ అగ్రగణ్యులు ఉండేవారు. మరోలా చెప్పాలంటే, భూమిలో ఎక్కువ భాగం చిన్న, మధ్య భూస్వాముల చేతుల్లోకి పోయింది. గ్రామ సమాజపు పూర్తి సభ్యులు భూమిలో కొద్ది భాగాన్ని పొందారు. గ్రామ సమాజపు పూర్తి సభ్యులు కాని వారికి, సమాజ సేవకులకి భూమిపైన హక్కు ఉండేది కాదు. భూమి స్వంతదారులైన ఫ్యూడల్ ప్రభువులు, కమతందార్లు కూడా రైతులని (వ్యవసాయదారులు అని) పిలవబడేవారు.

రైతులందరికీ తమ భూమిని అమ్ముకొనే, తనఖా పెట్టే లేక కౌలుకిచ్చే హక్కు ఉండేది. భూమిపైన పన్ను చెల్లించినంతకాలం దానిమీద వారి హక్కును తొలగించే అవకాశం ఉండేది కాదు. పన్ను ప్రమాణం ఉత్పాదితంలో సుమారు 1/3 వంతుకి 1/2 వంతుకి మధ్య ఉండేది. రమేష్ దత్తు చిన్న కమతాలపై ఉత్పత్తి చేయబడిన మొత్తం అదనపు ఉత్పాదితం పన్నులకే సరిపోయేదని అంచనా వేశాడు. ఆయన ఇచ్చిన లెక్కల మేరకు, ఒక చిన్న కమతంమీది అదనపు ఉత్పాదితపు విలువ 12 పౌనులకు మించి ఉండేది కాదు. సేద్యపు ఖర్చు 7–8 పౌనులు, భూమి పన్ను 4 పౌనులు, లేక మొత్తం అదనపు ఉత్పాదితమంత ఉండేది.* కొన్ని సమయాల్లో పన్ను అవసరమైన ఉత్పా

---

* పైన ఉదహరింపబడిన Romesh Dutt పుస్తకం, పేజీలు 121–122 చూడండి.

దితంలో గణనీయమైన భాగాన్ని కూడా మింగేసేది. పన్నులు ప్రతి 30 ఏళ్లకి ఒకసారి సవరింపబడేవి. ప్రభుత్వానికీ రైతుకీ మధ్య ఏ దళారీ ఉండేవాడు కాడు.

రైత్వారీ పద్ధతిని ప్రవేశపెట్టడం ద్వారా బ్రిటిష్‌వారు రెండు విషయాలు సాధించాలని ప్రయత్నించారు: 1) పన్ను ఆదాయాలు పెంచడం, 2) గ్రామ సమాజపు అగ్రగణ్యులను ఫ్యూడల్ భూస్వాముల హోదాకి లేవనెత్తడం ద్వారా వారినుంచి సాంఘిక తోడ్పాటు పొందడం.

ఈ సంస్కరణ ఫలితంగా, విస్తృతమైన భూప్రాంతాలు (పచ్చిక బీళ్లు, మైదానాలు, సమష్టి ఉపయోగంలో వున్న తదితర గ్రామ సమాజపు భూములు) ప్రభుత్వ ఆస్తి చెయ్యబడ్డాయి. గ్రామీణ జనాభాలో గణనీయమైన ఒక భాగం (గ్రామ సమాజపు పూర్తి సభ్యులు కానివారు, సేవకులు, వగైరాలు) భూమిపై యాజమాన్య హక్కు లేకుండా చెయ్యబడి, భూమి కౌలుదార్లుగా మార్చబడ్డారు. రైత్వారీ సంస్కరణ అమల్లో వున్న ప్రాంతాల్లో అధికసంఖ్యాక రైతుల ఆస్తి హరణాన్ని ఇది తెలియజేస్తుంది. సొంతదారులైన రైతులకు సంబంధించినంతవరకు, ఆచరణలో వారు సలన ప్రభుత్వపు కౌలుదారులు అయ్యారు. ఎందుకంటే, వారు చాలా పెద్ద మొత్తాల్లో భూమి పన్నులు చెల్లించి, తమ పొలం సాగుచేసుకోవలసివచ్చేది. ఇందుకు కారణం ప్రభుత్వంపట్ల వారి విధి మాత్రమే కాదు. మొత్తం ఆర్థిక పరిస్థితుల (చేతివృత్తుల వినాశం, పారిశ్రామికార్థికాభివృద్ధి మందగింపు) మూలంగా వారు తమ భూఖండాలకు అంటిపెట్టుకొని ఉండాల్సి వచ్చింది. రైత్వారీ పద్ధతియొక్క యీ లక్షణాలు, మార్క్స్ చెప్పినట్లు, దాన్ని "ఫ్రెంచి రైతు యాజమాన్యపు అపభ్రంశ చిత్రం" చేశాయి. ఎందుకంటే, రైతు యజమాని "ఏకకాలంలో భూదాసుడు, ప్రభుత్వపు భూమి కౌలుదారు కూడా."*

---

* K. Marx, "The War Question.–Doings of Parlia-

1820 దశకంలో అమలుజరపబడిన భూమి పన్ను సంస్కరణ వ్యవస్థని మహల్వారీ విధానం అనేవారు. ఆదిలో, సంయుక్త బాధ్యత కలిగిన గ్రామ సమాజాలకి భూమి స్వామ్య హక్కు దఖలుపరచబడింది. అవి తమ గ్రామణి ద్వారా పన్నులు చెల్లిస్తూ వుండేవి. మొత్తం గ్రామ సమాజానికి పన్ను మొత్తం నిర్ణయింపబడేది. అయితే, రైతుకి వ్యక్తిగత బాధ్యత వుండేది. పన్ను సకాలంలో పూర్తిగా చెల్లించకపోతే అతని ఆస్తి అందుకు జామీనుగా వుండేది.

సూత్రరీత్యా, భూమి పన్ను మొత్తం గ్రామ సమాజపు "నికర లాభం" ప్రాతిపదికమీద నిర్ణయింపబడేది. ఈ లాభపు మొత్తం స్థానిక ఫ్యూడల్ ప్రభువులకు రైతులు చెల్లించే ఫ్యూడల్ శిస్తునుబట్టి అంచనా వెయ్యబడేది. ఇది కొద్ది గొప్పల్లో అదనపు ఉత్పాదితానికి సమంగా వుండేది. 1840 దశకంలో యిది యీ మొత్తంలో 50 శాతంగా నిర్ణయింపబడింది. అందుకే, పన్ను అదనపు ఉత్పాదితంలో సగం మింగేసేదని అంచనా వెయ్యబడింది. ఆచరణలో అది అంతకంటె యింకా ఎక్కువే మింగేది. ఎందుకంటే, "నికర లాభపు" మొత్తాన్ని పన్ను వసూలుదారు తరచు ఏకపక్షంగా నిర్ణయించేవాడు. ఈ పద్ధతి అమల్లోకి వచ్చిన తొలి సంవత్సరాల్లో, పన్ను కొన్ని సమయాల్లో రైతు ఆదాయంలో 95 శాతం ఉండేది, అంటే, మొత్తం అదనపు ఉత్పాదితం పన్నుకే పోయేది.* దరిమిలా, 19వ శతాబ్ది రెండవ అర్ధ భాగంలో, సొంతదారు, పన్ను చెల్లింపుదారు హక్కులు మొత్తంగా గ్రామ సమాజానికి కాక, గ్రామ సమాజపు పూర్తి సభ్యులకు దఖలు పరచ

ment.—India," K. Marx, F. Engels, *Collected Works*, v. 12, pp. 214—15.

* పైన ఉదహరింపబడిన Romesh Dutt పుస్తకం, పేజి 139 చూడండి.

బడ్డాయి. కాగా, ఆచరణలో మహల్వారీ విధానానికీ రైత్వారీ విధానానికీ మధ్య భేదమేమీ లేదు.

వలస అధికారుల వ్యావసాయిక సంస్కరణలు రైతుల సామూహిక దిగారితనానికి దారితీశాయి. భూమి పన్ను సంస్కరణలు భారతదేశంలోని గ్రామ సమాజ వ్యవస్థని తీవ్రంగా దెబ్బతీశాయి. రైతుల్లో అధిక సంఖ్యాకులు ఆచరణలో జమీందారీ లేక ప్రభుత్వ భూమియొక్క ఏ హక్కులూ లేని కౌలుదార్లుగా మార్చబడి, తమ ఆర్థిక స్వాతంత్ర్యాన్ని కోల్పోయారు. భూస్వాములు, వడ్డీ వ్యాపారులు, వలస అధికారులు ఆదేశించిన వాటిని పండించక గత్యంతరం లేని స్థితిలో పడ్డారు. స్వతంత్ర గ్రామ సమాజం చిన్న రైతు కమతాలుగా విచ్ఛిన్నమైంది. ఆ కమతందార్లు వలసవాదుల ఆదేశాల మేరకు, సామ్రాజ్య దేశానికి ఎగుమతిచెయ్యవలసిన నీలిమందు, నల్లమందు, పత్తి, తదితర ముడి పదార్థాలను ఉత్పత్తిచేసేవారు. వ్యవసాయదారులకీ, చేతివృత్తులవారికీ మధ్య తరతరాలుగా వుంటూ వచ్చిన సంబంధాలు విచ్ఛిన్నమయాయి. గ్రామ సమాజం తన స్వయంసమృద్ధిని కోల్పోయింది. ఇప్పుడది బయట ఉత్పత్తిచెయ్యబడిన సరుకులపైన ఆధారపడసాగింది.

ఈవిధంగా, భూమి పన్ను విధానాలు భారతదేశం ఒక మార్కెట్టుగానూ, బ్రిటన్‌కి ముడి పదార్థాల సరఫరాదారుగానూ మార్పు చెందే పరిస్థితిని రూఢిపరచాయి. భారతదేశపు వలస ఆర్థిక వ్యవస్థను రూపొందించడంలో అవొక ముఖ్య ఘట్టాన్ని తెలియజేస్తాయి. ఆ వ్యావసాయిక సంస్కరణలు మౌలికమైనవే అయినప్పటికీ, రైతులపైన ఫ్యూడల్ భూస్వామ్య దోపిడి వ్యవస్థ పునాదులను చెక్కుచెదరకుండా అవి అలాగే నిలిపివుంచాయి. తమకు సాంఘిక తోడ్పాటును సమకూర్చి, దేశపు వలసవాద దోపిడికి స్థిరత్వం కల్పించే ఫ్యూడల్ భూస్వామ్య వర్గపు స్థానాలను వలసవాదులు పటిష్ఠం చేశారు. అంతే కాదు, బ్రిటిష్ పాలకుల ప్రత్యక్ష పాలనకింద వున్న బ్రిటిష్ ఇండియా అనబడే ప్రాం

తంలో యీ మార్పులు చెయ్యడం ద్వారా, దేశపు భూభాగంలో మూడో వంతును ఆక్రమించిన సుమారు 600 స్వదేశ సంస్థానాలను వాళ్ళు చెక్కుచెదరకుండా వుంచి, వాటికి సర్వవిధాలా తోడ్పడ్డారు

బ్రిటిష్ వ్యావసాయిక విధానాన్ని క్రోడీకరిస్తూ మార్క్స్ యిలా రాశాడు "జమీందారీ విధానం, రైత్వారీ విధానం, ఉప్పు పన్ను, వీటికి తోడు భారతీయ వాతావరణం కలరా వ్యాధికి ఆటపట్టులు – పాశ్చాత్య ప్రపంచ ధర్మమా అని భారతదేశ విధ్వంసన ఫలితాలు – మానవుల కష్టాల, దౌష్ట్యాల కలయికకి ప్రస్ఫుట, నిష్ఠుర ఉదాహరణ"* జమీందారీ, రైత్వారీ విధానాలను ప్రవేశపెట్టడంతో భారతదేశంలో బ్రిటిష్ సామ్రాజ్య వాదపు వ్యవసాయ చట్టాల తొలి ఘట్టం ముగిసింది.

భారతీయ వ్యవసాయంలోని ఫ్యూడల్ వ్యవస్థయొక్క అత్యంత అభివృద్ధినిరోధక లక్షణాలను అది పదిలంగా కాపాడింది వలసవాదులు భూమిపైన ఫ్యూడల్ భూస్వాముల స్వామ్యాన్నీ, వ్యవసాయంలో ఉత్పాదక శక్తుల అభివృద్ధికీ, మొత్తంగా దేశపు ఆర్థికాభివృద్ధికీ ప్రధానాటంకమైన అత్యంత గర్హ్యమైన ఫ్యూడల్ దోపిడి రూపాలనూ పటిష్ఠం చేసేందుకు తోడ్పడ్డారు.

పారిశ్రామిక పెట్టుబడి పెత్తనపు దశలో భారతీయ ఆర్థిక వ్యవస్థ ప్రధాన రంగాల్లో ప్రగాఢమైన మౌలిక మార్పులు ద్రవ్య చలామణీ రంగంలో వచ్చిన కొత్త ధోరణులతో జోడింపబడ్డాయి ఈస్టిండియా కంపెనీ వర్తక గుత్తాధిపత్యం రద్దు, బ్రిటిష్ సరుకుల దిగుమతుల్లో పెరుగుదలల మూలంగా, భారతదేశంలో ద్రవ్య, పరపతి విధానాలపట్ల వలసవాదులు తీవ్రమైన శ్రద్ధ చూపవలసివచ్చింది. వలస

---

* K Marx, "The War Question – Doings of Parliament – India," K Marx, F Engels, *Collected Works*, v 12, p 216

పూర్వ దశలోనూ, అలాగే ఈస్టిండియా కంపెనీ కాలంలోనూ భారతదేశంలో సమీకృత ద్రవ్య వ్యవస్థ లేదు వివిధ విలువలు కలిగిన అనేక వెండి, బంగారు నాణాలు చలామణీలో వుండేవి. దేశపు వివిధ భాగాల్లో వెండి రూపాయి సైతం ఒకే మాదిరిగా వుండేది కాదు. ఉదాహరణకు, కలకత్తా రూపాయి విలువ మద్రాసు రూపాయి విలువ కంటె 2/3 శాతం ఎక్కువ వుండేది వర్తక దోపిడి సమయంలో యీ ద్రవ్య అస్తవ్యస్త స్థితి దేశంనుంచి మరిన్ని ఎక్కువ సరుకులు పొందేందుకూ, వర్తకులూ, వ్యాపారస్తులూ, బ్లాక్ మార్కెటీర్లూ సంపన్నులయ్యేందుకూ తోడ్పడేది అయితే, పారిశ్రామిక బూర్జువావర్గా నికి ఒకే ఏకీకృతమైన ద్రవ్య వ్యవస్థ అవసరం దీనికి మారకపు రేటు మరింత అవసరం ఎందుకంటే, భారతదేశంలో సరుకులు అమ్మడం ద్వారా సంపాదించిన రూపాయలను పౌన్ల స్టెర్లింగులోకి మార్చుకో వలసివచ్చేది.

1818, 1835 సంవత్సరాల్లో చెయ్యబడిన రెండు చట్టాల ద్వారా భారతదేశంలో వెండి ప్రమాణం ప్రవేశపెట్టబడింది నిర్ణీత మైన బరువూ, వెండి ప్రమాణమూ కలిగిన వెండి రూపాయి దేశమంత టికీ ప్రాతిపదిక ద్రవ్య యూనిట్‌గా ప్రకటించబడింది అది వలస పరిపాలనయొక్క ద్రవ్య ఆదాయాన్ని స్థిరీకరించేందుకు దోహదంచేసి, నగదు పన్ను విధానాన్ని ప్రవేశపెట్టడాన్ని సాధ్యంచేసింది. అయితే, నగదు పన్నును ప్రవేశపెట్టడం, ప్రత్యేకించి వ్యవసాయంలో, రైతుల స్వయంపోషక ఆర్థిక వ్యవస్థను భగ్నంచేసి, ప్రధానంగా వస్తుమార్పిడి పద్ధతి మేరకు నెలకొల్పబడిన గ్రామ సమాజాల్లోని సాంప్రదాయిక ఆర్థిక సంబంధాలపైన దెబ్బతీసింది అది బ్రిటిష్ పారిశ్రామిక సరు కులకు మార్కెట్‌ను సృష్టించేందుకు కూడా తోడ్పడి, మార్కెట్‌లో గిరాకీ వున్న, నగదుకు అమ్ముకోగలిగిన సరుకులను ఉత్పత్తి చెయ్యక

గత్యంతరం లేని పరిస్థితిలోకి రైతులను నెట్టింది. 1820, 1830 దశకాల్లో చెయ్యబడిన చట్టాలు భారతదేశవు వలసవాద దోపిడిలో ద్రవ్య వ్యవస్థ వినియోగానికి నాంది పలికాయి.

రుణ వ్యవస్థమీద బ్రిటిష్ బాంకులు తమ గుత్త పెత్తనాన్ని నెలకొల్పుకున్నది కూడా యీ దశలోనే. 18వ శతాబ్ది చివర అవతరించిన తొలి బ్రిటిష్ బాంకులు ఒక విధంగా బలహీనమైన సంస్థలు. రెండు మూడు దశాబ్దాలు గడిచేసరికి అవి సామాన్యంగా దివాళా తీస్తూండేవి. 19వ శతాబ్ది చివరకి సైతం భారతదేశంలో మూడు పెద్ద జాయింట్ స్టాక్ బాంకులు ఉండేవి. రుణ సంబంధమైన లావాదేవీల్లో అధిక భాగం, బ్రిటిష్‌వారు మూడు నగరాల్లో – కలకత్తాలో (1806), బొంబాయిలో (1839), మద్రాసులో (1843) – నెలకొల్పిన ప్రెసిడెన్షియల్ బాంకులనబడే వాటి చేతుల్లో వుండేవి. పాక్షిక ప్రభుత్వ సంస్థలైన ఆ బాంకులు ప్రభుత్వపు వలస విధానాన్ని అమలుజరుపుతూ, దానికీ, బడా వ్యాపారస్తులకీ రుణాలు యిస్తూండేవి.

బడా బ్రిటిష్ బాంకులు భారతదేశంలో తమ లావాదేవీలను 1830 దశకం చివరా, 1840 దశకం మొదట్లోనూ ఆరంభించాయి. 19వ శతాబ్ది మధ్యనాటికి "ఓరియంటల్ బాంకింగ్ కార్పొరేషన్," "చార్టర్డ్ బాంక్ ఆఫ్ ఇండియా, ఆస్ట్రేలియా అండ్ చైనా," "చార్టర్డ్ బాంక్ ఆఫ్ గ్రేట్ బ్రిటన్" అనే మూడు బాంకులు వున్నాయి. విదేశీ వర్తకానికి రుణాలు యివ్వడంపైనా, కరెన్సీ లావాదేవీలు అన్నింటిపైనా వాటికి గుత్తాధిపత్యం వుండేది. తద్వారా అవి ప్రపంచ మార్కెట్‌తో భారతదేశానికి ప్రత్యక్ష సంబంధాలు లేకుండా చేసి, బ్రిటన్‌కి దాన్ని వ్యావసాయిక, ముడి పదార్థాలు సరఫరాచేసే ఒక అనుబంధ దేశంగా తయారుచేశాయి. భారతదేశంలో విదేశీ బాంకుల అవతరణతో, వలసవాదులు వర్తక, వడ్డీ పెట్టుబడిని తమ స్వప్రయోజనాలకు విస్తృతంగా వినియోగించుకోగలిగారు. బాంకులు రుణాల రంగంనుంచి వడ్డీ

పెట్టుబడిని తొలగించకపోవడమే కాక, దానికి అదనపు రుణాలతో తోడ్పాటును కూడా యిచ్చాయి. బాంకుల సహాయంతో వర్తకులూ, వడ్డీ వ్యాపారులూ బ్రిటిష్ పారిశ్రామిక సరుకులను అమ్ముతూ, మార్కెట్లోకి వచ్చిన ముడి పదార్థాలనూ, ఆహార పదార్థాలనూ కొంటూ వుండేవారు. వర్తక, వడ్డీ పెట్టుబడికీ, విదేశీ బాంకులకీ మధ్య సన్నిహిత సంబంధాలు దరిమిలా మరింత బలపడి, భారతదేశపు వలసవాద దోపిడి యంత్రాంగంలో ముఖ్యమైన ఒక లింకు అయ్యాయి.

కాగా, పారిశ్రామిక పెట్టుబడి పెత్తనపు దశలోనే భారతదేశపు ఆర్థిక లొంగుబాటు ప్రధానంగా పూర్తిచెయ్యబడి, దాని ఆర్థిక వ్యవస్థ ఒక విజాతీయ ఆర్థిక సంస్థ అవసరాలకీ, ప్రయోజనాలకీ అనువుగా సరిపుచ్చబడింది. భారతదేశం తన ఆర్థిక స్వాతంత్ర్యాన్ని కోల్పోయింది, దాని సొంత పరిశ్రమలు లేకుండా పోయాయి. ఏటా పెద్ద మొత్తాలు, 3–4 మిలియన్ల పౌన్ల మేరకు, బ్రిటన్‌కి తరలింపబడుతూ వచ్చాయి. అదీ యీ వలసదేశంనుంచి లభించిన విరాళం, భారతీయ ప్రజల కష్టాల మీదా, దైన్యంమీదా వ్యాపారం చేసి తమ సంపదను సృష్టించుకున్న పారిశ్రామిక, తదితర పెట్టుబడిదారుల వికర లాభం. ఆ దశకి విలక్షణ మైనది యేమిటంటే, వలసవాదులనుంచి దాదాపు ఎలాంటి సృజనాత్మక కార్యకలాపాలూ లేకపోవడం. భారతదేశానికి ఎంతో అవసరమైన నీటి పారుదల సౌకర్యాల నిర్మాణం సైతం విస్మరింపబడింది. వ్యవసాయం నాశనం చెయ్యబడింది. పొలాలు బీడుపడ్డాయి. భారతదేశం ఆకలి చావులకు ఆలవాలమైన దేశంగా తయారైంది. 19వ శతాబ్ది మొదటి అర్ధభాగంలో భారతదేశంలో కరువులు ప్రతి మూడు, నాలు గేళ్లకూ ఒకసారి సంభవించాయి. 1800–1878 మధ్య కరువుల మూలంగా మరణించినవారి సంఖ్య అధికారికంగా 65 లక్షలమందిగా

యివ్వబడింది.* వాస్తవంలో రజనీ పామీ దత్తు పేర్కొన్నట్లు "మర ణాలు బహుసంఖ్యాకంగా వుండేవి, మృతుల సంఖ్య ఎన్నడూ లెక్క వెయ్యబడలేదు." కాన్పూరు, ఆగ్రా, ఫతేపూర్ వంటి పెద్ద నగరాల్లో వీధులనుంచీ, నదులనుంచీ శవాలను తొలగించేందుకు ప్రత్యేక బృందాలు నియమింపబడ్డాయి.** అది 50 ఏళ్ల పారిశ్రామిక బూర్జువావర్గ పెత్త నపు భయంకర ఫలితం.

ఆ దశలో వలసవాదుల ఆర్థిక, రాజకీయ కార్యకలాపాలను సమీ క్షిస్తూ మార్క్స్ యిలా రాశాడు: "తన పాత ప్రపంచాన్ని నష్ట పోవడం, కొత్తదాన్ని పొందని భారతీయుని ప్రస్తుత దైన్యానికి ఒక ప్రత్యేక రకం విషాద ఛాయను కల్పిస్తోంది. బ్రిటన్‌చేత పాలింపబడుతున్న హిందూస్థాన్‌ను దాని ప్రాచీన సంప్రదాయాలన్నింటినుంచీ, దాని యావత్తు గత చరిత్రనుంచీ వేరుచేస్తుంది."***

భారతదేశపు దోపిడిలోని రెండవ దశ ఫలితాలూ, ప్రధాన లక్ష ణాలూ యివీ. సరిగా ఆ దశలోనే భారతదేశంలో జరిగిన మిక్కిలి పెద్ద ప్రజా తిరుగుబాట్లలో ఒకటైన 1857–59 నాటి తిరుగు బాటు ప్రజ్వరిల్లింది. దేశపు జాతీయ స్వాతంత్ర్య పునరుద్ధరణను తన ప్రధాన లక్ష్యాల్లో ఒకటిగా అది ప్రకటించింది. అది యావత్ ప్రజలనూ సమైక్యం చేసింది. ఆ తిరుగుబాటును అణచివేసేందుకు వలసవాదులు బ్రహ్మాండమైన ప్రయత్నం చెయ్యవలసివచ్చింది, వారు

---

* R. Palme Dutt, *India Today*, Victor Gollancz, Ltd., London, 1940, pp. 131–32.

** పైన ఉదహరింపబడిన Romesh Dutt పుస్తకం, పేజి 308 చూడండి.

*** K. Marx, "The British Rule in India," K. Marx, F. Engels, *Collected Works*, v. 12, pp. 126–27.

నిజంగానే చేసినట్లు, దాన్ని రక్త సంద్రంలో ముంచెత్తవలసివచ్చింది.

19వ శతాబ్ది చివరి కాలు భాగంలో బ్రిటన్‌లో సామ్రాజ్య వాదపు తొలిప్రధానాంశాలు పొడచూపాయి. వలసల ప్రాముఖ్యం అపారంగా పెరిగింది. అవి పెట్టుబడి మదుపుకి లక్ష్యమయ్యాయి. తత్పర్యవసానంగా వలసదేశాల పరాధీనతను పెంచి, వలసవాదుల స్థానాన్ని పటిష్ఠంచేసే సమస్య చాలా నిశితమైనదిగా తయారైంది.

1858లో, భారతదేశంలో అధికారం అధికారికంగా బ్రిటిష్ పార్లమెంటు చేతుల్లోకి వెళ్ళింది. ఈస్టిండియా కంపెనీ రద్దుచెయ్యబడింది.

భారతదేశంలో వలసవాదుల పాలనపైన జాతీయ తిరుగుబాటు అత్యధిక ప్రభావం కలిగించింది. దేశపు సాంఘికార్థిక అభివృద్ధిలో సంభవిస్తున్న మార్పులకు వాళ్ళు ప్రతిస్పందించక తప్పనిసరి పరిస్థితిలో పడ్డారు. తిరుగుబాటు దరిమిలా భారతదేశంలో వలసవాదుల విధానం మరింత పట్టు విడుపులతో కూడినదిగా మారింది. వలసవాద ప్రభుత్వం ఫ్యూడల్ అభివృద్ధినిరోధకులతో మరింత సన్నిహిత సంబంధాలు పెట్టుకొని పనిచేస్తూ, జనాభాలో తమ పాలనతో సంబంధం కలిగివున్న బృందాలకు — ఫ్యూడల్ భూస్వాములకు, స్వదేశ సంస్థానాధీశ్వరులకు, వర్తకులకు — అధికతర పొదార్థిక, రాజకీయ తోడ్పాటునిచ్చింది. బ్రిటిష్ పాలనకి వ్యతిరేకంగా అప్పటికే లేచి నిలబడగలిగిన శక్తి ఆవిర్భావానికి వలసవాదుల ప్రతివర్తన యిదీ.

4. బ్రిటిష్ ఫైనాన్సు పెట్టుబడిచేత భారతదేశపు దోపిడి ఆరంభం

19వ శతాబ్ది మధ్యలో బ్రిటిష్ వలసవాదులు భారతదేశాన్ని చేసే దోపిడిలో నూతన ధోరణులు తలెత్తాయి.

ఆ కొత్త పరిస్థితుల్లో వెనకటి దశలకు విశిష్టమైన వలస దోపిడి పాత రూపాలు యింకా నిలిపివుంచబడినప్పటికీ, వలసదేశపు దోపిడికి ప్రాతిపదిక క్రమంగా బ్రిటిష్ పెట్టుబడి మదుపులకు మారింది. అప్పటికే ప్రపంచ పెట్టుబడిదారీ ఆర్థిక వ్యవస్థలోకి లాగబడి, దేశంలో పారిశ్రామికాభివృద్ధికి అవసరమైన ప్రాథమిక పరిస్థితులు ఉన్న కారణంగా, భారతదేశాన్ని కొత్త పద్ధతుల్లో దోచుకోవడం సాధ్యమైంది.

1850 దశకంలో దేశ పరిపాలన కేంద్రీకృతం చెయ్యబడింది. టెలిగ్రాఫ్ వ్యవస్థ నిర్మింపబడింది. రైల్వేల నిర్మాణం మొదలైంది. ఓడరేవులు నిర్మింపబడ్డాయి. ద్రవ్య వ్యవస్థ యితోధికంగా ఏకీకృతం చెయ్యబడింది. విదేశీ బాంకులు తమ స్థానాన్ని పటిష్ఠం చేసుకున్నాయి. బ్రిటిష్ ఫైనాన్సు పెట్టుబడి భారతదేశాన్ని దోపిడి చేసేందుకు యివన్నీ పూర్వావసరాలు.

సామ్రాజ్యవాద యుగంలో వలస దోపిడి విశిష్ట లక్షణాల్లో ఒకటేమిటంటే, పెట్టుబడి ఎగుమతి. ఫైనాన్సు పెట్టుబడి లాభాలు గుంజుకునేందుకు విదేశీ పెట్టుబడి మదుపులే ప్రాతిపదిక. అయితే, భారతదేశం విషయంలో బ్రిటిష్ పెట్టుబడి మదుపుల ప్రధాన రూపం సామ్రాజ్య దేశంనుంచి పెట్టుబడి ఎగుమతి కాదు. బ్రిటిష్ పెట్టుబడి మదుపుల్లో అధికాంశం వలసవాదులు భారతదేశంలో కొల్లగొట్టిన డబ్బు నుంచే తీసుకోబడ్డాయి. బ్రిటన్‌నుంచి వచ్చిన డబ్బు సాపేక్షంగా తక్కువ. 19వ శతాబ్ది మధ్యలో బ్రిటిష్ పెట్టుబడి మదుపులు రైల్వేల, కొద్దిపాటి జనపనార, పత్తి మిల్లుల నిర్మాణానికి పరిమితమయ్యాయి. ఆదినుంచీ కూడా భారతదేశంలో బ్రిటిష్ పెట్టుబడి మదుపులు స్పష్టంగా పరభాగ్యోపజీవన స్వభావం కలిగి, జాతీయ రుణం అనబడేదాన్ని కేంద్రంగా చేసుకునేవి.

జాతీయ రుణం ఏర్పడటానికి భారతీయ ఆర్థికాభివృద్ధితో ఎలాంటి సంబంధమూ లేదు. భారతదేశ ఆక్రమణ కాలంలో బ్రిటన్‌కి అయిన

ఖర్చులతోనూ, వలస ప్రభుత్వ నిర్వహణకూ, భారతదేశంతో ఎలాంటి సంబంధమూ లేని (ఉదాహరణకు, లండన్‌లో టర్కిష్ సుల్తానుకు విందులు చేసేందుకు, చైనా, సోఫియా, అరేబియాల్లో దౌత్య సిబ్బంది పోషణ, వగైరాలకు) అయిన ఖర్చులతోనూ కూడివుండేది. అలాంటి మదుపులు ఉత్పాదకమైనవి కావనీ, అవి పూర్తిగా వలసవాద దోపిడి అన్న విషయం నిర్వివాదమైనది. ఈమాదిరి పెట్టుబడి "ఎగుమతి" భారతదేశపు పెట్టుబడిదారీ అభివృద్ధిని త్వరితంచేసేందుకు బదులు, అలాంటి అభివృద్ధి మార్గంలో అతి పెద్ద అవరోధమైంది. తర్వాత మాత్రమే జాతీయ రుణంలో, భారతదేశంపై రుద్దబడిన రైల్వేల నిర్మాణానికి సంబంధించిన వ్యయాలు మొదలైన "ఉత్పాదకాంశాలు" తలెత్తనారంభించాయి. 1792లో వడ్డీ భరించవలసిన భారతీయ రుణం 70 లక్షల పౌన్లను మించింది. 1829 నాటికి అది 3 కోట్లకు పెరిగింది. 1890–91 నాటికి అది 10 కోట్ల, 4 లక్షలకు, 20 శతాబ్ది ఆరంభానికి 13 కోట్ల, 30 లక్షల పౌన్లకు పెరిగింది.* అటు దరిమిలా దాని పెరుగుదల వేగం పుంజుకుంది. ఉజ్జాయింపు అంచనాల మేరకు, 1909–10లో భారతదేశంలో బ్రిటిష్ మొత్తం పెట్టుబడి మదుపు 36 కోట్ల, 50 లక్షల పౌన్లు కాగా, మొదటి ప్రపంచ యుద్ధారంభానికి సరిగా ముందు అది 45 కోట్ల నుంచి 47 కోట్ల, 50 లక్షల పౌన్లకు చేరుకుంది.**

ఈవిధంగా, భారతదేశపు విదేశీ వలస రుణం ప్రధానంగా విదేశీ

---

* పైన ఉదహరించబడిన Romesh Dutt పుస్తకం, పేజి 292; సం. 2, పేజి 452 చూడండి.

** ఎస్. డి. గ్రొద్కో, "భారతదేశపు జాతీయ రుణ చరిత్రనుంచి." — "ప్రాచ్య పరిశోధనా ఇన్‌స్టిట్యూట్ సంక్షిప్త నివేదికలు," సం. XII, పేజి 271 (రష్యన్‌లో).

పెట్టుబడి మదుపులతో కూడివున్న కారణంగా పెట్టుబడి ఎగుమతియొక్క ఒక రూపంగా వుంది. ఆ పెట్టుబడి అత్యంత పరభాగ్యోప జీవన రూపంలో ఎగుమతిచెయ్యబడి, దేశంలో పెట్టుబడి దారీ వ్యవస్థ అభివృద్ధికి ఏమాత్రం దోహదం చెయ్యలేదు అదే సమయంలో, జాతీయ ఋణం రూపంలో చెయ్యబడిన సాపేక్షంగా తొలి బ్రిటిష్ పెట్టుబడి మదుపుల నిర్దిష్ట లక్షణాలు, 19వ శతాబ్ది మొదటి అర్ధభాగం నాటికే వున్న వలస దోపిడియొక్క ఒక ముఖ్య పార్శ్వం భారతదేశపు దోపిడినుంచి పొందిన మొత్తం లాభాల్లో బ్రిటిష్ పారిశ్రామిక పెట్టుబడిదారుల వాటా క్రమంగా తగ్గిపోనారంభించింది 1890లో బ్రిటిష్ కార్ఖానా సరుకుల ఎగుమతుల దిగుమతుల విలువ (వెండి, బంగారాల దిగుమతులు లేకుండా) 10 కోట్ల, 40 లక్షల పౌన్లు లేక భారతదేశపు విదేశీ ఋణంతో సమానంగా వుంది కాని అది, దేశంలో బ్రిటిష్ పెట్టుబడి మదుపుల వెరసి మొత్తంకన్న తక్కువ

పారిశ్రామిక బూర్జువావర్గపు లాభాలు 1 కోటి పౌన్లను మించాయి అదే దశలో, జాతీయ ఋణంమీద వడ్డీ చెల్లింపు 3 కోట్ల, 35 లక్షల పౌన్లు వుంది * 1913–14లో బ్రిటిష్ పారిశ్రామిక, వర్తక బూర్జువావర్గం పొందిన లాభం 2 కోట్ల, 80 లక్షల పౌన్లకు చేరుకోగా, మదుపు పెట్టిన పెట్టుబడిమీద వడ్డీ ద్వారా లభించిన

---

* పైన ఉదహరించబడిన Romesh Dutt పుస్తకం, సం. 2, పేజి 397లో యిచ్చిన అంకెల ప్రాతిపదికమీద వేసిన అంచనా. ఎస్. డి. గ్రాద్కో "భారతదేశపు ఋణం, ద్రవ్య వ్యవస్థ," గోస్ఫిన్ యిజ్దాత్, మాస్కో, 1956, పేజి 114 (రష్యన్‌లో) అంచనాలకు ప్రాతిపదిక. 10 రూపాయలు=12 షిల్లింగులు.

ఆదాయం, వడ్డీజీవులనుంచి లభించిన ఆదాయం 5 కోట్ల పౌన్లకు పెరిగింది *

ఇలాంటి అంకెలనే, అంటే, 19వ శతాబ్ది చివరి బ్రిటన్ మొత్తం విదేశీ వర్తకపు విలువను బేరీజువేస్తూ, వి ఐ. లెనిన్ ''సామ్రాజ్య వాదం, పెట్టుబడిదారీ విధానపు అత్యున్నత దశ'' అనే తన పుస్తకంలో యిలా అంచనా వేశాడు: ''ప్రపంచంలోకెల్ల గొప్ప 'వర్తక' దేశంయొక్క విదేశ వర్తకంనుండి వచ్చే ఆదాయంకంటె వడ్డీజీవుల ఆదాయం ఐదు రెట్లు యెక్కువ!'' లెనిన్ దీన్ని ''సామ్రాజ్యవాదం యొక్క, సామ్రాజ్యవాదపు పరభాగ్యోప స్వభావపు సారం''**గా చూశాడు.

19వ శతాబ్ది రెండవ అర్ధభాగం నాటికే భారతదేశం ప్రధానంగా బ్రిటిష్ ఫైనాన్స్ పెట్టుబడికి ఒక లక్ష్యం అయింది గుణాత్మకంగా యిది, సామ్రాజ్య దేశానికి అనుకూలంగా, భారతదేశపు జాతీయాదాయంనుంచి వేరుగా, ఎలాంటి తిరుగు చెల్లింపూ లేకుండా గుంజుకోబడిన డబ్బు మొత్తం పెరుగుదలలో వ్యక్తమైంది. 19వ శతాబ్ది రెండవ అర్ధభాగంనుంచి యీ మొత్తంలో అధికతర భాగం ఫైనాన్సు పెట్టుబడిచేత సొంతంచేసుకోబడింది దానిలో విధిగా చెల్లించవలసిన హోమ్ ఛార్జీలు అనబడేవి వుండేవి రుణాలపై వడ్డీ, బ్రిటిష్ సివిల్ ఉద్యోగుల జీతాలు, పెన్షన్లు, భారతదేశానికి సంబంధించిన విదేశాంగ శాఖ కార్యదర్శి సిబ్బంది పోషణ 20వ శతాబ్ది మొదట్లో యీ చెల్లింపులు 1 కోటీ, 60 లక్షల పౌన్లకు తక్కువ కాకుండా వుండేవి ఆ

---

* పైన ఉదహరించబడిన R Palme Dutt పుస్తకం, పేజీలు 144–45 చూడండి.

** వి. ఐ. లెనిన్, ''సామ్రాజ్యవాదం, పెట్టుబడిదారీ విధానపు అత్యున్నత దశ''—వి. ఐ. లెనిన్, ''సంకలిత రచనలు,'' ''ప్రగతి'' ప్రచురణాలయం, 1985, సంపుటం 3, పేజి 249.

మొత్తంలో మరొక భాగం, అంతకంటె పెద్ద భాగం, పెట్టుబడి ఎగుమతితోబాటు పెరిగిన భాగంలో యీకిందివి యిమిడివుండేవి. బ్రిటిష్ పెట్టుబడి మదుపులపైన డివిడెండ్లు, విదేశీ వర్తకం, ఓడల రవాణా, అడవులు, భూమి, వగైరాలనుంచి లాభాలు. అత్యంత ఆందాజైన, బహుశా బాగా తగ్గించివెయ్యబడిన అంచనాల ప్రకారం, భారతదేశపు మొత్తం బాహ్య చెల్లింపులు మొదటి ప్రపంచ యుద్ధానికి సరిగా ముందు 5 కోట్ల పౌన్లు వుండగా, 1920, 1930 దశకాల నాటికి అవి 15 కోట్ల పౌన్లకి పెరిగాయి. సోవియట్ ఆర్థికవేత్తల అంచనాలనుబట్టి రెండవ ప్రపంచ యుద్ధానికి సరిగా ముందు అవి 20 కోట్ల పౌన్లకు చేరుకున్నాయి.*

భారతదేశపు జాతీయాదాయాన్ని కొల్లగొట్టేందుకు విదేశీ వర్తకం ప్రధాన సాధనం అయింది. పారిశ్రామిక బూర్జువావర్గపు పెత్తనం కాలంలో సైతం, బ్రిటిష్ కార్ఖానా సరుకులను పెద్ద ఎత్తున దిగుమతిచేసుకుంటూ వున్నా కూడా, బ్రిటన్‌తో చేసే వర్తకంలో భారత దేశానికి మిగులు వుండేది. 1830 దశకంలో యీ మిగులు 20 లక్షల పౌన్లు వుంది. ఈ వర్తకపు మిగులు దేశపు జాతీయ సంపద బయటకి ప్రవహించడాన్ని ప్రతిబింబిస్తుంది.

ఫైనాన్స్ పెట్టుబడి భారతదేశంపై పెత్తనం వహించినప్పుడు, విదేశీ కరెన్సీకి వర్తకపు మిగులే ప్రధాన మూలాధారంగా ఉండి, వలస లెవీని చెల్లించేందుకోసం పూర్తిగా వినియోగింపబడేది. 19వ శతాబ్ది మధ్యనుంచి విదేశీ వర్తకపు మిగులు బాగా పెరిగింది. 1855లో అది 54 లక్షల పౌన్లు ఉండగా, మొదటి ప్రపంచ యుద్ధ ఆరంభం

---

* ఎస్. ఎమ్. మేల్మన్, ''భారతీయ ఆర్థిక వ్యవస్థలో విదేశీ గుత్త పెట్టుబడి,'' మాస్కో, 1959, పేజి 43 (రష్యన్‌లో).

నాటికి అది 2 కోట్ల, 25 లక్షల పౌన్లకు చేరుకుంది.* తదుపరి సంవత్సరాల్లో దోపిడి స్థాయీ, భారతదేశంనుంచి తరలింపబడిన సంపద పరిమాణమూ గణనీయంగా పెరిగాయి.

సామ్రాజ్యవాద యుగంలో భారతదేశపు దోపిడియొక్క పరభాగ్యోప, కొల్లదారీ స్వభావం ప్రత్యక్ష దోపిడియొక్క చాలా రూపాలను నిలువుకొంటూనే, కొన్ని నూతన లక్షణాలను కూడా సంతరించుకుంది. వర్తక దోపిడి దేశ దారిద్ర్యానికి, వినాశానికి దారితియ్యగా, సరుకుల ఎగుమతులు భారతీయ ఆర్థిక నిర్వహణ పునాదులను దొలిచివేసింది. పెట్టుబడి ఎగుమతి, అదెంత పరభాగ్యోప జీవన స్వభావం కలిగినదైనప్పటికీ, దేశపు ఆంతరిక వనరులను ఏదో ఒక రూపంలో దోచుకొంది. తత్పర్యవసానంగా, అది ఏదో ఒక విధంగా ఉత్పాదక శక్తుల అభివృద్ధితో ముడిపడివుంది. ఈ విషయాన్ని పరిశీలించేటప్పుడు పెట్టుబడి ఎగుమతి ప్రభావంలో ఉత్పాదక శక్తుల అభివృద్ధి మెల్లగా జరిగిందా లేక త్వరితంగా జరిగిందా అన్నదాన్ని నిర్ణయించడమే కాక, అవి ఏ దిశగా ముందుకు సాగాయి అన్నదాన్ని నిర్ణయించడం కూడా ముఖ్యం.

బ్రిటిష్ పెట్టుబడి ఎగుమతి భారతదేశాన్ని సామ్రాజ్య దేశపు అవసరాలకు తన ఆర్థిక వ్యవస్థను సరిపుచ్చుకునే మార్గంలోకి నెట్టింది. అప్పుడే దేశపు ఆర్థిక వ్యవస్థ, దాని వలస నిర్మాణాన్ని, నిర్దిష్ట లక్షణాలను అంటే, బ్రిటన్ వ్యవసాయిక, ముడి పదార్థ అనుబంధ లక్షణాన్ని నిర్ణయించిన పాక్షికమైన, విరూపంచెయ్యబడిన ధోరణిని తీసు

---

* పైన ఉదహరింపబడిన Romesh Dutt పుస్తకం, సం. 2, పేజి 119 చూడండి; Vera Anstey, *The Economic Development of India*, Longmans, Green and Co., London, 1929, p. 330. అంచనా ప్రాతిపదిక: 15 రూపాయలు=1 పౌను.

కుంది. భారతదేశపు ప్రాకృతిక వనరులను అభివృద్ధిచేసి, వాటిని ఎగుమతిచెయ్యవలసిన అవసరం పెట్టుబడి ఎగుమతి రంగాన్ని నిర్ణయించింది. ప్రథమంగానూ, ప్రధానంగానూ అది రైల్వేల నిర్మాణంలోకి వెళ్లింది.

తమ ఫాక్టరీలకు ముడి పదార్థాలను సమకూర్చేందుకుగాను వలస వాదులకు రైల్వేలు అవసరమయ్యాయి. 1840 దశకంలోనే, భారత దేశంలో రైలు మార్గాల నిర్మాణంకోసం ప్రైవేటు బ్రిటిష్ కంపెనీలతో వలస అధికారులు సంప్రదింపులు మొదలుపెట్టారు. బొంబాయినుంచి ఠాణావరకు 20 మైళ్ల తొలి రైలు మార్గానికి 1853లో ప్రారంభోత్సవం జరిగింది. 20వ శతాబ్ది ఆరంభం నాటికి భారతదేశంలో 24 వేల మైళ్ల రైలు మార్గాలు ఉండగా, మొదటి ప్రపంచ యుద్ధారంభం నాటికి 34 వేల, 600 మైళ్ల రైలు మార్గాలు ఉన్నాయి.*

భారతదేశంలో రైలు మార్గాలు వలసవాద పద్ధతుల్లో, అంటే దేశ ప్రయోజనాలతో ప్రసక్తి లేకుండా, కాని దేశ ప్రజల ఖర్చుమీద నిర్మింపబడ్డాయి. రైలు మార్గాలు నిర్మించిన ప్రైవేటు బ్రిటిష్ సంస్థలకు వాటి పెట్టుబడిపైన, లేక మరింత కచ్చితంగా చెప్పాలంటే వెచ్చింపబడిన మొత్తం పెట్టుబడిపైన వలస ప్రభుత్వం 4–5 శాతం డివిడెండుకి హామీ యిచ్చింది. అలాంటి పద్ధతిలో ఏదైనా ఒక సంస్థ ఎంత ఎక్కువ ఖర్చు పెడితే దాని పెట్టుబడిపైన అంత ఎక్కువ లాభం వస్తుంది. అందుచేత అది డబ్బు దేనిపైన వెచ్చింపబడిందన్న విషయాన్ని పట్టించుకునేది కాదు. నిర్మాణం ఎంత ఎక్కువ వ్యయంతో కూడినదైతే, వాటి డివిడెండ్లు — భారతీయ ప్రజలు చెల్లించే పన్నుల నుంచి ఇవి వస్తాయి — అంత ఎక్కువగా ఉంటాయి. రైలు మార్గాల వ్యయం భారతదేశపు మూపులపైన పెను భారంగా పడింది. అది

---

* పైన ఉదహరింపబడిన Vera Anstey పుస్తకం, పేజి 524.

దాని వలస లేవీలో గణనీయమైన భాగం అయింది. దాదాపు ఒక కోటి పౌన్లు ఏటా బ్రిటన్‌కి రైల్వే రుణం చెల్లింపుగా బదిలీ చెయ్య బడేది.

అయితే రైలు మార్గాల నిర్మాణం, వలసవాదుల అభీష్టాలతో ప్రసక్తి లేకుండా, భారతదేశపు ఆర్థికాభివృద్ధిని విశేషంగా ప్రభావితం చేసింది. అది దేశంలో నూతన ఆర్థిక సంబంధాలు నెలకొనడానికి దారితీసింది, సరుకు—డబ్బు సంబంధాలు ఇతోధికంగా అభివృద్ధిచెందేం దుకు దోహదం చేసింది, భారతదేశంలో ఆధునిక పరిశ్రమకు నాంది కూడా పలికింది.

భారతదేశంలో రైల్వేల నిర్మాణానికి సంబంధించి కార్ల్ మార్క్స్ ఇలా రాశాడు: "రైల్వే రవాణా తక్షణ, ప్రస్తుత అవసరాలను తీర్చేం దుకు కావలసిన పారిశ్రామిక క్రమాలన్నింటినీ ప్రవేశపెట్టనిదే ఒక బ్రహ్మాండమైన దేశంలో రైలు మార్గాలను నిర్వహించడం సాధ్యం కాదు. వాటిలో రైల్వేలతో వేరుగా సంబంధం లేని పారిశ్రామిక శాఖల్లో యంత్ర వినియోగం కూడా పెరగవలసి ఉంటుంది."*

రైల్వేల నిర్మాణం రైల్వేలు సక్రమంగా నడిచేందుకు అవసరమైన కొన్ని పారిశ్రామిక సంస్థల అభివృద్ధికి దారితీసింది. 1870 దశకంలో బ్రిటిష్ కంపెనీలు బెంగాల్, బీహార్ రాష్ట్రాల్లో బొగ్గుగనుల తవ్వకం మొదలెట్టాయి. అప్పట్లో బొగ్గు ఉత్పత్తి ఏటా 5 లక్షల టన్నులను మించలేదు. 19వ శతాబ్ది చివరి సంవత్సరాల్లో లోహపాత పరిశ్రమ రూపొందనారంభించింది. "బెంగాల్ ఇనుము, ఉక్కు" అనే బ్రిటిష్ కంపెనీ నెలకొల్పబడింది. అది ఏటా కేవలం 35 వేల టన్నుల ఉక్కును

---

* K. Marx, "The Future Results of British Rule in India," K. Marx, F. Engels, *Collected Works*, v. 12, p. 220.

ఉత్పత్తి చేసింది. 20వ శతాబ్ది ఆరంభంలో మద్రాసు, మధ్య రాష్ట్రాల్లో మాంగనీసు ఖనిజపు తవ్వకం మొదలైంది. ఆ ఖనిజ మంతా ఎగుమతికి ఉద్దేశింపబడింది.

అయితే, భారతీయ ఆర్థిక వ్యవస్థ ధోరణిని నిర్ణయించినది భారీ పరిశ్రమ వివిధ శాఖల అభివృద్ధి కాదు. బొగ్గు, ఉక్కు ఉత్పత్తి దేశపు ఆర్థిక ప్రగతిని ముందుకు తీసుకెళ్లేందుకు ఉద్దేశింపబడలేదు. భారతదేశపు దోపిడికి సంబంధించిన ఖర్చులను తగ్గించడం వలసవాదులకు అవసరమైన కారణంగానే అవి మొదలుపెట్టబడ్డాయి. బొగ్గు, ఉక్కు ఉత్పత్తి పరిమాణం దేశపు ఆర్థిక వ్యవస్థలో అది స్వల్పమైన పాత్ర వహించిందని తెలియజేస్తుంది. ఆ దశలోనూ, అటు తర్వాతా ఇంతకంటె ఎంతో ముఖ్యమైనది ఏమిటంటే, లఘు పరిశ్రమ వివిధ శాఖల, ప్రత్యేకించి అవసరమైన ముడి పదార్థాలనూ, నిపుణ శ్రమనూ కలిగిన జౌళి పరిశ్రమ అభివృద్ధి.

భారతీయ జౌళి పరిశ్రమ ప్రత్యేకించి నూలు వస్త్రాల, జనపనార వస్తువుల ఉత్పత్తిలో స్పెషలైజ్ చేసింది.

జౌళి పరిశ్రమ ఆదినుంచీ ఒక సాంప్రదాయిక భారతీయ పరిశ్రమగా అభివృద్ధిచెందింది. ''బొంబాయి నూలు, నేత కంపెనీ'' (Bombay Spinning and Weaving Company) అనే మొదటి భారతీయ కంపెనీ 1851లో నెలకొల్పబడింది. బొంబాయికి కొద్ది దూరంలో నిర్మింపబడిన మొదటి జౌళి మిల్లు 1854లో పనిచెయ్యనారంభించింది. అమెరికాలో అంతర్యుద్ధ కారణంగా స్థానిక, ప్రపంచ మార్కెట్లలో ముడి పత్తి అధిక ధర కారణంగా తదుపరి రెండు దశాబ్దాలూ నూలు మిల్లుల అభివృద్ధికి అననుకూలంగా ఉన్నాయి.

నూలు మిల్లుల శీఘ్రాభివృద్ధి 1870 దశకం తర్వాత మొదలైంది. ఆ దశకారంభంలో భారతదేశంలో కేవలం 20 మిల్లులు ఉండగా, పదేళ్ల తర్వాత వాటి సంఖ్య 3 రెట్లు అయింది. 1890

దశకం నాటికే 150కి పైగా మిల్లులున్నాయి. భారతదేశం తన ఉత్పాదితంలో కొంత భాగాన్ని (అత్యధికాంశం నూలును) చైనా, జపాన్లకు ఎగుమతి చెయ్యనారంభించింది.

దరిమిలా, 1890 దశకం మధ్యనుంచి మొదటి ప్రపంచ యుద్ధ ఆరంభంవరకు, భారతీయ పరిశ్రమ పెరుగుదల రేటు మందగించింది. వలస పరిస్థితుల మూలంగా తలెత్తిన పరిమితులు ఒక అవరోధం కాగా, దేశీయ మార్కెట్ సంకుచితమైనదవడం మరొక ప్రధాన అవరోధమయింది.

భారతీయ జౌళి పరిశ్రమ ఆరంభ దశలో దాని విశిష్ట లక్షణం ఏమిటంటే, జౌళి మిల్లుల్లో అత్యధిక భాగం నూలు పైననే కేంద్రీకరించాయి. ఇది వలస పరిస్థితుల్లో అభివృద్ధికి ఒక సాధారణ లక్షణం. భారతీయ మిల్లులు ముతక నూలులు ఉత్పత్తి చేసేవి. అవి పాక్షికంగా చైనాకు, తదితర ప్రాచ్య దేశాలకు ఎగుమతి చెయ్యబడేవి. వాటిలో కొంత భాగం భారతదేశంలోనే చేనేత కార్మికుల చేత వినియోగింపబడేది. పట్టణ, గ్రామీణ జనాభాలోని మిక్కిలి పేద విభాగాలకోసం, అంటే, అతి తక్కువ కొనుగోలు సామర్థ్యం కలిగిన దేశీయ మార్కెట్‌కోసం అవి ముతక వస్త్రాన్ని ఉత్పత్తి చేసేవి. సన్న వస్త్రాలు లాంకషైర్‌నుంచి దిగుమతి చేసుకోబడేవి. ముతక నూలును లేక బట్టను ఉత్పత్తిచేసే భారతీయ పరిశ్రమ బ్రిటిష్ జౌళి పరిశ్రమకు తీవ్రమైన పోటీ ఎంతమాత్రం కాజాలదని దీని అర్థం.

జౌళి పరిశ్రమయొక్క మరొక ముఖ్య శాఖ అయిన జనపనార పరిశ్రమ బ్రిటిష్ పెట్టుబడిచేత నెలకొల్పబడింది. 19వ శతాబ్ది మధ్యదాకా జనపనార సరుకుల ఉత్పత్తి బెంగాల్ నేతగాని గుత్త స్వామ్యంగా ఉండేది. భారతదేశంలో బ్రిటిష్ పెత్తనం నెలకొల్పబడటంతో ముడి జనుములో అత్యధిక భాగం బ్రిటన్‌కి — డండీకి — ఎగుమతి చేయ

బడేది. ఇది స్థానిక చేనేత జనపనార పరిశ్రమను కుంగదీసింది. అయితే, 19వ శతాబ్ది మధ్యనాటికి, జనపనారకి ప్రధాన పోటీదారైన రష్యన్ కీత్తనార ఎగుమతులు నిలిచిపోయేందుకు కారణభూతమైన క్రిమియన్ యుద్ధ ఫలితంగా ప్రపంచ మార్కెట్టులో జనపనార సరుకుల గిరాకీ బాగా పెరిగింది. అది, భారతదేశంలో జనపనార మిల్లుల నిర్మాణానికి ప్రేరణనిచ్చింది. తొలి జనపనార మిల్లు 1854లో నిర్మింపబడింది. ఆ శతాబ్ది అంతం నాటికి భారతదేశంలో, ప్రధానంగా కలకత్తా ప్రాంతంలో, 29 మిల్లులు వెలిశాయి. 1913–14 నాటికి యీ సంఖ్య రెట్టింపైంది. అప్పటికి జనపనార మిల్లుల్లో 2 లక్షలకి పైగా కార్మికులు ఉన్నారు. ఆదినుంచీ యీ పరిశ్రమ విశిష్ట లక్షణం, అటు పెట్టుబడి, యిటు కార్మికుల అధిక కేంద్రీకరణ.

1911 నాటి లెక్కల ప్రకారం, భారతదేశంలో 7 వేలకి పైగా పారిశ్రామిక సంస్థలు వున్నాయి. భారతీయ గణాంక లెక్కల్లో యివి ఫాక్టరీలుగా లేక మిల్లులుగా నమోదుచెయ్యబడ్డాయి. అయితే, అవి అధికాంశం వర్క్‌షాపులు లేక కార్ఖానాలు. ఎందుకంటే, ఆంగ్లో-ఇండియన్ గణాంక లెక్కల ప్రకారం, యంత్రాలు ఉపయోగించబడక పోయినా కూడా, 20 మందికి పైగా కార్మికులు పనిచేసే పారిశ్రామిక సంస్థలు ఫాక్టరీలుగా పరిగణింపబడతాయి.

అప్పట్లో భారతదేశంలో పెట్టుబడిదారీ పరిశ్రమ అభివృద్ధియొక్క అతి ముఖ్య ఫలితం యేమిటంటే, కార్మికవర్గ ఆవిర్భావం. 19వ శతాబ్ది రెండవ అర్ధభాగంనుంచి యీ నూతన సామాజిక, రాజకీయ శక్తి భారతదేశ చరిత్రలో అంతకంతకు అధికతర పాత్ర వహించనారంభించింది.

1911లో దేశంలో కార్మికుల మొత్తం సంఖ్య తేయాకు, వగైరా తోటల కూలీలతో కలుపుకొని 20 లక్షలకు పైగా వుంది.

అయితే, వారిలో అధిక సంఖ్యాకులు ఫాక్టరీల్లో కాక, చిన్న కార్ఖానా తరహా వర్క్‌షాపుల్లో పనిచేస్తూండేవారు.

భారతదేశంలో జనాభా నిర్మితి కూడా పెట్టుబడిదారీ పరిశ్రమ అభివృద్ధికి విశిష్టమైనది. 19వ శతాబ్ది మధ్యలో పట్టణవాస జనాభా మొత్తం జనాభాలో దాదాపు 10 శాతం వుంది. అదే సమయంలో అమెరికాలో యీ సంఖ్య 4 శాతంకంటె తక్కువ, ఫ్రాన్సులో దాదాపు 10 శాతం వున్న విషయాన్ని దృష్టిలో పెట్టుకున్నప్పుడు ప్రత్యేకించి యీ సంఖ్య బాగా అధికమే. అయితే, దరిమిలా 40 పైచిలుకు సంవత్సరాల్లో భారతదేశంలో పట్టణవాస జనాభా దాదాపు యేమీ మారలేదు.* పట్టణవాస జనాభాలో నికరమైన పెరుగుదలకి విశిష్ట లక్షణం వుంది. ఏ ఓడరేవు పట్టణాల గుండా అయితే ముడి పదార్థాలూ, ఆహార పదార్థాలూ దేశంనుంచి బయటకు ఎగుమతి చెయ్యబడతాయో అధికాంశం ఆ పట్టణాల్లో జనాభా పెరిగింది. అంచేత, యీ పెరుగుదలకి పరిశ్రమల అభివృద్ధితో సంబంధం లేదు. అది, దేశపు ముమ్మర దోపిడినుంచి ఉత్పన్నమైంది.

భారతదేశపు ఆర్థిక పరిణామపు అతి ప్రముఖ పరిశీలకుల్లో ఒకడైన డి. ఆర్. గాడ్గిల్ దృష్టిలో, భారతదేశంలో పట్టణవాసపు పెరుగుదలకు "వర్తకాంశం పరిశ్రమాంశంకన్న చాలా ఎక్కువగా కారణం."** వాస్తవానికి, 20వ శతాబ్ది మొదట్లో పారిశ్రామిక కేంద్రాలంటూ యేవీ లేవు. భారతీయ పరిశ్రమ స్వభావ రీత్యా వలస విశిష్ట లక్షణం కలిగినది: లఘు పరిశ్రమ, ప్రత్యేకించి పత్తి, జనపనార పరిశ్రమ ప్రాబల్యం, బాగా నిమ్న సాంకేతిక స్థాయి, దిగుమతి చేసుకోబడిన

---

* D. R. Gadgil, *The Industrial Evolution of India in Recent Times*, Humphrey Mifford, Madras, 1924, p. 159.

** అదే పుస్తకం, పేజి 172.

యంత్ర సముదాయంపైన ఆధారపడటం. మొదటి ప్రపంచ యుద్ధ ఆరంభం నాటికి లోహపాత పరిశ్రమ అప్పుడప్పుడే మొదలవుతోంది. ఇంజనీరింగు గాని, యితర భారీ పరిశ్రమలు గాని లేవు.

భారతదేశంలో 19వ శతాబ్ది రెండవ అర్ధభాగంనుంచి అభివృద్ధి చెందనారంభించిన పెట్టుబడిదారీ సంబంధాలు ఆర్థిక వ్యవస్థయొక్క అన్ని శాఖలనూ, అదే మేరకు అన్ని భౌగోళిక ప్రాంతాలనూ ప్రభావితం చెయ్యలేదు. దూర ప్రాంతాలు సాధారణ వర్తక తిరగడలోకి అతి స్వల్పంగా మాత్రమే లాగబడ్డాయి, నూతన పరిస్థితులచేత పరోక్షంగా మాత్రమే ప్రభావితం చెయ్యబడ్డాయి. భారతీయ ఆర్థిక వ్యవస్థ ప్రధాన శాఖ అయిన వ్యవసాయవు విశేషమైన వెనకబాటుతనానికి పునాది పడినది కూడా ఆ దశలోనే.

వ్యవసాయంలో పెట్టుబడిదారీ సంబంధాలు, మందగతిలో ఎగుడు దిగుడుగా సాగే పరిశ్రమాభివృద్ధి కాలంలో అభివృద్ధిచెందాయి. అది పెట్టుబడిదారీ పూర్వ లక్షణాలు పదిలపరచబడటానికి అనివార్యంగా దారితీసింది. గ్రామీణ ప్రాంతాల్లో సరుకు—డబ్బు సంబంధాలూ, పెట్టుబడిదారీ వ్యవస్థా భూమిపైన ఫ్యూడల్ భూస్వాముల స్వామ్యం ప్రబలంగా వున్న కాలంలో, రైతులు, అర్ధస్వయంపోషక ఆర్థిక వ్యవస్థతో ఫ్యూడల్ శిస్తులచేతా, పన్నులచేతా అణగదొక్కబడిన కాలంలో పురోగమించాల్సివచ్చింది. స్వతంత్ర దేశాల్లో స్వేచ్ఛాయుతమైన నగదు సంచయనాలు పారిశ్రామికోత్పత్తిలో మదుపు పెట్టబడుతూ వుండగా, భారతదేశంలో స్వేచ్ఛాయుతమైన పెట్టుబడిలో అత్యధిక భాగం, ఫ్యూడల్ కౌలు రూపంలో అధిక ఆదాయాలిచ్చే భూమి కొనుగోలుకోసం వినియోగింపబడింది. ఆ పరిస్థితుల్లో, భూస్వాముల చేతుల్లో వున్న భూమి పరిమాణం పెరుగుతూ వుండగా, రైతుల చేతుల్లో వున్న భూమి పరిమాణం క్రమక్రమంగా తగ్గిపోతూ వచ్చింది. చిన్న భూఖండాలు కలిగిన లేక అసలు భూమి లేని రైతుల సంఖ్య విస్తృతంగా ఉండ

టమన్నది భారతదేశపు గ్రామసీమల అత్యంత విశిష్ట లక్షణం.

18వ శతాబ్ది చివర, 19వ శతాబ్ది ఆరంభంలోనూ జరిగిన వలస ఆక్రమణలు, బ్రిటిష్ భూ సంస్కరణల కాలంలో భారతీయ రైతులు సిగ్గుచేటైన పద్ధతిలో దోపిడికి గురిచెయ్యబడి, వారి ''పాత ప్రపంచం''నుంచి దూరం చెయ్యబడ్డారు. 19వ శతాబ్ది అర్ధభాగంలో ప్రపంచ మార్కెట్ ప్రభావమూ, ముడి పదార్థాలు, ఆహారం విష యంలో దాని అపారమైన అవసరాలూ వారి అనుభవంలోకి రాసాగాయి. ఫ్యూడల్ శిస్తు మారి వర్తక, వడ్డీ పెట్టుబడి లావాదేవీల పరిమాణం గణనీయంగా పెరిగినప్పుడు సామ్రాజ్యవాద దోపిడి తొలి ప్రభావాన్ని గ్రామాలు చవిచూశాయి. బ్రిటిష్ గుత్త సంస్థలు చౌక ముడి పదా ర్థాల్లో అనక్తి చూపాయి. ఆ ముడి పదార్థాలను కోట్లాది రైతు లను దోచుకొనే భూస్వాములు, వడ్డీ వ్యాపారస్తులు సరఫరా చేస్తూండే వారు. తత్ఫలితంగా, శిస్తు అన్నది ఫ్యూడల్ దోపిడి రూపం మాత్రమే కాకుండా సామ్రాజ్యవాద దోపిడి రూపం కూడా అయింది. భూస్వామికి దానికదిగా తను పొందిన శిస్తు మొత్తంపట్ల ఆసక్తి ఉండేది కాదు, దాని మారకపు విలువలో మాత్రమే అతనికి ఆసక్తి ఉండేది. ఇది అదనపు శ్రమకి గిరాకీని ఆచరణలో అనంతంగా పెంచి శిస్తుల విపరీతమైన పెరుగుదల రూపాన్ని తీసుకొంది.

ఫ్యూడల్ భూస్వామ్య దోపిడి అంతకంతకు అధికంగా వర్తక, వడ్డీ దోపిడితో ముడిపడింది. 19వ శతాబ్ది చివరి నాటికి వడ్డీ వ్యాపార స్తులకు రైతుల రుణం 3 వందల కోట్ల రూపాయల స్థాయికి చేరు కొంది. వడ్డీ వ్యాపారులు, వర్తకులు సామ్రాజ్యవాద గుత్త సంస్థలతో (ప్రత్యేకించి బాంకులతో) సన్నిహిత సంబంధాలు కలిగి వున్నారు. వారు రైతుల ఉత్పాదితాన్ని తక్కువ ధరలకు కొనేవారు, లేక తమకి చెల్లించ వలసిన బాకీలకుగాను కబ్జాచేసుకునేవారు. ముడి పదార్థాలను, ఆహార పదార్థాలను దేశంనుంచి ఎగుమతిచేసేవారు.

భూమి పన్ను కూడా రైతుల దోపిడిలోనూ, భారతదేశాన్ని బ్రిటన్‌కి ముడి పదార్థాలను ఎగుమతిచేసే తైనాతీగానూ మార్చివెయ్యడంలో ఒక ముఖ్య పాత్ర వహించింది. భారతదేశాన్ని ముడి పదార్థాల సరఫరాదారుగా తయారుచెయ్యడంలో కౌలు పద్ధతిని వలసవాదులు ఒక ముఖ్య సాధనంగా వినియోగించుకొన్నారు. వివిధ ద్రవ్య చర్యలను వినియోగించుకోవడం ద్వారా సామ్రాజ్యవాదులు బ్రిటన్ పరిశ్రమలకి దాని నగరాలకి అవసరమైన మొత్తాల్లో ముడి పదార్థాలను, ఆహార పదార్థాలను (జనపనార, పత్తి, నీలిమందు, గోధుమ, వగైరాలు) ఉత్పత్తిచేసేలాగ రైతులను నిర్బంధించేవారు.

ఈ పరిస్థితుల్లో వ్యాపార, వాణిజ్య పంటల సేద్యంలో పెరుగుదల గ్రామాల్లో పెట్టుబడిదారీ వ్యవస్థ అభివృద్ధి ఫలితంగా కంటె వ్యావసాయిక ముడి పదార్థాల అనుబంధ సరఫరాదారుగా భారతదేశపు దోపిడి ఫలితంగా జరిగింది. 1880, 1890 దశకాల్లో, భారతదేశంలో స్పెషలైజేషన్ జరిగే ప్రాంతాలు ఆవిర్భవించసాగాయి. గుజరాత్, బేరార్, సూరత్, తదితర ప్రాంతాలు పత్తిలో స్పెషలైజ్ చెయ్యగా, ఈశాన్య భారతదేశం (పంజాబు) క్రమంగా గోధుమ ఎగుమతి ప్రాంతం అయింది. అయితే, సాంకేతిక పంటలకింద ఉన్న ప్రాంతాల విస్తరణతో సంబంధితమైన వాణిజ్య వ్యవసాయ ఆరంభం సైతం ఆహార పదార్థాల కొరతల మూలంగానూ, ఆయా ప్రాంతాల మధ్య సంబంధాలు కొరవడిన మూలంగానూ ఈ స్పెషలైజేషను చాలా పరిమితమైంది.

వాణిజ్య వ్యవసాయం ప్రధానంగా ప్రపంచ పెట్టుబడిదారీ మార్కెట్‌కి ఉన్ముఖం చెయ్యబడింది, అది దేశీయ మార్కెట్ అభివృద్ధిని మందగింపచేసేందుకు దారితీసింది. రైతుకి ప్రపంచ మార్కెట్‌తో ప్రత్యక్ష సంబంధాలు లేనందున, అన్ని సంబంధాలూ వడ్డీ వ్యాపారులు, భూస్వాముల ద్వారానే నిర్వహింపబడుతున్నందున, ఆచరణలో రైతు మార్కెట్‌నుంచి వేరుచెయ్యబడ్డాడు. అతని పంట అతన్నుంచి ఒక

సరుకు రూపంలో కాక, కౌలు గానో లేక అప్పులపై వడ్డీ గానో దూరంచేయబడుతూ వచ్చింది. భూస్వాముల, వడ్డీ వ్యాపారుల చేతుల్లో మాత్రమే రైతుల పంట ఒక సరుకు అయ్యేది.

ఈ వాణిజ్య వ్యవసాయ రూపం దేశపు సామ్రాజ్యవాద దోపిడికి తోడ్పడి, దాని వనరులు నిండుకొనేందుకు దోహదంచేసి, అదే సమయంలో జనాభా దారిద్ర్యానికి గురిచేసేది. సామ్రాజ్యవాద దశలో కరువుకి గురైన భారతదేశంనుంచి ఆహార పదార్థాల (ప్రత్యేకించి గోధుమ) ఎగుమతి బృహత్ ప్రమాణానికి చేరుకుంది. అర్ధశతాబ్దికి తక్కువ కాలంలో గోధుమ ఎగుమతులు సుమారు 43 రెట్లు పెరిగాయి.* 1841కి, 1872–1891కి మధ్య పంట దిగుబడులు 64 శాతం పడిపోయి, పంట ప్రాంతాలు మారని కాలంలో ఈ పెరుగుదల సంభవించింది.** వలస అధికారులచేత ఆహార పదార్థాల ఈ ఎగుమతులు లక్షలాది భారతీయుల భౌతిక నిర్మూలనకు సమానమైనది.

19వ శతాబ్ది రెండవ అర్ధభాగంలో, సుదీర్ఘ వ్యవసాయ చరిత్ర కలిగి ఏటా రెండు పంటలు పండించే సామర్థ్యం కలిగిన భారతదేశం తీవ్రమైన ఆహార సమస్యకు గురైంది. ఈ సమస్య యీనాటికీ అపరిష్కృతంగానే ఉండిపోయింది. వ్యావసాయికోత్పత్తి క్రమంగా పడిపోయింది. విస్తృత సేద్యపు పరిస్థితుల్లో వ్యవసాయ క్షేత్రపు పంటల విస్తృత ఎగుమతులు, నీటిపారుదల సౌకర్యాలపైన, ఎరువుల ఉత్పత్తిపైన (అన్నట్లు, ఎరువులు సైతం పెద్ద మొత్తాల్లో ఎగుమతి చెయ్యబడుతున్నాయి) తగినంత సొమ్ము ఖర్చుపెట్టకపోవడం భూమి

---

* Brij Narain, *Indian Economic Life. Past and Present*, Uttar Chand Kapur and Sons, Lahore, 1929, p. 436లో ఉదహరింపబడిన సమాచారం ఆధారంగా వెయ్యబడిన లెక్కలు.

** అదే పుస్తకం, పేజి 366.

పేదబడిపోవడానికి దారితీశాయి. భారతదేశంలో ఆకలి అన్నది దీర్ఘకాలిక లక్షణమైంది.

అయితే 19వ శతాబ్ది రెండవ అర్ధభాగంలో అది బ్రిటిష్ పారిశ్రామిక పెట్టుబడి ప్రాబల్యకాలంలోని దానికంటె భిన్న రూపం తీసుకుంది. అది అప్పుడిక ఎంత మాత్రం వ్యవసాయపు పతన క్షైణ్యాల ఫలితం మాత్రమే కాక, అత్యధిక రైతు కమతాల్లో పునరుత్పత్తి యొక్క నూతన పరిస్థితుల ఫలితం కూడా అయింది. శిస్తు, భూమి పన్ను, అప్పులపై వడ్డీలు చెల్లించవలసిన ఒత్తిడి మూలంగా తన పంటలో రైతు ఎంత పెద్ద వాటాను కోల్పోయేవాడంటే, అతని జీవికకు కనీస మొత్తం మాత్రమే మిగిలేది (అన్నప్పుడూ అదీ వుండేది కాదు). దానితో, దాని సాంప్రదాయిక రూపంలో స్వయం పోషక ఆర్థిక వ్యవస్థ, అంతమైపోయింది. ఆ పరిస్థితుల్లో, మామూలుగా పంట దెబ్బతిన్న సందర్భం సైతం పెద్ద విపత్తుగా పరిణమించేది. అప్పటికే సంఖ్య రీత్యా గణనీయంగా పెరిగిన వ్యవసాయ కార్మికులు తమ సాంప్రదాయిక జీవనోపాధులను కోల్పోయి, పాక్షికంగా తమ వేతనంమీద బతుకుతున్నారు, ఆహార పదార్థాలకు గిరాకీ పెరిగింది. అలాంటి పరిస్థితిలో ఆహార పదార్థాలు ఎగుమతి చెయ్యబడుతూవచ్చాయి. కాగా, సామ్రాజ్యవాద యుగంలో, భారతదేశంలో క్షుద్బాధ వలస దోపిడియొక్క మౌలిక వ్యక్తీకరణ అవుతూ వచ్చింది.

ఫ్యూడల్ భూస్వామ్య, సామ్రాజ్యవాద దోపిడి తీవ్రతరమవడం, రైతులు తమ భూములు కోల్పోవడం, పేదతనం పెరుగుదల – యివన్నీ కలిసి, గ్రామీణ ప్రాంతాల్లో వర్గ వైరుధ్యాలను తీవ్రంగా పెంచాయి. 1870, 1880 దశకాల్లో జాతీయ విముక్తి ఉద్యమంలో ఒక నూతన వెల్లువ వచ్చింది. అది రైతు తిరుగుబాట్ల రూపం తీసుకుంది. దానితో వలసవాదులు భూమి కౌలు పద్ధతిని సంస్కరించక గత్యంతరం లేని స్థితిలో పడ్డారు. 19వ శతాబ్ది రెండవ అర్ధభాగంలో

వలన ప్రభుత్వం గ్రామాల్లో భూమి కౌలు పద్ధతిని నియంత్రితంచేసే కొన్ని చట్టాలను జారీచేసింది. వీటిని రైత్వారీ, జమీందారీ పద్ధతులను ప్రవేశపెట్టిన దరిమిలా జరిగిన వ్యవసాయ చట్టాల్లో రెండవ ఘట్టంగా పరిగణించవచ్చు. ఈ నూతన ఘట్టానికి చెందిన చట్టాల్లో 1857–59 నాటి జాతీయ తిరుగుబాటు అనంతరం వెంటనే 1859లో జారీచెయ్యబడిన బెంగాలు కౌలు చట్టం (Bengal Rent Act) మొదటిది.* భారతదేశంలో బ్రిటిష్ సామ్రాజ్యవాదపు సమర్థకులైన బూర్జువా అర్థశాస్త్రవేత్తలు ''బెంగాలీ రైతుల మహా పత్రం''గా దాన్ని అభివర్ణించారు. అయితే వాస్తవంలో, యీ ''పత్రం''వల్ల రైతులు పొందిందేమిటి?

1859 చట్టం బెంగాల్లో శాశ్వత భూమి కౌలు పద్ధతి అనబడే హక్కును నెలకొల్పింది. అది భూస్వాముల ఏకపక్ష చర్యలనుంచి, తమ భూములనుంచి రైతులు తొలగింపబడటం, భూమి శిస్తును పెంచి వెయ్యడం, మొదలైనవాటినుంచి రైతులకు రక్షణ కల్పించవలసివుంది. ఆ చట్టం, బ్రిటిష్ ఇండియాలోని యితర రాష్ట్రాలకోసం దరిమిలా జారీచెయ్యబడిన వ్యవసాయ చట్టాలకు నమూనా అయింది.

1859 చట్టం భూమి కౌలుదార్ల అతి చిన్న బృందానికి, మిక్కిలి ధనిక బృందానికి కొన్ని హక్కులను, ప్రత్యేక సౌకర్యాలను కల్పించి, రైతులను తరతమ హక్కులు కలిగిన గ్రూపుల్లోకి మరింతగా విడదీసింది. అత్యధిక సంఖ్యాక రైతుల పరిస్థితిలో 1859 చట్టం గణనీయమైన మెరుగుదల యేమీ తీసుకురాలేదు. తద్భిన్నంగా, చాలా సందర్భాల్లో వారి పరిస్థితి మరింత హీనమైంది. ఎందుకంటే, కౌలు వ్యవధి 12 ఏళ్లను మించకుండా వుండేందుకుగాను, జమీందార్లు తమ కౌలుదార్లను మధ్యమధ్య మార్చివేస్తూ వచ్చారు.

---

* *Agricultural Legislation in India*, v. VI, Delhi, 1955, p. VI.

భారతదేశంలో ఫ్యూడల్ వ్యతిరేక, సామ్రాజ్యవాద వ్యతిరేక పోరాటం 1880 దశకంలో ఒక కొత్త మలుపు తిరిగింది. సామ్రాజ్యవాదులు కొత్త వ్యవసాయ చట్టాలు జారీచెయ్యడం ద్వారా ఆ పోరాటపు తాకిడిని తగ్గించేందుకు ప్రయత్నించారు. 1859 చట్టానికి సవరణలూ, చేర్పులూ సూచిస్తూ బెంగాల్ రాష్ట్రానికి వర్తించే మరొక భూమి చట్టం 1885లో ప్రవేశపెట్టారు.*

పెట్టుబడిదారీ పూర్వ దోపిడి మౌలిక సూత్రాలను స్పృశించకుండా, ఆ చట్టం భూమి కౌలుదార్ల మరింత విస్తృత విభాగానికి మరింత దీర్ఘ కౌలు వ్యవధినిచ్చే అవకాశం కల్పించింది. రైతుల క్రోధంనుంచి భూస్వాములను కాపాడేందుకు యిది అవసరమైంది. అంతే కాకుండా, 1880, 1890 దశకాల్లో చెయ్యబడిన వ్యవసాయ చట్టాలకు భారతీయ గ్రామాల్లో సరుకు—పెట్టుబడిదారీ సంబంధాల అభివృద్ధిని నిర్లక్ష్యంచెయ్యడం సాధ్యం కాలేదు.

వర్తకులూ, వడ్డీ వ్యాపారులూ రైతులను చేసే దోపిడిపట్ల వలస వాదులు కూడా ప్రతివర్తించక తప్పనిసరి పరిస్థితిలో పడ్డారు. వడ్డీ వ్యాపారులకు వ్యతిరేకంగా ఉద్దేశింపబడిన తొలి చట్టం డక్కన్‌లో కొన్ని రైతు తిరుగుబాట్లు సంభవించిన దరిమిలా వెంటనే 1879లో ఆమోదింపబడింది. ఆ చట్టం ప్రకారం సివిల్ కోర్టులకు, మరీ అధికంగా తాము పరిగణించిన వడ్డీ రేట్లను తగ్గించే హక్కు కల్పింపబడింది. ప్రత్యేకమైన కోర్టు ఆర్డరు లేనిదే బాకీదారు భూమిని అమ్మివెయ్యడాన్ని ఆ చట్టం నిషేధించింది. అయితే ఆచరణలో యీ చట్టమూ, వడ్డీ వ్యాపారులకు వ్యతిరేకింపబడిన యితర చట్టాలూ (యీ బాపతు చట్టాలు 100కి పైగా వున్నాయి) అమలుజరపబడేవి కావు.

ఈ చట్టపు మరో లక్షణం ఏమిటంటే అది భారతదేశ మంత

---

* అదే పుస్తకం, పేజి VII.

టికీ వర్తించదు. భిన్న రాష్ట్రాలకు భిన్నమైన చట్టాలు ఉన్నాయి. వాటిని స్థానిక అధికారులు అమల్లో పెట్టవలసివుంటుంది. ఆచరణలో, వాటికి కేంద్ర వలస అధికారుల తోడ్పాటు ఉండేది కాదు. చివరకు న్యాయవాదులు సైతం వాటికి వేర్వేరు భాష్యాలు చెప్తూండేవారు. కాగా, రైతులు తమ హక్కులను కాపాడుకొనేందుకు వాటిని వినియోగించుకోలేకపోయేవారు.

భారతదేశంలో వ్యావసాయిక విప్లవాన్ని నివారించడం, వ్యవసాయంలో వలసవాద పెట్టుబడిదారీ వ్యవస్థ అభివృద్ధికోసం కనీసావసర పరిస్థితులను కల్పించడం — ఇదీ వలసవాదుల భూ చట్టాల లక్ష్యం. ఈ చర్యలన్నింటికీ ఇదే ఆర్థిక, రాజకీయ మూలం. ఆ చట్టాల్లో ఏ ఒక్కటీ విస్తృత రైతు జనసామాన్యపు పరిస్థితిని సులభతరం చెయ్యలేదు. అలాగే అవి ఫ్యూడల్ భూస్వామ్య లేక సామ్రాజ్యవాద దోపిడినుంచి రైతులను కాపాడలేదు. వ్యావసాయిక చట్టాలు వాగాడంబర లక్ష్యాల కోసం, రైతుల హక్కులకోసం జరిగే అసలైన పోరాటాలనుంచి వారి దృష్టిని మళ్లించేందుకోసం విస్తృతంగా వినియోగింపబడ్డాయి.

ఈవిధంగా, మొదటి ప్రపంచ యుద్ధారంభం నాటికే భారతదేశం ఒక సాంప్రదాయిక వలసదేశం — పెట్టుబడి మదుపుపెట్టేందుకు అనువైన స్థానం, ముడి పదార్థాలకు ఒక మూలస్థానం, ఉత్పాదిత సరుకులకు ఒక మార్కెట్టు — అయింది. వలసదేశానికి ఇది నమూనా ప్రాయమైన ఆర్థిక నిర్మాణం. బ్రిటిష్ పెట్టుబడి ఎగుమతిచెయ్యబడి, కొన్ని ఫాక్టరీ పరిశ్రమలు నిర్మింపబడినప్పటికీ, భారతదేశం విచ్ఛిన్నమవుతున్న వృత్తి పరిశ్రమల దేశంగానే మిగిలిపోయింది. నూతన ఉత్పత్తి రూపాలు చాలా మెల్లగా తలెత్తాయి. దేశంలో వ్యవసాయ రంగం పూర్తి ప్రాబల్యంలో ఉండి, దానిలో రైతులపై ఫ్యూడల్, పాక్షిక ఫ్యూడల్ దోపిడి రూపాలు రాజ్యం చేశాయి.

ప్రకరణం 2

రెండు ప్రపంచ యుద్ధాల మధ్య భారతదేశపు ఆర్థికాభివృద్ధి

పారిశ్రామికాభివృద్ధి విశిష్ట లక్షణాలు

౨౦ పవ శతాబ్ది కాలం యావత్తు మానవాళి అభివృద్ధిలో ఒక మైలురాయి. ఆ దశ పెట్టుబడిదారీ వ్యవస్థ సార్వత్రిక సంక్షోభపు మొదటి దశతో ఆరంభమై మరింత ప్రగాఢమైన సంక్షోభపు నూతన దశ ఆవిర్భావంతో ముగిసింది. ఆ దశలోనే సామ్రాజ్యవాదపు రాజకీయ, ఆర్థిక శక్తి బలహీనపడనారంభించింది, వెనకటి రష్యన్ సామ్రాజ్యంలో కార్మికుల, రైతుల రాజ్యం నెలకొల్పబడింది. ఆ రాజ్యం నవజీవన నిర్మాణం మొదలుపెట్టింది. అక్టోబరు సోషలిస్టు విప్లవం జారిస్టు రష్యాకి సంబంధించిన వలస సమస్యను పరిష్కరించి వలస పీడనతో బాటు అన్ని రకాల పీడననుంచి రష్యాలోని అన్ని జాతుల ప్రజలనూ విముక్తం చేసింది.

రెండు ప్రపంచ యుద్ధాల మధ్య సంవత్సరాల్లో భారతదేశంలో బ్రిటిష్ సామ్రాజ్యవాదపు సంక్షోభం అంతకంతకు స్పష్టంగా వెల్లడైంది.

అంతకుముందు దశలో తలెత్తిన వైరుధ్యాలు — స్వతంత్ర ఆర్థికాభివృద్ధి అవసరాలకీ, వలస బానిసత్వానికీ మధ్య వైరుధ్యాలు — బాగా వ్యగ్రమై, జాతీయ విముక్తి పోరాటం తీవ్రతరమయ్యేందుకు ప్రాతిపదిక అయ్యాయి.

మొదటి ప్రపంచ యుద్ధానికి ముందూ, దాని తొలి దశల్లోనూ

కొన్ని పరిశ్రమలు అభివృద్ధిచెందిన ఫలితంగా స్వతంత్ర ఆర్థిక, రాజకీయ పెరుగుదలపట్ల వాంఛ మరింత ప్రగాఢమైంది. యుద్ధం పరిశ్రమల పెరుగుదలను విశేషంగా ప్రభావితం చేసి, సామ్రాజ్యవాద ఒత్తిడిని కొంతమేరకు తగ్గించింది. సామ్రాజ్యవాద రాజ్యాల మధ్య సైనిక ఘర్షణ భారతీయ పరిశ్రమల పరిమిత అభివృద్ధికి సానుకూల పరిస్థితులను కల్పించింది. యూరప్‌నుంచి దిగుమతులు తగ్గాయి, అదే సమయంలో దేశీయ మార్కెట్‌లో పారిశ్రామిక సరుకులకు గిరాకీ పెరిగింది. భారతదేశం మిత్రరాజ్యాల యుద్ధావసరాలైన గోనెసంచులు, టంగ్‌స్టన్, మైకా, సాల్ట్‌పీటర్, కలప, తదితర ముడి పదార్థాలను సరఫరా చేసింది. 1918 నాటికి భారతదేశపు సైనిక వస్తు సరఫరాల విలువ 8 కోట్ల పౌనులు ఉంది.* అదే సమయంలో దాని మొత్తం సైనిక వ్యయం 25 కోట్ల పౌనులు. సైనిక వస్తువులకు ఆర్డర్లు, వీటికితోడు భారతీయ మార్కెట్‌లో జపాను, అమెరికాలు అంతకంతకు ఎక్కువగా చొరబడటం కొన్ని భారతీయ పరిశ్రమల పెరుగుదలకు ప్రేరణనిచ్చాయి.

ఆ దశలో పెరుగుతున్న ధరలు కూడా ఉత్పత్తిని గణనీయంగా ప్రభావితం చేశాయి. దేశపు ఆర్థికాభివృద్ధి అవకాశాలను అధ్యయనం చేసేందుకుగాను భారతదేశంలో 1916లో భారతీయ పారిశ్రామిక కమిషన్ అనే ఒక ప్రత్యేక సంస్థ నెలకొల్పబడింది. ఆ మరుసటి సంవత్సరం ఆయుధ పరికరాల సమితి ఏర్పాటుచెయ్యబడింది. కమిషన్ అధ్యయనాలవల్ల ఆచరణలో ఎలాంటి ఫలితాలూ కలగలేదు. 1918లో ప్రచురించబడిన దాని సిఫారసులో నిర్దిష్టమైన ప్రతిపాదనలు ఏమీ లేవు. యుద్ధావసరాలను తీర్చడమే దాని పని కనుక ఆయుధ పరికరాల సమితి మరింత జయప్రదంగా పనిచేసింది. దాని ఆధ్వర్యంలో సైనిక

---

* పైన ఉదహరించబడిన Vera Anstey పుస్తకం, పేజి 216.

పరికరాలను ఉత్పత్తిచేసే పారిశ్రామిక సంస్థలు నెలకొల్పబడ్డాయి. రైలు పట్టాలు, ఉన్ని వస్త్రాలు, తోలు, వగైరాల సరఫరాలకోసం భారతీయ సంస్థలతో ఆ సమితి కంట్రాక్టులు కుదుర్చుకొంది.

అయితే భారతదేశంలోని చాలా కొత్త ఫాక్టరీల్లో వాటాలు కలిగి, అక్కడ తమ పెట్టుబడి మదుపులను పెంచుకొన్న బ్రిటిష్ బూర్జువా వర్గమే ఈ పారిశ్రామికోత్పత్తి అభివృద్ధి మూలంగా ప్రథమంగానూ, ప్రధానంగానూ లాభం పొందిందన్న విషయాన్ని గుర్తించవలసి ఉంది. యుద్ధ కాలంలో శీఘ్రంగా అభివృద్ధిచెందిన పరిశ్రమల్లో జనపనార, బొగ్గు, బంగారం, మరికొన్ని ఇతర పరిశ్రమలు ఉన్నాయి. వాటిలో సర్వేసర్వత్రా బ్రిటిష్ పెట్టుబడి గుత్తస్వామ్యం కలిగివుంది. 1913/14కీ, 1919/20కీ మధ్య జనపనార మిల్లుల సంఖ్య 64నుంచి 76కి పెరిగింది. జనపనార సరుకుల (సంచులు, పట్టా) ఎగుమతి రెట్టింపుకి పైగా పెరిగింది. జనపనార పరిశ్రమలో చెల్లింప బడిన సగటు డివిడెండు 140 శాతానికి తక్కువ కాకుండా వుంది.

యుద్ధ పరిశ్రమల అవసరాలు, దిగుమతుల నిలిపివేత, లోహపోత పరిశ్రమ అభివృద్ధి—ఇవన్నీ బొగ్గుగని పరిశ్రమకు దోహదంచేశాయి. యుద్ధ సంవత్సరాల్లో బొగ్గు ఉత్పత్తి 1 కోటి, 62 లక్షల టన్నుల నుంచి 2 కోట్ల, 26 లక్షల టన్నులకు పెరిగింది. మాంగనీసు, వెండి, సీసం, జింకు, ఇనుప ఖనిజాల ఉత్పత్తి కూడా బాగా పెరిగింది. టీ ఎగుమతి గణనీయంగా పెరిగింది. యుద్ధం బ్రిటిష్ పెట్టుబడిదారు లను సంపన్నంచేసి, బ్రిటిష్ పెట్టుబడి మదుపులను విశేషంగా పెంచింది. అయితే, అదే సమయంలో భారతీయ పెట్టుబడులు స్థిరపడ్డాయి. జాతీయ పరిశ్రమాభివృద్ధి వేగం పెరిగింది. దేశీయ మార్కెట్‌లో దాని పరిస్థితి మెరుగైంది. జాతీయ పెట్టుబడి వినియోగ రంగం విస్తృతమైంది. జాతీయ పెట్టుబడి ప్రాబల్యం వహించిన కొన్ని పరిశ్రమలు దేశీయ మార్కెట్‌లో క్రమంగా మరింత బలమైన స్థానాన్ని

సంపాదించుకోసాగాయి. ఇది ప్రత్యేకించి పత్తి పరిశ్రమలో స్ఫుటంగా కనిపించింది.

లాంకషైర్ తన వస్త్రాలతో భారతీయ మార్కెట్‌ను ఇప్పుడిక ఎంత మాత్రం ముంచెత్తే పరిస్థితిలో లేదు. 1913/14కీ 1917/19కీ మధ్య బ్రిటిష్ నూలు వస్త్రాల దిగుమతులు దాదాపు సగమయ్యాయి. కాగా, అదే సమయంలో భారతదేశంలో వాటి ఉత్పత్తి 27 శాతం పెరిగింది.* యుద్ధ సంవత్సరాల్లో నూలు మిల్లుల ఉత్పత్తిలో విశేషమైన మార్పు వచ్చింది. యుద్ధానికి ముందు, ఆ మిల్లుల్లో అత్యధికాంశం ప్రధానంగా నూలు మిల్లులు. యుద్ధ సంవత్సరాల్లో మగ్గాల సంఖ్య 25 శాతం పెరగ్గా, మిల్లుల సంఖ్యా, కదుళ్ల సంఖ్యా దాదాపు ఏమీ పెరగలేదు. యుద్ధానికి ముందు, బ్రిటిష్ వస్త్రాలు భారతీయ మార్కెట్లో 70 శాతాన్ని ఆక్రమించగా, భారతీయ వస్త్రాలు 28 శాతం మాత్రమే వున్నాయి. యుద్ధం తర్వాత బ్రిటన్ వాటా 35 శాతానికి తగ్గగా, భారతదేశపు వాటా 61 శాతానికి పెరిగింది. 1913కీ 1920కీ మధ్య పత్తి మిల్లుల లాభాలు 4.5 రెట్లు పెరిగాయి.

యుద్ధావసర వస్తువుల ఆర్డర్లూ, అధిక లాభాలూ భారతదేశంలో యుద్ధానికి సరిగా ముందు మొదలై, ప్రధానంగా టాటా గ్రూపుకి ప్రాతినిధ్యం వహించిన ఇనుము, ఉక్కు పరిశ్రమాభివృద్ధికి దోహదం చేశాయి. భారతదేశంలో ''ఇండియన్ ఐరన్ అండ్ స్టీల్ కార్పొరేషన్,'' ''బెంగాల్ స్టీల్ కార్పొరేషన్''— దీనికి చెందిన చిన్న పారిశ్రామిక సంస్థ మైసూరులో వుంది — అనే బ్రిటిష్ కంపెనీలు కూడా

---

* **Brij Narain,** ***Indian Economic Life. Past and Present,*** **pp. 456—57**లో ఉదహరింపబడిన సమాచారం ఆధారంగా వెయ్యబడిన లెక్కలు.

ఉక్కును ఉత్పత్తిచేశాయి. 1913లో 19,000 టన్నులు వున్న ఉక్కు ఉత్పత్తి 1918లో 1,24,000 టన్నులకి పెరిగింది. దీనిలో సుమారు 2/3 వంతు ఉక్కును టాటా గ్రూపు ఉత్పత్తి చేస్తూ వచ్చింది.

యుద్ధ కాలంలో అభివృద్ధిచెందిన మరో పరిశ్రమ సిమెంటు పరిశ్రమ. యుద్ధానికి ముందు 900 టన్నులున్న సిమెంటు ఉత్పత్తి 1919లో 87,000 టన్నులకు పెరిగింది.

యుద్ధ కాలంలో భారతీయ పెట్టుబడి అంతకుముందు బ్రిటిష్ పెట్టుబడి గుత్త స్వామ్యం కలిగివున్న పరిశ్రమల్లోకి చొరుచుకు వెళ్లింది. జనపనార, టీ పరిశ్రమలు వీటికి ఉదాహరణప్రాయమైనవి.

భారతదేశంలో మొత్తంమీద పారిశ్రామికోత్పత్తి పెరుగుదలతో, రుణ వరపతి వ్యవస్థలో కూడా జాతీయ పెట్టుబడి స్థానాలు పటిష్ఠమయ్యాయి.

యుద్ధం మూలంగా భారతీయ బడా బూర్జువావర్గం మరింత ధనికమైంది, పరిశ్రమల్లో పెట్టుబడి కేంద్రీకరణ, సాంద్రీకరణ క్రమం పెరిగింది. పెట్టుబడిదారీ వ్యవస్థ మరింత త్వరితంగా పెంపొందింది. 1921 లెక్కల ప్రకారం, భారతదేశంలో 11,000కి పైగా ఫాక్టరీలు ఉన్నాయి (1911 నాటి సంఖ్యకి యిది 4,000 ఎక్కువ), 26 లక్షలమంది కార్మికులు వున్నారు (1911 నాటి సంఖ్యకి యిది దాదాపు 5 లక్షలు ఎక్కువ).

వెనకటి మాదిరిగానే 20 మందికన్న ఎక్కువ కార్మికులు పనిచేసేవన్నీ ఫాక్టరీలుగా పరిగణింపబడ్డాయి. కాగా చాలావరకు చిన్న వర్క్‌షాపులు, కార్ఖానాలు, వగైరాలు కూడా పరిశ్రమలుగా వర్గీకరింపబడ్డాయి.

యుద్ధ కాలంలో పరిశ్రమలు పెరిగినప్పటికీ, యుద్ధానంతరం కొన్ని సంవత్సరాలు వ్యాపార విజృంభణ జరిగినప్పటికీ పారిశ్రామిక

రంగపు నిర్మాణంలో ముఖ్యమైన గుణాత్మక మార్పులేవీ సంభవించ లేదు. చిన్న తరహా పరిశ్రమలే యింకా ప్రాబల్యంలో వున్నాయి. భారీ పరిశ్రమ అతి ముఖ్య శాఖలు అప్పటికింకా లేవు. వలస పారిశ్రామిక నిర్మాణం మార్పు లేకుండా అలాగే ఉండిపోయింది. ఎందుకంటే, యుద్ధ కాలంలో సైతం సామ్రాజ్యవాదం పారిశ్రామికాభివృద్ధిని ప్రత్యక్షంగానూ, పరోక్షంగానూ జాగుచేసింది. పారిశ్రామిక పురోగతికి లభించిన సాపేక్ష స్వేచ్ఛ ఎక్కువ కాలం నిలవలేదు. 1920 నాటికి యుద్ధానంతర సమృద్ధి ముగిసిపోయింది. అంత స్వల్ప కాలంలో వాస్తవమైన పారిశ్రామికీకరణ జరగడం అసంభవం. ఎందుకంటే, యుద్ధ కాలంలో యంత్ర పరికరాల దిగుమతి కష్ట సాధ్యం. పారిశ్రామిక రంగపు తీవ్ర పునర్నిర్మాణానికి దేనికీ సామ్రాజ్యవాదుల విధానం బొత్తిగా ఆస్కారం లేకుండా చేసింది. భారతీయ బూర్జువావర్గపు యుద్ధ కాల విశేష లాభాలు పరిశ్రమల్లో కాక, ప్రభుత్వ రుణాల్లోను, తేయాకు తోటల్లోను, భూమిపైనా మదుపు పెట్టబడ్డాయి.

అదే సమయంలో సామ్రాజ్యవాదులు పెంపొందించిన అభివృద్ధి నిరోధక వ్యావసాయిక విధానం పరిశ్రమలకు దేశీయ మార్కెట్ ఏర్పడకుండా నిరోధించింది. పాలి రైతుల పాక్షిక బానిస శ్రమపై ఆధారపడిన పాక్షిక భూస్వామ్య వ్యవస్థ అమల్లో ఉన్నంత కాలం ఆధునిక యంత్రాలను ప్రవేశపెట్టే సమస్యే ఉండజాలదు.

భారతీయ పెట్టుబడి మదుపు, కొన్ని పరిశ్రమల్లో దాని వాటా మాదిరిగానే పెరిగినప్పటికీ, జాతీయార్థిక వ్యవస్థయొక్క అన్ని రంగాల్లోనూ విదేశీ పెట్టుబడే ప్రాబల్యం వహిస్తోంది. అంతే కాకుండా, రవాణా, విదేశీ వర్తకం, ఫైనాన్స్, పరపతి వ్యవస్థలో అది గుత్తాధిపత్యం కలిగివుంది. భారతదేశంలో 1925/26లో మొత్తం చెల్లింపబడిన 55 కోట్ల, 40 లక్షల పౌన్ల పెట్టుబడితో (740 కోట్ల రూపాయలు) 819 విదేశీ కంపెనీలు (వీటిలో అత్యధిక

భాగం (బ్రిటిష్ కంపెనీలు) పనిచేస్తూ వుండగా, 5,311 భారతీయ కంపెనీలు 27 లక్షల రూపాయల పెట్టుబడితో పనిచేస్తున్నాయి.* ఈ అంకెలు విదేశీ పెట్టుబడి పూర్తి ప్రాబల్యం కలిగి ఉందనీ, అంతే కాకుండా, భారతీయ కంపెనీలు చిన్నవనీ, భారీ విదేశీ గుత్త సంస్థలు వాటికి పోటీగా ఉన్నాయనీ తెలియజేస్తున్నాయి. విదేశీ కంపెనీ సగటు పెట్టుబడి భారతీయ కంపెనీ సగటు పెట్టుబడికన్న దాదాపు 18 రెట్లు ఎక్కువ.

జాతీయ ఆర్థిక వ్యవస్థయొక్క అన్ని రంగాల్లోనూ బ్రిటన్ స్థానం దుర్భేద్యంగా ఉన్నప్పటికీ, భారతీయ పరిశ్రమల పురోగతిని నివారించేందుకు బ్రిటన్ తన రాజకీయ పెత్తనాన్ని వినియోగించింది. చట్టాలు, కోర్టులు, టారిఫ్‌లు, సుంకాలు, పన్నులు, మొదలైనవన్నీ భారతీయ సరుకులకు నష్టదాయకంగా, బ్రిటిష్ సరుకుల లాభాలను పెంచేందుకు అనువుగా మలచబడ్డాయి. స్వతంత్ర పెట్టుబడిదారీ దేశాల్లో బూర్జువా వర్గం ఎప్పుడూ పారిశ్రామికాభివృద్ధికి సానుకూల పరిస్థితులను కల్పించేందుకు ప్రభుత్వాన్ని వినియోగించుకొంటుంది. భారతదేశంలో ప్రభుత్వ యంత్రాంగం జాతీయ పరిశ్రమల అభివృద్ధి ప్రయోజనాలకు విరుద్ధమైనది.

యుద్ధ కాలంలో మరింత బలవత్తరము, ధనికము అయిన భారతీయ బూర్జువావర్గం విదేశీ పోటీనుంచి కొన్ని పరిశ్రమలకు రక్షణను డిమాండుచేసింది. జాతీయ విముక్తి ఉద్యమపు ఒత్తిడికింద బ్రిటిష్ ప్రభుత్వం 1921లో ప్రభుత్వపు టారిఫ్ విధానాన్ని అధ్యయనం చేసేందుకు ఒక ప్రత్యేక రెవెన్యూ కమిషన్‌ను ఏర్పాటుచెయ్యక గత్యంతరంలేని స్థితిలో పడింది. సుదీర్ఘమైన చర్చలు, సమావేశాల అనంతరం

* పైన ఉదహరింపబడిన Vera Ansley పుస్తకం, పేజి 110.

ఆ కమిషన్ ఏదైనా ఒక పరిశ్రమ ఏ పరిస్థితుల్లో ప్రభుత్వపు తోడ్పాటును పొందగలదో వాటిని సూత్రీకరించింది.

రెవెన్యూ కమిషన్ తన నివేదికలో భారతదేశ పారిశ్రామికాభివృద్ధి బ్రిటిష్ ప్రయోజనాలకు భంగకరంగా సాగరాదని పేర్కొంది. భారత దేశంలో బ్రిటన్ ఆర్థిక ప్రయోజనాలకు భంగం కలగకుండా వ్యవహరించినప్పుడే, భారతీయ పరిశ్రమలు రక్షణ పొందగలిగివుంటాయి. అంతే కాకుండా, అలాంటి రక్షణ పొందేందుకు తతంగం చాలా సంక్లిష్టమైనది. కాగా, అందుకు ఏళ్లతరబడి పట్టేది.

యుద్ధానంతర సంవత్సరాల్లో బ్రిటిష్ పెట్టుబడి పనిచేసే కొత్త పద్ధతులు తలెత్తాయి: మిశ్రమ ఆంగ్లో-ఇండియన్ కంపెనీల ఏర్పాటు, భారతదేశంలో బ్రిటిష్ కంపెనీల రిజిస్ట్రేషన్. ఇది భారతదేశంలో జాతీయ విముక్తి ఉద్యమ విజృంభణకు ఒక రకం రక్షణాత్మక ప్రతి వర్తన. దేశపు ఆర్థికాభివృద్ధిపైన కొత్తదీ, అస్పష్టమైనదీ అయిన ఒక అజమాయిషీ రూపాన్ని కనుగొనేందుకు, భారతీయ బూర్జువావర్గపు మరింత ధనవంతమైన భాగాన్ని బ్రిటిష్ సామ్రాజ్యవాద ప్రయోజనాలకు మరింత సన్నిహితంగా ముడిపెట్టేందుకూ అదొక ప్రయత్నం.

1927లో హిల్టన్–యంగ్ కమిషన్ సిఫారసు మేరకు రూపాయి మారకపు రేటు 16–18 పెన్నీలనుంచి 1 పౌనుకు పెంచబడింది. ఈ చర్య భారతీయ సరుకులు పోటీకి తట్టుకునే శక్తిని బాగా తగ్గించి, బ్రిటిష్ ఎగుమతిదారుల స్థానాన్ని బలపరచింది.

దివాళాల వెల్లువ ఒకటి భారతదేశాన్ని ముంచెత్తింది. అది జాతీయ రుణ వ్యవస్థను దుర్బలంచేసి, పారిశ్రామికాభివృద్ధిపైన అత్యంత అననుకూలమైన ప్రభావాన్ని కలిగించింది. 1925–26లో పారిశ్రామిక పెరుగుదల వేగం మందగించింది. చాలా పారిశ్రామిక సంస్థలు తాము దివాళా తీసినట్లు ప్రకటించుకోవలసివచ్చింది. అప్పటినుంచే మొత్తం విదేశీ వర్తక పరిమాణం తగ్గనారంభించింది. మరోలా చెప్పాలంటే,

1921–29 నాటి పారిశ్రామిక సమృద్ధి భారతదేశాన్ని స్పృశించ కుండానే దాటిపోయింది. ఇవన్నీ, వీటికితోడు 1926నుంచి ధరలు పడిపోవడమూ భారతదేశం ఒక ఆర్థిక సంక్షోభంగుండా పయనిస్తున్న విషయాన్ని తెలియజేస్తాయి. 1929–33 నాటి ప్రపంచ ఆర్థిక సంక్షోభానికి కారణభూతమైన అంశాలు భారతదేశంలో అప్పుడే పనిచేస్తు న్నాయి. ప్రధానమైన పెట్టుబడిదారీ దేశాల్లోని ముడి పదార్థాల బ్రహ్మాండమైన నిల్వలు ప్రపంచ మార్కెట్‌ని ప్రభావితంచేసి, ఆ సంక్షోభం ఇంకా ఆరంభం కాక ముందే కొనుగోళ్లను తగ్గించివేస్తున్నాయి.

1929లో ప్రపంచ పెట్టుబడిదారీ ఆర్థిక వ్యవస్థ అపూర్వమైన స్థాయిలో సంక్షోభంలో చిక్కుకుంది. భారతీయ ఆర్థిక వ్యవస్థపై దాని ప్రభావం సంక్లిష్టమూ, పరస్పర విరుద్ధమూ అయినది. వ్యవ సాయమూ, పరిశ్రమలూ భిన్నభిన్నంగా ప్రభావితమయ్యాయి. సంక్షోభ భారాన్ని భారతీయ ప్రజలపైకి నెట్టేందుకు బ్రిటన్ తను చెయ్య గలిగినదంతా చేసింది. సామ్రాజ్యవాదులు భారతదేశపు ఖర్చుపైన తమ సొంత ఆర్థిక వ్యవస్థను ఆ సంక్షోభ ఫలితాలనుంచి తప్పించేందుకు ప్రయత్నించారు. ముడి పదార్థాల, ఆహార పదార్థాల ధరలు — భారతీయ ఎగుమతుల్లోని ప్రధాన వస్తువులు — భారతదేశం దిగుమతిచేసుకున్న పారి శ్రామిక ధరలకన్న చాలా ఎక్కువగా పడిపోయాయి. బ్రిటిష్ పౌను స్టెర్లింగుకి సంబంధించి కృత్రిమంగా పెంచబడిన మారకపు రేటు మూలంగా భారతదేశపు ఎగుమతి వర్తకం క్షీణించింది. ఇవన్నీ, భారత దేశపు విదేశీ వర్తకంలో లోటు ఏర్పడేందుకు దారితీశాయి. ఆ సంక్షోభ కాలంలో అత్యధిక స్వతంత్ర పెట్టుబడిదారీ దేశాలు మారటోరియంని ప్రకటించి, రుణాల చెల్లింపులు ఎగవేశాయి. ఈ మారటోరియం భారత దేశానికి విస్తరింపచెయ్యబడని కారణంగా, అది బ్రిటన్‌కి తన రుణా లన్నీ వెనకటి మాదిరిగానే చెల్లించవలసివచ్చింది. శతాబ్దాల తరబడి భారతదేశం వెండి, బంగారాలను దిగుమతిచేసుకుంది. పాక్షిక ఫ్యూడల్

ఆర్థిక వ్యవస్థకి అదొక సంచయన రూపంగా వినియోగపడింది. బాగా అభివృద్ధిచెందిన తన విదేశీ వర్తకం మూలంగానూ, వలస దశకి పూర్వం యీ వర్తకంలో దశాబ్దాల తరబడి దానికి వున్న మిగులు మూలంగానూ భారతదేశం పెద్ద మొత్తాల్లో వెండి బంగారాలను దిగుమతిచేసుకోగలిగింది. వలస దశలో వెండి, బంగారాల రూపంలోనే స్తబ్ధ పెట్టుబడి పారిశ్రామికాభివృద్ధినుంచి ఉపసంహరించబడింది. 1900 మొదలుకొని 30 ఏళ్ల కాలంలో భారతదేశం 540 కోట్ల రూపాయల విలువగల బంగారాన్ని దిగుమతిచేసుకోగా, 1931–37 మధ్య ఆరేళ్ల కాలంలో 320 కోట్ల రూపాయల విలువగల బంగారం ఎగుమతులు జరిగాయి.* సంక్షోభ కాలంలో భారతీయ బంగారం బ్రిటన్ స్థానాన్ని బలపరిచేందుకు తోడ్పడింది. బాంక్ ఆఫ్ ఇంగ్లండ్ బంగారు నిల్వ మూడు రెట్లయింది. భారతదేశంనుంచి బంగారం బయటకి పోవడానికి ప్రత్యక్ష దోపిడి అనే అర్థం. సంక్షోభ సంవత్సరాల్లో భారత దేశంలో ధరలు విపరీతంగా పడిపోయాయి. ధరల తరుగుదలా, జనాభా, అందునా ప్రత్యేకించి రైతుల సామూహిక దివాళా — యీ రెండూ జమిలిగా సాగాయి.

1929కీ 1933కీ మధ్య భారతదేశంలో టోకు ధరలు 42 శాతం పడిపోగా, బ్రిటన్, అమెరికా, జర్మనీ, జపాను దేశాల్లో వరుసగా యీ తరుగుదల 30.4 శాతం, 37.6 శాతం, 34.7 శాతం, 22.2 శాతం వుంది.**

ప్రపంచ ఆర్థిక సంక్షోభ కాలంలో దిగుమతుల, ఎగుమతుల విలువ సగానికి పైగా పడిపోయింది. భారతదేశం దాదాపు పారిశ్రామిక సరుకు

---

* Brij Narain, *India in the Crisis*, Allahabad, 1934, p. 102.

** అదే పుస్తకం, పేజి 193.

లేమీ ఎగుమతిచెయ్యనందున, యిది ఎక్కువ భాగం ముడి పదార్థాల, ఆహార పదార్థాల విషయంలో జరిగింది. 1933/34లో తయారీ ఉత్పాదితాల్లో (జనపనార సరుకులను మినహాయించి) ఎగుమతుల మొత్తం పరిమాణం భారతదేశపు ఎగుమతుల్లో సుమారు 13 శాతం మాత్రమే వుంది. దీనిలో పాక్షికంగా తయారైన సరుకుల, పరిశ్రమలకు ముడి పదార్థంగా పరిగణించదగిన గని పరిశ్రమ ఉత్పాదితాల (ఉదాహరణకు సూరేకారం) పాలు గణనీయంగా వుంది. ఎగుమతుల, ధరల తరుగుదల ప్రధానంగా వ్యవసాయాన్నీ, కొన్ని ఎగుమతి పరిశ్రమలనీ దెబ్బతీసింది. కాగా, భారతదేశంలో ప్రపంచ ఆర్థిక సంక్షోభం ప్రధానంగా వ్యావసాయిక సంక్షోభంగా అభివ్యక్తమైంది. ఈలోగా, ప్రధానంగా దేశీయ మార్కెట్‌తో అనుబంధితమై, దానిలో స్థిరమైన స్థానం ఆక్రమించిన భారతీయ పరిశ్రమయొక్క కొన్ని శాఖలకు పరిస్థితులు సాపేక్షంగా సానుకూలంగా పరిణమించాయి. ముడి పదార్థాల ధరలు పడిపోవడం, ఒకవైపున నిరుద్యోగం పెరిగిపోగా, మరోవైపున వేతనాలు తగ్గడం మూలంగా ఉత్పత్తి వ్యయం తగ్గి, ఆ కష్ట కాలంలో సైతం అధిక లాభాలు పొందడాన్ని సాధ్యంచేశాయి.

ఆ కాలంలో బ్రిటిష్ ప్రభుత్వపు సుంకాల విధానం కూడా కొన్ని పరిశ్రమలను గణనీయంగా ప్రభావితం చేసింది.

సంక్షోభం భారతీయ మార్కెట్‌కోసం సామ్రాజ్యవాద పోరాటాన్ని వ్యగ్రంచేసింది. 1929/30కీ, 1931/32కీ మధ్య భారతదేశపు విదేశీ వర్తకంలో బ్రిటన్ వాటా 42.8 శాతంనుంచి 35.5 శాతానికి పడిపోయింది.* పత్తి సరుకుల మార్కెట్‌లో బ్రిటన్ స్థానాన్ని జపాను మిక్కిలి విజయవంతంగా దెబ్బతీసింది. 1913/14లో

---

* *Industrial Problems of India*, ed. by P. C. Jain, Kitabistan, Allahabad, 1944, p. 177.

బ్రిటన్‌కీ జపానుకీ పత్తి మార్కెట్ వాటా వరుసగా 97 శాతం, 0.3 శాతం ఉంది. 1932/33 నాటికి జపాన్ తన వాటాను 47.3 శాతానికి పెంచుకొంది. భారతదేశంతో వర్తకంలో అమెరికా, జర్మనీలు కూడా తమ స్థానాలను గణనీయంగా బలపరచుకొన్నాయి. 1932లో బ్రిటన్ భారతీయ పరిశ్రమల్లో పెట్టుబడి మదుపు పెట్టిన తన పెట్టుబడిదారుల స్థానాన్ని పటిష్ఠంచేసేందుకూ, తన ఎగుమతికి మరింత సానుకూల పరిస్థితులను కల్పించేందుకూ గాను, అట్టావా ఒప్పందాలకింద భారతదేశాన్ని సామ్రాజ్య ప్రాధాన్యాల వ్యవస్థలో (imperial preferences system) చేర్చుకొంది. ప్రాధాన్యతా సుంకాలు బ్రిటిష్ పరిశ్రమలకు విశేషంగా తోడ్పడి, భారతీయ మార్కెట్‌లో బ్రిటన్ సరుకులకు మరింత లాభసాటి ప్రతిపత్తిని కల్పించాయి. ఇందుకు బదులుగా భారతదేశం, బ్రిటిష్ పరిశ్రమలకు అవసరమైన ముడి పదార్థాలు, పాక్షిక తయారీ సరుకుల విషయంలో ప్రాధాన్యతా సుంకాలను వినియోగించుకుంది. అందుచేత ఈ ప్రాధాన్యతా సుంకాలు బ్రిటన్‌కి ఎంతమాత్రం నష్టదాయకం కాలేదు. అదే సమయంలో కొన్ని బ్రిటిషేతర సరుకులకు భారతదేశంలో సమున్నత రక్షణ సుంకాలు ప్రవేశపెట్టబడ్డాయి.

జపాను పోటీ పెరిగిన దృష్ట్యా 1933లో బ్రిటిషేతర వస్త్రాల పైన సుంకాలు 75 శాతం పెంచబడ్డాయి.

బ్రిటన్ సుంకాల విధానం మూలంగా అది భారతదేశంలో తన స్థానాలను బలపరచుకోగలిగింది. భారీ బ్రిటిష్ గుత్త సంస్థలు ఈ రక్షణవాద విధానాన్ని భారతదేశంలో అనుబంధ పరిశ్రమలను తెరిచేందుకు ఉపయోగించుకొన్నాయి. భారతీయ దిగుమతుల్లో 1931/32లో 35.5 శాతం ఉన్న బ్రిటన్ వాటా 1933/34లో 41.7 శాతానికి పెరిగింది.* అయితే జపాన్, జర్మన్, అమెరికన్, తదితర

---

* అదే పుస్తకం, అదే పేజి.

సామ్రాజ్యవాదుల విస్తరణకు వ్యతిరేకంగా బ్రిటన్ ఆర్థిక యుద్ధం మూలంగా భారతీయ పరిశ్రమయొక్క కొన్ని రంగాలు రక్షణవాద ఫలితాలను తమ సొంత ప్రయోజనాలకు వినియోగించుకొనే అవకాశం కలిగింది. పైపెచ్చు, భారతదేశం అప్పటికింకా సంక్షోభపు కోరల్లో చిక్కుకోలేదు. అది సామ్రాజ్య దేశంలోని సంక్షోభ ప్రతిబింబంగా మాత్రమే అభివ్యక్తమయింది. కాగా, అది సర్వతోముఖం కాలేకపోయింది. అది ప్రధానంగా బ్రిటిష్ సామాజిక పెట్టుబడి పునరుత్పత్తిలో ప్రత్యక్షంగా మగ్నమైన పరిశ్రమలను ప్రభావితంచేసింది. పత్తి, పంచదార, సిమెంటు, మరికొన్ని యితర పరిశ్రమల్లో ఉత్పత్తి పెరిగింది. కొత్త ఫాక్టరీలు తెరవబడ్డాయి. 1932కీ 1936కీ మధ్య పత్తి వస్త్రాల పారిశ్రామి కోత్పత్తి 4 లక్షల గజాలు పెరిగింది. 1937లో మాంద్యము, మరో సంక్షోభము మొదలైనప్పటికీ, పత్తి పరిశ్రమ పురోగమిస్తూ వచ్చింది. రెండవ ప్రపంచ యుద్ధ ఆరంభం నాటికి అప్పుడే అది 1913లో ఉత్పత్తిచేసిన నూలుకు రెండు రెట్లు, వస్త్రాలకు 3 రెట్లు ఉత్పత్తి చేస్తోంది. 1913తో పోలిస్తే 1938 నాటికి బ్రిటన్నుంచి వస్త్రాల దిగుమతి 5 రెట్లు తగ్గింది. కాగా, రెండవ ప్రపంచ యుద్ధ ఆరంభం నాటికి భారతదేశపు దేశీయ మార్కెట్లో కొనుగోలుచెయ్యబడుతున్న విదేశీ వస్త్రాల మొత్తం 10–15 శాతానికి మించిలేదు.

1930 దశకం మొదట్లో భారతదేశం పంచదార పరిశ్రమను నెలకొల్పుకుంది. రెండవ ప్రపంచ యుద్ధారంభం నాటికి దానిలో 1 లక్షమంది కార్మికులు నియోగింపబడ్డారు. సిమెంటు పరిశ్రమ వేగంగా పురోగమిస్తోంది. 1939 నాటికి అప్పుడే భారతదేశంలో 19 సిమెంటు ఫాక్టరీలు 12 లక్షల టన్నుల సిమెంటు ఉత్పత్తిచేస్తూ, దేశీయ మార్కెట్ అవసరాలను దాదాపు పూర్తిగా తీరుస్తున్నాయి.

అదే సమయంలో జనపనార, గనులు, గృహ పరిశ్రమల వంటి ఎగుమతి పరిశ్రమలు సంక్షోభం మూలంగా గట్టి దెబ్బతిన్నాయి. జనప

నార మిల్లుల సంఖ్య తగ్గకపోయినప్పటికీ వాటి ఉత్పత్తి పడిపోయింది. ఖనిజ ముడి పదార్థాల మొత్తం విలువ కూడా 1923లో 2 కోట్ల, 50 లక్షల పౌనులనుంచి 1932లో 1 కోటి, 80 లక్షం పౌన్లకు పడిపోయింది.*

ఆ దశలో, అంటే రెండు ప్రపంచ యుద్ధాలకీ మధ్య, పారిశ్రామికాభివృద్ధి రేటు గణనీయంగా మందగించింది. మొదటి ప్రపంచ యుద్ధానికి ముందు 17 సంవత్సరాల్లో ఫాక్టరీ కార్మికుల సంఖ్య 2.2 రెట్లు పెరగ్గా, 1922–1939 మధ్య వారి సంఖ్య 28 శాతం మాత్రమే పెరిగింది. భారతదేశంలో జాయింట్ స్టాక్ కంపెనీల సంఖ్య పెరిగినప్పటికీ (1927/28తో పోలిస్తే 1933/34లో 2,515 కంపెనీలు పెరిగాయి), అదే విధంగా ఫాక్టరీల సంఖ్య కూడా పెరిగినప్పటికీ (1911లో 7,000 కాగా, 1935లో 9,261), సంక్షోభ పూర్వపు సంవత్సరమైన 1925/26లో చెల్లింపబడిన జాతీయ వాటా పెట్టుబడికంటె 10 లక్షల రూపాయలు తక్కువ ఉంది.**

పెట్టుబడి సాంద్రీకరణ, కేంద్రీకరణ క్రమం సంక్షోభంచేత విశేషంగా ప్రభావితంచెయ్యబడిన మరో రంగం. భారతీయ పెట్టుబడియొక్క పాత గుత్త సంస్థలు విస్తరించాయి, కొత్తవి ఏర్పాటుచెయ్యబడ్డాయి. 1941 గణాంక లెక్కల ప్రకారం కార్మికుల్లో సుమారు 44 శాతం 500 మంది కార్మికులకంటె తక్కువ పనిచేసే 9,276 ఫాక్టరీల్లో పనిచేస్తూ ఉండగా, మిగిలిన 56 శాతం కార్మికులు 249 మిక్కిలి పెద్ద పారిశ్రామిక సంస్థల్లో పనిచేస్తున్నారు.

జనపనార, బొగ్గు పరిశ్రమల్లోనూ, తేయాకు, వగైరా తోట

---

* P. Banerjea, *A Study of Indian Economics*, University of Calcutta, Calcutta, 1944, p. 74.

** అదే పుస్తకం, అదే పేజి.

ల్లోనూ, గుత్త సంస్థలు ఉన్నాయి. అయితే ఇది ఏ ఆంతరిక క్రమ పర్యవసానమూ కాదు. గుత్త సంస్థలు పైనుంచి నెలకొల్పబడ్డాయి. అవి బ్రిటిష్ గుత్త పెట్టుబడి ప్రాబల్యం కలిగిన పరిశ్రమలు కావడమే ఇందుకు కారణం.

భారతీయ మెటలర్జికల్ పరిశ్రమలో గుత్త సంస్థలు చాలా వెనకే అభివృద్ధిచెందాయి. వాటిలో మొదటి పెద్ద సంస్థ 20వ శతాబ్ది ఆరంభంలో తలెత్తింది. 1938 నాటికి దుక్క ఇనుము ఉత్పత్తిలో 64 శాతం, ఉక్కు ఉత్పత్తిలో 90 శాతం దాంట్లోనే జరుగుతోంది. 1930 దశకంలో ఒక సిమెంటు సిండికేట్ ఏర్పడింది. 1936లో సిమెంటు పరిశ్రమలోని మొత్తం ఉత్పత్తి సామర్థ్యాల్లో సుమారు మూడో వంతును అజమాయిషీచేసే ఒక ట్రస్టును నెలకొల్పేందుకు అది ప్రాతిపదిక అయింది. జనపనార పరిశ్రమ కూడా ఒక సాంద్రీకరణ దశగుండా గడిచింది. ఒక మిల్లులో కార్మికుల నగటు సంఖ్య 3,000 దాటింది. 1937లో ఒక పంచదార సిండికేటు నెలకొల్పబడింది. అది మొత్తం పంచదార రిఫైనరీలలో 60 శాతం పైగా అజమాయిషీ సంపాదించుకుంది.

నూలు వస్త్ర పరిశ్రమలో సాంద్రీకరణ, కేంద్రీకరణ క్రమం అంత బలంగా లేదు. 2,000 మంది కార్మికులకు పైగా పనిచేసే పెద్ద మిల్లులు మొత్తం మిల్లుల్లో 16 శాతం ఉన్నాయి. వాటిలో సుమారు 40 శాతం మంది పనిచేస్తున్నారు.

రెండవ ప్రపంచ యుద్ధారంభం నాటికి బిర్లా, టాటాల నాయకత్వాన భారతీయ గుత్త సంస్థలు భారతీయ పారిశ్రామిక రంగంలో అగ్ర స్థానానికి చేరుకొన్నాయి.

పరిశ్రమలో పెట్టుబడి కేంద్రీకరణలో ఏజెన్సీలు — ఒక ప్రత్యేక రకం విదేశీ, భారతీయ గుత్త సంస్థలు — బ్రహ్మాండమైన పాత్రను వహించాయి. అవి ఈస్టిండియా కంపెనీ, ఏజెన్సీ కార్యాలయాల ప్రాతి

పడికమీద తలెత్తాయి. భారతదేశంలో కొల్లగొట్టిన సంపదను వినియో గించుకొని ఆ కంపెనీ సిబ్బంది, వ్యాపారస్తులు, చట్టా వ్యాపారులు దళారీ వ్యాపారాలను నెలకొల్పారు. అవి భారతీయ సరుకులను జమ చేసి, దరిమిలా భారతదేశంలో బ్రిటిష్ పారిశ్రామిక సరుకుల అమ్మకా లకు తోడ్పడ్డాయి.

సామ్రాజ్యవాద యుగంలో ఈ ఏజెన్సీలు కొత్త లక్షణాలను సంతరించుకున్నాయి. వాటి ద్వారానే బ్రిటిష్ పెట్టుబడి ఎగుమతి చెయ్యబడింది. భారతదేశంలోకి బ్రిటిష్ పెట్టుబడి చొరబాటుకి ప్రధాన వాహికల్లో ఒకటే, పారిశ్రామిక సంస్థలను నెలకొల్పడంలో భాగస్వామీ అయిన ఆ ఏజెన్సీ కార్యాలయాలు కొత్త జాయింట్ స్టాక్ కంపెనీల్లో మేనేజిమెంటునూ, అజమాయిషీ విధులనూ చేబట్టాయి. ఈవిధంగా, వాటి పాత్ర దళారీ సంస్థలనుంచి సామ్రాజ్యవాద అజమాయిషీ, భారత దేశ దోపిడి సంస్థలకి మారింది.

సామ్రాజ్యవాద యుగంలో మేనేజింగ్ ఏజెన్సీలు ఏజెన్సీ కార్యాలయాల నుంచి అభివృద్ధిచెందడం మాత్రమే కాకుండా, అవి విదేశీ గుత్త సంస్థలతో అత్యంత సన్నిహితమైన సంబంధాలు నిలుపుకొంటూనే, స్వతంత్రంగా కూడా తలెత్తాయి. లిమిటెడ్ స్టాక్ కంపెనీలే వాటి ప్రధాన నిర్మాణ రూపంగా వుండేవి.

అయితే అవి వాణిజ్యంలోనో, పరిశ్రమలోనో నిమగ్నమైన మామూలు తరహా కంపెనీలు కావు. మేనేజింగ్ ఏజెన్సీ విధులు చాలా విస్తృతమూ, మరెంతో సంక్లిష్టమూ అయినవి. అది పరిశ్రమ వివిధ శాఖల్లో స్టాక్ కంపెనీని నెలకొల్పే బాధ్యత వహించింది. అది షేర్లు జారీ చేసింది, రుణం సమకూర్చింది, నిర్వాహక సిబ్బందిని నియమించింది, ఉత్పాదితాన్ని అమ్మేందుకు తోడ్పడింది, యంత్రాలు, వగైరాలు అంద జేసింది. జాయింట్ స్టాక్ కంపెనీకీ (లేక ఫాక్టరీకీ) మేనేజింగ్ ఏజెన్సీకీ మధ్య సంబంధాలు, మామూలుగా 20 ఏళ్ళ గాని, 40

ఏళ్ళు గాని అమల్లోవుండే — తరచు ఏటేటకి కాల పరిమితి నిర్ణయం జరగదు — ప్రత్యేకమైన అగ్రిమెంటుచేత నియంత్రితం చెయ్యబడతాయి చట్టం దృష్టిలో, దళారీగా మాత్రమే వ్యవహరించే మేనేజింగ్ ఏజెన్సీ షేర్‌హోల్డర్లకు బాధ్యత వహించదు అయితే ఆచరణలో, దాని అజమాయిషీకింద వున్న కంపెనీలు మేనేజింగ్ ఏజెన్సీకి పూర్తిగా లోబడివుంటాయి, అది వాటిని నిర్దాక్షిణ్యంగా దోపిడిచేస్తూంటుంది.

పరిశ్రమలకు రుణాలు ఇవ్వడంలో మేనేజింగ్ ఏజెన్సీల పాత్ర చాలా అధికం భారతదేశ బాంకింగ్ వ్యవస్థ బాగా అభివృద్ధిచెందలేదు. బాంకులకీ పరిశ్రమకీ మధ్య ప్రత్యక్ష సంబంధాలు దాదాపు పూజ్యం పరిశ్రమలకు బాంకు రుణాలు, ఆచరణలో మేనేజింగ్ ఏజెన్సీల ద్వారా ఇవ్వబడేవి అలాంటి రుణాలపై వడ్డీ నేరుగా ఇవ్వబడే బాంకు రుణాల మీది వడ్డీకంటె 1–2 శాతం ఎక్కువగా ఉండేది ఏదైనా ఒక పారిశ్రామిక సంస్థ రుణంకోసం నేరుగా బాంకుకి దరఖాస్తు పెట్టు కొన్న సందర్భంలో సైతం, దాన్ని పొందే విషయంలో అది పూర్తిగా మేనేజింగ్ ఏజెన్సీపైన ఆధారపడేది హామీ పత్రాలపైన అయా సంస్థల అధిపతుల సంతకాలతోబాటు మేనేజింగ్ ఏజెన్సీ సంతకాలు ఉన్నప్పుడు మాత్రమే బాంకులు రుణాలు ఇచ్చేది.

ప్రధాన వర్తక కేంద్రాలతోనూ, ప్రపంచ మార్కెట్‌తోనూ పారి శ్రామిక సంస్థల సంబంధాలను మేనేజింగ్ ఏజెన్సీలు తమ గుప్పెట్లో పెట్టుకొనేవి కంపెనీలకు తమంతట తాము తమ సరుకులను అమ్ము కొనే హక్కు ఉండేది కాదు అలాగే తమకు కావలసిన యంత్రాలను, తదితర పరికరాలను స్వయంగా కొనుక్కొనే హక్కు ఉండేది కాదు ఈ రెండు లావాదేవీలూ మేనేజింగ్ ఏజెన్సీ చేతులమీదుగా జరగవలసి వచ్చేది ఇందుకుగాను కంపెనీనుంచి లేక పారిశ్రామిక సంస్థలనుంచి దానికి కమిషన్ లభించేది ఈ కమిషను మొత్తం ఉత్పత్తినుంచి లేక

అమ్మిన సరుకుల మొత్తం విలువనుంచి, లేక లాభాల్లో ఒక నిర్ణీత శాతం రూపంలో దానికి ముట్టేది.

ఒక వలసదేశంలో విదేశీ ఫైనాన్స్ పెట్టుబడియొక్క ఒక ప్రత్యేక తరహా గుత్త సంస్థగా మేనేజింగ్ ఏజెన్సీలు భారతీయ పెట్టుబడి ఆధారంగా కూడా తలెత్తాయి. ఇండియాలో బడా బూర్జువావర్గం దేశంలో పారిశ్రామికోత్పత్తి నిర్మాణానికి పూనుకున్నప్పుడు తయారై సిద్ధంగా వున్న దోపిడి వ్యవస్థని వినియోగించుకుంది. విదేశీ పెట్టుబడితో సన్నిహితంగా ముడిపడిన వర్తకుల, వడ్డీ వ్యాపారుల శ్రేణుల నుంచి వచ్చిన స్థానిక బూర్జువావర్గం, తన వెనకటి కార్యకలాపాలకు అత్యంత అనుగుణమైన రూపంలో మేనేజింగ్ ఏజెన్సీలను అవలంబించేందుకు పూర్తి సంసిద్ధంగా ఉంది.

బడా భారతీయ వర్తకులకీ, వడ్డీ వ్యాపారులకీ, బాగా లాభదాయకమైన తమ స్వంత పద్ధతుల్లో దేశీయ పరిశ్రమలను దోపిడి చేసుకొనేందుకు పారిశ్రామిక ప్రగతి పథంలో సామ్రాజ్యవాదం కల్పించిన ఆటంకాలను — భారతీయ ఉత్పత్తితో ప్రత్యక్ష సంబంధం కలిగివున్న బూర్జువావర్గానికి ఇవి పెద్ద ప్రతిబంధకాలు అయాయి — అధిగమించేందుకు మేనేజింగ్ ఏజెన్సీలు అవకాశం కల్పించాయి.

భారతదేశంలో స్థానిక మేనేజింగ్ ఏజెన్సీలు తలెత్తాయి — వాటిలో మిక్కిలి పెద్దవి తాతా, బిర్లా, దాల్మియా, సింఘానియా. ఆచరణలో వాటి కార్యకలాపాలు బ్రిటిష్ మేనేజింగ్ ఏజెన్సీల కార్యకలాపాలకు ఏంతమాత్రం భిన్నంగా లేవు. బహుశా ఉన్న ఒకేఒక భేదం, అవి విదేశీ పెట్టుబడిమీదా, విదేశీ మేనేజింగ్ ఏజెన్సీలమీదా ఆధారపడివుండటమే. భారతదేశపు పరిశ్రమను అలుముకొని, శృంఖలాబద్ధం చేసిన మేనేజింగ్ ఏజెన్సీల వ్యవస్థ, తన ఆర్థిక సారాంశం రీత్యా, దేశంలో స్థానిక, విదేశీ పెట్టుబడిని సమైక్యం చేసిన ఒక గుత్త రూపం. వాటి కార్యకలాపాల విస్తరణ పెట్టుబడి యితోధిక కేంద్రీకరణకు దారితీసింది.

ఈ క్రమం 1930 దశకంలో ప్రత్యేకించి త్వరితంగా అభివృద్ధిచెంద నారంభించింది. ఆ దశలో అంతకంతకు అధిక సంఖ్యలో స్టాక్ కంపెనీలు మేనేజింగ్ ఏజెన్సీల అజమాయిషీలోకి వచ్చాయి.

భారతీయ పరిశ్రమలోని గుత్త సంఘాలకు కొన్ని విశిష్ట లక్షణాలు ఉన్నాయి. పెట్టుబడిదారీ దేశాల్లో పెట్టుబడి కేంద్రీకరణ ఫలితంగానే కాకుండా, పెట్టుబడి స్వతస్సిద్ధ సంపుటిని విస్తృతంచేసే ఉత్పత్తి అధిక సాంద్రీకరణ పర్యవసానంగా కూడా గుత్త సంస్థలు ఆవిర్భవించాయి. ఈలోగా, భారతదేశంలో మేనేజింగ్ ఏజెన్సీలు పరస్పరం స్వతంత్రమైన, అనేక సందర్భాల్లో పరిశ్రమయొక్క విభిన్న శాఖలకు చెందిన డజన్ల కొలది స్టాక్ కంపెనీలను ఐక్యంచేశాయి. భారతీయ గుత్త సంస్థలు వర్తకం, రుణంపై అజమాయిషీలు ఒంటి చేతుల్లో సాంద్రీకరింప బడేందుకు దారితీసిన మేనేజింగ్ ఏజెన్సీలకు స్టాక్ కంపెనీల స్వాధీనతను అనుసరించి ఏర్పడినంతగా, ఉత్పత్తి సాంద్రీకరణ ప్రాతిపదికమీద అభివృద్ధిచెందలేదు. కాగా, యిదొక నిర్దిష్ట తరహా పెట్టుబడి సాంద్రీకరణ. ఇది ప్రధానంగా డబ్బు చలామణీ రంగానికి పరిమితమైంది. దీన్ని వెన్నంటి తదనుగుణమైన ఉత్పత్తి సాంద్రీకరణ జరగలేదు. అలాంటి గుత్త సంస్థ అభివృద్ధిచెందినప్పుడు, అదుపులో వున్న పెట్టుబడి పరిమాణంలోని పెరుగుదలకి అధీనపరచబడిన పెట్టుబడి సంపుటి పెరిగిందని కాక, ప్రధానంగా మేనేజింగ్ ఏజెన్సీ అజమాయిషీలో వున్న పారిశ్రామిక సంస్థల సంఖ్య పెరిగిందని మాత్రమే అర్థం.

భారతీయ గుత్త సంస్థల్లోని కంపెనీలూ, పారిశ్రామిక సంస్థలూ ఎంతో విస్తృత వైవిధ్యం కలిగినవైన మూలంగా, గుత్త గ్రూపులోని పరిశ్రమ శాఖల గణనీయమైన సహకారాభివృద్ధులకు అవకాశం దాదాపు లేకుండా పోయింది.

ఉదాహరణకు, బిర్లా ఆధిపత్యంలో వున్న మేనేజింగ్ ఏజెన్సీ ఎనిమిది జౌళి మిల్లులపైనా, ఇన్సూరెన్సు కంపెనీలపైనా, బాంకుల

పైనా, వార్తాపత్రికలపైనా (''హిందూస్థాన్ టైమ్స్,'' ''ది లీడర్,'' ''భారత్''), ఒక పేపరు మిల్లు, వగైరాలపైనా అజమాయిషీ హక్కు కలిగివుంది.

భారతదేశపు మిక్కిలి పెద్ద గ్రూపు అయిన తాతా అజమాయిషీలో లోహపాత పారిశ్రామిక సంస్థలు, రైలు కూర్పు కర్మాగారాలు, వ్యవసాయ పరికరాలు తయారుచేసే ఫాక్టరీలు, పవర్ స్టేషన్లు, జౌళి మిల్లులు, రసాయనిక కర్మాగారాలు, సిమెంటు ఫాక్టరీలు, పెయింటు, వనస్పతి, సబ్బు ఫాక్టరీలు, రవాణా కంపెనీలు, రేడియో స్టేషన్లు, హోటళ్లు వున్నాయి.

అభివృద్ధిచెందిన పెట్టుబడిదారీ దేశాల్లో ఏదో ఒక పారిశ్రామిక శాఖలో ఉత్పత్తియొక్క ఉన్నత స్థాయి సాంద్రీకరణ ప్రాతిపదికమీద గుత్త సంస్థలు తలెత్తాయి. అటుతర్వాత మాత్రమే అవి ఇతర పరిశ్రమలను స్వాధీనం చేసుకున్నాయి. చాలా కాలంపాటు యూరప్, అమెరికాల్లోని గుత్త సంస్థలు తమ విస్పష్టమైన స్పెషలైజేషన్‌ను నిలువుకున్నాయి: ఉక్కు ట్రస్టులు, ఆటోమొబైల్, నూనె సంస్థలు, వగైరాలు. భారతదేశంలో గుత్త సంస్థలకు అలాంటి స్పష్టమైన స్పెషలైజేషనేమీ లేదు. బహుశా, భారీ పరిశ్రమపట్ల నిర్దిష్టమైన అభిముఖ్యం కలిగిన తాతా కంపెనీ మాత్రమే ఇందుకు మినహాయింపు.

యూరప్, అమెరికాల్లోని గుత్త సంస్థలు పెట్టుబడిదారీ ఉత్పత్తి విధానపు పర్యవసానం. అవి ఉన్నత స్థాయి పెట్టుబడిదారీ అభివృద్ధిని ప్రతిబింబిస్తాయి. అయితే భారతదేశంలోని గుత్త సంస్థలు పెట్టుబడిదారీ వ్యవస్థ అభివృద్ధి ఆరంభ దశలో మాత్రమే తలెత్తాయి.

కాగా, గుత్త సంస్థల ఒక రూపంగా మేనేజింగ్ ఏజెన్సీల వ్యవస్థ పరిశ్రమలో ఉత్పాదక శక్తుల అభివృద్ధికి ప్రధాన అవరోధాల్లో ఒకటైంది. అది దాదాపు పరిశ్రమయొక్క చాలా శాఖలను సామ్రాజ్యవాద గుత్త సంస్థలకు, వర్తకులకు, వడ్డీ వ్యాపారులకు, ఫైనాన్షియల్ తిమిం

గలాలకు అప్పగించింది. మేనేజింగ్ ఏజెన్సీలు దేశంలో పారిశ్రామిక సంచయనాన్ని విశేషంగా తగ్గించడం ద్వారా, విదేశీ పెట్టుబడికి అత్యధిక లాభాలను సమకూర్చి, దేశపు స్వతంత్ర ఆర్థిక పురోగతిని నిరోధించి, జాతీయ పరిశ్రమాభివృద్ధిని మందగింపజేశాయి.

రెండవ ప్రపంచ యుద్ధారంభానికి ముందు దుక్క ఇనుములో భారతదేశపు తలసరి ఉత్పత్తి బ్రిటన్ తలసరి ఉత్పత్తిలో 1/36 వంతు, జపాను తలసరి ఉత్పత్తిలో 1/7 వంతు ఉండగా, దాని ఉక్కు ఉత్పత్తి బ్రిటన్ ఉత్పత్తిలో 1/90 వంతు ఉంది.

పరిశ్రమ అంగ నిర్మాణం విలక్షణమైన వలస రీతిలో ఉండిపోయింది. లఘు పరిశ్రమ మాత్రమే (ప్రత్యేకించి నూలు వస్త్ర పరిశ్రమ) సాపేక్షంగా బాగా అభివృద్ధిచెందింది. మొత్తం ఫాక్టరీల్లో 80 శాతం నూలు వస్త్ర పరిశ్రమకి చెంది వుండగా, మొత్తం కార్మికుల్లో 80 శాతంమంది దానిలోనే వున్నారు. భారతదేశానికి దాని సొంత ఇంజనీరింగు పరిశ్రమ గాని, ఎలెక్ట్రికల్ ఇంజనీరింగు, ఆటోమొబైల్ పరిశ్రమలు గాని, భారీ పరిశ్రమయొక్క తదితర అతి ముఖ్య శాఖలు గాని లేవు. ఆ కాలపు భారతీయ పరిశ్రమ విశిష్ట లక్షణం ఏమిటంటే, చిన్న తరహా కుటీర పరిశ్రమల పూర్తి ప్రాబల్యం. 1931 నాటి లెక్కల ప్రకారం పరిశ్రమయొక్క అన్ని శాఖల్లోనూ 1 కోటి, 50 లక్షలమందికి పైగా పనిచేస్తున్నారు. వీరిలో 20 లక్షలమంది మాత్రమే ఫాక్టరీల్లో పనిచేస్తున్నారు.

పెట్టుబడిదారీ పరిశ్రమయొక్క మిక్కిలి నిమ్న దశల ప్రాబల్యం పెట్టుబడిదారీ పరిశ్రమాభివృద్ధి స్థాయికి ఒక ముఖ్య సూచిక. పెట్టుబడి యొక్క అతి నిమ్న రూపాలైన వర్తక, వడ్డీ పెట్టుబడి పరిశ్రమలో వహించే బృహత్తర పాత్రను ఇది సూచిస్తుంది. చిన్న తరహా ఉత్పత్తికి మార్కెట్‌తో దాదాపుగా ప్రత్యక్ష సంబంధాలు ఉండవు. అది వర్తకు లకీ, వడ్డీ వ్యాపారులకీ బంధింపబడి ఉండి, అన్ని స్వేచ్ఛలూ కోల్పోయి,

నిర్దాక్షిణ్యమైన దోపిడికి గురిచెయ్యబడుతుంది దాని పోటీ సామర్థ్యం ఉన్నత స్థాయి దోపిడిపైన, చౌక శ్రమపైన ఆధారపడి ఉంటుంది

భారతదేశంలో లక్షలాది చిన్న తరహా పాక్షిక వృత్తి కార్ఖానాలపై ఆధిక్యత కలిగిన గుత్త సంస్థలు పెట్టుబడిదారీ పరిశ్రమల అతి నిమ్న రూపాలతో సహజీవనం చేశాయి

విదేశీ పెట్టుబడి జాతీయార్థిక వ్యవస్థయొక్క అన్ని రంగాల్లోనూ ప్రబలమైన స్థానాలు కలిగివుంటూ వచ్చింది 1933లో 1,100 కోట్ల రూపాయల చెల్లింపబడిన పెట్టుబడితో (831 మిలియన్ల పౌనులు లేక భారతీయ స్టాక్ కంపెనీల చెల్లింపబడిన పెట్టుబడికి నాలుగు రెట్లు) 901 విదేశీ కంపెనీలు ఉన్నాయి విదేశీ పెట్టుబడుల వెరసి మొత్తం 1,330 కోట్ల రూపాయలను (1,150 మిలియన్ల పౌనులు) మించి ఉన్నాయి * అయితే ఈ అంకెలు విదేశీ పెట్టుబడి యొక్క అసలు పరిస్థితులను వెల్లడించవు ఎందుకంటే, భారతదేశం వెలుపల రిజిస్టరు చెయ్యబడిన కంపెనీలు మాత్రమే విదేశీ కంపెనీల జాబితాలో చేరాయి అయితే 1930 దశకం నాటికే చాలా విదేశీ కంపెనీలు భారతదేశంలో రిజిస్టరు చేయించుకోవడం ద్వారానూ, తమ పేరుకి ''ఇండియా లిమిటెడ్'' అని జోడించడం ద్వారానూ భారతీయ ముసుగు తగిలించుకున్నాయి

పరిశ్రమ, వర్తకం, ఫైనాన్సుల్లో బ్రిటిష్ పెట్టుబడి ప్రబలమైన స్థానంలో వుంది దానికి ప్రభుత్వపు దన్ను వుంది జాతీయ కంపెనీలు బ్రిటిష్ ఫైనాన్సు పెట్టుబడి ప్రభావాన్ని వదిలించుకోలేకపోయాయి దేశీయ మార్కెట్ సంకుచితమైనది కావడం భారతీయ పరిశ్రమాభివృద్ధికి మరొక తీవ్ర ఆటంకమైంది జనపనార, పంచదార, సిమెంటు పరిశ్రమల ఉత్పత్తి తక్కువే అయినప్పటికీ, 1930 దశకం చివరకి

---

* పైన ఉదహరింపబడిన P Banerjea పుస్తకం, పేజి 119.

వాటికి అధికోత్పత్తి సమస్యలు ఎదురయ్యాయి. సామ్రాజ్యవాదం ఎంతో శ్రద్ధగా పెంచిపోషించిన అభివృద్ధినిరోధక వ్యావసాయిక విధానం భారత దేశపు ఆర్థిక, సాంఘిక పురోగతికి ఆటంకంగా వుంది. పట్టణాల్లోనూ, గ్రామీణ ప్రాంతంలోనూ పెట్టుబడిదారీ అభివృద్ధి వేగం మధ్య పెరుగుతున్న వార ఆర్థిక వ్యవస్థలో వైరుధ్యాలను సృష్టించింది. వలస పరిస్థితుల్లో అధిగమించ సాధ్యం కాని ఈ వైరుధ్యాలు పారిశ్రామిక పురోగతికి వస్తుపరమైన, ఆర్థిక పరిమితులను కల్పించాయి. పెట్టుబడిదారీ పరిశ్రమకు మార్కెట్ పెరుగుదల చాలా మందంగా సాగింది.

ఆ దశలో సరుకు—డబ్బు సంబంధాలు, పెట్టుబడిదారీ వ్యవస్థల అభివృద్ధి శక్తి పుంజుకుంది. అలాగే వ్యవసాయంలో పెట్టుబడిదారీ వ్యవస్థకీ, ఫ్యూడలిజానికీ మధ్య వైరుధ్యాలు కూడా తీవ్రమయ్యాయి. అయితే ఫ్యూడలిజం ఇంకా తగినంత బలంగా ఉంది. సామ్రాజ్యవాదపు తోడ్పాటును కలిగి, పెట్టుబడిదారీ అభివృద్ధి ఎగుడు దిగుడు రూపంలో సాగింది. ఫ్యూడల్ దోపిడిని తొలగించేందుకు బదులు అది ఫ్యూడలిజంతో చేతులు కలిపి దానితో తనని తాను పెనవేసుకుంటుంది. తత్ఫలితంగా, రైతాంగపు దోపిడి అత్యంత తీవ్రతరమై, రైతులు తమ భూమిని కోల్పోయేందుకు దారితీసింది. అదే సమయంలో ఫ్యూడల్ భూస్వాములు కౌల్దారీ వ్యవసాయ రూపాలకు పూనుకొన్నారు. ఆ పద్ధతులు ఉత్పాదక శక్తులను నాశనంచేసి, గ్రామాల్లో ఆకలి దారిద్ర్యాలను పెంపొందించాయి.

ప్రధాన ఉత్పత్తి శక్తి అయిన భూమి ఫ్యూడల్ భూస్వామ్యవర్గపు, వడ్డీ వ్యాపారుల, వర్తకుల చేతుల్లో సాంద్రీకరింపబడింది. రెండు ప్రపంచ యుద్ధాలకీ మధ్య సంవత్సరాల్లో రైతులు కోల్పోయిన భూమి విస్తృత ప్రమాణాన్ని అందుకొంది, అసలు భూమిలేని లేక చిన్న భూఖండాలు మాత్రమే కలిగిన రైతుల సంఖ్య విపరీతంగా పెరిగింది. భారతదేశపు మిక్కిలి పెద్ద రాష్ట్రాలైన పంజాబ్, బెంగాలుల్లో 1930

దశకం చివరినాటికి 70 శాతానికి పైగా కమతాలు రైతునీ, అతని కుటుంబాన్నీ తగినంతగా పోషించగలిగిన స్థితిలో లేవు. బొంబాయి, మద్రాసుల్లోనూ, బ్రిటిష్ ఇండియాలోని తదితర రాష్ట్రాల్లోనూ పరిస్థితి దాదాపు ఇలాగే ఉంది. దీనికితోడు రైతుల స్వామ్యంలో ఉన్న భూకమతాలు బాగా చెల్లాచెదురుగా ఉన్నాయి. 10–15 ఎకరాల కమతాలు అరుదుగా ఏక ఖండంగా ఉండేవి. చాలా తరుచు అవి చిన్నచిన్న ఖండాలుగా ఒకదాన్నుంచి మరొకటి చాలా దూరంలో చెదిరి ఉండేవి.

భారతదేశంలో వ్యావసాయిక జనాభా అధికంగా ఉండటమే దీనికి ప్రధాన కారణం. గ్రామాల్లో ఉండిపోవలసివచ్చిన వ్యావసాయిక జనాభా సహజ పెరుగుదల, పట్టణాలనుంచి, పల్లెలనుంచి దివాళాతీసిన చేతి వృత్తులవారు కలవడంతో రైతుల పెరుగుదల రైతు కమతాల చీలికకు కారణభూతమయ్యాయి.

భూమిని కోల్పోయే ముమ్మర క్రమం, తత్ఫలితంగా చాలా పెద్ద సంఖ్యలో చిన్న, బుల్లి రైతు కమతాల అవతరణ ఒక ప్రత్యేక తరహా భూమి సేద్యాన్ని అమల్లోకి తెచ్చాయి. ఈ సేద్యపు తరహా స్వభావ రీత్యానే ఉత్పాదక శక్తుల అభివృద్ధి, సామాజిక శ్రమ రూపాలు, పెట్టుబడి సామాజిక సాంద్రీకరణ, భారీ స్థాయిలో పశుపోషణ, విజ్ఞాన శాస్త్రపు ప్రగతిశీల అన్వయాలకి ఆస్కారం లేకుండా చేస్తుంది. చిన్న తరహా భూమి స్వామ్యం ఉత్పత్తి సాధనాలు అతిగా పంపిణీ అయ్యేందుకు, మానవ కృషి వృధా అయ్యేందుకు, ఉత్పత్తి పరిస్థితులు అధ్వాన్నమయ్యేందుకూ దారితీసింది.

రైతులు భూమి కోల్పోవడం, చిన్న తరహా ఆస్తియొక్క లాంఛన ప్రాయమైన రద్దూ చిన్న తరహా ఉత్పత్తిని పదిలపరచేందుకు దోహదంచేసి, స్వేచ్ఛాయుతుడైన కార్మికుడి అవతరణకు గాక, ఒకనాడు తనదైన భూమిని సేద్యంచెయ్యక గత్యంతరంలేని భూమికి బంధితుడైన

కౌలుదారు అవతరణకు దారితీసింది. రైతు విషయంలో అంతకంతకు అధికంగా పాలు వ్యవసాయమే ప్రధాన జీవనాధారమైంది. గ్రామీణ ప్రాంతాల్లో అధిక జనాభా పెరిగేకొద్దీ, వలస పాలన కొనసాగినంత కాలం అక్కడ పెట్టుబడిదారీ వ్యవస్థ అభివృద్ధి అసాధ్యమైంది. భారీ స్థాయి భూస్వామ్యం నడుమనే చిన్న, బుల్లి భూకమతాల వినియోగం కొనసాగింది. భూస్వాముల భూమి అంతా లేక దాదాపు అంతా కౌలుదార్లకు అమర్చబడింది. కౌలుదార్లు ఆ భూమిని వినియోగించుకున్నందుకు పంటలో మూడింట రెండు వంతులు చెల్లించేవారు. ఆ రోజుల్లో తమ ఆర్థిక వ్యవస్థను నిర్వహించుకోకుండానే కౌలు వసూలు చేసుకొనే గైరుహాజరు భూస్వాముల సంఖ్య అధికంగా ఉండేది. దేశపు అన్ని ప్రాంతాల్లోని భూమిలో అత్యధిక భాగాన్ని గైరుహాజరు భూస్వాములు సాగుచేస్తూండేవారని గణాంక లెక్కలు సూచిస్తున్నాయి. పంజాబులో 1930 దశకంలో సగం భూమిని వారు సాగుచేశారు. గుజరాతులో 1917–1943 మధ్య గైరుహాజరు భూస్వాముల చేతుల్లో ఉన్న భూమి 24 శాతంనుంచి 32 శాతానికి పెరిగింది. బెంగాల్ రాష్ట్రంలో 1921–1931 మధ్య భూమి కౌలు మొత్తాలపై జీవించే భూస్వాముల సంఖ్య 62 శాతం పెరిగింది. పాలి రైతులైన బర్గదార్లు సేద్యంచేసే భూమి రాష్ట్రపు మొత్తం భూమిలో దాదాపు 40 శాతం ఉంది.

ఈ పరిస్థితుల్లో పెట్టుబడిదారీ పంథాలో భూస్వామ్య ఎస్టేట్ల అభివృద్ధి చాలా స్వల్పంగా ఉండి, ప్రధానంగా భూస్వామికోసం చేసే పని మొత్తంలో పెరుగుదల రూపం తీసుకొంది. అంతే కాని అది నూతన, పెట్టుబడిదారీ ఉత్పత్తి రూపాల పెరుగుదల కాలేదు. ఫ్యూడల్ భూస్వామి తన సొంత చిన్న భూఖండాన్ని, పరికరాలను కలిగిన కౌలుదారులో ఆసక్తి కలిగి ఉండేవాడు. అలాంటి అస్తుల్లో పెట్టుబడిదారీ వ్యవస్థ, సరుకు—డబ్బు సంబంధాల అభివృద్ధి ప్రధానంగా కౌలు

మొత్తాల పెరుగుదల రూపం తీసుకునేది. అయితే, కొన్ని ఎస్టేట్లలో నూతన పెట్టుబడిదారీ ఉత్పత్తి రూపాలు తలెత్త నారంభించాయి. 1930 దశకం చివర కొద్దిగొప్పల్లో మూడు గ్రూపుల ఫ్యూడల్ అస్తులను చూడవచ్చు.

మొదటి గ్రూపులో కౌలు వ్యవసాయదారులు సాగుచేసే ఆస్తులు ఉన్నాయి. అయితే వారికి భూస్వామి విత్తనాలు సరఫరా చేస్తాడు. మరోలా చెప్పాలంటే, ఆ కౌలుదారు భూస్వామి కోరుకున్న పంట పండించడం ఖాయమన్నమాట. ఈ ఉదాహరణలో ఆస్తిని ఏక ఆర్థిక యూనిట్‌గా పరిగణించవచ్చు. కౌలుదారు అప్పటికే సగానికి పైగా వేతన కార్మికుడి దశకి దిగజార్చబడ్డాడు. ఇది పెట్టుబడిదారీ సంబంధాల మొదటి అతి నిమ్న రూపం. అలాంటి ఆస్తి విశిష్ట రూపాల్లో ఒకటేమిటంటే, కౌలుదారు ఉత్పత్తి సాధనాలను — పరికరాలను — కలిగివుంటాడు.

రెండవ రకం ఆస్తిలో ఉత్పత్తి సాధనాలన్నీ, విత్తనాలు, భూస్వామికి చెందివుంటాయి. అయితే కౌలుదారు భూస్వామికి పంటలో ఒక భాగాన్ని చెల్లిస్తాడు కనుక అతనింకా వేతన కార్మికుడు కాదు. వేతనానికి పనిచేసే వేతన కార్మికుడినుంచి అతను ఒక్క చిన్న అడుగు దూరంలో మాత్రమే ఉంటాడు.

మూడవ తరహా ఆస్తిలో భూస్వామి పరికరాలను, ఉత్పత్తి సాధనాలను కలిగివుండి, వేతన శ్రమని వినియోగించుకుంటాడు. అది అప్పుడే పెట్టుబడిదారీ తరహా ఉత్పత్తి అయింది. భూస్వామి స్వయంగా తన ఆస్తిని పెట్టుబడిదారీ ప్రాతిపదికమీద నిర్వహించుకొంటాడు, కార్మికులను పనిలో పెట్టుకొని వారికి వేతనం చెల్లిస్తాడు.

అయితే వాస్తవ జీవితంలో ఈ రూపాలన్నీ కలగాపులగంగా ఉంటాయి. ఒకే ఆస్తిలో వేర్వేరు భూఖండాలు వేరువేరు పద్ధతుల్లో సాగుచెయ్యబడవచ్చు.

మొత్తంమీద, పాక్షిక ఫ్యూడల్ అస్తులు భారతదేశంలో అమల్లో వుండగా, పెట్టుబడిదారీ తరహా ఆస్తులు కొద్ది మాత్రమే ఉన్నాయి. వలస భారతదేశంలో భూస్వామికి భూమిని స్వయంగా సేద్యంచెయ్యడం కంటె తన కౌలురైతులను దోపిడిచేసి, వారినుంచి విపరీతమైన కౌలు మొత్తాలను గుంజుకోవడమే ఎక్కువ లాభదాయకంగా ఉండేది. తత్ఫలితంగా మిరాషీ భూమి కౌలు పద్ధతి భారతీయ గ్రామీణ ప్రాంతంలో పెట్టుబడిదారీ సంబంధాల అభివృద్ధికి ఒక ప్రధాన ఆటంకమైంది.

సేద్యపు భూమిలో అత్యధికాంశాన్ని కలిగివున్న భూస్వాములు ఇతరుల శ్రమను దోచుకునే ధనిక రైతుల (కులాక్కుల) పెరుగుదలను నిరోధించారు.

ధనిక రైతుల ప్రయత్నాలు ప్రధానంగా పెట్టుబడి మదుపు పెట్టకుండా, పాత పద్ధతిలో అదనపు ఉత్పాదితంలో అత్యధిక భాగాన్ని గుంజుకొనే దిశగా ఉన్ముఖం చెయ్యబడేవి. అలాంటి కమతాలపైన పెట్టుబడి స్వతస్సిద్ధ వినిమయం చాలా తక్కువగా ఉండేది.

భూమి ధర ఎక్కువగా వుండటం, అధిక కౌళ్ళా, భూమిని కౌలుకివ్వడాన్ని లాభసాటి వ్యాపారంగా చేశాయి. సాధారణంగా ధనిక రైతు తన భూమిలో గణనీయమైన భాగాన్ని రైతులకి కౌలుకిచ్చి, మిక్కిలి సారవంతమైన భూములను తన సొంతానికి అట్టేపెట్టుకొని, వాటిని కూలీలచేతా, పాలి రైతుల, బాకీదార్ల వెట్టిచాకిరీ ద్వారా సాగుచేయించుకునేవాడు. ఈ పద్ధతి, భూమికి వున్న అధిక ధరలనూ, అధిక కౌళ్లనూ వినియోగించుకోవడం ద్వారా, వాణిజ్య వ్యవసాయాన్ని, సారాంశంలో పెట్టుబడిదారీ ఉత్పత్తిని సంభవంచేసింది. అందుచేత, ధనిక రైతు ఫ్యూడల్ భూస్వామ్య రూపాలకు సర్దుకోవలసివచ్చింది.

జమీందారీ భూస్వామ్య విధానం సామ్రాజ్యవాదంచేత చాలా కాలం పాటు పదిలపరచబడి, ప్రోత్సహింపబడిన కారణంగా, ధనిక రైతుల వ్యవసాయ క్షేత్రాల్లో కూడా పాక్షిక ఫ్యూడల్ ఉత్పత్తి రూపాలు దీర్ఘ

కాలంపాటు వదిలిపరచబడ్డాయి. తాత్కాలికమైనదిగా ఉండి ఉండవలసిన రూపమల్లా, గ్రామాల్లో సాంఘికార్థిక సంబంధాల ప్రమాణంగా తయారైంది. భారతదేశంలో ధనిక రైతు విశిష్ట, వైరుధ్యపూరిత లక్షణం ఇందులోనే వుంది. అలాంటి ధనిక రైతు ఫ్యూడల్ అవశేషాల భారంతో తను స్వయంగా కుంగిపోతూనే, మరోవైపున తను స్వయంగా వాటిని వినియోగించుకున్నాడు.

అయితే పెట్టుబడిదారీ సంబంధాల ప్రతినిధిగా, ధనిక రైతు ఫ్యూడల్ భూస్వామ్యానికి వ్యతిరేకి. ఫ్యూడల్ వ్యతిరేక, సామ్రాజ్యవాద వ్యతిరేక పోరాటంలో అతను మొత్తంగా రైతాంగపు పక్షం వహించాడు.

సరుకు—డబ్బు సంబంధాలు, పెట్టుబడిదారీ వ్యవస్థ అభివృద్ధి కూడా సన్నకారు భూమి సొంతదారుల్లోనూ, కౌలుదార్లలోనూ ఒక భాగం వ్యవసాయ కార్మికులుగా మారేందుకు దారి తీసింది. వీరి ఆదాయానికి ప్రధాన మూలాధారం తమ శ్రమని అమ్ముకోవడం ద్వారా లభిస్తుంది.

గ్రామీణ శ్రామికవర్గంలో అత్యధిక భాగం, భారతీయ గ్రామాల్లో పెట్టుబడిదారీ అభివృద్ధి బాగా వేగంగా సాగిన 20వ శతాబ్దపు ఉత్పాదితం. 1891లో వ్యవసాయ కార్మికులు గ్రామీణ జనాభాలో 13 శాతం మాత్రమే ఉండగా, 1921లో వారు 26.2 శాతం, 1931లో 38 శాతం ఉన్నారు. అయితే పనిముట్లను, ఉత్పత్తి సాధనాలను కోల్పోయిన రైతుల్లో ఒక చిన్న భాగం మాత్రమే వేతన కార్మికులు అవగా, మిగిలినవారు బికారులై, చిల్లరమల్లర పనులు చేసుకుంటూ గ్రామాల్లో ఉండిపోయారు.

అదనపు జనం పెరుగుదల వేతన శ్రమ విలువ బాగా పడిపోయేందుకు దారితీసి, యంత్రాల ఉపయోగాన్ని లాభదాయకం కాకుండా చేసింది. ఈ కారణంగా చౌక శ్రమ, భారతీయ వ్యవసాయపు సాంకేతిక స్తబ్దతలో ఒక ప్రధానాంశం అయింది.

రైతుల దారుణమైన దోపిడి, యాంత్రీకరణ, వ్యవసాయిక సాంకేతిక పరిజ్ఞానాల్లో హీన స్థాయీ భారతీయ శ్రామిక ప్రజల ప్రధానాహారమైన తిండిగింజల మొత్తం పంట దిగుబడి తగ్గిపోయేందుకు దారితీశాయి. రెండవ ప్రపంచ యుద్ధారంభం నాటికి భారతదేశం 20 లక్షల టన్నుల ఆహార ధాన్యాలను దిగుమతిచేసుకోవలసిన పరిస్థితిలో పడింది. 1880లో భారతదేశంలో తలసరి ఆహార వినిమయం 1.5 పౌనులు ఉన్నప్పుడు, ఆహార ధాన్యాల మిగులు 50 లక్షల టన్నులు వుండగా, రెండవ ప్రపంచ యుద్ధారంభం నాటికి 1 పౌను తలసరి ఆహార వినిమయంతో దేశపు ఆహార కొరత 1 కోటి టన్నులు వున్నట్లు భారతీయ ఆర్థికవేత్తలు అంచనావేశారు.*

1930 దశకం చివరకి భారతదేశపు సగటు దిగుబడి ఈజిప్టులో దానికంటె 70–80 శాతం, ఇటలీలోని వరి దిగుబడికన్న 75 శాతం, జావాలోని చెరుకు దిగుబడికన్న మూడో వంతు, హవాయి దిగుబడికన్న ఏడో వంతు తక్కువ.

రెండవ ప్రపంచ యుద్ధానికి ముందరి దశాబ్దంలో భారతీయ గ్రామాల్లోని పరిస్థితి ప్రత్యేకించి గడ్డుగా వుంది. ప్రపంచ ఆర్థిక సంక్షోభం ఫ్యూడల్ ప్రభువులచేత రైతాంగపు దోపిడిని విపరీతంగా తీవ్రతరం చేసి, పన్నుల భారాన్నీ, వడ్డీ వ్యాపారులకు రైతులు చెల్లించవలసిన రుణాల భారాన్నీ పెంచింది.

వ్యవసాయ పంటలకు భారతదేశ వ్యాపితమైన మార్కెట్ ఏర్పడటం, ప్రపంచ మార్కెట్‌లో ఆహార, ముడి పదార్థాలకు గిరాకీ పెరగడం, మొదటి ప్రపంచ యుద్ధం నాటి ద్రవ్యోల్బణాల కారణంగా,

---

* *Proceedings of the Sixth International Conference of Agricultural Economists*, Oxford University Press, London, 1948, p. 271.

19వ శతాబ్ది మధ్యలో మొదలైన వ్యావసాయికోత్పాదితాల ధరల పెరుగుదలకి సంబంధించిన సుదీర్ఘ దశ తరువాత ధరలు తీవ్రంగా పడిపోయాయి. వడ్డీ వ్యాపారులకు చెల్లించవలసిన రుణాల భారంతో రైతులు దివాళా తీశారు. 1929కీ 1937కీ మధ్య రైతాంగ రుణాల వెరసి మొత్తం రెట్టింపైంది, అంటే 900 కోట్ల రూపాయలనుంచి 1,800 కోట్ల రూపాయలకు పెరిగింది. రూపాయి విలువ తరుగుదల దృష్ట్యా, వాస్తవంలో ఈ మొత్తం 2,200 కోట్ల రూపాయలు వుంది. రైతుల రుణ భారం, భూమి శిస్తు, పన్నుల పెరుగుదల మూలంగా వ్యావసాయికోత్పత్తి ఖర్చులు అనివార్యంగా పెరిగాయి. వ్యావసాయికోత్పాదితాల ధరలు నిరంతరంగా పడిపోయాయి. భారతీయ రైతుకి వాస్తవంలో ఇదొక శాపం అయింది.

మార్కెట్లలో అరాచకత్వాన్ని తగ్గించే ప్రయత్నంలో రైతులు వాణిజ్య పంటల ప్రాంతాన్ని తగ్గించి, స్వయంపోషక వ్యవస్థ దిశగా వెనక్కిపోయేందుకు ప్రయత్నించారు. ఈ కారణంగా సంక్షోభం వాణిజ్య వ్యవసాయాభివృద్ధిపైనా, గ్రామసీమలో పెట్టుబడిదారీ సంబంధాలు రూపొందడంపైనా అత్యంత అననుకూల ప్రభావాన్ని కలిగించింది.

కోట్లాది రైతు కమతాల సామూహిక వినాశ ఫలితంగా వర్తకులు, వడ్డీ వ్యాపారులు, ఫ్యూడల్ భూస్వాములు సంపన్నులై, తమ చేతుల్లో భూమినీ, డబ్బునూ ఎక్కువగా సాంద్రీకరించుకున్నారు. 1934 దరిమిలా వ్యావసాయికోత్పాదితాల ధరలు కొద్దిగా పెరిగాయి. కాని అది గ్రామసీమ ఆర్థిక పరిస్థితిని మెరుగుపరచలేదు. 1937 తరువాత నూతన ఆర్థిక సంక్షోభం తలెత్తడంతో, ధరలు తిరిగి పడిపోనారంభించాయి.

ఈవిధంగా, తనకి తాను గాని, పట్టణాలకు గాని తిండి పెట్టలేని, దారిద్ర్య పీడితమైన, వినాశానికి గురైన గ్రామసీమ, ఉత్పాదక

శక్తులు స్తంభించిపోవడం, వ్యావసాయిక జనాభా అధిక పెరుగుదల, కౌలు మొత్తాలు, పన్నులు, రుణభారాల్లో విపరీతమైన పెరుగుదల — ఇవన్నీ రెండవ ప్రపంచ యుద్ధారంభానికి సరిగా ముందు భారతదేశపు అతి ముఖ్య ఆర్థిక రంగంలో బ్రిటిష్ సామ్రాజ్యవాద పాలన ఫలితాలు.

రెండు ప్రపంచ యుద్ధాలకీ మధ్య భారతీయ గ్రామసీమలోని పరిస్థితి వర్గ వైరుధ్యాల నిశిత వ్యగ్రతకి దారితీసింది. ఈ వైరుధ్యాలు రైతాంగ తిరుగుబాట్ల సంఖ్య పెరుగుదలలో వ్యక్తమయ్యాయి. అఖిల భారత రైతు సమాఖ్య — కిసాన్ సభ — రైతాంగపు సామూహిక సంఘంగా 1936లో నెలకొల్పబడింది. కిసాన్ సభ స్థాపన భారతీయ రైతాంగం జరిపిన ఫ్యూడల్ వ్యతిరేక, సామ్రాజ్యవాద వ్యతిరేక పోరాటంలో ఒక ముఖ్య ఘట్టమయి, దాని రాజకీయ పరిణతికి ఒక చిహ్నం అయింది. ఫ్యూడల్ వ్యతిరేక, సామ్రాజ్యవాద వ్యతిరేక పోరాటం ముమ్మరమవడంతో, వలస ప్రభుత్వం వ్యావసాయిక సమస్యల విషయంలో — వాటి పరిష్కారంలో రైతుల భాగస్వామ్యాన్ని నివారించేందుకు లేక తగ్గించేందుకు — కొన్ని చర్యలు తీసుకోక గత్యంతరంలేని స్థితిలో పడింది. ప్రభుత్వం కొన్ని వ్యావసాయిక చట్టాలను ఆమోదించింది. వాటిని వలస భారతదేశపు వ్యావసాయిక చట్టాల మూడవ ఘట్టంగా పరిగణించవచ్చు. ఈ చట్టాలు సంపన్న రైతుల ఒక చిన్న బృందపు హక్కులను విస్తృతం చేసి, తద్వారా వలసవాదుల పెత్తనానికి మరింత విస్తృతమైన పునాదిని కల్పించేందుకూ, అదే సమయంలో, రైతుల రాజకీయ ఐక్యతను నివారించేందుకూ ఉద్దేశింపబడ్డాయి.

1939లో యునైటెడ్ ప్రావిన్సెస్‌లో ఒక భూమి చట్టం ఆమోదింపబడింది. ఆ చట్టం ప్రకారం కౌలుదార్లు వారసత్వ హక్కులూ, భూమిమీద యిళ్లు కట్టుకొనే, చెట్లు నాటే, భూమిని బాగుచేసుకొనే హక్కూ పొందారు. కౌలుదారు చెల్లించవలసిన కౌలు మొత్తాల

బాకీలు బాగా పెరిగిపోయినప్పుడు మాత్రమే భూస్వామి తన కౌలు దారును తొలగించగలుగుతాడు. శిస్తును మినహాయించి యితర మొత్తాల న్నింటి చెల్లింపూ నిషిద్ధం. మిగతా రాష్ట్రాల విషయంలో కూడా అలాంటి చట్టాలే చెయ్యబడ్డాయి. వ్యావసాయిక సంక్షోభం ప్రగాఢ మయ్యేకొద్దీ, వలసపాలకులు ఈ చట్టాల ద్వారా ఫ్యూడల్ భూస్వామ్య వర్గాన్ని కాపాడేందుకూ, వ్యావసాయిక విప్లవాన్ని నివారించేందుకూ ప్రయత్నించారు.

ప్రకరణం 3

రెండవ ప్రపంచ యుద్ధ కాలంలో భారతదేశపు ఆర్థికాభివృద్ధి

1. యుద్ధ కాలంలో భారతీయ గ్రామసీమ

1939 సెప్టెంబరులో బ్రిటన్ భారతదేశాన్ని ఒక యుద్ధమగ్న దేశంగా ప్రకటించింది. దానితో భారతీయ ఆర్థిక వ్యవస్థ అభివృద్ధిలో ఒక నూతన దశ ఆరంభమైంది. అది దేశానికి విపరీతమైన కష్టాలు తెచ్చిపెట్టింది.

దేశపు ఆహారావసరాలను తీర్చడంలో వ్యవసాయపు అసమర్థతని యుద్ధం వెల్లడించింది. యుద్ధ పూర్వపు సంవత్సరాల్లో భారతదేశం సగటున సాలీనా 5 కోట్ల, 20 లక్షలనుంచి 5 కోట్ల, 30 లక్షల టన్నులవరకు ఆహార ధాన్యాలను — వరి, గోధుమ, జొన్నలు — ఉత్పత్తి చేసింది. అయితే, దేశపు ఆహార ధాన్యాల అవసరాలు 5 కోట్ల, 5 లక్షల టన్నులకు తగ్గలేదు.* 20 లక్షల టన్నుల కొరత బర్మా, థాయ్‌లాండ్‌లనుంచి దిగుమతుల ద్వారా భర్తీచెయ్యబడింది. 1942లో బర్మాను జపాను ఆక్రమించుకున్నప్పుడు, భారతదేశం తన ప్రధాన బియ్యం సప్లయిదారుని కోల్పోయింది. దానికితోడు, ఇండోచైనా,

---

* P. S. Lokanathan, *India's Post-War Reconstruction and Its International Aspects*, New Delhi, 1946, p. 9.

థాయ్‌లాండలనుంచి కూడా ఆహార పదార్థాలు (ప్రధానంగా బియ్యం) దిగుమతులు కూడా నిలిపివెయ్యబడ్డాయి. మరోవైపున, భారతదేశం సైన్యపు అవసరాలకోసం (తన స్వంత, ఆంగ్లో-అమెరికన్ బలగాలకోసం సుమారు ఒక కోటి టన్నుల ఆహార ధాన్యాలను సప్లయి చెయ్యవలసి ఉన్నందున, దాని ఆహారావసరాలు గణనీయంగా పెరిగాయి. తత్ఫలితంగా మొత్తం 12 కోట్ల, 50 లక్షల జనాభా కలిగిన 5 మిక్కిలి పెద్ద రాష్ట్రాలు (బెంగాల్, మద్రాసు, బీహారు, ఒరిస్సా, అస్సాం) కరువువాతపడ్డాయి. దిగుమతుల నిలిపివేత, ప్రభుత్వ ఆహార నిల్వలు లేకపోవడం, గ్రామసీమ కటిక దారిద్ర్యం, గ్రామాలకు అమ్మదగిన తిండిగింజల మిగులు లేకపోవడం కోట్లకొలది భారతీయులను ఆకలికీ, మరణాలకీ గురిచేశాయి.

స్థిరమైన ధరలకు కొనుగోలు మునుగులో రైతులనుంచి ఆహార ధాన్యాలు వశంచేసుకోబడ్డాయి. తత్ఫలితంగా, రైతులు తమ దగ్గర ఏ కొద్ది తిండిగింజల నిల్వలో ఉండడం తటస్థిస్తే, వాటిని తమ విత్తనాలతోబాటు కోల్పోయారు. కొనుగోలుదార్లు సామాన్యంగా వర్తకులు, వడ్డీ వ్యాపారులు, భూస్వాములు అయివుండేవారు. వాళ్లు తిండిగింజలను బ్లాక్‌మార్కెట్లో అధిక లాభాలకు అమ్ముకునేవారు. కోట్లమంది పస్తులతో మాడి చస్తూ వుంటే, వాళ్లు తిండిగింజలను పెద్ద మొత్తాల్లో నిల్వచేస్తూండేవారు.

యుద్ధ కాలంలో జనపనార, పత్తివంటి వాణిజ్య పంటల — భారతీయ ఎగుమతుల్లో ముఖ్యమైనవి — ఎగుమతులు కనీస స్థాయికి పడిపోయాయి. ఈ కారణంగా మేటపడిన మిగులు వస్తువులను దేశీయ మార్కెట్ కొనుగోలు చెయ్యలేకపోయింది. అందుచేత జనపనార, పత్తి ధరలు పడిపోసాగాయి. ఈవిధంగా యీ పంటల ఉత్పత్తి దారులు క్లిష్ట పరిస్థితుల్లో చిక్కుకున్నారు. అది కోట్లాది రైతు కమతాల విచ్ఛిత్తికి దారితీసింది. ధరలను స్థిరపరచేందుకు, ఆహార

సమస్యను పరిష్కరించేందుకు ప్రభుత్వం చేసిన ప్రయత్నాలు నిష్ఫల మయ్యాయి.

ధరలపై లాంఛనప్రాయమైన కంట్రోళ్ల విధింపు బ్లాక్‌మార్కెట్లో ధరలు మరింత పెరిగిపోయేందుకు మాత్రమే కారణమైంది. 1943లో 2 లక్షలమంది మాత్రమే రేషనింగ్ పద్ధతికిందకి వచ్చారు. యుద్ధాంతం నాటికి ఈ సంఖ్య 2 కోట్ల, 60 లక్షలకి పెరిగింది. తిండిగింజలు మాత్రమే రేషన్ చెయ్యబడ్డాయి.

యుద్ధానికి ముందరి దశాబ్దంలో — ఇది ధరలు దీర్ఘ కాలంపాటు పడిపోయిన దశ — రైతుల క్షేత్రాల్లో అత్యధిక భాగపు ఆర్థిక పరిస్థితి దిగజారింది. యుద్ధం మూలంగా ఏర్పడిన ద్రవ్యోల్బణం కారణంగా ధరలు విపరీతంగా పెరిగాయి. అయితే యుద్ధ పర్యవసానంగా ఏర్పడిన మొత్తం ద్రవ్యోల్బణం కూడా రైతాంగం దారిద్ర్య వినాశాల్లో కూరుకు పోసాగింది. 1939కీ 1945కీ మధ్య చలామణిలో ఉన్న కాగితపు డబ్బు 7 రెట్లు పెరిగింది. అదే సమయంలో దేశంలో ఆహార పదార్థాల ధరలు సగటున దాదాపు 3 రెట్లు పెరిగాయి. ఆ పరిస్థితిలో రైతులు మరింత సంపన్నులయి వుండవలసినదని అనిపిస్తుంది. అయితే వాస్తవంలో ఇందుకు భిన్నంగా జరిగింది. రైతులు అమ్మిన ఆహార పదార్థాల ధరలు 3 రెట్లు పెరగ్గా, ఉత్పత్తికి అవసరమైన సరుకుల (దుక్కి పశువులు, ఎరువులు, వ్యవసాయ పనిముట్లు, పశువుల మేత, వగైరాల) ధరలు 4.5 రెట్లకి పైగా పెరిగాయి.* ఇది రైతు రూపాయి కొనుగోలు శక్తి పడిపోయేందుకూ, రైతు క్షేత్రాల్లో అత్యధిక భాగపు పునరుత్పత్తి పరిస్థితులు అధ్వాన్నమయ్యేందుకూ దారితీసింది.

---

* M. B. Desai, *The Rural Economy of Gujarat*, Oxford University Press, London, 1948, pp. 282—84 ప్రాతిపదికమీద అంచనా వేయబడింది.

ఆ దశలో కౌలు మొత్తాలూ, భూమి ధరలూ పెరిగాయన్న విషయాన్ని కూడా గుర్తుంచుకోవడం అవసరం. ఒక భారతీయ ఆర్థిక వేత్త ఆర్. వి. రావు చెప్పినదాన్నిబట్టి చివరకు బంజరు భూమి సైతం యకరానికి 20–40 రూపాయలకి అమర్చబడగా, చెరుకు పంట భూముల కౌలు యకరానికి 200–300 రూపాయలకి పెరిగింది.*

యుద్ధం, ద్రవ్యోల్బణాల మూలంగా రైతు కమతాల పునరుత్పత్తి పరిస్థితులు దిగజారడం గురించి వ్యాఖ్యానిస్తూ, 1948లో జరిగిన వ్యవసాయ ఆర్థికవేత్తల అంతర్జాతీయ కాన్ఫరెన్సులో ప్రసంగిస్తూ భారతీయ ప్రతినిధి ఎమ్. నానావతి యుద్ధారంభం తర్వాత నాలుగైదు ఏళ్లలో వ్యావసాయిక ఉత్పాదితాల అపూర్వమైన ధరల పెరుగుదల, వ్యవసాయదారులకు ఎలాంటి వెసులుబాటునూ కల్పించలేకపోయిందని పేర్కొన్నాడు. వారిలో అత్యధిక సంఖ్యాకులు, తమకు కావలసిన వస్తువుల (పనిముట్లు, బట్టలు, దుక్కి పశువులు, నూనె, వగైరాల) ధరల్లో వచ్చిన పెద్ద పెరుగుదలల మూలంగా చాలా నష్టపోయారు.** తత్పర్యవసానంగా, యుద్ధం మూలాన రైతులు మరింత పేదవారయ్యారు.

యుద్ధమూ, ద్రవ్యోల్బణమూ గ్రామీణ ప్రాంతాల పేదతనాన్ని పెంచాయి. నిజంగా లాభపడినవల్లా వ్యవసాయోత్పాదితాల మిగుళ్ళున్న కమతాలు మాత్రమే. మరోలా చెప్పాలంటే, ద్రవ్యోల్బణం భూస్వాములను, వర్తకులను, వడ్డీ వ్యాపారులను, ధనిక రైతులనూ సంపన్నులను చేసింది.

---

* R. V. Rao, *Studies in Rural Economy*, Orient Longmans, Ltd., Bombay, 1953, p. 103.

** *Proceedings of the Sixth International Conference of Agricultural Economists*, p. 266.

వ్యవసాయోత్పాదితాల ధరలు పెరగడంతో, తామిచ్చిన బాకీల మొత్తాల విలువ పడిపోతుందన్న భయంతో, వడ్డీ వ్యాపారులు తమ బాకీలను సహజోత్పాదితాలలోకి మార్చుకోనారంభించారు. వాళ్ళు, విలువ కోల్పోతున్న రూపాయల్లో రైతులకు రుణాలిస్తూ, వడ్డీనీ, బాకీ చెల్లింపులనూ వ్యవసాయోత్పాదితాల రూపంలో వసూలుచేసుకున్నారు.

యుద్ధ సంవత్సరాల్లో రుణ భారం మరో కారణంగా కూడా పెరిగింది. అత్యధిక సంఖ్యాక రైతు కమతాల్లో పునరుత్పత్తి పరిస్థితులు తీవ్రంగా దిగనాసిల్లాయి. రైతు క్షేత్రాల్లో అధిక భాగం (రుణంలో అత్యధిక భాగం వాటిపైనే పడింది) ఆర్థికంగా బలహీనపడ్డాయి, వాటి వనరులు తరిగిపోయాయి. ఇది రుణ భారపు ప్రభావాన్ని వ్యగ్రం చేసింది. అంతే కాకుండా యుద్ధ కాలంలో వడ్డీ వ్యాపారుల వడ్డీ రేటు పెరిగింది.

ధరల పెరుగుదల గ్రామీణ ఆర్థిక వ్యవస్థపై వినాశకర ప్రభావం కలిగించి, ధనికులకీ పేదలకీ మధ్య అగాధాన్ని పెంచింది.

భారీ ఫ్యూడల్, పాక్షిక ఫ్యూడల్ తరహా భూస్వామ్యానికీ, చిన్న తరహా రైతు కమతాలకీ మధ్య వైరుధ్యాలు ఆ దశలో చాలా నిశితంగా వెల్లడయ్యాయి. రైతులు భూమిని కోల్పోవడం విస్తృత ప్రమాణంలో సాగింది. అది భూమిపైన స్వామ్యం భూస్వాముల వడ్డీ వ్యాపారుల చేతుల్లో సాంద్రీకరింపబడేందుకూ, భూమి కౌలు మొత్తాలు విపరీతంగా పెరిగేందుకూ, భూమిలేనివారు భూమికి అనుబంధింపబడివుండే పరిస్థితులు తీవ్రంగా దిగనాసిల్లేందుకూ దారితీసింది. రైతు తన స్వంత భూమిని కోల్పోవడంతోబాటు పెట్టుబడిదారీ పారిశ్రామిక సంస్థల పెరుగుదల సంభవించనందున రైతు నిర్బంధ కౌలుదారుగా లేక వ్యవసాయ కార్మికుడుగా మార్చబడ్డాడు.

పెట్టుబడిదారీ పూర్వ ఉత్పత్తి రూపాలు నిలిచివుండటం ఎప్పటిట్లు పెట్టుబడిదారీ అభివృద్ధి పంథాకు పరివర్తన చెందడాన్ని ఆలస్యంచేశాయి. ఫ్యూడల్ భూస్వాముల, వడ్డీ వ్యాపారుల చేతుల్లో భూమి కేంద్రీకరణ ధనిక రైతుల స్థానాన్ని సంఘటితంచేసి, వారిని కౌలు, వడ్డీ వ్యాపార దోపిడీ రంగాల్లో నిమగ్నులను చేసి, వారు మధ్యయుగాల, ఆటవికత్వ శృంఖలాలను విదిలించుకోకుండా అడ్డుపడింది. అదే సమయంలో, రైతుల ఇతోధిక శ్రేణీకరణ, ధన సంచయనపు పెరుగుదల, గ్రామీణ బూర్జువావర్గపు పెరుగుదలా పెట్టుబడిదారీ వ్యవస్థ శీఘ్రతర అభివృద్ధికి పదార్థిక ప్రాతిపదికను కల్పించి, గ్రామసీమలో ఫ్యూడల్, పెట్టుబడిదారీ సంబంధాల మధ్య వైరుధ్యాలను మరింత నిశితం చేశాయి. అయితే వలస పాలన పరిస్థితుల్లో ఫ్యూడల్ ఉత్పత్తి సంబంధాలే ప్రాబల్యం వహించాయి. వాటికి సామ్రాజ్యవాదపు పూర్తి తోడ్పాటు ఉండేది. ఆ సంబంధాలు సామ్రాజ్యవాదం దేశాన్ని దోచుకొనేందుకు పరిస్థితులను కల్పించడమే ఇందుకు కారణం.

తత్పర్యవసానంగా, పెట్టుబడిదారీ ఉత్పత్తి రూపానికి విశిష్టమైన ఉత్పాదక శక్తుల పెరుగుదల జాగుచెయ్యబడి, పెట్టుబడిదారీ ఫ్యూడల్ దోపిడి రూపాల పరస్పర విరుద్ధమైన పెనవేత అభివృద్ధిచెందింది. ఉత్పాదక శక్తుల పెరుగుదలలో ఆలస్యం తరచు వినాశకర రూపం తీసుకొని, వ్యవసాయపు స్తబ్ధ, వెనకబాటు స్వభావాన్ని శాశ్వతంచేసింది.

19వ శతాబ్ది రెండవ అర్ధభాగంలో తలెత్తి, 1930, 1940 దశకాల్లో ప్రత్యేకించి స్పష్టంగా వెల్లడైన ఈ క్రమాలు భారతదేశంలో వ్యావసాయిక సంక్షోభపు ప్రధాన లక్షణం అయ్యాయి. యుద్ధ కాలంలోనూ, యుద్ధానంతర తొలి సంవత్సరాల్లోనూ నిశితంగా తీవ్రమైన ఆ సంక్షోభం దేశపు వ్యవసాయ సమస్య తక్షణ పరిష్కారాన్ని అవసరంచేసింది. దేశ ఆర్థిక వ్యవస్థయొక్క ప్రధాన రంగమైన వ్యవసాయం బాగా వెనకబడి వుండి, మొత్తం ఆర్థిక వ్యవస్థపై అత్యంత

అననుకూలమైన ప్రభావాన్ని కలిగించి, దేశీయ మార్కెట్ ఏర్పడి, అభివృద్ధిచెందడాన్ని నిరోధించింది.

వ్యవసాయ సంస్కరణల అవసరం గ్రామీణ ప్రాంతాల్లో అన్ని రకాల ఫ్యూడల్, వలస దోపిడిని రద్దుచెయ్యాలని కోరే రైతాంగపు పోరాటం ముమ్మరమవడంవల్ల కూడా ముందుకు వచ్చింది.

౨. పారిశ్రామికోత్పత్తి నిర్మాణం

రెండవ ప్రపంచ యుద్ధ కాలంలో, ప్రభుత్వ వినిమయం పెరిగినా కూడా భారతీయ పరిశ్రమలు అతి కొద్దిగా మాత్రమే పురోగమించాయి. నాలుగేళ్ల యుద్ధ కాలంలో ప్రభుత్వంనుంచి పరిశ్రమలు పొందిన కంట్రాక్టుల మొత్తం విలువ 10 రెట్లు పెరిగినప్పటికీ, పారిశ్రామికోత్పత్తి 20 శాతం మాత్రమే పెరిగింది.* పరిశ్రమ ప్రధాన శాఖల్లో యుద్ధపు మొదటి రెండు మూడేళ్లల్లో మాత్రమే పారిశ్రామికోత్పత్తి పెరిగింది. 1943 తర్వాత పరిశ్రమయొక్క అనేక శాఖల్లో ఈ పెరుగుదల అసలే లేకపోగా, మరికొన్ని శాఖల్లో ఉత్పత్తి పడిపోయింది కూడా. సైనికేతర వినిమయ సరుకుల ఉత్పత్తి గణనీయంగా పడిపోయింది.

1945లో భారీ పరిశ్రమల్లోని మొత్తం ఉత్పాదితం 1939 నాటి స్థాయిలోనే ఉంది. ప్రధానంగా టాటా మిల్లుల విస్తరణ ఫలితంగా ఇనుము, ఉక్కు ఉత్పత్తిలో కొంత పెరుగుదల ఉంది. 1939లో 7 లక్షల, 80 వేల టన్నులున్న ఉక్కు ఉత్పత్తి 1944 నాటికి

---

* పైన ఉదహరింపబడిన P. S. Lokanathan పుస్తకం, పేజి 16.

12 లక్షల టన్నులకు చేరుకుంది. భారతదేశం టాంకు కవచానికి అవసర మైన ప్రత్యేక రకాల ఉక్కును ఉత్పత్తిచెయ్యడం మొదలుపెట్టింది.

అయసేతర లోహపాత పరిశ్రమ కూడా కొంత ప్రగతిని సాధించింది. అయితే ఈ పెరుగుదల అల్యూమినం ఉత్పత్తి పెరుగుదల మూలంగా జరిగింది. యుద్ధం చివర నాటికి అల్యూమినం రిఫైనరీల ఉత్పత్తి సామర్థ్యం 5,000 టన్నులకి పెరిగింది.

యుద్ధం మూలంగా వలసవాదులు భారతదేశంలో విమానాల, ఆటోమొబైల్ కూర్పు కర్మాగారాలను (ఇంజన్ను దిగుమతి చేసుకోబడేవి), రైఫిళ్లు, మెషీన్ గన్నులు, ఫిరంగి గుళ్ల వంటి వాటిని ఉత్పత్తిచేసే కొన్ని యుద్ధ పరిశ్రమలను తప్పనిసరిగా మొదలుపెట్టవలసివచ్చింది. అవన్నీ బ్రిటిష్ లేక అమెరికన్ కంపెనీలకు ("జనరల్ మోటార్స్," "ఫోర్డ్," "స్టుడిబేకర్") చెందినవి. కొన్ని రసాయనాల (క్లోరిన్, అమ్మోనియా సల్ఫేటు, పేలుడు పదార్థాల) ఉత్పత్తి కూడా ప్రారంభించబడింది.

యుద్ధ సంవత్సరాల్లో మొత్తం పారిశ్రామికోత్పత్తి సూచిక 20 శాతం మాత్రమే పెరిగింది. అయితే, పౌర ఉత్పత్తి స్థాయి యుద్ధ పూర్వపు స్థాయికంటె తక్కువగా వుంది. ఎందుకంటే, చాలా పరిశ్రమల్లో ఉత్పత్తి పెరుగుదల మిలిటరీ కంట్రాక్టులకి మాత్రమే పరిమితమై వుంది. అంచేత అది తాత్కాలికమైనది.

రెండవ ప్రపంచ యుద్ధం దేశ ఆర్థిక వ్యవస్థ ప్రగాఢ సంక్షోభాన్ని వెల్లడించింది. పెట్టుబడిదారీ వ్యవస్థ సార్వత్రిక సంక్షోభపు రెండవ దశ మూలంగా అది మరింత అధ్వాన్నమైంది. వలసలకోసం సామ్రాజ్యవాద రాజ్యాల మధ్య పోరాటం వ్యగ్రమవడంతో బ్రిటిష్ ఫైనాన్స్ పెట్టుబడి భారతదేశంపైన తన అజమాయిషీని బిగించి, తర్వాత దాని పురోగతిని నిరోధించక గత్యంతరంలేని స్థితిలో పడింది.

దేశీయ మార్కెట్ సంకుచితమవడమన్న విషయం ప్రత్యేకించి

యుద్ధ కాలంలో మరింతగా వెల్లడైంది భారతదేశ పరిశ్రమలు అప్ప టికే సాధించిన స్థాయి వలస పాలనలో సాధించగల స్థాయికి హద్దుగా నిరూపితమైంది

యుద్ధ కాలంలో భారతీయ పరిశ్రమలో మౌలికంగా గుణాత్మకమైన మార్పులు ఏవీ సంభవించలేదు భారీ పరిశ్రమ కొంత పెరిగినప్పటికీ, భారతీయ పరిశ్రమ నిర్మాణం యథాతథంగా ఉండిపోయింది పరిశ్రమ సాంకేతిక పునాది పునరుద్ధరింపబడలేదు అది ఉత్పత్తి సామర్థ్యాన్ని దెబ్బతీసింది యంత్రాలపైన అధిక భారం మూలంగా అవి విపరీతంగా అరిగిపోయాయి.

అదే సమయంలో యుద్ధం భారతీయ పెట్టుబడిదారులను సంప న్నంచేసి, పెట్టుబడి కేంద్రీకరణ క్రమాన్ని త్వరితం చేసింది. మొత్తం వాటా పెట్టుబడిలో బడా కంపెనీల (ఒక కోటి రూపాయలు లేక అంతకు ఎక్కువగా) వాటా 1939లో 20 శాతం ఉండగా, 1945లో అది 61 శాతానికి పెరిగింది. చాలా స్టాక్ కంపెనీల (విదేశీ కంపెనీలతో సహా) సంఖ్యని తీసుకున్నప్పుడు, 1945లో అది సుమారు 15,000 ఉంది వాటి చెల్లింపబడిన పెట్టుబడి 1939లో 3,000 కోట్ల రూపాయలు ఉండగా, 1945లో అది 4,000 కోట్ల రూపాయలకి పెరిగింది * అయితే, ద్రవ్యోల్బణాన్ని, రూపాయి విలువ తగ్గింపుని పరిగణనలోకి తీసుకొన్నప్పుడు ఈ పెరుగుదల ఏమంత గణనీయమైనది కాదు

యుద్ధ కాలంలో భారత జాతీయ పెట్టుబడి తన స్థానాలను పటిష్ఠం చేసుకుంది నూతన పారిశ్రామిక సంస్థల నిర్మాణం మూలం గానూ, బ్రిటిష్ కంపెనీల్లో కొన్ని వాటాలను అమ్మివేయడం మూలం

---

* *Statistical Abstract, India, 1953-54*, Government of India Press, Delhi, 1956, p 436

గానూ జాతీయ పెట్టుబడి అన్వయ రంగం విస్తృతమైంది. 1945లో భారతదేశంలో 822 విదేశీ కంపెనీలు, అంటే యుద్ధానికి ముందు కంటె 100 తక్కువ పనిచేస్తున్నాయి. అవి పూర్తిగా చెల్లింపబడిన 70 కోట్ల, 35 లక్షల పౌన్ల పెట్టుబడితో, అంటే 1933లోకంటె 13 కోట్ల పౌన్ల తక్కువ పెట్టుబడిలో ఉన్నాయి.* యుద్ధ కాలం లోను, యుద్ధానంతర తొలి సంవత్సరాల్లోను పరిశ్రమల్లో జాతీయ పెట్టుబడి వాటా గణనీయంగా పెరిగింది. ఎల్. ఐ. రైస్నెర్, జి. కె. షిరోకొవ్ అనే సోవియట్ ఆర్థికవేత్తల అంచనాల ప్రకారం 1948లో దేశపు ప్రైవేటు పరిశ్రమల్లోని మొత్తం పెట్టుబడి మదుపులో విదేశీ గుత్త సంస్థల వాటా 19.3 శాతం ఉంది. వలస పాలకుల ఆస్తులతో కలుపుకొని విదేశీ గుత్త సంస్థలు మొత్తం ఫాక్టరీ కార్మికుల్లో 34.9 శాతం మందిని నియోగించుకొన్న 13.1 శాతం ఫాక్టరీలను కలిగి వున్నాయి.

యుద్ధ కాలంలో భారతదేశం బ్రిటన్‌కి తన స్టెర్లింగ్ రుణాన్ని తీర్మానం చేసుకొంది. కఠినమైన దోపిడికి గురై, తన వనరులను బ్రిటన్‌కి తరలించిన ఫలితంగా ఈ రుణ తీర్మానం జరిగింది. 1939లో యుద్ధం అరంభమైనప్పుడు, భారతదేశపు స్టెర్లింగ్ రుణం 476 కోట్ల రూపాయలు (సుమారు 3 కోట్ల, 50 లక్షల పౌనులు) వుంది. అయితే 1944 నాటికి అది 3 కోట్ల, 80 లక్షల రూపాయలకు (2,81,000 పౌనులకు) తగ్గింది.** భారతదేశం సరఫరా చేసిన ముడి పదార్థాలు, ఆహార పదార్థాలు, తదితర సరుకులకు గాను, భారతదేశాన్ని జలగ

---

* అదే పుస్తకం, పేజి 460.

** పైన ఉదహరింపబడిన P. S. Lokanathan పుస్తకం, పేజి 42.

మాదిరిగా పీల్చివేసిన వలన దోపిడి ఫలితంగా సంచితమైన రుణాల్లో చెల్లుపెట్టడం ద్వారా బ్రిటన్ చెల్లించింది.

బ్రిటన్‌కి భారతదేశం చేసిన అనేక సరుకు సప్లయ్‌లకి అసలు చెల్లింపులే జరగలేదు. వాటి వెల మొత్తం బాంక్ ఆఫ్ ఇంగ్లండులో స్తంభింపచెయ్యబడిన స్టెర్లింగ్ అక్కౌంటులో రాసుకోబడింది. ఇది భారతదేశంలో ద్రవ్యోల్బణాన్ని పెంచి, బృహత్పరిమాణంలో దేశీయ రుణం పెరిగేందుకు దారితీసింది. 1939లో 710 కోట్ల రూపాయలున్న ఆ రుణం 1944లో 1,330 కోట్లకు పెరిగింది. మొత్తంమీద భారతదేశపు సైనిక వ్యయం 2,500 కోట్ల రూపాయలు వుంది. 1945 ఆగస్టులో భారతదేశపు స్టెర్లింగ్ అక్కౌంటు 1,500 కోట్ల రూపాయలు దాటింది.* దానితో భారతదేశం బ్రిటన్‌కి రుణ దాత అయింది. అయితే యిది, భారతదేశం తన వనరులను ఊడ్చిపెట్టడం ద్వారా, తన సొంత ఆర్థిక వ్యవస్థను కొల్లగొట్టడం ద్వారా, జన సామాన్యపు నిరుపేదతనం ద్వారా, దాని పాదార్థిక, అంగబల వనరుల ఘోర దోపిడి ద్వారా, తీవ్రమైన ద్రవ్యోల్బణం ద్వారా, ఉత్పాదక శక్తుల అభివృద్ధిలో పతన, స్తబ్దతల ద్వారానే సాధింపబడింది.

అయితే, విదేశీ పెట్టుబడి మదుపుల పరిమాణంలో తరుగుదల సామ్రాజ్యవాదంపైన భారతదేశపు పరాధీనతను గణనీయంగా తగ్గించ లేదు. యుద్ధ కాలంలో విదేశీ పెట్టుబడితో ప్రధానమైన భారతీయ గుత్త సంస్థల సంబంధాలు బలపడ్డాయి. సంయుక్త కంపెనీల రూపంలో కొత్త తరహా సంబంధాలు అవతరించాయి.

బిర్లా గ్రూపు, ''స్టుడిబేకెర్ కార్పొరేషన్''ల భాగస్వామ్యంతో ''హిందుస్థాన్ మోటార్స్,'' వాల్చంద్ హీరాచంద్‌కి చెందిన ''ప్రీమియర్

---

* అదే పుస్తకం, పేజీలు 36, 45.

ఆటోమొబైల్,'' ''క్రైస్లర్ కార్పొరేషన్''లతో ఏర్పడిన తొలి సంయుక్త కంపెనీలు యుద్ధపు చివరి రోజుల్లో తలెత్తాయి.

20వ శతాబ్ది ఆరంభంలో అమెరికన్ పెట్టుబడి భారతదేశంలోకి చొరబడనారంభించింది. 1920 దశకం నాటికే అమెరికన్ ''ఇంటర్నేషనల్ బాంకింగ్ కార్పొరేషన్'' శాఖలు ఏర్పడ్డాయి, కొన్ని గుత్త సంస్థలు (''ఫోర్డు,'' ''జనరల్ మోటార్స్,'' వగైరాలు) భారతదేశంలో తమ అనుబంధ సంస్థలను నెలకొల్పాయి. 1948 నాటికి భారతదేశంలో అమెరికన్ పెట్టుబడి మదుపు మొత్తం పరిమాణం 18 కోట్ల రూపాయలకు చేరుకుంది. అంటే, దాదాపు యుద్ధానికి ముందరి మొత్తాన్ని చేరుకుందన్నమాట. అయితే యుద్ధ కాలంలోనూ, యుద్ధం తర్వాతా అమెరికన్ పెట్టుబడి విదేశీ వ్యాపారంలో తన స్థానాలను ఎంతో గణనీయంగా బలపరచుకొని, తదుపరి సంవత్సరాల్లో రుణాలు, ''సహాయం'' రూపంలో దేశంలో అంతకంతకు ఎక్కువగా ప్రవేశించింది. యుద్ధానికి ముందు భారతదేశపు దిగుమతి ఎగుమతుల్లో అమెరికా వాటా వరుసగా 6 శాతం, 8 శాతం ఉంది. యుద్ధాంతం నాటికి భారతదేశానికి ఎగుమతులు, లెండ్-లీజ్ (అరువు-కౌలు) లావాదేవీలను పరిగణనలోకి తీసుకుంటే, 7 రెట్లు పెరిగాయి. 1944–45లో భారతదేశపు విదేశీ వర్తకంలో అమెరికా వాటా దాదాపు 25 శాతం ఉంది. కాని బ్రిటిష్ మేనేజింగ్ ఏజెన్సీలు, విదేశీ బాంకులు అప్పటికింకా ప్రాబల్యం వహిస్తూనే వున్నాయి. 1946–47లో వున్న 200–300 మేనేజింగ్ ఏజెంట్లలో 21 మేనేజింగ్ ఏజెంట్లు ప్రాబల్యంలోకి వచ్చారు. ఆర్థిక వ్యవస్థయొక్క వివిధ శాఖల్లో 934 ప్రముఖ కంపెనీలపైన వారు అజమాయిషీ కలిగివున్నారు. అతి ముఖ్యులైన పదిమంది బ్రిటిష్ ఏజెంట్లు 413 షేర్ కంపెనీలపైన – టీ, బొగ్గు, జనపనార, రవాణా, వగైరాలు – అజమాయిషీ కలిగివున్నారు. అత్యధిక సంఖ్యాక కంపెనీలు ఈకింది బ్రిటిష్ ఏజెన్సీల అజమాయిషీలో వున్నాయి:

''ఆండ్రీ యూల్'' (78 కంపెనీలు, ప్రధానంగా టీ, బొగ్గు, జనపనార, వగైరాలు), ''హైలాండర్స్ అర్బత్‌నాట్'' (70 కంపెనీలు, టీ, బొగ్గు, రవాణా, వగైరాలు), ''అక్సేవియస్ స్టీల్'' (57 కంపెనీలు), ''మెక్ లెయోడ్ స్టీల్'' (55 కంపెనీలు). 1947లో 15 విదేశీ బాంకులు దేశంలో పనిచేస్తున్నాయి. ఇంపీరియల్ బాంకుతో కలుపుకొని (దీని వాటాల్లో 75 శాతం విదేశీయులకి చెందినవి) అవి దేశపు మొత్తం బాంకింగ్ వ్యవస్థ డిపాజిట్లలో 64 శాతంపైన అజమాయిషీ కలిగివున్నాయి.*

యుద్ధ కాలంలో పారిశ్రామికోత్పత్తి పెరుగుదల భారతీయ మార్కెట్‌ని విదేశీ సరుకుల ప్రాబల్యంనుంచి కాపాడలేదు. యుద్ధానంతర దశలో భారతదేశ ఆర్థిక పరిస్థితిలో వచ్చిన తీవ్ర క్షీణ్యం బ్రిటన్, అమెరికాలపై దాని పరాధీనతను విశేషంగా పెంచింది. అన్ని ప్రధాన పారిశ్రామిక వస్తువుల ఉత్పత్తీ యుద్ధానంతరం 15 శాతం పడిపోయింది. ఉత్పత్తిలో తరుగుదల భారతీయ పరిశ్రమయొక్క దాదాపు అన్ని శాఖలనూ ప్రభావితంచేసింది.

1947 నాటికి పారిశ్రామికోత్పత్తి 1939 నాటి యుద్ధపూర్వ దశకు చేరుకోగా, పత్తి, జనపనార, ఉక్కు, అద్దకపు రంగులు, పిండి, వగైరా కొన్ని పరిశ్రమల్లో అది ఇంకా పడిపోయింది. యుద్ధ కాలంలో ఉత్పత్తి పెరుగుదలకి తగినంత దృఢమైన పునాది లేదని ఆ కారణంగా అది కొనసాగలేకపోయిందని, యుద్ధ కాలపు పెరుగుదలకు ప్రధానంగా యుద్ధ ద్రవ్యోల్బణం మూలంగా ఏర్పడిన గిరాకీయే కారణమన్న విషయాన్ని ఇది వెల్లడిస్తోంది.

భారతీయ పెట్టుబడిదారీ వ్యవస్థ ఒక శతాబ్దానికి పైగా అభివృద్ధిచెందుతోన్నప్పటికీ, దేశంలో యింకా విరూపమైన, ఏకముఖ

---

* *Statistical Abstract, India, 1953-54*, pp. 425—26.

వలస ఆర్థిక నిర్మాణం నిలిచి ఉంది. దాని పరిశ్రమకి సామాజిక పెట్టు బడి పునరుత్పత్తిని స్వతంత్రంగా సాగించగల సామర్థ్యం లేదు. ఉత్పా దక వస్తువుల ఉత్పత్తి శాఖలు దాదాపు బొత్తిగా లేకపోవడమే ఇందుకు కారణం.

దేశపు ఆర్థిక వెనుకబాటుతనం, దాని వలస నిర్మాణమూ, దాని జాతీయాదాయంలో స్పష్టంగా వ్యక్తమయ్యాయి.

1951లో జాతీయ ఆదాయ కమిటీ 1948/49 సంవత్సరానికి తన మొదటి యుద్ధానంతర నివేదికను ప్రచురించింది. జాతీయాదా యాన్ని అంచనావేసే పద్ధతిలో ఎన్ని లోపాలు ఉన్నప్పటికీ, ఆ నివేదిక ఆర్థిక వ్యవస్థ వలస నిర్మాణాన్ని మరుగుపరచలేకపోయింది. 1948/49 సంవత్సరానికి భారత యూనియన్ (పాకిస్తాన్ లేకుండా) జాతీయ ఆదాయం 8,730 కోట్ల రూపాయలుగా అంచనా వెయ్యబడింది. ఆ జాతీయాదాయం నికర ఆదాయంగా కాక, జాతీయార్థిక వ్యవస్థయొక్క అన్ని శాఖల ఉత్పత్తి, దానికితోడు అన్ని తరహాల కార్యకలాపాల్లోనూ పాల్గొనే అందరు వ్యక్తుల, సంస్థల ఆదాయాల విలువగా లెక్కగట్ట బడింది. అలాంటి అంచనాల ఫలితంగా, ప్రాథమిక ఆదాయాలు, వాటి నుంచి ఉత్పన్నమయే అప్రధాన ఆదాయాలకు చేర్చబడ్డాయి. వీటిలో వర్తకుల, వడ్డీ వ్యాపారుల, మత ప్రముఖులు, వగైరాల ఆదాయాలు కూడా యిముడ్చబడ్డాయి. ఈ అంకెల విశ్లేషణ ద్వారా యీకింది వివరాలు లభిస్తాయి: చేపల వేట, అడవులతో కలుపుకొని వ్యవసాయం వాటా 47.6 శాతం, పరిశ్రమ 17.2 శాతం (అందులో భారీ పరిశ్రమ 6.6 శాతం, చిన్న తరహా పరిశ్రమ 9.9 శాతం), వర్తకుల, వడ్డీ వ్యాపారుల, బాంకుల, ఇన్స్యూరెన్స్, రైల్వే, పోస్టల్, టెలిగ్రాఫ్ సేవల ఆదాయాలు 19.5 శాతం, సివిల్ ఉద్యోగుల, అనియత ఉద్యోగుల, గృహ యజమానుల (సేవకుల ఆదాయాలతోబాటు) 15.9 శాతం.

ఈ మొత్తం జాతీయాదాయపు అంకెలు వ్యవసాయంలోనూ, పరిశ్రమలోనూ చిన్న తరహా ఉత్పత్తి ప్రాబల్యాన్నీ, పరభాగ్యోపజీవన వ్యక్తులు జాతీయాదాయంలో చాలా పెద్ద వాటా కలిగివున్నారన్న విషయాన్నీ — దీనిలో 35.4 శాతం లేక అధికాంశం వడ్డీ వ్యాపారులకు, వర్తకులకు, గృహ యజమానులకు చెందుతుందనీ — స్పష్టంగా తెలియజేస్తాయి. ఈ అంకెలో బడా ఫ్యూడల్ భూస్వాములు, మేనేజింగ్ ఏజెంట్లు వగైరాల ఆదాయాలు చేర్చబడలేదు.

వాణిజ్యంలో తలసరి సాలుసరి ఆదాయం (బాంకులు, ఇన్స్యూరెన్సు, రవాణా, ప్రయాణ సౌకర్యాలతోబాటు) 1,600 రూపాయలు వుంది. ఇది పరిశ్రమలోని తలసరి ఆదాయం 800 రూపాయలకు రెట్టింపు, వ్యవసాయంలోని ఆదాయం 500 రూపాయలకు 3.5 రెట్లకి పైగానూ వుంది. కాగా, మిక్కిలి మేలైన స్థానంలో వున్న జనాభా విభాగం వాస్తవంలో జాతీయాదాయాన్ని ఉత్పత్తిచేసే విభాగం కాదు (యిందుకు మినహాయింపు యిందులో పొరపాటుగా చేర్చబడిన సరుకు రవాణా) వ్యావసాయికోత్పత్తిలో నిమగ్నులైన కోట్లాదిమంది పరిస్థితి మిక్కిలి అధ్వాన్నంగా వుంది.

యీ నివేదిక ప్రకారం భారీ పరిశ్రమలోని వ్యక్తి సాలుసరి ఆదాయం 1,700 రూపాయలు కాగా, వ్యావసాయిక సంస్థల్లోనూ, చేతివృత్తుల్లోనూ పనిచేసే సాలుసరి ఆదాయం 600 రూపాయలు మాత్రమే.

జాతీయాదాయంలో కార్మికుల, రైతుల వాటా గాని, విదేశీ పెట్టుబడి గుంజుకొనే వాటా గాని ఆ నివేదికలో లేదు.

తలసరి ఆదాయం (247 రూపాయలు) విషయంలో భారతదేశం ప్రపంచ జాబితాలో దాదాపు అట్టడుగున, చివరకు సింహళం, ఇరాన్, ఇరాక్‌ల వంటి వెనకబడ్డ దేశాలకంటె కూడా అడుగున వుంది.

బూర్జువా గణాంక లెక్కల పద్ధతుల్లో ఎన్ని లోపాలు ఉన్నప్ప

టికీ, అవి భారత జాతీయాదాయ నివేదిక, దేశపు ఆర్థిక వ్యవస్థ వలస ఫ్యూడల్ లక్షణాలను గాని, ఆర్థికంగా దాని అధిక వెనుకబాటు తనాన్ని గాని మరుగుపరచలేకపోయాయి.

రెండవ ప్రపంచ యుద్ధం ముగియడంతో సామ్రాజ్యవాద వలస వ్యవస్థ సంక్షోభం వ్యగ్రమైంది, జాతీయ స్వాతంత్ర్యంకోసం వలస ప్రజల పోరాటం ముమ్మరమైంది. సామూహిక విప్లవకర, సామ్రాజ్య వాద వ్యతిరేక ఉద్యమాన్ని బ్రిటిష్ సామ్రాజ్యవాదం యికనెంతమాత్రం నిలవరించలేకపోయింది.

ప్రపంచ రంగంలో బలాబలాలు సోషలిజానికి అనుకూలంగా మారి, పెట్టుబడిదారీ వ్యవస్థ తన సార్వత్రిక సంక్షోభపు రెండవ దశలో ప్రవే శిస్తున్న తరుణంలో భారత ప్రజల జాతీయ విముక్తి పోరాటం ముమ్మర మైంది.

భారతదేశాన్ని విభజించడం ద్వారా, అధినివేశ ప్రతిపత్తిని మంజూరు చెయ్యడం ద్వారా బ్రిటిష్ లేబరు పార్టీ యీ పరిస్థితిని పరిష్క రించాలని ప్రయత్నించింది. 1947 అగస్టు 15న భారతదేశానికి స్వాతంత్ర్యాన్ని మంజూరుచేసే మౌంట్‌బాటెన్ పథకం ఆమోదించబడింది.

భారతదేశాన్ని రెండు రాజ్యాలుగా చీల్చడానికి ప్రేరణనిచ్చింది రాజ కీయ ఉద్దేశమే గాని, ఆర్థికావసరాలు కాదు. మత, కుల సూత్రం ఆధారంగా ముస్లిం పాకిస్తాన్ రాజ్యం విడదీయబడింది. మత సూత్రాల ప్రాతిపదికపైన జరిగిన యీ విభజన పర్యవసానంగా, ఆర్థికంగా చాలా ముఖ్యమైన రెండు రాష్ట్రాలు — పంజాబు, బెంగాలు — భారతదేశం, పాకిస్తాన్‌ల మధ్య విభజింపబడ్డాయి.

విభజన జరగబోతున్నదన్న తొలి పుకార్ల పర్యవసానంగా 1947 మార్చిలో హిందువులకీ, సిక్కులకీ, ముస్లింలకీ మధ్య పంజాబులో రక్తపాతంతో కూడిన కలహాలు జరిగాయి. బ్రిటిష్ రహస్య పోలీసులూ, స్థానిక అభివృద్ధినిరోధకులూ ఈ కలహాలను రెచ్చగొట్టారు.

భారతదేశ విభజన క్రమంలో మూకుమ్మడి హత్యలు జరిగాయి. లక్షలమంది ప్రజలు వినాశానికి గురయ్యారు. భారతదేశంనుంచి పాకిస్తాన్‌కి, పాకిస్తాన్‌నుంచి భారతదేశానికి కాందిశీకులు ప్రవాహ సదృశంగా తరలిపోయారు. దానితోబాటు మూకుమ్మడి జనవధలూ, హత్యాకాండలూ జరిగాయి. భారతీయ ఆర్థిక వ్యవస్థను స్థిరపరచేందుకు పరిస్థితి సానుకూలంగా లేకపోయింది.

సామూహిక హత్యాకాండలనుంచి, ఊచకోతనుంచి ప్రజల పలాయనం భయంకరమైన ఒక జాతీయ విపత్తు అయింది. తూర్పు పంజాబు, తూర్పు బెంగాలులనుంచి 75 లక్షలమంది హిందువులు ఇండియన్ యూనియన్‌కి పారిపోగా, ఇండియన్ యూనియన్‌నుంచి 58 లక్షల మంది ముస్లింలు పాకిస్తాన్‌లో శరణు పొందారు.

1947లో "శాంతియుతమైనది"గా చెప్పబడే భారతదేశ విభజన సామ్రాజ్యవాదులు హిందువులకీ ముస్లింలకీ మధ్య అపూర్వమైన భయోత్పాతాన్ని రెచ్చగొట్టడాన్ని సాధ్యంచేసి, రక్తపాతానికి కారణభూతమైంది. లక్షలాదిమందిని కడగండ్లపాలు చేసింది. వారు తమ ఇల్లువాకిళ్లనూ, సర్వస్వాన్నీ కోల్పోయారు. ఇది ఏ హింసాత్మక విప్లవంలోనూ జరగనంత విస్తృత స్థాయిలో జరిగింది. అయినా కూడా, బ్రిటిష్ బూర్జువా వర్గమూ, మితవాద సోషలిస్టు పత్రికలూ మొత్తంమీద భారతదేశ విభజనవల్ల అనుకున్నదానికంటె తక్కువ రక్తపాతమే జరిగిందని వాదించాయి.

దేశ విభజన ఆర్థిక వ్యవస్థపై కలిగించిన ప్రభావం అత్యంత దురదృష్టకరమైనది. పాకిస్తాన్‌కి మొత్తం భూభాగంలో 14.9 శాతమూ, జనాభాలో 17.7 శాతమూ దఖలుపడ్డాయి. దేశ విభజనకు ముందు భారతదేశపు గోధుమలో 35 శాతం, వరిలో 32 శాతం, జనపనారలో దాదాపు 80 శాతం, పత్తిలో 35 శాతం ఉత్పత్తిచేసే వ్యావసాయిక ప్రాంతాలు కూడా దానికి దఖలుపడ్డాయి. మరోవైపున పారిశ్రామిక సంస్థలు బహు కొద్దిగా మాత్రమే పాకిస్తాన్‌కి వెళ్లాయి.

అంతే కాకుండా, పాకిస్తాన్ పశ్చిమ భాగం దాని తూర్పు భాగంనుంచి (తూర్పు బెంగాల్) 1,300 కిలోమీటర్ల దూరం వేరుపడివుంది.

బొగ్గు పరిశ్రమ, దాదాపు అన్ని ఇనుము, ఉక్కు కర్మాగారాలు, జనపనార పరిశ్రమ, చాలా జౌళి మిల్లులు, పంచదార రిఫైనరీలు, సిమెంటు ఫాక్టరీలు, టీ తోటలు, రైలు మార్గాల్లో అధికతర భాగం, ప్రధానమైన ఓడరేవులు భారతదేశానికి మిగిలాయి.

దేశ విభజన మూలంగా ఆయా ప్రాంతాల మధ్య స్థిరపడిన ఆర్థిక సంబంధాలు దెబ్బతిన్నాయి. దేశీయ మార్కెట్ నెలకొనడంపైన అది ప్రతికూల ప్రభావం కలిగించింది. ఒక భాగం ప్రాకృతిక వనరులు కోల్పోగా, మరొకటి పారిశ్రామిక సరుకుల మూలాధారాన్ని కోల్పోయింది. ఆ పరిస్థితుల్లో సామ్రాజ్యవాద రాజ్యాలపైనా, ప్రపంచ మార్కెట్పైనా యీ రెండు అధినివేశ రాజ్యాల పరాధీనత అనివార్యంగా పెరిగింది.

కాగా దేశ విభజన యుద్ధం మూలంగా బలహీనపడిన భారతీయ ఆర్థిక వ్యవస్థ మరింతగా దెబ్బతినేందుకే దారితీసి, రాబోయే చాలా కాలంపాటు దాని అభివృద్ధికి అదనపు తీవ్ర ఆటంకాలను కల్పించింది.

భారతీయ పరిశ్రమలోని 1947 అనంతర దశ సంక్షోభ, మాంద్యాల దశ. దాదాపు అన్ని వస్తువుల ఉత్పత్తి కూడా 1938 నాటి స్థాయి కంటె తక్కువ స్థాయిలో వుంది. అనేక పారిశ్రామిక సంస్థలు మూసి వెయ్యబడ్డాయి, చాలా పరిశ్రమలు వారంలో పనిగంటలు తగ్గించాయి.

వీటన్నింటికీ ఆకలి, ద్రవ్యోల్బణం, విదేశీ వర్తకపు లోటులో అంతకంతకు పెరుగుదల, బంగారు, కరెన్సీ నిల్వల తరగుదలా తోడయ్యాయి.

దాదాపు రెండు శతాబ్దాలపాటు బ్రిటిష్ పాలన ''లాభాలను'' అనుభవించిన స్వతంత్ర భారతదేశం ఆర్థిక వినాశపు టంచుకి చేరింది. దారిద్ర్య, వినాశాలకు గురైన దేశం — యిదీ వలస దోపిడీ పర్యవసానం. రాజకీయంగా స్వతంత్రమైన భారతదేశం అలాంటి స్థితినుంచి బయల్దేరి తన ఆర్థికాభివృద్ధిని ప్రారంభించవలసివచ్చింది.

ప్రకరణం 4

వ్యవసాయ సంబంధాలు, వ్యవసాయ సంస్కరణలు

ఈనాటికీ వ్యవసాయమే భారతదేశ ఆర్థిక వ్యవస్థ ప్రధాన శాఖ. దేశపు శ్రమశక్తిలో 70 శాతానికి పైగా వినియోగించుకొని, అది జాతీయాదాయంలో సుమారు సగం ఉత్పత్తి చేస్తోంది.

దేశం స్వాతంత్ర్యం సంపాదించుకునేందుకు ముందు అభివృద్ధిచెందిన వ్యవసాయ సంబంధాల స్వభావం గ్రామీణ ప్రాంతంలో సంభవిస్తున్న మౌలిక ఆర్థిక క్రమాలనూ, ఇంకా పూర్తిచెయ్యవలసిన సంస్కరణల పరిధినీ నిర్ణయిస్తుంది.

1. వ్యవసాయ సంబంధాలు

వ్యవసాయ సంస్కరణలు అమలుజరపబడేందుకు ముందు 2/3 శాతంమంది ఫ్యూడల్ భూస్వాములు సేద్యపు భూమిలో 70 శాతాన్ని కలిగివుండి, వడ్డీ వ్యాపారులు, వర్తకులతోబాటు యావత్తు మిగులు ఉత్పాదితాన్నే కాకుండా, రైతుల, కౌలుదారుల కమతాల్లో తయారైన అవసరపు ఉత్పాదితంలో ఒక భాగాన్ని కూడా భుక్తం చేసుకొనేవారు.

స్వాతంత్ర్యానంతర సంవత్సరాల్లో సామాజికార్థిక మార్పుల ఫలి

తంగా, ప్రధానంగా వ్యవసాయ సంస్కరణల ద్వారా ఫ్యూడల్ సంబంధాల ప్రధాన లక్షణాలు పరిమితపరచబడ్డాయి, చాలా ప్రాంతాల్లో అవి తొల గింపబడ్డాయి. గ్రామీణ ప్రాంతంలో పెట్టుబడిదారీ సంబంధాల అభి వృద్ధి త్వరితంచెయ్యబడింది. అయితే, ఆధునిక భారతీయ గ్రామీణ ప్రాంతపు పెట్టుబడిదారీ పరివర్తన క్రమం సామాజికార్థిక వ్యత్యా సాలను తొలగించకపోగా, చాలా సందర్భాల్లో వాటిని వ్యగ్రంచేసింది. రైతాంగంలో అత్యధిక భాగం, అందునా దాని నిమ్న శ్రేణులు పెట్టు బడిదారీ పరిణామపు సాధారణ క్రమంనుంచి వేరుపడి, పెట్టుబడిదారీ దిశాభిముఖ గ్రామీణ అగ్రగణ్యుల ప్రాథమిక ధనార్జనకు గురి అవడమే కాక, అందుకు మూలాధారమయ్యారు. మిగులు ఉత్పాదితం అమ్మడం, అంటే దాన్ని సరుకు రూపంలోకి మార్చడం అత్యధిక భాగం రైతుచేత కాక గ్రామీణ బూర్జువావర్గ సభ్యులైన భూస్వాములు, వడ్డీ వ్యాపా రులు, వర్తకులచేత జరిగింది. ఈ గ్రామీణ బూర్జువావర్గం క్రమంగా ఒకే సామాజిక నమూనా, వ్యావసాయిక పెట్టుబడిదారీ వ్యవస్థ అభి వృద్ధికి మూర్తీభావంగా సంలీనమవుతుంది. ఈ పరిస్థితుల్లో లక్షలాది చిన్న కమతందార్ల ఉత్పత్తి లక్ష్యం వ్యక్తిగత వినిమయమే. ఈ ఉత్పత్తి శ్రామిక శక్తి, అత్యంత ఆదిమ ఉత్పత్తి సాధనాల పునరుత్పత్తికి కటా కటీగా సరిపోతుంది. ఉత్పత్తి రకమూ, వినిమయ స్వభావమూ అదనపు శ్రమలో లేక నూతన పరికరాల్లో నిమ్న ఆవశ్యకతలను ముందే నిర్ణయి స్తాయి. రైతు లేక కౌలుదారైన చిన్న కమతందారు, సేద్యపు పంటల ఉత్పత్తిపైన వ్యక్తిగత వ్యయాన్ని నిర్ణయించడంతో వ్యయ అనుపాతాలను గాని, సామాజికావసరమైన శ్రమతో వాటి సంబంధాన్ని గాని పరిగణన లోకి తీసుకునే ప్రయత్నమేదీ చెయ్యలేదు. ఈ సంబంధం జాతీయ మార్కెట్లోని ధరల్లో వ్యక్తమవుతుంది. రైతుకి లేక కౌలుదారుకి యీ జాతీయ మార్కెట్ దాదాపు అందుబాటులో వుండదు. తత్పర్యవసానంగా, తమ కనీస వ్యక్తిగత అవసరాలను తీర్చుకోవడమన్న వారి ఉత్పత్తి

లక్ష్యం — యిదే భూమి కౌలు ప్రమాణాన్ని పరిమితంచేస్తుంది — శ్రమ ఉత్పాదకతకు ప్రేరణనివ్వడంలోనూ, దాన్ని పెంచడంలోనూ లేక ఉత్ప త్తికి అవసరమైన కాలాన్ని తగ్గించడంలోనూ విఫలమైంది. ఆచరణలో గ్రామీణ ఉత్పత్తిదార్లలో విస్తృత సంఖ్యాకులు స్వయంపోషక లేక పాక్షిక స్వయంపోషక ఆర్థిక వ్యవస్థను నిలుపుకుంటారు. ఈ వ్యవస్థ చాలా నెమ్మదిగా చిన్న తరహా సరుకు ఉత్పత్తిలోకి అభివృద్ధిచెందుతుంది. ఆర్థిక వ్యవస్థయొక్క వ్యావసాయిక రంగంలో పెట్టుబడిదారీ సంబంధా లకు కొద్ది గొప్పల్లో విస్తృతమైన ప్రాతిపదిక ఏర్పడేందుకు యీ దశ అవసరం.

స్వయంపోషక ఆర్థిక వ్యవస్థ ప్రాబల్యం కలిగివుండి, సరుకు మార కాలు అభివృద్ధిచెందకుండా వుండే ఫ్యూడల్ ఉత్పత్తి విధానంలో రైతు లేక చిన్న కౌలుదారు దోపిడి ఫ్యూడల్ ప్రభువు వ్యక్తిగత వినిమయానికీ, అతని పరివారపు వినిమయానికీ అవసరమైన ఉత్పాదితపు పరిమాణంలో వ్యక్తమవుతుంది. తత్పర్యవసానంగా, కౌలు రూపంలో రైతు కనుతం నుంచి తియ్యగల పంట మొత్తానికి స్వయంపోషక ఆర్థిక వ్యవస్థ తన సొంత పరిమితులు నెలకొల్పుతుంది.

భారతీయ గ్రామాల్లో సాంప్రదాయిక ఆధిపతులు — ఆర్థిక, రాజ కీయ స్థానాలు నిలుపుకుంటున్న ఫ్యూడల్ భూస్వాములు, వర్తకులు, వడ్డీ వ్యాపారులు, పెట్టుబడిదారీ సంబంధాల అభివృద్ధితోబాటు తలెత్తు తున్న నూతన అగ్రగణ్యులు — రైతులు పండించిన ఆదనపు పంటలో అధికతర భాగాన్ని భుక్తం చేసుకుని, అమ్ముకుంటారు. దోపిడీదారుల చిన్న బృందం వ్యవసాయ పంటల ఉత్పత్తి, అమ్మకాలపైన గుత్త పెత్తనం చలాయిస్తుంది. తద్వారా అది, ముడి పదార్థాల, ఆహార పదా ర్థాల ధరల మార్పులమీద గణనీయమైన ప్రభావం కలిగిస్తుంది. ఈ బృందం వ్యవసాయ ఉత్పత్తి, మారకాలపైన ప్రభుత్వ నియంత్రణ ప్రయత్నాలన్నింటినీ క్రియాశీలంగా వ్యతిరేకిస్తుంది.

ఈవిధంగా, భారతీయ గ్రామసీమలో వ్యవసాయ సంబంధాల్లో, గ్రామాల వెలుపల వున్న సరుకు—డబ్బు సంబంధాల సుడిగుండంలోకి యీడ్వబడిన చిన్న రైతు క్షేత్రాల్లో పెద్ద స్థాయిలో స్వయంపోషక ఆర్థిక వ్యవస్థ నిలిచివుండటం కనిపిస్తుంది. రైతు ప్రధానంగా తన పంటను తన సొంత వినియోగంకోసమూ, తన కౌలు చెల్లింపుకోసమూ, వడ్డీ వ్యాపారులకు తన బాకీల చెల్లింపుకోసమూ పండించగా, బడా ఎస్టేటు యజమానులు రైతు పంటని, దాని మారకపు విలువ దృష్ట్యా చూస్తారు. వారి ధన దాహానికి హద్దు వుండదు. ఎస్టేటుదారులకు రైతుల పంటలో దాని మారకపు విలువ దృష్ట్యా మాత్రమే ఆసక్తి వుంటుంది. కాగా, సాధ్యమైనంత పొందాలన్న వారి కోర్కెనీ, పెరుగు తున్న దోపిడి స్థాయినీ అదే నిర్ణయిస్తుంది.

భారతదేశపు బహుళ రంగ సాంఘికార్థిక నిర్మాణంలో పెట్టు బడిదారీ సంబంధాలకు ప్రాబల్యంలేని దృష్ట్యా, జాతీయార్థిక వ్యవస్థ యొక్క అతిపెద్ద రంగమైన వ్యవసాయంలో లాభాలు ఉత్పత్తి నియంత్రణ కర్తలుగా పనిచెయ్యవు. గ్రామసీమలో ఉత్పత్తిని నియంత్రించేది భూమి కౌళ్లే గాని, లాభాలు కాదు. కాగా, లాభాలపై గరిష్ఠ పరిమితిని విధిం చేది కూడా భూమి కౌళ్లే.

పెట్టుబడిదారీ వ్యవసాయ సంబంధాలు ప్రాబల్యంలోకి వచ్చిన ప్పుడు, లాభాలే భూమి కౌళ్లపైన గరిష్ఠ పరిమితిని విధిస్తాయి. అందుచేత కౌళ్ల రేటు పెట్టుబడి చలామణీనిబట్టే, దాన్ని తిరిగి పొందడంబట్టే నియంత్రితం చెయ్యబడుతుంది. ఈ విషయం, అన్ని సాంఘిక, ఆర్థిక నిర్మాణాలూ పెట్టుబడి చలనానికి లోబడివుండటాన్ని వ్యక్తంచేస్తుంది.

గ్రామీణ అగ్రగణ్యులు ఉత్పత్తిని అదుపుచెయ్య కలిగివుండి, ఉత్పత్తి వ్యయంతో ప్రసక్తి లేకుండా, మిగులులో గణనీయమైన భాగాన్ని, తరచు అవసర భాగాన్ని, చిన్న రైతుల, కౌలుదార్ల పంటని సొంతపరచుకొం

టుంది కనుక, అది అతి తరచుగా తన ఆదాయంలో అధికతర భాగాన్ని లాభాల రూపంలో కాక, పెట్టుబడిదారీ పూర్వ కౌలు రూపంలో లేక అప్పులపై వడ్డీ రూపంలో పొందుతుంది. రైతు, కౌలుదారు కమతాల నుంచి గుంజబడే ఆదాయాలు రకంలోనూ, మూలంలోనూ పెట్టుబడిదారీ పూర్వ తరహావి. కాని, వాటి ప్రమాణం రీత్యా అవి సాధారణంగా పెట్టుబడిదారీ తరహా క్షేత్రాలనుంచి వచ్చే లాభాల మొత్తంకంటె బాగా ఎక్కువ వుంటాయి. ఇక్కడ మరో విషయం కూడా గమనించాలి: మిగులు పంట యీవిధంగా సొంతం చేసుకోబడినప్పుడు, "ఉత్పత్తి వ్యయం" అన్న అంశం దాదాపు వుండదు. ఆదాయపు రేటును లాభపు రేటుతో సైతం పోల్చడం సాధ్యం కాదు. ఈ పరిస్థితుల్లో, అభివృద్ధి దశను గుర్తుంచుకొనే అనుకోండి, పెట్టుబడిదారీ తరహాలో నిర్వహింపబడే వ్యవసాయ క్షేత్రాలు తరచు "సాంప్రదాయిక" ఉత్పత్తి రూపాలకంటె, చిన్న రైతు కమతాల అదనపు పంటను సొంతం చేసుకోవడంకంటె, పొందడంకంటె తక్కువ లాభదాయకంగా వున్నట్లు నిరూపితమైంది.

భారతదేశ వ్యవసాయ వ్యవస్థలోని యీ అంశాలన్నీ కల్పించే పరిస్థితి, పెట్టుబడిదారీ సంబంధాలు నెలకొల్పబడి, ఆర్థిక వ్యవస్థయొక్క అన్ని రంగాల్లోనూ పనిచేస్తున్న దేశాల్లోని పరిస్థితికి భిన్నమైనది. కౌళ్లు లాభాలకంటె అధికంగా ఉంటాయని కాక, కౌళ్లమీద మిగులు రూపంలో మాత్రమే లాభాలు రాగలవు.

ఈ పరిస్థితి భారతదేశపు వ్యవసాయ రంగంలో పెట్టుబడిదారీ వ్యవస్థ అభివృద్ధిమీద తీవ్ర అవరోధాలు విధిస్తుంది. అదనపు శ్రమ రూపంలో లాభాలు, అధికాంశపు చిన్న రైతు కమతాల్లో వున్న ఉత్పత్తి, లాభాల పరిస్థితులచేత పరిమితం చెయ్యబడ్డాయి. వ్యవసాయంలో సృజించబడే అదనపు ఉత్పాదితంలో అత్యధికాంశం భూమి కౌలు, బాకీలపైన వడ్డీ రూపాన్నీ, తదితర పెట్టుబడిదారీ పూర్వ స్వాయత్త రూపాలనూ

తీసుకొంటుంది. ఇది భారతదేశపు గ్రామసీమలో పెట్టుబడి చొరబాటు ప్రమాణాన్ని మాత్రమే కాకుండా, దాని పునరుత్పత్తి సాధారణ పరిస్థితు లను కూడా ప్రతిబింబిస్తుంది.

ఆర్థిక వ్యవస్థయొక్క మిక్కిలి పెద్ద రంగంలో సంచయనం పెట్టుబడిదారీ పూర్వ నిర్మాణాల ప్రాతిపదికమీద జరుగుతుంది కనుక, అంతిమ విశ్లేషణలో అది భూస్వాముల వివిధ సాంఘిక బృందాల చేతుల్లోనూ, అలాగే వర్తకుల, బ్లాక్ మార్కెటీర్ల, వడ్డీ వ్యాపారుల చేతుల్లోనూ సాంద్రీకరింపబడిన డబ్బు అతీత సంచయనాల్లోకి మార్చ బడింది. అత్యధిక సందర్భాల్లో అది ఉత్పాదకోపయోగానికి ఎన్నడూ వినియోగింపబడదు. అది పరభాగ్యోపజీవన వినిమయ రంగాన్ని కేవలం విస్తరిస్తుంది, అంతమాత్రమే. ఇది పెట్టుబడిదారీ సంచయనావకాశాన్ని మాత్రమే కాకుండా, అన్ని రకాల సంచయనావకాశాన్నీ లుప్తం చేస్తుంది. ఈ దృష్ట్యా, పెట్టుబడిదారీ పూర్వ కౌలూ, తదితర సమాంతర ఆదాయ రూపాలూ (గణనీయమైన మెలికలు లేకుండా) పెట్టుబడి దారీ సంచయనపు ప్రాథమిక సంచయన రూపంగా పరిగణింపబడజాలవు. ఉత్పత్తిదారులనుంచి నేరుగా ఆదనపు ఉత్పాదితంలో ఒక భాగాన్ని పరి హారం చెల్లించకుండా సొంతపరచుకోవడం ద్వారా గ్రామసీమలో సృష్టింపబడిన ధన, పాదార్థిక వనరుల అతీత సంచయనపు రేటు, పెట్టుబడిదారీ పూర్వ భూమి కౌలు, రుణాలపై వడ్డీ సంచయనమూ, వాటిని పెట్టుబడిలోకి మార్చేందుకు అవసరమైన సామాజిక పరిస్థితుల స్థాపనకంటె చాలా వేగంగా అభివృద్ధిచెందుతున్నాయి. పారిశ్రామిక పెట్టు బడి సంచయనపు పెరుగుదల రేటు తక్కువగా ఉన్నందువల్ల (గ్రామ సీమలో కాదు) కాలం చెల్లిపోయిన పెట్టుబడి రూపాల్లో అతీత సంచ యనం పెట్టుబడిదారీ సంచయనపు కక్ష్యలోకి చాలా తక్కువగా లేబడింది.

పెట్టుబడిదారీ ఉత్పత్తి విధానం తన పురోగతిని ఆటంకపరు

స్తున్న ఆర్థిక నిర్మాణాలతో జరిపే తీవ్ర పోరాటంలో — రాజకీయ, ఆర్థిక రంగాలు రెండింటినీ ఆవరించే పోరాటంలో — తనని తాను స్థిరపరచుకోవలసి ఉంటుంది. ప్రాబల్యంలో వున్న చారిత్రక పరిస్థితుల మూలంగా, పాత ఉత్పత్తి విధానపు అవశేషాలతో పెట్టుబడిదారీ వ్యవస్థ రాజీపడవలసిన దేశాల్లో, ఆర్థిక వ్యవస్థలోను, రాజకీయాల్లోను అభివృద్ధినిరోధక లక్షణాలు మిగిలి ఉన్నాయి. అంతే కాకుండా, వాటి ఆర్థిక పురోగతి వేగం కూడా తక్కువగా ఉంది. కాగా, పెట్టుబడిదారీ యూరప్‌లో అవి చాలా కాలంపాటు రెండవ రకం రాజ్యాలుగా ఉండిపోయాయి.

స్థిరమైన పెట్టుబడిదారీ పూర్వ ఆర్థిక రూపాలు నిలిచివుండటం, విభిన్న పరిణతి స్థాయిలు కలిగిన పెట్టుబడిదారీ రూపాలు ఉండటం — ఇవన్నీ వర్ధమాన దేశాల్లో పారిశ్రామిక పెట్టుబడి నాణ్యతనీ, సంపుటినీ బహుళ రంగ ఆర్థిక వ్యవస్థ సంచయనపు, విస్తృత పునరుత్పత్తి విశిష్ట లక్షణాలనూ ముందే నిర్ణయిస్తాయి.

గ్రామసీమలో సాపేక్షంగా చిన్న తరహా ఉత్పాదక మదుపుల దృష్ట్యా, అధిక దోపిడి రేటు పారిశ్రామిక పెట్టుబడి సంచయనపు తగ్గు రేటును నిర్ణయిస్తుంది. అంటే, పెట్టుబడిదారీ నిర్మాణాల అభివృద్ధికి ప్రేరణలను అది నిరోధిస్తుంది లేక తగ్గిస్తుంది. ఉన్నత ఆదాయపు రేటు, దానికి సంబంధించిన అత్యధిక సంచయనం, పెట్టుబడిదారీ రంగంలో సంచయన పరిమితులపైనా, పునరుత్పత్తి రేటుపైనా ప్రతికూల ప్రభావం కలిగి వుంటుంది. అది ఆదిమ రూపంలోని సంపదలకోసం — బంగారం, వజ్ర వైఢూర్యాలు, మొదలైనవాటికోసం — నిర్దిష్టమైన అధికతర మదుపు డిమాండును సృష్టిస్తుంది, వర్తకం, బ్లాక్ మార్కెటింగ్, చట్టా వ్యాపారం, కౌలు దోపిడి రంగంలోకి, అంటే పారిశ్రామిక పెట్టుబడికి బదులు పెట్టుబడిదారీ పూర్వ సంచయన రంగాన్ని విస్తృతం చేసే మాదిరి ఆర్థిక కార్యకలాపాల రంగంలోకి అన్ని

నగదు సంచయనాలనూ (అదనపు విలువ భాగంతోబాటు) లాగుతుంది.

ఉత్పత్తి మారకాల రంగంలో పెట్టుబడిదారీ పూర్వ దోపిడి పద్ధతుల ద్వారా పొందే అధిక స్థాయి ఆదాయం పారిశ్రామిక పెట్టుబడి మదుపుకి ఒక మాదిరి ఆటంకంగా పరిణమిస్తుంది. లాభాలు అనేక సందర్భాల్లో పెట్టుబడిదారీ పూర్వపు కౌలుకంటె లేక రుణాలపై వడ్డీకంటె తక్కువగా ఉంటాయి.

ఈ వాస్తవాన్ని గమనించి భారతీయ అర్థశాస్త్రవేత్త పట్నాయక్ అమాదిరి ఉన్నత స్థాయి పెట్టుబడిదారీ పూర్వ కౌలు రూపాలు పెట్టుబడిదారీ తరహా ఉత్పత్తి ఆవిర్భావ అభివృద్ధులకు గట్టి ఆటంకంగా రూపొందుతాయని చెప్తాడు.* ఈ పరిస్థితుల్లో, ఆధునిక భారతదేశపు వ్యవసాయ ఆర్థిక వ్యవస్థయొక్క ఒక విశ్లేషణలో ఆయన ఇలా పేర్కొంటాడు: ఒక నిర్దిష్ట సాంకేతిక మెరుగుదలల సంచయన పాటవం ఇంతకుముందే పూర్తిగా వినియోగించబడినట్లయితే ఉత్పాదక పెట్టుబడిదారీ మదుపులను సమంచెయ్యాలని లేక తగ్గించాలని సూచించవచ్చు. పెట్టుబడి సాంకేతిక సంపుటి విశేషాభివృద్ధి, శ్రమ ఉత్పాదకత, ఉత్పత్తి పరిమాణాల పెరుగుదల పెట్టుబడిదారీ పారిశ్రామిక సంస్థలోని ఉత్పత్తి ఖర్చులను, ఉత్పత్తి ఖర్చులతో ప్రసక్తి లేకుండా నిర్వహింపబడే సాంప్రదాయిక పారిశ్రామిక సంస్థల ఉత్పత్తితో పోటీ పడగల స్థాయికి తగ్గించగలిగితే సొంతపరచుకోవడం పెట్టుబడిదారీ పూర్వ రూపం తీసుకున్నప్పుడు, పెట్టుబడిదారీ మదుపులు సాధ్యమవుతాయి. ఎన్నో సాంకేతిక మెరుగుదలలు, శ్రమ ఉత్పాదకత పెరుగుదల జరిగినా కూడా పెట్టుబడిదారీ పరిశ్రమల ఉత్పాదితం పెట్టుబడిదారీ పూర్వ రంగంనుంచి మార్కెట్లోకి వచ్చే వ్యవసాయ క్షేత్ర సరుకులతో పోటీ పడలేకపోయినట్లయితే, కొత్తగా తలెత్తిన పెట్టుబడిదారుల సంచ

---

* *Economic and Political Weekly*, Septemper, 1976.

యనాలు వడ్డీ వ్యాపార లావాదేవీలు, బ్లాక్ మార్కెటింగ్, వగైరాల్లోకి మార్చబడతాయి. పెట్టుబడిదారీ, పెట్టుబడిదారీ పూర్వ రూపాల అత్యంత పరస్పర విరుద్ధమైన యీ ప్రతివర్తనలో పెట్టుబడిదారీ సంచయన సమస్య పరిష్కరింపబడుతోంది. అది గ్రామసీమ స్థాయిలోనే కాకుండా జాతీయ స్థాయిలో కూడా పరిష్కరింపబడుతోంది. ఎందుకంటే, భూమి స్వామ్యం, దానితో ముడిపడిన పెట్టుబడిదారీ పూర్వపు కౌలు, దానికి తోడు వడ్డీ వ్యాపారం, తదితర అధిక లాభార్జన లావాదేవీల్లో పట్టణాల్లో అమల్లోవున్న రూపాల్లో పనిచేసే పారిశ్రామిక పెట్టుబడియొక్క ఆ భాగం కూడా యిమిడివుంటుంది.

తత్పర్యవసానంగా, మొత్తంగా దేశంలోనూ, ప్రత్యేకించి వ్యవసాయంలోనూ మొత్తం సాంఘికార్థిక పరిస్థితులు భూమిపై స్వామ్యాన్ని ఆస్తిపర వర్గాలు సంచితంచేసిన పెట్టుబడి వినియోగ రూపాన్ని ఆసక్తికరము, లాభదాయకము చేస్తున్నాయి. అది భూమిపై వ్యక్తిగత స్వామ్యాన్నీ, దాని ప్రాతిపదికపై అభివృద్ధిచెందే ఉన్నత స్థాయి దోపిడినీ నిలిపివుంచేందుకు, పెంచేందుకు సహితం దోహదం చేస్తుంది. విస్తృత స్వాధీనాలు రైతు ఆర్థిక వ్యవస్థను దెబ్బతీసి, వడ్డీ వ్యాపార పెట్టుబడి అభివృద్ధికి వస్తుపర ప్రాతిపదికను కల్పిస్తాయి. ఈ పెట్టుబడి వ్యావసాయిక భారతదేశపు పునరుత్పత్తి యంత్రాంగ ఆవశ్యక అంశీభూత భాగమయి, ప్రధాన ఉత్పత్తిదారుచేత సాగింపబడే దోపిడి భారాన్ని అపారంగా పెంచుతుంది. తత్ఫలితంగా, ప్రాకృతిక వనరులు దారుణంగా కొల్లగొట్టబడుతున్నాయి, మానవ శ్రమపైన విపరీతమైన భారం మోపబడుతోంది. అది శ్రమ ఉత్పాదకత తరుగుదలకు, నూతన ఉత్పత్తి రూపాల అత్యంత మందగతి అభివృద్ధికి దారితీస్తుంది. ఈ క్రమాలు సుదీర్ఘ వ్యావసాయిక సంక్షోభానికి, దేశపు యావత్తు సామాజికార్థిక పరిణామంపైన, జాతీయ ప్రభుత్వపు సాంఘికార్థిక సంస్కరణల ఫలదాయకతపైన ప్రభావం కలిగించిన సంక్షోభానికి పరిస్థితులను కల్పిస్తాయి.

అందుకని, స్వాతంత్ర్య సాధనానంతరం జాతీయ పునర్నిర్మాణం ప్రథమంగానూ, ప్రధానంగానూ వ్యవసాయ సంస్కరణలతో మొదలైంది.

2. వ్యవసాయ సంస్కరణలు

భారతదేశంలో వ్యావసాయిక వ్యవస్థ సంస్కరణ ప్రారంభింపబడి సుమారు పావు శతాబ్దానికి పైగా గడిచింది. అయితే అదింకా పూర్తి కాలేదు.

స్వతంత్ర భారతదేశపు వ్యవసాయ విధాన సూత్రాలు ఆదిలో మొదటి పంచవర్ష ప్రణాళికలో (1950/51–1955/56) రూపొందించబడ్డాయి. ఆ ప్రణాళిక, దేశానికి ఆహార, ముడి పదార్థాల అవసర సరఫరాలను రూఢిచేసేందుకుగాను ఆర్థికాభివృద్ధికి వున్న ఆటంకాలను తొలగించే లక్ష్యాన్ని పెట్టుకుంది. దోపిడిని తొలగించడం, వ్యవసాయదారులందరికీ సమాన హక్కులనూ, అవకాశాలనూ రూఢిచెయ్యడం అనే సాంఘిక లక్ష్యం కూడా సూత్రీకరించబడింది. భూమి సంబంధాల సమస్య ఒక ముఖ్య జాతీయ సమస్య, అందుచేత వ్యవసాయ వ్యవస్థ శ్రమ ఫలితాలు భూమి దున్ని సాగుచేసినవాళ్లకు దక్కే విధంగా ఉండాలన్న మూల సూత్రంనుంచి యీ పథకం తలెత్తింది.

ప్రభుత్వ పెట్టుబడి మదుపుల మొత్తంలో 34 శాతానికి పైగా వ్యావసాయికోత్పత్తి అభివృద్ధిలోకీ, గ్రామాల, నీటి పారుదల సౌకర్యాల పునర్నిర్మాణంలోకీ మళ్లింపబడాలని ప్రణాళిక ఉద్దేశించింది.

కేంద్ర ప్రభుత్వంచేత జాతీయ స్థాయిలో ఏ సాధారణ భూమి చట్టమూ రూపొందించబడలేదు. తమ తమ రాష్ట్రాలకు భూమి చట్టాలను రూపొందించుకొని, వాటిని ఆమోదించి, అమలుబరిచే హక్కు ఆయా రాష్ట్రాల శాసన నిర్మాణ, కార్యనిర్వాహక సంస్థలకు వదిలెయ్యబడింది. రాష్ట్ర ప్రభుత్వాలూ, వాటి శాసన సభలూ

భూస్వాములతో సన్నిహితంగా ముడిపడివున్న కారణంగా, యీ చర్య తక్షణ ప్రభావం వ్యవసాయ సంస్కరణల వేగంపైనా, ప్రగాఢత్వం పైనా పడింది.

పంచవర్ష ప్రణాళిక సిఫారసులకు అనుగుణంగా, ప్రణాళికా కాలం చివర అన్ని రాష్ట్రాల్లోనూ ఆమోదింపబడిన భూమి చట్టాల్లో యీకింది చర్యలు తలపెట్టబడ్డాయి: వలస పాలన కాలంనుంచి సంక్రమించిన వంశ పారంపరిక జమీందారీ వ్యవస్థ రద్దు, భూమి కౌళ్ల తగ్గింపు, కమతాల ఏకీకరణ ద్వారా వ్యవసాయపు పునర్నిర్మాణం, ఉత్పత్తిలో సహకార సూత్రాలనూ, సామాజిక స్వయంపాలన సహకార రూపాలనూ అభివృద్ధిచెయ్యడం, భూకమతాల గరిష్ఠ పరిమితి విధింపు, మిగులు భూములను భూమిలేని కౌలుదార్లకు లేక చిన్న కమతాలు వున్న రైతులకు బదిలీ చెయ్యడం, వశంచేసుకున్న భూమికి చట్టం ప్రకారం నష్టపరిహారపు చెల్లింపు. 1956–57 నాటికి భారతదేశంలో జమీందారీ వ్యవస్థ అమల్లో వున్న అన్ని రాష్ట్రాలూ ఉత్పత్తిదారులకీ ప్రభుత్వానికీ మధ్య దళారీలు – అంటే, జమీందార్లు, జాగీర్దార్లు, తాలూక్దార్లు, మాల్‌గుజార్లు, వగైరాలు – భూమి కలిగివుండే హక్కును రద్దు చేస్తూ చట్టాలు చేశాయి. ఈ చట్టాలు దేశంలో రైత్వారీ పద్ధతి అమల్లో వున్న రాష్ట్రాలను, అంటే రైతులకు వారి భూములపైన లాంఛనగతమైన హక్కు వున్న ప్రాంతాలను ప్రభావితం చెయ్యలేదు. అయితే వాస్తవంలో, దేశపు ఆ ప్రాంతంలో కూడా భారీ భూస్వామ్యం దీర్ఘ కాలంపాటు అమల్లో వుంది, రకరకాలుగా రైతులను శృంఖలాబద్ధంచేసే కౌళ్ళూ, అతి చిన్న, బుల్లి కమతాలూ ఉన్నాయి.

జమీందారీ వ్యవస్థనీ, అదే మాదిరి యితర వ్యవస్థలనీ రద్దుచేసే చట్టాల మేరకు, భూమిని సాగుచెయ్యకుండా, కౌలు మొత్తాలను మాత్రమే వసూలు చేసుకొనేవారినుంచి భూమి వశంచేసుకోబడింది. అది ప్రభుత్వ ఆస్తి చెయ్యబడింది. భూమిని సాగుచేసే కౌలుదార్లకు,

వారి వెనకటి ప్రతిపత్తి, నష్టపరిహార మొత్తం ప్రాతిపదికపైన భూమి కౌలు హక్కుకి హామీ కల్పించబడింది. జమీందార్లకి భూమి కౌలు స్థానంలో భూమి పన్ను ప్రవేశపెట్టబడింది. పన్ను పరిమాణం సంస్కరణకి పూర్వం వున్న కౌలు ప్రాతిపదికమీద నిర్ణయింపబడింది.

అధికారిక గణాంక లెక్కల ప్రకారం రెండు కోట్లమందికి పైగా జమీందారీ భూముల కౌలుదార్లు 1961 నాటికి ప్రభుత్వంతో ప్రత్యక్ష సంబంధాలు నెలకొల్పుకున్నారు, అంటే వాళ్లు తమ భూములకు యజమానులయ్యారు. సంస్కరణల అమలు కాలంలో జమీందారులూ, వారి బాపతువారూ, వారి స్వామ్యంలో వున్న భూమిలో 60 శాతం పైగా కోల్పోయారు.

రైత్వారీ ప్రాంతాల్లో బడా భూస్వాములమీద వ్యవసాయ చట్టాలు చాలా తక్కువ ప్రభావం కలిగించాయి. భూ సంస్కరణలు ప్రధానంగా కౌళ్లపైన గరిష్ఠ పరిమితి విధించేందుకూ, కౌలుదార్లకు కౌలు కాల పరిమితి విషయంలో వివిధ హామీలు కల్పించేందుకూ ఉన్ముఖం చెయ్యబడ్డాయి. చట్టం ప్రకారం కౌలు, నీటిపారుదల సౌకర్యాలు వున్న భూముల విషయంలో మొత్తం పంటలో నాల్గవ వంతునూ, తదితర భూముల విషయంలో మూడవ వంతునూ మించరాదు. భూస్వామికి ఉప కౌలు, వివిధ రూపాల గుప్త చెల్లింపూ నిషేధింపబడ్డాయి.

నష్టపరిహారపు మొత్తం సుమారు 700 కోట్ల రూపాయలుగా అంచనావెయ్యబడి, నగదు రూపంలోనూ, బాండ్ల రూపంలోనూ చెల్లింపబడింది. ఈ చెల్లింపుల భారం చిన్న కమతందార్లపైన పడి, ఆ కారణంగా దేశపు సాంఘికాభివృద్ధి ఆలస్యమైంది. ఆ సంస్కరణలు గ్రామాల్లో ప్రధాన సమస్య అయిన భూమి పునర్విభజనను పరిష్కరించలేకపోయాయి. జమీందారీ వ్యవస్థ రద్దు లక్ష్యం పెట్టుబడిదారీ పద్ధతులను వినియోగించే వ్యవసాయదారులను సృష్టించడం. జమీందారు కొంత భూమిని నిలుపుకోవడాన్నీ, తన కుటుంబ సభ్యుల సాయంతో

లేక కూలీలను పెట్టుకొని అతను భూమిని సాగుచేసుకోగలిగితే కౌలు దార్లను వదిలించుకోవడాన్నీ చట్టం అనుమతించింది.

భూమి స్వామ్యంపైన పరిమితులు పెద్ద తోటలకు, ప్రత్యేకమైన క్షేత్రాలకు (పాడి, పళ్ళు, పశువులు), పెద్ద మొత్తాల్లో పెట్టుబడి మదుపుపెట్టబడిన క్షేత్రాలకూ వర్తింపచెయ్యబడలేదు.

సంస్కరణ క్రమంలో చాలా పెద్ద సంఖ్యలో కౌలుదార్లు తొల గింపబడ్డారు. తమ భూములను నిలుపుకునేందుకుగాను భూస్వాములు తమ భూములను తమ బంధువులకీ, తరచు తమ చెప్పుచేతల్లో ఉండే వాళ్లకీ పంచారు.

పెద్దపెద్ద భూఖండాలు, అందునా మిక్కిలి సారవంతమైన భూములు నిలువుకున్న మీదట బడా ఎస్టేటు యజమానులు సహజంగానే నూతన వ్యవసాయ పద్ధతులను వెంటనే ప్రవేశపెట్టలేకపోయారు. కాగా, భూమి పాలి రైతులచేతనే సాగుచెయ్యబడుతూ వచ్చింది. గుప్త కౌళ్ళు సర్వ సామాన్య విషయమయ్యాయి. ఇది కౌలుదార్ల పరిస్థితిని మరింత అధ్వాన్నం చేసింది.

వ్యవసాయ సంస్కరణల తొట్టతొలి ఘట్టంలోనే ఒక విషయం నుస్పష్టమైంది. వలస పాలన కాలంనుంచి వారసత్వంగా వచ్చిన సంస్థ లనూ, భారతీయ సమాజపు సాంఘికార్థిక నిర్మాణాలనూ అలాగే వుంచి నంత కాలమూ గ్రామ జీవిత పునర్నిర్మాణాన్ని సాగించడం దుస్సాధ్యమ న్నదే ఆ విషయం.

భారతదేశ ఆర్థికాభివృద్ధికోసం రూపొందించబడిన రెండవ పంచ వర్ష ప్రణాళిక (1955/56–1960/61) దేశపు పారిశ్రామికీకరణ ఆరంభాన్నీ, ఆర్థికాభివృద్ధిలో అనుపాతాల మార్పునూ ఉద్దేశించింది. ఈ ప్రణాళిక కౌలుదార్ల, సన్నకారు ఆస్తిపరుల హక్కుల పరిరక్షణను వ్యవ సాయ విధానపు ప్రధాన లక్ష్యంగా నిర్దేశించింది. వ్యవసాయ సంస్కరణల యీ ఘట్టంలో భూమి స్వామ్యంపైన గరిష్ఠ పరిమితిని విధించేం

దుకు ప్రయత్నాలు జరిగాయి. మొదటి పంచవర్ష ప్రణాళిక యీ విషయంలో కొన్ని సిఫారసులు చేసింది. అయితే రెండవ ప్రణాళికలో, కౌల్దారీ రైతులను భూములనుంచి తొలగించడాన్నీ, బినామీ భూ పునర్వి భజననూ నివారించేందుకుగాను "భూమి స్వతంత్ర సేద్య" భావనలో మరింత కచ్చితత్వం ప్రవేశపెట్టబడింది. అయితే, "దున్నేవాడికే భూమి" అన్న వినాద లక్ష్యం సాధింపబడలేదు.

వ్యవసాయ పునర్నిర్మాణంకోసం ఒక దశాబ్దంపాటు జరిగిన ప్రయత్నాలను సమీక్షిస్తూ భారతదేశపు మూడవ పంచవర్ష ప్రణాళిక (1960/61–1965/66) కౌలుదార్ల సంక్షేమంకోసం చెయ్య బడిన చట్టం ఆచరణలో ఆశించినంతగా సత్ఫలితం యివ్వలేదని పేర్కొంది. అందుకనే మూడవ ప్రణాళిక, భూములపైన హక్కులను కౌలుదార్లకు బదిలీచేసే కార్యక్రమాన్ని పూర్తిచెయ్యాల్సిన అవసరంనుంచి బయల్దేరి, యీ సందర్భంగా, కౌలుదార్లచేత సాగుచెయ్యబడే భూమి అంతనీ జాతీయం చేసి, తర్వాత దాన్ని కౌలుదార్లకు బదిలీచెయ్యాలనీ లేక నష్టపరిహార చెల్లింపు ప్రాతిపదికపైన రైతులకు ఆస్తిగా దఖలు పరచాలనీ ప్రతిపాదించింది. తద్వారా, భూమికి సంబంధించిన ప్రధాన సమస్య యింకా అపరిష్కృతంగానే ఉండిపోయిందన్న విషయం గుర్తింప బడింది.

నాల్గవ (1969–1974), ఐదవ (1974–1979) పంచ వర్ష ప్రణాళికలు వ్యవసాయ చట్టాల సాంఘిక లక్ష్యాల సాధన విషయంలో మొత్తం కర్తవ్యాలను గ్రామసీమలో సాంఘిక న్యాయ సాధన భావం రూపొందించి, ఆ కర్తవ్యాలను వ్యవసాయ పునర్నిర్మాణపు ఆచరణపర సమస్యల పరిష్కారావసరంతో సన్నిహితంగా ముడిపెట్టాయి.

నాల్గవ ప్రణాళిక హక్కులు లేని కౌలుదార్ల పరిస్థితి చాలా అస్థిరంగా వుందనీ, భూమి యింకా కౌల్దారీ పద్ధతిలోనే వినియోగిం చుకోబడుతోందనీ పునరుద్ఘాటించింది.

జనతా పార్టీ అధికారంలో వున్న స్వల్ప కాలంలో, దేశపు సాంఘి కార్థిక అభివృద్ధి వ్యూహపు ప్రధాన సూత్రాలు ఆరవ పంచవర్ష ప్రణా ళిక (1978–1983) ముసాయిదాలో రూపొందించబడ్డాయి. వ్యవ సాయ పునర్నిర్మాణ సమస్యలపట్ల అది స్పష్టంగా ఆచరణాత్మకమైన సరళీకృతమైన వైఖరినీ, తీవ్రమైన సామాజిక సమస్యలను దాటవేసే వైఖరినీ వెల్లడించింది.

అరవ పంచవర్ష ప్రణాళిక ముసాయిదా వ్యవసాయ సంస్కరణల ప్రధాన లక్ష్యం సామాజిక న్యాయం పేర అభివృద్ధియేనని పేర్కొంది. రాబోయే పదేళ్ల కాలంలో (I) దేశంలో పూర్తి ఉద్యోగ కల్పన సాధింప బడుతుందనీ, దారిద్ర్యం నిర్మూలింపబడుతుందనీ ప్రకటించింది. అయితే ఆ ముసాయిదా, వ్యవసాయ విధానపు ప్రధాన దిశను సూత్రీకరించకుండా అస్పష్టంగా వదిలేసింది. శ్రమకి న్యాయమైన ప్రతిఫలం యిచ్చే పద్ధతిలో స్థిరమైన ఉద్యోగాల కల్పనపైన వక్కాణింపు యివ్వబడుతుందని మాత్రమే అది పేర్కొంది.

ప్రణాళికా కర్తలు అభివృద్ధి వ్యూహం నీటిపారుదల సౌకర్యాల భూ, జల, తదితర స్థానిక వనరుల అత్యధిక వినియోగాన్ని అత్యంత త్వరితంగా, అత్యధిక స్థాయిలో అభివృద్ధిచేసే దిశగా ఉన్ముఖంచెయ్యబడాలని భావిం చారు. పెట్టుబడి మదుపు, ఉద్యోగ కల్పనలను పెంచేందుకుగాను గ్రామ సీమలో రకరకాల క్షేత్రాలను వెలకొల్పాలని, మరోలా చెప్పాలంటే, వ్యవసాయ క్షేత్రాలను, పశు క్షేత్రాలను, ఆటవీ, మత్స్య కేంద్రాలనూ వెలకొల్పాలని ప్రతిపాదించబడింది. గ్రామాల్లోని మిక్కిలి పేద విభాగాల ప్రయోజనాలను కాపాడే విషయంలో ఒక ప్రత్యేక ఏర్పాటు చెయ్య బడింది. అయితే, యీ విషయంలో హామీలేవీ కల్పించబడలేదు. ఆచర ణలో వ్యవసాయ సంబంధాలు, గ్రామసీమలో సాంఘిక మార్పుల రంగాల్లో జనతా పార్టీ గణనీయమైన చర్యలేవీ చేపట్టలేదు.

వ్యవసాయ వ్యవస్థలో సంస్కరణలకు సంబంధించి ప్రణాళికలోని

ప్రత్యేక విభాగం వ్యవసాయ సంస్కరణలను సాధారణ ఆర్థిక వ్యూహంలో ఒక భాగంగానూ, ఉద్యోగావకాశాల పెంపుదల కార్యక్రమంలో అంతర్భాగంగానూ చూడాలని పేర్కొనడం మినహాయించి ముందుకు పోలేదు.

దేశపు ఆర్థిక, సాంఘికాభివృద్ధికోసం 1980–1985 దశలో భారత జాతీయ కాంగ్రెస్ (ఇందిరా గాంధీ) ప్రభుత్వం ఆమోదించిన ఆరవ పంచవర్ష ప్రణాళిక వ్యవసాయానికీ, వ్యవసాయ సమస్యకీ అత్యధిక ప్రాముఖ్యాన్ని ఆపాదించింది. ఈ ఐదేళ్ల కాలంలో వ్యావసాయిక వ్యూహపు ప్రధాన లక్ష్యం. గతంలో సాధింపబడినదాన్నంతనీ సంఘటితం చెయ్యడం, వ్యవసాయ సంస్కరణల అమలును త్వరితం చెయ్యడం, కొత్త టెక్నాలజీని ప్రవేశపెట్టడం, వ్యావసాయికోత్పత్తిలో స్థిరమైన పెరుగుదలను సాధించడం. ఆ ప్రణాళికలో యిలా వక్కాణింపబడింది: ''ఈ లక్ష్యాలను సాధించేటప్పుడు వ్యావసాయిక పెరుగుదలకు సంబంధించిన మౌలికమైన సాంఘికార్థిక పరిమాణాలను మనం పరిగణనలోకి తీసుకోవాలి....''.* ''కౌల్దారీ సంస్కరణలు, పాలు రైతులకు రక్షణ, భూ గరిష్ఠ పరిమితి, భూ ఏకీకరణల''** విషయంలో యితోధిక ప్రగతిని సాధించవలసిన అవసరాన్ని ప్రణాళిక పేర్కొంది.

వ్యవసాయ పునర్నిర్మాణంకోసం విస్తృతమైన కార్యక్రమాన్ని రూపొందించి, ప్రణాళిక గ్రామసీమ సాంఘిక, ఆర్థిక, సాంకేతిక సమస్యలను ఆర్థిక స్వాతంత్ర్యాన్ని స్థిరపరిచేందుకు ఉద్దేశింపబడిన జాతీయార్థిక వ్యవస్థ సాధారణ లక్ష్యాలతో దాన్ని సన్నిహితంగా ముడిపెట్టింది.

ఈ మొత్తం వ్యూహం దృష్ట్యా వ్యవసాయ సంస్కరణల అమలుకీ, వ్యావసాయిక పెరుగుదలకీ సంబంధించిన క్లిష్ట కర్తవ్యాన్ని అమలు

---

* *The Sixth Five Year Plan, 1980—85*, Government of India, Planning Commission, New Delhi, 1981, p. 98.

** *The Sixth Five Year Plan...*, p. 8.

జరపడంతో భారతదేశపు విజయాలనూ, దాని తప్పు అంచనాలనూ మనం పరిశీలిద్దాం. స్వాతంత్ర్యానంతర సంవత్సరాల్లో ప్రధానమైన వ్యావసాయిక సమస్యలు చాలావాటిని పరిష్కరించడంలో భారతదేశం సాధించిన ప్రగతి తక్కువేమీ కాదు. నూతన యంత్రాల, ఎరువుల వినియోగం పెరిగింది. విత్తనాలు మెరుగుపరచబడ్డాయి. కొన్ని సాంఘిక మార్పుల అమలుకు జరిపిన కృషి, అలాగే ధరల విధానంలో, ఆహార నిల్వల ఏర్పాటు, పంపిణీ వ్యవస్థ మెరుగుదల దిశగా జరిగిన కృషి నిష్ఫలం కాలేదు.

అయితే, వ్యవసాయ ఆర్థిక వ్యవస్థయొక్క కొన్ని మౌలిక సమస్యలు ఏమాత్రం పరిష్కరింపబడలేదు.

జమీందారీ వ్యవస్థ రద్దు పర్యవసానంగా 2 కోట్లమంది జమీందారీ భూమి కౌలుదార్లు తాము సేద్యంచేసే భూమికి కొన్ని పరిమితులతోనే అయినప్పటికీ, సొంతదారులు అయ్యారు. చిన్న కమతాలు కలిగిన లేక అసలు భూమిలేని విస్తృత రైతు జనసామాన్యానికి సంబంధించినంతవరకు, భూ గరిష్ఠ పరిమితి చట్టాల మేరకు మిగులు భూములను వశంచేసుకుని, వారికి పంచడం ద్వారా, వారి పరిస్థితిని మెరుగుపరచి వుండవలసింది.

1970 దశకం చివరినాటికి, ఎన్నో సంవత్సరాల కృషి జరిగి భూ గరిష్ఠ పరిమితి విధింపబడిన మూలంగా 16 లక్షల హెక్టార్ల మిగులు భూమి అనబడేది విడుదల అయింది. దానిలో సగంకంటె తక్కువ భూమి అసలు భూమిలేని, లేక కొద్ది భూమి వున్న రైతులకి పంచబడింది. 11 లక్షలమందికి పైగా భూమిలేని రైతులు భూఖండాలు పొందారు.*

---

* అదే పత్రం, పేజీలు 114–16.

ఆరవ పంచవర్ష ప్రణాళికలో అంగీకరింపబడినట్లు, యీ పరిస్థితులకి భూ గరిష్ఠ పరిమితి చట్టాన్ని సంతృప్తికరంగా అమలుజరపక పోవడం కారణం. చాలా రాష్ట్రాలు తమ భూమి చట్టాలను కౌలు మొత్తాలను నియంత్రితంచేసే జాతీయ విధానానికి అనుగుణంగా తీర్చి దిద్దవలసివుంది.

వ్యవసాయ సంస్కరణల క్రమంలో మొత్తం పంటలో భూమి కౌలు 1/5 లేక 1/4 వంతును మించివుండరాదన్న జాతీయ పరిమితి యింకా సాధింపబడలేదు.

వ్యవసాయ సంస్కరణల తొలి దశల్లో రాష్ట్ర ప్రభుత్వాలకు భూమి వివరాలను తెలిపే రిజిస్టర్లు లేకపోవడమన్న తీవ్రమైన ఆటంకం ఎదురైంది. ఈ రిజిస్టర్లు లేనిదే గ్రామ ప్రాంతాల్లోని భూములు ఎవరికి చెందినవో, వివిధ సాంఘిక తరగతులకు చెందినవారికి చెందిన భూఖండాల ప్రమాణాలేమిటో నిర్ణయించడం సాధ్యం కాదు. వ్యవసాయ సంస్కరణలు ఆరంభింపబడిన దరిమిలా 25 సంవత్సరాలు గడిచినా కూడా పరిస్థితి మారలేదు. దేశంలో ప్రామాణికమైన భూ వివరాలు తెలిపే, భూ సంస్కరణల ఫలితాల కొన్ని పరిమాణాత్మక అంచనాలను బేరీజువెయ్యడాన్ని సాధ్యం చేసే రిజిస్టర్లు యీనాటికీ లేవు.

భూ సంస్కరణలతోబాటు భారత ప్రభుత్వం గ్రామసీమలో వివిధ సమయాల్లో మరికొన్ని యితర ముఖ్య చర్యలను కూడా చేబట్టింది. గ్రామంలో రైతుకి వేర్వేరు చోట్ల వున్న భూఖండాలను ఒకే కమతంగా ఏకీకరించేందుకుగాను ప్రత్యేక చట్టం ఉద్దేశింపబడింది. ఆయా భూముల సారంలో తేడాల దృష్ట్యా, అనేక సందర్భాల్లో భూముల చిన్న సొంతదారుల ప్రయోజనాల మధ్య ఘర్షణల మూలంగా కూడా ఆయా భూమి మార్పిడుల ఏర్పాటు తేలిక పనేమీ కాదు. అన్ని రాష్ట్రాల్లోనూ భూమిని కౌలుకి యివ్వడాన్నీ, భూమి విభజన మూలంగా లాభసాటి కాని భూ కమతం

ఏర్పడే సందర్భాల్లో భూ విభజనని నిషేధిస్తూ చట్టాలు చెయ్య బడ్డాయి.

అలాంటి చర్యల ద్వారా భారత ప్రభుత్వం రైతుల భూమి మరింతగా ముక్కచెక్కలు కాకుండా నివారించ ప్రయత్నిస్తోంది. అయితే రైతాంగ అధిక జనాభా కారణంగా, ఒకవైపున కమతాల ఏకీకరణ జరుగుతున్నప్పటికీ, మరోవైపున కమతాలు విడిపోయే క్రమం కూడా సాగుతూ వుండటంబట్టి యీ ప్రయత్నాలు నీరుకారిపోతూ, ఏ చట్టాలూ యీ క్రమాన్ని నిరోధించలేకపోతున్నాయి.

ఈ సందర్భంగా ఆరవ పంచవర్ష ప్రణాళికలో యిలా పేర్కొనబడింది: ''ఈ చట్టాల, ప్రత్యేకించి భూ గరిష్ఠ పరిమితి చట్టపు అమలు వేగం మందంగా, లోపాలతో నిండివుంది. ఈ కారణంగా కమతాల స్వరూపంమీద యీ చట్టాల ప్రభావం కనీస స్థాయిలో వుంది.''*

చాలా ఏళ్లపాటు భారతదేశంలో గ్రామ సమాజ వికాస కార్యక్రమంపట్ల విశేష శ్రద్ధ వహించబడింది. వ్యావసాయికోత్పత్తిని పెంచడం, గ్రామసీమలో ప్రజల జీవన ప్రమాణాన్ని మెరుగుపరచడమే దాని లక్ష్యం. ఆ కార్యక్రమంలో యీ దిగువ అంశాలు వున్నాయి: స్థానిక నీటిపారుదల నిర్మాణాలు, భూసారాన్ని పెంపొందించేందుకు చర్యలు, ఎరువులు, మేలు రకం విత్తనాల సరఫరాల పెంపుదల, సేద్యపు పద్ధతులను మెరుగుపరచే చర్యలు, వ్యవసాయంలో నూతన శాస్త్రీయ పద్ధతులను ప్రవేశపెట్టడం. సమర్థ భూ వినియోగం, విత్తనాల అభివృద్ధి, భూసార పరిరక్షణ, వరదల తాకిడినుంచి భూములను కాపాడటం, మొక్కలను తెగుళ్లనుంచి రసాయనిక పదార్థాల ద్వారా కాపాడటం, వ్యవసాయ రంగంలో మరింత విస్తృతమైన శాస్త్రీయ పరిశోధన, వ్యవసాయ శాస్త్రజ్ఞులకు శిక్షణ, పాడి పశు క్షేత్రాల్లో ఉత్పా

* *The Sixth Five Year Plan...*, p. 8.

దకతను పెంపొందించడం, చేపల వేటను, అడవుల పెంపకాన్ని అభివృద్ధి చెయ్యడం, వ్యావసాయిక రుణకల్పన సౌకర్యాలను విస్తృతం చెయ్యడం, సహకార సంఘాల అభివృద్ధి, రైతుల పంటల అమ్మకాలకు అనువైన పరిస్థితులను కల్పించడం అనే అంశాలపట్ల గణనీయమైన శ్రద్ధ వహించబడింది. వ్యావసాయిక-పారిశ్రామిక కాంప్లెక్స్‌లను ఏర్పరచే కర్తవ్యం కూడా ప్రణాళికలో ముందుంచబడింది.

భారతీయ గ్రామాల పునర్నిర్మాణం విషయంలో సహకార సంఘాలకి ఎప్పుడూ విశేష ప్రాముఖ్యం యివ్వబడుతూ వచ్చింది.

తొలి సహకార సంఘాలు భారతదేశంలో యీ శతాబ్ది ఆరంభంలో నెలకొల్పబడ్డాయి. వాటి ఆవిర్భావమూ, గ్రామీణ బూర్జువావర్గపు ఆవిర్భావమూ సహజంగానే ఏకకాలంలో జరిగాయి.

సహకార సంఘాలను వ్యావసాయిక (మొత్తం సహకార సంఘాల్లో 80 శాతం), వ్యావసాయికేతర అనే రెండు రకాలుగా విభజించవచ్చు. సహకార ఉద్యమానికి ప్రాతిపదిక పరపతి సంఘాలు (వ్యావసాయిక సహకార సంఘాల్లో 80 శాతందాకా యివే). వీటికితోడు ఉత్పత్తి, మార్కెటింగు సహకార సంఘాలు కూడా వున్నాయి.

భారతదేశం స్వతంత్రమయ్యాక సహకార సంఘాల సంఖ్యా, వాటి సభ్యత్వమూ బాగా వేగంగా పెరిగాయి. భారత ప్రభుత్వం అద్యతన భవిష్యత్తులో గ్రామీణ జనాభాలో అధిక భాగాన్ని సహకారోద్యమంలోకి తెచ్చే లక్ష్యం పెట్టుకుంది.

సహకారోద్యమపు అత్యున్నత రూపమైన ఉత్పత్తి సహకార సంఘాలు భారతదేశంలో తక్కువ అభివృద్ధిచెందాయి. ఉన్నవాటిలో అత్యధిక భాగాన్ని ప్రభుత్వం కొత్త భూముల్లో నెలకొల్పింది. ఉత్పత్తి సహకార సంఘాల్లో ఒక భాగం బడా ఎస్టేటుదార్ల సంస్థలు. వ్యవసాయ సంస్కరణల మూలంగా ఏర్పడిన నిర్బంధాలనుంచి తప్పుకొనేందుకు వాటిని వారు వినియోగించుకొనేందుకు ప్రయత్నిస్తారు.

అన్నింటిలోకీ అత్యధికంగా అభివృద్ధిచెందినవి పరపతి సంఘాలు. అవి ప్రధానంగా గ్రామీణ బూర్జువావర్గపు అవసరాలను తీరుస్తాయి. ఈ సహకార సంఘాలు తరచు వర్తకుల, వడ్డీ వ్యాపారుల, భూస్వాముల చేతుల్లో వుంటాయి. వాటి పెట్టుబడి గ్రామాల ప్రధాన రుణదాతలైన వడ్డీ వ్యాపారుల, వర్తకుల పెట్టుబడికి — యీ లావాదేవీల్లో వీరి వాటా 70 శాతం వుంటుంది — ప్రత్యామ్నాయం కాగలిగినంతగా వుండదు.

వడ్డీ వ్యాపారులచేత గ్రామీణ జనాభాలోని మిక్కిలి పేద విభాగాల దోపిడి, తత్పర్యవసానంగా అమల్లోకి వచ్చిన శృంఖల రూపాలూ యీనాటికీ విస్తృత వ్యాప్తిలో వున్నాయి.

గ్రామీణ ప్రాంతాల్లో బాంకింగ్ రుణాల వ్యవస్థను పెంపొందించేందుకుగాను భారత ప్రభుత్వం సహకార సంఘాలను పటిష్ఠం చేసేందుకు కొన్ని చర్యలు చేపట్టింది. 1969లో బడా వాణిజ్య బాంకులను జాతీయంచెయ్యడమూ, వాటి సేవలను గ్రామాలకు విస్తరింపజెయ్యడమూ వాటిలో ఒకటి. దరిమిలా, గ్రామీణ ప్రాంతాల్లో, ప్రాంతీయ వ్యావసాయిక బాంకుల కార్యక్రమ ప్రాతిపదికమీద బాంకింగ్ వ్యవస్థను విస్తరింపజెయ్యడంకోసం అదనపు చర్యలు తీసుకోబడ్డాయి.

గ్రామాలకు బాంకింగ్ సౌకర్యాల విస్తరణ జరిగాక కూడా, వడ్డీ వ్యాపారులకు వారి రుణభారంనుంచి రైతులను అది విముక్తంచెయ్యలేకపోయింది. 1979లో గ్రామాలకు రుణ సౌకర్యాల కల్పనలో వాణిజ్య బాంకుల వాటా 12 శాతాన్ని మించలేదు. ఆ రుణాలైనా మిక్కిలి అసమంగా యివ్వబడ్డాయి. వాటిలో సగానికి పైగా మిక్కిలి అభివృద్ధి చెందిన ఐదు రాష్ట్రాలకి — ఆంధ్రప్రదేశ్, గుజరాత్, మహారాష్ట్ర, పంజాబు, తమిళనాడు — పోయింది. దానిలో ధనిక రైతుల వాటా — అలాంటి రుణాలు ప్రధానంగా వారికే అందుబాటులో వుంటాయి — అత్యధికం (బాంకు రుణాలు అన్నింటిలోనూ, వ్యవసాయాభివృద్ధికి ప్రభుత్వ

కేటాయింపుల్లోనూ సుమారు 70 శాతం). రైతుల్లో అత్యధిక సంఖ్యాకులు (సుమారు 85 శాతం) ఋణాలకోసం వడ్డీ వ్యాపారుల దగ్గరకే పోక గత్యంతరంలేని స్థితిలో వుంటున్నారు.

గణనీయమైన స్థాయిలో బాంకింగ్ ఋణాల విస్తరణా, గ్రామం పొందిన ఋణాల మొత్తం పరిమాణంలో నాటినాటి పెరుగుదలా వడ్డీ వ్యాపారులకు రైతుల ఋణభారపు లేక కాలం చెల్లిపోయిన పెట్టుబడి రూపాలపై వారి పరాధీనతా సమస్యను యింకా పరిష్కరించలేకపోయాయి. అలాంటి పరిస్థితి యాదృచ్ఛికమూ కాదు, నాసి నిర్వహణ ఫలితమూ కాదు. అది గ్రామసీమలో ప్రాబల్యంలో వున్న ఉత్పత్తి తరహాల సహజ ఫలితం. వడ్డీ వ్యాపారం లేక ఆమాదిరి యితర ఋణ రూపాలూ పెట్టుబడిదారీ పూర్వ లేక చిన్నతరహా పెట్టుబడిదారీ ఉత్పత్తికి సరిపోతాయి. అయితే, పెట్టుబడిదారీ పూర్వ రూపాలు గణనీయమైన స్థాయిలో నిలిపివుంచబడినంత కాలం, వడ్డీ వ్యాపారిని ఋణ లావాదేవీలనుంచీ, అత్యధిక సంఖ్యాక ఉత్పత్తిదారులు నిమగ్నులైన ఉత్పత్తినుంచీ బయట వుంచడం దాదాపు అసంభవం. ఈ దృష్ట్యా, గ్రామీణ జనాభాలోని పై శ్రేణికి సేవచేసే బాంకు ఋణాల వ్యవస్థ అతి సామాన్య స్థానాన్నే కలిగివుంటుంది.

సహకారాన్ని అభివృద్ధిచెయ్యడం, ప్రజాస్వామికం చెయ్యడం, దాన్ని వడ్డీ వ్యాపారుల, చట్టా వ్యాపారుల పెత్తనంనుంచి విముక్తం చెయ్యడం, దాన్ని రైతు క్షేత్రాల అభివృద్ధికి దోహదంచేసే వ్యవస్థగా మార్చడం — యివన్నీ దేశపు ప్రజాతంత్ర, ప్రగతిశీల శక్తుల తక్షణ కర్తవ్యం.

సహకార సంఘాలు ఉత్పత్తి సంబంధాల నూతన రూపంగా ఆవిర్భవించవన్నమాట నిజమేననుకోండి. అవి కేవలం ఆ సమాజాల్లో ప్రాబల్యంలో వున్న ఉత్పత్తి సంబంధాల పద్ధతిని అనుకరిస్తాయి. అందుకే భారతదేశంలో సహకార సంఘాలు వ్యవసాయ సమస్యను

పరిష్కరించలేకపోతున్నాయి. అయితే, సహకారోద్యమంలో నానాటికీ అధికతర సంఖ్యలో రైతాంగం చేరేకొద్దీ, ప్రగతిశీల సామాజికార్థిక మార్పులకోసం తాము జరిపే పోరాటంలో ప్రజాతంత్ర శక్తులు దాన్ని ఉపయోగించుకోగలుగుతాయనే విషయాన్ని గుర్తుంచుకోవాలి.

గ్రామసీమ సాంఘికార్థిక సమస్యలు అపరిష్కృతంగా ఉండిపోయాయన్న వాస్తవం వ్యవసాయోత్పాదితవు పెరుగుదల రేటుపైన, ప్రత్యేకించి ఆహార ధాన్యాల ఉత్పత్తి పెరుగుదల రేటుపైన అననుకూల ప్రభావాన్ని కలిగిస్తోంది.

వ్యవసాయపు ప్రధాన శాఖ ధాన్యపు పంట. సుమారు 75 శాతం సాగు భూమిలో ఆహార పంటలు పండించబడుతున్నాయి. పంట చేలు నెమ్మదిగా పెరుగుతూ వుండి, జనాభా త్వరితంగా పెరుగుతున్న దృష్ట్యా భూమిలో అత్యధిక భాగాన్ని ఆహార పంటలకోసం (ధాన్యాలు, అపరాలు) వినియోగించడం దేశపు ఆహార సమస్యా పరిష్కారానికి అవసరమైన పరిస్థితుల కల్పనకు స్వల్పంగా మాత్రమే దోహదంచేస్తుంది. అయితే అదే సమయంలో, వ్యవసాయ సంబంధాలను పునర్నిర్మించేందుకూ, గ్రామాల్లోని ఉత్పాదక శక్తుల పెరుగుదలకోసం కార్యక్రమాన్ని అమలుజరిపేందుకూ చేసే ప్రయత్నాలు, వాటిలో ఎన్ని లోపాలూ, పరిమితులూ ఉన్నా కూడా, దేశపు ఆహార నిల్వల విషయంలో ఆదుర్దాను తగ్గించేందుకూ, వ్యావసాయికోత్పత్తిని పెంచేందుకూ తోడ్పడ్డాయన్న విషయాన్ని అంగీకరించవలసివుంది.

ఆ కార్యక్రమాల ఫలితాలనుబట్టి వ్యవసాయ సంస్కరణల అమలు రూపాలూ, పద్ధతులూ కౌలు దోపిడి స్థాయినీ, వడ్డీ వ్యాపారులకు రైతుల రుణ భారపు పరిమాణాన్నీ గణనీయంగా తగ్గించలేదన్న విషయం చూడవచ్చు. వ్యావసాయిక అధిక జనాభా కూడా పెరుగుతూనే వుంది. భూమి కౌలు చాలా సందర్భాల్లో మొత్తం పంటలో 50 శాతందాకా పెరుగుతోంది. సాగు భూముల్లో 20 శాతానికి తక్కువ కాకుండా

ఏ హక్కులూ లేని పాలి రైతులచేత సాగుచెయ్యబడుతున్నాయనీ, వ్యవసాయ కార్మికుల కట్టు బానిస శ్రమ విస్తృతంగా వుందనీ భారతీయ ఆర్థిక వేత్తలు అంచనావేశారు.

అధికారిక గణాంక లెక్కలనుబట్టి, భూస్వామ్య సాంద్రీకరణ తగ్గింపబడటం లేదు. రిజర్వ్ బాంక్ ఆఫ్ ఇండియా ప్రకారం 1960/61లో 10 శాతం నిరుపేద కమతాలు గ్రామ ఆస్తుల మొత్తంలో 0.1 శాతాన్ని కలిగివుండగా, 10 శాతం వున్న మిక్కిలి సంపన్న కమతాలు 51.4 శాతం ఆస్తుల్ని కలిగివున్నాయి. ఇదే పద్ధతిలో 1971/72 సంవత్సరానికి అంచనా వెయ్యబడిన అంకెల్నిబట్టి పెద్ద మార్పేమీ ఉన్నట్లు కనిపించదు. మిక్కిలి పేద కమతాలు భూమిలోనూ, ఉత్పత్తి సాధనాల్లోనూ 0.1 శాతం కలిగివుండగా, 10 శాతం వున్న మిక్కిలి సంపన్న కమతాలు 51 శాతం కలిగివున్నాయి.* ఈ అంకెలు 1970 దశకారంభందాకా, గ్రామసీమలో సంపద పునర్విభజనపైన భూ సంస్కరణల ప్రభావం గణనీయంగా లేదన్న విషయాన్ని సూచిస్తున్నాయి.

అధిక జనాభా పెరుగుదల రేటు మూలంగా వ్యావసాయిక అధిక జనాభా కొనసాగేటంత కాలం, గ్రామీణ ప్రాంతాల్లో అధిక నిరుద్యోగం కొనసాగేటంత కాలం, పాత వ్యవస్థాగత ప్రతిబంధకాలు తొలగింపబడనంతకాలం, భారతదేశ గ్రామీణ ప్రాంతంలోని సామాజిక పరిస్థితిలోనూ, ఉత్పాదక శక్తుల శీఘ్రాభివృద్ధిలోనూ మౌలికమైన మార్పుకి అవసరమైన వాస్తవ పరిస్థితులేమీ ఉండవు.

ఏక కాలంలో వ్యావసాయిక పెట్టుబడిదారీ వ్యవస్థను ప్రోత్సహించడం ద్వారా, భూస్వాములనుంచి వశంచేసుకున్న భూముల్లో చిన్న

---

* *Reserve Bank Staff Occasional Papers*, Issue № 1, June 1976, p. 15; *The Sixth Five Year Plan...*, p. 8.

కమతాల ఏర్పాటు ద్వారా వ్యవసాయ సమస్యను పరిష్కరించేందుకు జరిపిన ప్రయత్నం కొన్ని సమస్యలను సృష్టించి, గ్రామసీమలో పెట్టుబడిదారీ పరిణామ క్రమాన్ని వ్యగ్రంచేసింది.

అయితే, చాలా సంవత్సరాలపాటు జరిపిన ప్రయత్నాల మూలంగానూ, వ్యవసాయ సంస్కరణల పర్యవసానంగానూ భూమి గాని, చిన్న భూ ఖండాలు గాని లేనివారిలోనుంచి చిన్న కమతందారులుగా మారినవారి సంఖ్య కొద్దిగొప్పల్లో గణనీయంగా పెరిగింది.

చిన్న, అతి బుల్లి క్షేత్రాల రూపంలో వున్న 80 శాతం భూమిలో సొంత వినిమయంకోసం ఆహార పంటలు సాగుచెయ్యబడుతున్నాయి. ఈ కమతాల వినిమయదారీ స్వభావం మార్కెట్ టర్నోవరులో వాటి అతి తక్కువ భాగస్వామ్యాన్నీ, సంచయనపు నిమ్న రూపాన్నీ, పెట్టుబడి మదుపు సరుకుల అతి స్వల్ప డిమాండునీ ముందే నిర్ణయిస్తుంది.

కాగా, వ్యవసాయ సంస్కరణలు భూములు లేనివారికి భూములు యిచ్చేందుకు ఉద్దేశింపబడగా, వాస్తవంలో సరుకు, పెట్టుబడిదారీ సంబంధాల అభివృద్ధికి అనేక అవరోధాన్ని సృష్టిస్తాయి. లాభసాటి కాని కమతాల సంఖ్య పెరుగుతుంది. ఈ పెరుగుదల శ్రమశక్తి అసమర్థ వినియోగానికి దారితీసి, పెట్టుబడిదారీ పూర్వ పీడన రూపాలనూ, కట్టుబానిస పద్ధతినీ నిలిపివుంచేందుకూ, వాటెని స్థిరపరచేందుకూ పరిస్థితులను సృష్టిస్తుంది. ఇది పరిశ్రమకి దేశీయ మార్కెట్‌ను విస్తరింపజెయ్యడానికి గాని లేక శాస్త్ర, సాంకేతిక పరిజ్ఞానపు ప్రగతిశీల వినియోగానికి గాని ఏమాత్రం దోహదంచెయ్యదు.

పట్టణాల్లోనూ, గ్రామసీమలోనూ బహుళ రంగ నిర్మాణపు ఎగుడు దిగుళ్ళూ, పరస్పర విరుద్ధ పరిణామమూ దేశపు ఆర్థికాభివృద్ధిపైన అననుకూల ప్రభావం కలిగిస్తాయి. అవి సుదీర్ఘ నిర్మాణగత సంక్షోభాన్ని వ్యగ్రంచేస్తాయి, జాతీయాదాయపు పెరుగుదల రేటును తగ్గిస్తాయి, ద్రవ్యోల్బణాన్ని ముమ్మరంచేస్తాయి. సాంఘికార్థిక వైరుధ్యాలు వ్యగ్రమై,

రాజకీయ పోరాటం తీవ్రమైన కారణంగా 1975 జూలైలో భారత ప్రభుత్వం దేశంలో అత్యవసర పరిస్థితిని ప్రకటించి, 20 అంశాల కార్యక్రమాన్ని ప్రకటించక గత్యంతరంలేని స్థితిలో పడింది. ఆ కార్యక్రమంలో వ్యవసాయానికి సంబంధించిన భాగంలో యీకింది సూచనలు వున్నాయి: రైతుల రుణభారాన్ని రద్దుచెయ్యడం; భూ గరిష్ఠ పరిమితిని నిర్దేశిస్తూ యింతకుముందే చెయ్యబడిన వ్యవసాయ చట్టాలను అమలుపరచడం; భూములు లేనివారికి మిగులు భూముల పంపిణీని త్వరితం చెయ్యడం; వ్యవసాయ కార్మికుల పాక్షిక బానిసత్వ, కట్టుబానిసత్వాలను రద్దుచెయ్యడం. ఇంతకుముందే జారీచెయ్యబడిన చట్టాలను అమలుజరపడం, గ్రామాల్లోని భూములను కొంతవరకు తిరిగి పంచి, తద్వారా, నిర్దిష్ట పెట్టుబడిదారీ పూర్వ పీడన, దోపిడీ సంబంధాల వ్యవస్థ సరిగా ఏ పునాదిమీదనైతే ఆధారపడివుందో ఆ పునాదిని దొలిచివెయ్యడం — యిదీ, ఆ కార్యక్రమ ప్రధాన లక్ష్యం. యాజమాన్య సంబంధాలను మార్చేందుకు ప్రయత్నించడంతోబాటు, ఆ కార్యక్రమం చాలా విస్తృతమైన ప్రభుత్వ, సహకార సంస్థల రుణాల కల్పన, నిర్ణీత లేక సబ్సిడీ ధరలకు పంటల కొనుగోలు, మార్కెటింగు, తక్కువ వడ్డీ రేటుపైన రుణంగా వ్యవసాయ యంత్రాల, యంత్ర పరికరాల సప్లయిలను కూడా ప్రతిపాదించింది.

1980 జనవరిలో జరిగిన పార్లమెంటరీ ఎన్నికల్లో భారత జాతీయ కాంగ్రెస్ (ఇందిర) విజయం పొందడంతో ఇందిరా గాంధీ నాయకత్వాన ఏర్పడిన ప్రభుత్వం 20 అంశాల కార్యక్రమాన్ని అమలు జరిపేందుకు తిరిగి పూనుకొంది. అప్పట్లో వ్యావసాయికాభివృద్ధి వ్యూహాన్ని నిర్వచించేటప్పుడు, ప్రత్యేక వక్కాణింపు సాంఘిక కార్యక్రమాలపైన యివ్వబడింది. గ్రామసీమలోని నిరుపేద విభాగాలు ఆర్థికాభివృద్ధి పెరుగుదల ఫలితాలు పొందగలగాలన్నదే దీని లక్ష్యం. "వ్యావసాయిక పెరుగుదల దానికి అదిగా దారిద్ర్య సమస్యను పరిష్కరించక

పోవచ్చు''* అన్న విషయాన్ని ఆరవ పంచవర్ష ప్రణాళిక మరుగుపర చేందుకు ప్రయత్నించదు. ఆ ప్రణాళికలోని ఒక భాగం గ్రామీణ జనాభాలోని విస్తృత విభాగాల ''కనీసావసరాలను'' తీర్చే విషయంలో ఒక విస్తృత కార్యక్రమాన్ని ప్రకటించి, దానికోసం 5,800 కోట్ల రూపాయలను కేటాయించింది. ఆ సమీకృత కార్యక్రమం దారిద్ర్య రేఖకి దిగువ ఆదాయాలు వున్నవారి వినిమయ స్థాయిని పెంచాలనీ, గ్రామాల్లో రోడ్లు నిర్మించాలనీ, గ్రామాలను విద్యుదీకరించాలనీ, గ్రామాల్లోని నిరుపేదలకు యిళ్లు నిర్మించాలనీ, ఆరోగ్య సౌకర్యాలూ, మంచి నీటి సౌకర్యాలూ కల్పించాలనీ, తదితర చర్యలు చేపట్టాలనీ ఉద్దేశించింది.

భారతదేశంలో వ్యవసాయ సంస్కరణల గతానుభవం యీకింది విషయాన్ని ధృవీకరించింది: దేశపు సామాజికాభివృద్ధి దిశను నిర్ణయించే మొత్తం జాతీయ వ్యూహ ధోరణితో ప్రసక్తి లేకుండా, ప్రజా జీవితపు ప్రజాస్వామ్యకరణను, పదార్థిక లాభాల న్యాయమైన పంపిణీనీ, ఆర్థిక పెరుగుదల త్వరిత గతినీ రూఢీపరిచే దిశాభిముఖత్వం లేనిదే గ్రామసీమలో విడిగా సాంఘికార్థిక మార్పులు సాధ్యం కావు.

---

* *The Sixth Five Year Plan...*, p. 8.

ప్రకరణం 5

పరిశ్రమ సాంఘికార్థిక నిర్మాణం

వలస పాలన భారతదేశపు జాతీయ ఉత్పత్తిని బ్రిటన్‌పై ఆధార పడేలా చేసి, దేశపు సామాజిక నిర్మాణ పరివర్తనను నిరోధించి, పారిశ్రామికాభివృద్ధిని ఆలస్యంచేసింది. 1950/51లో జాతీయాదాయంలో భారీ, చిన్న తరహా పరిశ్రమ వాటా – నిర్మాణం, ఉత్పత్తి అంతర్ నిర్మాణం (infra-structure)లతోబాటు – 18.8 శాతం వుంది. స్వాతంత్ర్యం పొందిన దరిమిలా సంవత్సరాల్లో పరిశ్రమ నిర్మాణంలో కొన్ని మార్పులు సంభవించాయి: సాంప్రదాయిక శాఖల వాటా తగ్గగా, కొత్త శాఖల వాటా పెరిగింది. అయితే, ప్రగతిశీలమైన యీ మార్పులు జరిగిపోయినప్పటికీ, జాతీయార్థిక వ్యవస్థలో పరిశ్రమ వాటా తక్కువగానే ఉంది. దానిలో పెట్టుబడిదారీ పూర్వ, పెట్టుబడిదారీ తొలి ఉత్పత్తి సంబంధాలు ప్రాబల్యం కలిగివుండే చిన్న తరహా కుటీర పరిశ్రమలు ఇంకా చాలా పెద్ద పాత్ర వహిస్తున్నాయి. భారీ పరిశ్రమలో ప్రైవేటు, ప్రభుత్వ పెట్టుబడి మదుపు గణనీయంగా ఉన్నప్పటికీ, దేశ పారిశ్రామికీకరణ యింకా పరిశ్రమ ప్రాతిపదిక – ఉత్పత్తి సాధనాల ఉత్పత్తి – నిర్మాణ దశలోనే ఉంది. భారతదేశం ఇంకా చాలా సాధించవలసి ఉంది: అది పారిశ్రామిక విప్లవాన్ని పూర్తిచేసి, యావత్తు జాతీయ వ్యవస్థనూ పారిశ్రామిక ఉత్పత్తి పద్ధతులకు మార్చవలసి

వుంది, అనేక ఆర్థిక రంగాల మధ్య విభజనలను తొలగించి పరిశ్రమలో ఏకైక ఆర్థిక నిర్మాణాన్ని ప్రవేశపెట్టవలసివుంది.

మొత్తంగా జాతీయార్థిక వ్యవస్థలోనూ, ప్రత్యేకించి పరిశ్రమ లోనూ ఉన్న నిర్మాణగతమైన ఎగుడుదిగుళ్లు సామాజిక శ్రమ విభజననూ, దాని ఉత్పాదకత పెంపుదలనూ నిరోధిస్తున్నాయి. అవి జాతీయార్థిక వ్యవస్థలో ఏకీకరణ క్రమాలను ఆటంకపరచి, దేశీయ మార్కెట్ ఏర్పడటాన్ని ఆలస్యంచేస్తున్నాయి. పారిశ్రామికీకరణ సాంఘిక, ఆర్థిక సరిహద్దులూ, అలాగే పరిశ్రమలో పునరుత్పత్తి వేగమూ, అనుపాతాలూ దీనిమీదనే ఆధారపడివుంటాయి.

దేశంలోని పారిశ్రామిక సంస్థల్లో 90 శాతం చిన్నవి. ఉత్పాదితపు మొత్తం విలువ దృష్ట్యా 49 శాతాన్నీ, చేర్పబడే విలువ దృష్ట్యా 51 శాతాన్నీ అవి తయారుచేస్తున్నాయి.* 1951లో చిన్న తరహా పరిశ్రమల్లో 99 లక్షలమంది కార్మికులు పనిచేస్తున్నారు. 1979/80లో 2 కోట్ల, 33 లక్షలమందికి పైగా చిన్నతరహా ఉత్పత్తి శాఖలన్నింటిలోనూ నియుక్తులయ్యారు. వీరిలో సుమారు 1 కోటి, 40 లక్షలమంది సాంప్రదాయిక కుటీర పరిశ్రమల్లో పనిచేస్తున్నారు.**

భారీ పరిశ్రమలు (25 లక్షల రూపాయలకి పైగా స్థిర ఆస్తులు ఉన్నవి) 1980లో మొత్తం స్థిర ఆస్తుల్లో 86 శాతాన్ని కలిగివుండి, మొత్తం పారిశ్రామికోత్పత్తిలో 50 శాతానికి పైగానూ, చేర్పబడే ఉత్పాదితపు విలువలో సగానికి పైగానూ తయారుచేస్తున్నాయి. భారీ ఉత్పత్తి సంస్థల స్థిరాస్తులు చిన్నతరహా ఉత్పత్తి సంస్థల స్థిరాస్తులకు 350 రెట్లు ఎక్కువ. అయితే వాటి ఉత్పత్తి కేవలం 54 రెట్లు మాత్రమే ఎక్కువ. భారీ పరిశ్రమలో సగటు కార్మికుడి స్థిర

* *The Sixth Five Year Plan...*, p. 187.

** అదే పత్రం, అదె పేజి.

పెట్టుబడి చిన్నతరహా పరిశ్రమలోకంటె 8 రెట్లు ఎక్కువ, కాగా కార్మికుడి తలసరి నికర ఉత్పాదితం 2 రెట్లు మాత్రమే ఎక్కువ *

కాగా, చిన్నతరహా ఉత్పత్తిలో పెట్టుబడి మదుపుల ఫలదాయకత భారీ ఉత్పత్తిలోకంటె మరింత ఎక్కువ ఇది శ్రమశక్తి, యంత్రాల పెట్టుబడిదారీ వినియోగానికి ఒక మాదిరి సాంఘిక హద్దుగా పనిచేస్తుంది

ఈ పరిస్థితుల్లో పారిశ్రామికీకరణ సద్యోజనితంగా సాధించబడటం సాధ్యం కాదు ఎందుకంటే, దాన్ని ప్రోత్సహించగలిగిన ఆర్థిక ప్రేరణలు ప్రాబల్యంలో వున్న చిన్నతరహా ఉత్పత్తియొక్క పెట్టుబడిదారీ పూర్వ రూపాల ఫలదాయకతచేతా, నానా జాతీయ దేశీయ మార్కెట్ నిర్దిష్ట లక్షణాలచేతా పరిమితం చెయ్యబడతాయి ఈ దేశీయ మార్కెట్‌లో గిరాకీ పెట్టుబడిదారీ పూర్వ రూపాల ప్రాబల్యాన్నీ, తత్పర్యవసానంగా పరిశ్రమ ప్రధాన శాఖల ఉత్పత్తి సామర్థ్యాల నిరంతర అల్పోపయోగాన్నీ, ద్రవ్య వనరుల సంచయనపు రేట్ల తగ్గుదలనీ ప్రతిబింబిస్తుంది వీటన్నింటినిబట్టి, దేశ ఆర్థికాభివృద్ధికోసం రచింపబడిన పంచవర్ష ప్రణాళికల ప్రకారం, ప్రభుత్వ రంగపు చట్రం లోపల పారిశ్రామికీకరణ మొదలవాలని నిర్ధారితమైంది ప్రస్తుతం వున్న సంబంధాల వ్యవస్థను ప్రత్యక్షంగా ప్రభావితంచెయ్యకుండా, ప్రభుత్వ రంగ పరిశ్రమ దేశ పరిశ్రమయొక్క ఒక ఆవశ్యక యూనిట్‌గా — యీనాటిదానికంటె రేపటిదానిగా — పురోగమిస్తోంది

1. పరిశ్రమలో ప్రభుత్వ రంగం

ఒక వర్ధమాన దేశం స్వాతంత్ర్యం సాధించుకున్న తర్వాత, ఆర్థిక పునర్నిర్మాణం ప్రథమ ప్రాముఖ్యం సంతరించుకుంటుంది ఆర్థికా

---

* *India's Economic Problems*, p 92

భివృద్ధి కీలక సమస్యల్లో అంతరిక బహుళ రంగ జాతీయార్థిక వ్యవస్థను పునర్నిర్మించడమూ, ప్రపంచ మార్కెట్లో జాతీయార్థిక వ్యవస్థ అసమ స్థితిని అధిగమించడమూ ఇమిడివుంటాయి బహుళ రంగ ఆర్థిక వ్యవస్థలో ఏకీకరణ క్రమం, స్వయంపోషక వ్యవస్థ సరుకు రూపాలకు మారడం, చిన్నతరహా పరిశ్రమ పెట్టుబడిదారీ రూపాల్లోకీ, అతి నిమ్న పెట్టుబడిదారీ రూపాలు అత్యున్నత రూపాల్లోకీ మారడం ప్రాతిపదికపైన సద్యోజనితంగా అభివృద్ధిచెందుతుంది విభిన్న ఆర్థిక రంగాల మధ్య తలెత్తే వైరుధ్యాలను పరిష్కరించేందుకూ, వాటిని ఒకే ఆర్థిక వ్యవస్థగా రూపొందించేందుకూ ప్రభుత్వం తోడ్పడుతుంది బాహ్య సామ్రాజ్యవాద ఒత్తిడినుంచి బహుళ రంగ ఆర్థిక వ్యవస్థను అది పరిరక్షిస్తుంది అయితే, ప్రభుత్వం కేవలం ఒక రాజకీయ ఉపరి నిర్మాణంగా ఉండిపోతే లేక సాంప్రదాయిక, ఆర్థిక, ఆర్థికేతర నియంత్రణ పద్ధతులను మాత్రమే ఉపయోగిస్తే అది ఈ విధులను నిర్వర్తించ లేదు అది ఉన్న ఆర్థిక రంగాల్లో ఏ ఒక్కదానిపైనా పూర్తిగా ఆధార పడజాలదు కనుక, ఉన్న రంగాల ఆర్థిక విధులను పెంపొందించి, పాక్షికంగా వాటి స్థానంలో ఒక నూతన సామాజిక రంగాన్ని — జాతీయ స్థాయిలో, జాతీయ ప్రయోజనాలకోసం శక్తివంతమైన ఒక ఆర్థిక విధానాన్ని అమలుపరచడంలో ప్రాతిపదికగా వినియోగపడే రంగాన్ని ప్రవేశ పెట్టాలి ప్రభుత్వ రంగం అభివృద్ధిచెందేకొద్దీ, ఒక సామాజిక యంత్రాంగం రూపొందుతుంది ఈ యంత్రాంగం బహుళ రంగ వ్యవస్థలో, ఆర్థిక రంగాల ఈ బాహుళ్యం తొలగింపబడక ముందే, కొద్ది గొప్పల్లో పునరుత్పత్తి క్రమం మామూలుగా పనిచేసేందుకు అవసర పరిస్థితులను స్థిరపరుస్తుంది

ప్రభుత్వ రంగమే మిక్కిలి సామాజీకృత ఆర్థిక రూపం అది విలువ నియమంచేత కచ్చితంగా పరిమితంచెయ్యబడకపోవడమే దాని పునరుత్పత్తి క్రమపు విశిష్ట లక్షణం ఫైనాన్షియల్ రుణ వ్యవస్థలను

వినియోగించుకొని, ప్రభుత్వ పరిశ్రమలను ఆధారంగా చేసుకొని, ప్రైవేటు రంగాలకు అసాధ్యమైన పరిమాణాల్లో వనరులను ప్రభుత్వం సమీకరించి, వాటిని జాతీయ ప్రయోజనాలకోసం వినియోగించ గలుగుతుంది.

ప్రభుత్వ రంగపు పాదార్థిక ప్రాతిపదిక ప్రభుత్వపు మదుపు విధానం ద్వారా వ్యక్తిగత స్వామ్యంలో వున్న కొన్ని పరిశ్రమలను, సంస్థలను జాతీయంచెయ్యడం ద్వారా సృష్టింపబడుతుంది ఇందుకు సంబంధించిన ఉత్పాదక శక్తులు ప్రభుత్వ ఆర్థిక వ్యవస్థను లేక జాతీయార్థిక వ్యవస్థయొక్క ప్రభుత్వ రంగాన్ని రూపొందిస్తాయి

పెట్టుబడిదారీ ఉత్పత్తి ప్రధాన లక్ష్యం సాధ్యమైనంత అత్యధిక లాభాలను పొందడమే అన్న విషయం తెలిసిందే ప్రభుత్వ గుత్త పెట్టుబడిదారీ వ్యవస్థ యంత్రాంగం యావత్తూ ఈ లక్ష్య సాధనకే ఉన్ముఖం చెయ్యబడుతుంది

వర్ధమాన దేశాల్లో — భారతదేశం ఇందుకు మినహాయింపు కాదు — ఉత్పత్తి లక్ష్యం జాతీయాదాయాన్ని అత్యధిక స్థాయికి పెంచడం. ఇది జనాభాయొక్క అన్ని విభాగాల — సాంప్రదాయిక ఉత్పత్తి రూపాల్లో, ఆధునిక రంగంలో నిమగ్నమైన విభాగాల — ప్రయోజనాలకు అనుగుణ మైనది

ప్రభుత్వ రంగంలో సంచయన క్రమం పెట్టుబడిదారీ పూర్వ సంచయన రూపాల, ప్రైవేటు పెట్టుబడిదారీ సంచయన రూపాల ప్రత్యక్ష కార్యాచరణకు సాపేక్షంగా స్వతంత్రమైనది అంతే కాకుండా, ఒక ఆర్థిక శక్తిగా ప్రభుత్వం తదితర రూపాల వ్యవహారాల్లో ఆర్థికం గాను, ఆర్థికేతరంగాను జోక్యంచేసుకున్నప్పుడు, అది ఆ సంచయనాలను ప్రభుత్వ సంచయనంకోసమూ, చివరకు జాతీయాదాయాన్ని అత్యున్నత స్థాయికి పెంచేందుకూ కూడా వినియోగించగలుగుతుంది

ఆంతరిక ఆర్థిక సంబంధాలను నియంత్రితం చెయ్యడం ద్వారా విభిన్న ఆర్థిక రంగాల్లో అవసరమైన పునరుత్పత్తి సమన్వయాన్ని ప్రభుత్వం సాధించగలుగుతుంది. అంటే జాతీయార్థికాభివృద్ధి వాస్తవ అవసరాలకు అనుగుణంగా మొత్తంగా పునరుత్పత్తి క్రమాన్ని అది అదుపు చెయ్యగలుగుతుంది. విదేశీ ఆర్థిక సంబంధాలను నియంత్రితం చెయ్యడం ద్వారా ప్రభుత్వం ప్రపంచ మార్కెట్లో అత్యంత లాభదాయకమైన మారకపు షరతులను సాధించి, తన అభివృద్ధిచెందుతున్న ఆర్థిక వ్యవస్థకీ, ప్రపంచ ఆర్థిక వ్యవస్థకీ మధ్య సహేతుక సంబంధాలను స్థిరంగా ఏర్పరచుకోగలుగుతుంది. ఇవన్నీ తరుణ రాజ్యాల ఆర్థికాభివృద్ధిలో ప్రభుత్వ రంగాన్ని నిర్ణయాత్మక అంశం చేస్తాయి.

ఉత్పత్తి సంబంధాల ఒక వ్యవస్థగా ప్రభుత్వ రంగం — ఇది దేశపు బహుళ రంగ ప్రాతిపదికయొక్క ఒక భాగం — తదితర ఆర్థిక రంగాలతోనూ, ప్రపంచ ఆర్థిక వ్యవస్థతోనూ ఉత్పత్తి, పంపిణీ, మారకాల్లో సన్నిహితంగా ముడిపడివుంది. అయితే, ప్రైవేటు రూపాలకి భిన్నంగా ప్రభుత్వ రంగం రాజకీయ ఉపరి నిర్మాణంతో ప్రత్యక్ష సంబంధాలు కలిగివుంది. ఎందుకంటే, ఉత్పత్తి సాధనాలు ప్రభుత్వ స్వామ్యంతో ఉంటాయి. తత్పర్యవసానంగా, వర్ధమాన దేశాల్లో ప్రభుత్వ రంగం ప్రాతిపదికలోను, ఉపరి నిర్మాణంలోను కూడా ఒక భాగం. భారీ స్థాయి జాతీయకరణ లేనప్పుడు దాని అభివృద్ధి ద్వితీయ ప్రాధాన్యం కలిగిన సంబంధాల రంగంలో (పంపిణీ, మారకాల, ప్రాథమిక స్వామ్య సంబంధాల రంగంలో) మొదలవుతుంది. ప్రభుత్వ స్వామ్యం పెరిగేకొద్దీ ప్రాథమిక సంబంధాలు ముందుకు వచ్చి, ప్రభుత్వ రంగపు రాజకీయార్థిక సారాన్నీ, జాతీయార్థికాభివృద్ధిపైన దాని నిర్ణాయక ప్రభావాన్నీ నానాటికీ అధికంగా ప్రతిబింబిస్తాయి. ప్రభుత్వ స్వామ్యంలోని పారిశ్రామిక సంస్థల సంఖ్య పెరిగేకొద్దీ, బహుళ రంగ ఆర్థిక వ్యవస్థలో అత్యున్నత సామాజీకృత, నిర్మాణపర రూపం ఆవిర్భవిస్తుంది. ఈవిధంగా

అది అభివృద్ధిచెందిన, స్వతంత్ర జాతీయార్థిక వ్యవస్థ రూపొందేందుకు ముఖ్య పాత్ర వహిస్తుంది.

ఉత్పత్తి, చలామణీలను సామాజీకృతం చేసి నియంత్రితం చెయ్యడం ద్వారా పునరుత్పత్తి అనుపాతాల క్రమాన్ని త్వరితంచేసేందుకు, పునర్ని ర్మించేందుకు అవసరమైన పదార్థిక, సామాజిక పరిస్థితులను — ఇవి లేనిదే దేశపు ఆర్థిక వెనుకబాటుతన గా, పరాధీనతా అధిగమింపబడ జాలవు — ప్రభుత్వం కల్పిస్తుంది.

ఈవిధంగా, అభివృద్ధిచెందుతున్న ఆర్థిక వ్యవస్థలో దేని చుట్టూ అయితే ఒక నూతన శ్రమ విభజన రూపొందింపబడుతుందో ఆ కేంద్రంగా మాత్రమే కాకుండా, ప్రైవేటు రంగపు అభివృద్ధిని దాని అన్ని రూపాల్లోనూ పరిమితంచేసే ఒక మాదిరి సాంఘిక హద్దుగా కూడా ప్రభుత్వ రంగం వ్యవహరిస్తుంది.

ప్రభుత్వ రంగపు సాంఘికార్థిక సారం ఉత్పత్తి సంబంధాల ప్రబల రూపంచేతా, ఉపరి నిర్మాణపు వర్గ స్వభావంచేతా నిర్ణయింపబడు తుంది. పెట్టుబడిదారీ చట్రం లోపల ప్రభుత్వ రంగం ప్రభుత్వ పెట్టుబడిదారీ వ్యవస్థకు సమానమైనదిగా ఉంటుంది. భారతదేశంతో బాటు అత్యధిక వర్ధమాన దేశాల్లో పెట్టుబడిదారీ ఆర్థిక రూపం నెలకొల్పబడినప్పటికీ, అది జాతీయార్థిక వ్యవస్థయొక్క అన్ని రంగాల పైనా పెత్తనం వహించదు. అందుచేత ప్రభుత్వ రంగాన్ని కేవలం ప్రభుత్వ పెట్టుబడిదారీ వ్యవస్థ అని నిర్వచించడం సాధ్యం కాదు.

బహుళ రంగ ఆర్థిక వ్యవస్థల్లో ప్రభుత్వ రంగ అభివృద్ధిలోని చారిత్రక ధోరణులు దేశంలోని ఆర్థిక సంబంధాలనూ, వర్గ శక్తుల పొందికనూ ఏదో ఒక దశలో ప్రతిబింబిస్తాయి. తత్పర్యవసానంగా, వర్ధ మాన దేశాల్లో సాంఘికార్థిక సంస్కరణలు — ప్రభుత్వ రంగపు భాగ స్వామ్యంతో లేక దాని ప్రాతిపదికపైన — తీసుకునే దిశ పెట్టుబడిదారీ వ్యవస్థ అభివృద్ధికి దోహదమైనా చెయ్యవచ్చు లేక దాన్ని నిరోధించవచ్చు.

భారతదేశంలో ప్రభుత్వ రంగం దేశపు ఆర్థికాభివృద్ధియొక్క వివిధ దశల్లో జాతీయ పెట్టుబడిదారీ వ్యవస్థ రూపొందడాన్ని విభిన్న పద్ధతుల్లో ప్రభావితంచేసింది ఒక సామాజిక స్వామ్య రూపంగా ప్రభుత్వ రంగపు వాస్తవ సామర్థ్యాలు, యీ స్వామ్య రూపం దేనితో సంబంధితమై వుంటుందో ఆ రాజకీయ ఉపరి నిర్మాణంచేత నిరంతరం ప్రభావితమవుతూ వచ్చాయి, అంటే, ఆర్థికాభివృద్ధిపైన ప్రభుత్వ రంగపు ప్రభావం చివరకు ఆయా దశల్లో వర్గ శక్తుల బలాబలాలపైన ఆధారపడివుంటుంది.

అయితే, ప్రభుత్వ రంగం ఆర్థిక నిర్మాణపు ఒక ముఖ్యాంశం అయేకొద్దీ అది ఒక రకమైన స్వాతంత్ర్యాన్నీ, తన సొంత అభివృద్ధి ప్రయోజనాన్నీ సంతరించుకొని, తన వంతులో, ప్రాతిపదిక సంబంధాలను మాత్రమే కాకుండా, ఉపరి నిర్మాణపు సంబంధాలను కూడా ప్రభావితం చేస్తుంది ప్రభుత్వ రంగంపైన యిలా ఆధారపడటమూ, ఆర్థిక, రాజకీయ సంబంధాల్లో ప్రభుత్వ రంగపు అంతకంతకు పెరుగుతున్న పాత్రా, ఆర్థిక వ్యవస్థలో ప్రభుత్వ రంగపు వాటామీద ప్రధానంగా ఆధారపడతాయి.

ప్రభుత్వ రంగం ఆర్థికంగా తగినంత బలంగా వుండి, స్వతంత్రంగా — యితర రూపాలకు అనుబంధంగా కాకుండా తన సొంత అభివృద్ధి క్రమాన్ని అనుసరించగలిగితేనే — వ్యవహరించగలిగినప్పుడే ప్రభుత్వ రంగ సామర్థ్యాలు ఫలదీకృతమవుతాయి ప్రభుత్వ స్వామ్య రూపం ప్రభుత్వ రంగంలోని సంబంధాల ఆర్థిక సారాంశాన్ని నానాటికీ అధికంగా నిర్ణయిస్తుంది. ప్రభుత్వ ఆర్థిక వ్యవస్థ పరిమాణాత్మక పెరుగుదల, కొన్ని రాజకీయ పరిస్థితుల్లో దాని స్థానాల సంఘటన, అది పునరుత్పత్తి క్రమపు రేటుని, అనుపాతాన్ని, సంచయనపు అన్ని పరిమాణాలను, ప్రభుత్వ ఆర్థిక వ్యవస్థ పరిమితుల్లోనే కాకుండా, మొత్తం జాతీయార్థిక వ్యవస్థ పరిమితుల్లో నిర్ణయించనారంభిస్తాయి

భారతదేశం వంటి దేశపు నిర్దిష్ట పరిస్థితుల్లో వాస్తవంలోను, బూర్జువావర్గపు ప్రైవేటు పారిశ్రామిక వ్యవస్థయొక్క తదితర సభ్యుల వ్యక్తిగత అభీష్టాల ప్రసక్తి లేకుండా ప్రభుత్వ రంగం సామాజిక స్వామ్యాన్ని సృష్టిస్తుంది. అది పెట్టుబడిదారీ స్వామ్యంతోబాటు ప్రైవేటు స్వామ్యపు కచ్చితమైన నాస్తీకరణ. ఈ అర్థంలో ప్రభుత్వ రంగపు అభివృద్ధి సంఘటనలు పెట్టుబడిదారీయేతర అభివృద్ధి పంథాకు మారేందుకు మార్గాన్ని సుగమం చేస్తాయి. ప్రజాతంత్ర శక్తుల చేతుల్లో ప్రభుత్వ రంగం నికరమైన స్వాతంత్ర్యంకోసం, ఆర్థిక, సాంస్కృతిక వెనుకబాటును, అన్ని రకాల దోపిడిని రద్దుచేసేందుకోసమూ జరిగే పోరాటంలో పటిష్ఠమైన ఒక పరికరం కాగలదు.

భారతదేశంలో ప్రగతిశీల శక్తులు ప్రభుత్వ రంగపు అభివృద్ధి పటిష్ఠమూ, ప్రజాస్వామికమూ చెయ్యబడాలని పట్టుబడుతున్నాయి. ప్రభుత్వ రంగాన్ని ప్రజాస్వామికం చేసి, సంకుచిత వర్గ ప్రయోజనాల కోసం కాక దాన్ని జాతీయ ప్రయోజనాలకోసం వినియోగించాలని జరిపే ఈ పోరాటం సామ్రాజ్యవాదానికీ, గుత్త పెట్టుబడికీ, సమాజంలోని తదితర అభివృద్ధినిరోధక గ్రూపులకీ వ్యతిరేకంగా విస్తృత జనసామాన్యాన్నీ, సమస్త ప్రగతిశీల శక్తులనూ సమీకరించేందుకు పాదార్థిక ప్రాతిపదికను సృష్టిస్తుంది. ఈ అర్థంలో ప్రభుత్వ రంగపు అభివృద్ధికి జాతీయ ప్రాధాన్యం ఉంది. ప్రభుత్వ రంగపు అభివృద్ధి విదేశీ పెట్టుబడి వినిమయ రంగాన్ని కుదించి, జాతీయార్థిక వ్యవస్థలోని కీలక స్థానాలనుంచి దాన్ని వెళ్లగొట్టి, కొన్ని సందర్భాల్లో దేశపు ఆర్థిక జీవితంపైన దాని ప్రభావపు స్వభావాన్ని మారుస్తుంది.

దోపిడిదారీ వర్గాలు దేశపు ఆర్థిక జీవితంలో ప్రభుత్వ జోక్యపు రంగాన్ని పరిమితపరిచేందుకు ప్రయత్నిస్తాయి. వివిధ సాంఘిక బృందాల ఈ ప్రతిఘటన శక్తి స్వభావాలు ఒకే మాదిరిగా ఉండవు. పరిశ్రమతో సంబంధం ఉన్న పెటీబూర్జువావర్గపు, పాక్షికంగా మధ్యతరగతి

విస్తృత విభాగాలు కూడా ప్రభుత్వపు ప్రత్యక్ష తోడ్పాటులోనూ, ఆర్థిక వ్యవస్థను నియంత్రించేందుకోసం అది తీసుకొనే కొన్ని చర్యల్లోనూ ఆసక్తి కలిగివుంటాయి. ఎందుకంటే, ఉత్పత్తి సాంద్రీకరణకు, పెట్టుబడి కేంద్రీకరణకు దారితీసే, గుత్త సంస్థల స్థానాన్నీ, ప్రభావాన్నీ పటిష్ఠంచేసే పెట్టుబడిదారీ వ్యవస్థ సద్యోజనిత అభివృద్ధి పెటీబూర్జువావర్గంలో గణనీయమైన ఒక భాగాన్నీ, మధ్య రకం పరిశ్రమదారుల కొన్ని బృందాలనీ సైతం ఎదుగూ బొదుగూ లేని స్థితికీ, లేక దివాళాకీ సైతం గురిచేస్తాయి. కాగా ఈ బృందాలు సహజంగానే ప్రభుత్వపు తోడ్పాటును పొందేందుకు ప్రయత్నిస్తాయి. గుత్త సంస్థలు ఏర్పడే దిశగా పెంపొందే ధోరణులను వ్యతిరేకిస్తాయి. మొత్తం మీద ప్రభుత్వ రంగ పురోగతిని సమర్థిస్తాయి. అవి ప్రభుత్వ తోడ్పాటు కోసం నిరీక్షిస్తాయి. అయితే వాటి వైఖరి స్థిరంగా ఉండదు: అవి ప్రభుత్వ నియంత్రణకి సంబంధించిన కొన్ని రూపాలకు వ్యతిరేకంగా ముందుకు వస్తాయి, అవి తమకు స్వేచ్ఛను, ఇతరులకు నిర్బంధాలను డిమాండు చేస్తాయి.

గత 15–20 సంవత్సరాలుగా తనని తాను విశేషంగా సుసంపన్నం చేసుకొన్న బడా, గుత్త బూర్జువావర్గం తన ఆర్థిక, రాజకీయ స్థానాలను కూడా పటిష్ఠం చేసుకొంది. ఆ కారణంగా ప్రభుత్వ రంగం పైన పరిమితులు విధింపబడాలని అంతకంతకు తరచుగా పట్టుబడుతోంది. ఆర్థిక వ్యవస్థయొక్క ఏ రంగాలపైన బడా, గుత్త బూర్జువావర్గానికి ప్రాబల్యం ఉందో వాటిలో ప్రవేశించేందుకు ప్రభుత్వం చేసే ప్రయత్నాలను నిశితంగా విమర్శిస్తోంది. బూర్జువావర్గపు ఈ విభాగం తన స్థానాలను ఎంత ఎక్కువగా బలపరచుకొంటే, దాని అభిప్రాయాలను వెల్లడించే ఆర్థికవేత్తలు ప్రభుత్వ, ప్రైవేటు రంగాల సహజీవనం గురించిన అభిప్రాయాలతో అంత ఎక్కువ నిశితంగా ముందుకు వస్తారు. అయితే బడా బూర్జువావర్గం సైతం ప్రభుత్వ రంగం పూర్తిగా

రద్దుచెయ్యబడాలని కోరుకోదు. ఎందుకంటే, అది ప్రభుత్వం చేసే ప్రత్యక్ష సహాయంపైన విస్తృతంగా ఆధారపడుతుంది. అంతేకాకుండా, భారతదేశం వంటి సంకుచిత దేశీయ మార్కెట్‌ను కలిగిన దేశంలో ప్రభుత్వం ప్రైవేటు రంగం ఉత్పత్తిచేసే అనేక సరుకులకు ప్రధాన వినిమయదారుగా కూడా ఉంటుంది.

ఆచరణలో బడా బూర్జువావర్గం ప్రభుత్వ రంగ కార్యకలాపాలను శుద్ధ ఆర్థిక సమస్యలకు పరిమితం చెయ్యాలని కోరుకుంటుంది. మరోలా చెప్పాలంటే, దేశంలో పెట్టుబడిదారీ వ్యవస్థను పటిష్ఠంచేసే ఒక శక్తిగా ప్రభుత్వాన్ని అది చూస్తుంది, అంత మాత్రమే. తత్ప ర్యవసానంగా, ప్రభుత్వ రంగంపై బడా బూర్జువావర్గపు విమర్శ దాదాపు ఎప్పుడూ కూడా ఆర్థిక వ్యవస్థయొక్క వివిధ రంగాల్లో దాని అతి విస్తరణకు వ్యతిరేకంగా మాత్రమే అని చెప్తున్నా కూడా, వాస్తవంలో దాని అభ్యంతరాలు ప్రభుత్వ రంగపు ప్రజాస్వామిక పార్శ్వా లకు వ్యతిరేకంగా ఉద్దేశింపబడ్డాయి.

జనతా పార్టీ అధికారంలో వున్నప్పుడు గుత్త పెట్టుబడిదారులూ, పరిశ్రమదారులూ ఆర్థిక, రాజకీయ వ్యవహారాలపైన తమ ప్రభావాన్ని విశేషంగా పెంచుకోగలిగారు. జనతా పార్టీ అన్ని రకాల ప్రైవేటు పరిశ్రమనీ సమర్థిస్తుంది కనుక, ఆర్థిక వ్యవస్థలో ప్రభుత్వ జోక్యాన్ని అది తగ్గించనారంభించింది. ఈ చర్య ఆర్థిక వ్యవస్థకి హానిదాయక మైంది. 1977లో అధికారాన్ని చేబట్టాక అది అనుసరించిన ఆర్థిక విధానం దేశంలో సంక్షోభ పరిస్థితి వ్యగ్రమయ్యేందుకు కారణభూత మైంది. 1979/80లో మొత్తం జాతీయోత్పాదితం 4.5 శాతం పడిపోగా, ధరలు 21 శాతానికి పైగా పెరిగాయి. పారిశ్రామికోత్పత్తి – ప్రత్యేకించి ఇంధన, శక్తి పరిశ్రమల్లో ఉత్పత్తి – పడిపోయింది. రవా ణాలో క్లిష్ట పరిస్థితి ఏర్పడింది. ద్రవ్యోల్బణపు రేటు బాగా పెరి గింది. 1980 జనవరిలో ఇందిరా గాంధీ నాయకత్వాన భారత

జాతీయ కాంగ్రెస్ విజయం వెనకటి ఆర్థిక క్రమాన్ని పునరుద్ధరించింది.

ప్రభుత్వ రంగం యింకా స్వయం సమృద్ధం కాలేదన్న విషయాన్ని భారతదేశపు చారిత్రక అనుభవం నిరూపిస్తోంది. అంతిమ విశ్లేషణలో, దాని పాత్ర, ప్రాముఖ్య, క్రమాలు దేశంలో అసలైన ఆర్థిక, రాజకీయ అధికారాన్ని కలిగివున్న సామాజిక శక్తులచేత నిర్ణయింపబడుతున్నాయి.

గత 20 సంవత్సరాల్లో భారతదేశపు చారిత్రక అభివృద్ధి క్రమం అంతట్లోనూ బడా బూర్జువావర్గం, ప్రత్యేకించి దాని గుత్త విభాగం ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చేందుకు అనేక సందర్భాల్లో ప్రయత్నించింది. కాగా, యీ ఒత్తిడి ప్రభావం దేశపు ఆర్థిక విధానంమీద పడింది.

భారతదేశం యీనాడు అనుసరిస్తున్న ఆర్థిక విధానం చాలవరకు రాజీ స్వభావం కలిగినది. అది సామాజిక వైరుధ్యాలనూ, వాటిని పరిష్కరించవలసిన తక్షణావశ్యకతనూ పరిగణనలోకి తీసుకొంటుంది. అలాంటి వైఖరి అవసరం. ఎందుకంటే, మూడవ పంచవర్ష ప్రణాళికలో సహేతుకంగా పేర్కొనబడినట్లు, జనాభాలో అత్యధిక సంఖ్యాకులు దారిద్ర్యపు టంచుల్లో జీవిస్తున్నప్పుడు, సాంఘిక న్యాయంకోసం, పని హక్కు, సమావావకాశాలు, కనీస జీవనాధారాలకోసం డిమాండ్లు అసాధారణ ప్రాధాన్యాన్ని సంతరించుకుంటాయి. ఆయా ఆర్థిక సమస్యలపైన ప్రభుత్వం చేసే ప్రకటనలనూ, సంపదా, అధికారమూ కొద్దిమంది చేతుల్లో సాంద్రీకరింపబడరాదని పేర్కొనే కొన్ని ప్రభుత్వ పత్రాల సాధారణ ధోరణినీ యీ దృక్కోణంనుంచి చూడాల్సివుంది. ఆచరణలో యీ విధానం గుత్త వర్గాల, పార్లమెంటులో వాటి ప్రతినిధుల ఒత్తిడి మూలంగా, అన్నప్పుడూ తగినంత సుసంగతంగా అమలు జరపబడటం లేదు.

తన ఆర్థిక విధానపు ప్రధాన లక్ష్యాలనూ, సూత్రాలనూ అమలు

జరపడంలో, అన్నింటికంటె ముందు ఆర్థిక వ్యవస్థ వివిధ శాఖల్లోని తన ఆస్తినీ, అంతే కాకుండా, ఆర్థిక వ్యవస్థయొక్క ప్రభుత్వ నియంత్రణకి సంబంధించిన తదితర రూపాలనూ ప్రభుత్వం వినియోగిస్తుంది ఈ కారణంగా ప్రభుత్వ ఆర్థిక వ్యవస్థను రూపొందించడమన్నది అతి ముఖ్య ఆచరణపర సమస్యల్లో ఒకటైంది ఈనాడు జవహర్లాల్ నెహ్రూ పేరుతో ముడిపడివున్న దేశపు సామాజికార్థిక వ్యవస్థను సాధించేందుకు యీ ప్రభుత్వ ఆర్థిక వ్యవస్థ ప్రాతిపదికను కల్పించ వలసివుంది.

ప్రస్తుతం పరిశ్రమలో ప్రభుత్వ ఆస్తి వాటా జాతీయాదాయం లోనూ, దరహంమీద పెట్టుబడి మదుపుల మొత్తంలోనూ, తత్ఫర్యవ సానంగా పారిశ్రామికోత్పాదితపు మొత్తం విలువలోనూ సాపేక్షంగా చాలా తక్కువ ప్రభుత్వ ఆస్తి ప్రధానంగా మూడు మార్గాల్లో రూపొందు తోంది

1) ప్రభుత్వానికి వలస పాలకుల ఆస్తి బదిలీ,

2) భారతీయ, విదేశీ బూర్జువావర్గ ప్రతినిధులకు చెందిన కొన్ని ప్రైవేటు కంపెనీల జాతీయకరణ,

3) భారీ ప్రభుత్వ మదుపుల ప్రాతిపదికమీద నూతన పరి శ్రమల నిర్మాణం

ఈ మూడు మార్గాల్లోనూ మూడవదైన నూతన పరిశ్రమల నిర్మాణం అత్యంత ముఖ్యమైనది

స్వాతంత్ర్యం ప్రకటింపబడిన తర్వాత ప్రభుత్వ ఆస్తుల్లో యీకిం దివి యిమిడివున్నాయి. ప్రయాణ రవాణా, వార్తా ప్రసార వ్యవస్థలు, ప్రధానమైన ఓడరేవులు (మద్రాసు, విశాఖపట్టణం, కాండ్లా, బొంబాయి, కలకత్తా, కొచ్చిన్), భారీ ఆయుధ ఫాక్టరీలు, నీటి పారుదల నిర్మా ణాలు మరోలా చెప్పాలంటే, జాతీయ ప్రభుత్వం వలస పాలకుల ఆస్తులు వారసత్వంగా పొందింది

1947/48లో ప్రభుత్వ ఆస్తులు (ప్రయాణ రవాణా, వార్తా ప్రసార, నీటి పారుదల నిర్మాణాలతోబాటు) సుమారు 900 కోట్ల రూపాయలదాకా వున్నాయి.

పరిశ్రమలో జాతీయకరణ చాలా పరిమితంగా వుంది. ప్రభుత్వం నష్టపరిహారంగా చాలా పెద్ద మొత్తాలు చెల్లించి బాగా తరిగిపోయిన కోలారు బంగారు గనులనూ, నష్టంలో నడుస్తున్న కొన్ని కొబ్బరి పీచు ప్రోసెసింగు పరిశ్రమలనూ, పన్నాలో వజ్రాల గనులనూ, దివాళా అంచున వున్న విశాఖపట్టణం ఓడల నిర్మాణ కర్మాగారాలనూ, రాజస్థాన్ లోని కొన్ని పవర్ స్టేషన్లనూ, రాగి గనులనూ, కొన్ని బొగ్గు గనులనూ వశంచేసుకుంది.

పారిశ్రామిక సంస్థలకు సంబంధించినంతవరకు, జాతీయం చెయ్యబడినవి దాదాపు యివే. 1950/51లో మొదటి పంచవర్ష ప్రణాళిక ఆరంభింపబడినప్పుడు, ప్రభుత్వ రంగపు ఆస్తులు 1,200 కోట్ల రూపాయలకు అతి కొంచెం ఎక్కువగా వున్నాయి. వీటిలో 90 శాతానికి పైగా ప్రయాణ రవాణా, వార్తా ప్రసార, నీటి పారుదల కట్టడాలకు సంబంధించినవి కాగా, పరిశ్రమల విలువ 4 శాతం మాత్రమే. పునరుత్పత్తిచెయ్యబడిన సంపదలో ప్రభుత్వ రంగపు వాటా 15 శాతం మాత్రమే. అదే సమయంలో ప్రైవేటు రంగపు ఆస్తులు (వ్యవసాయం, చిన్న తరహా పరిశ్రమ, బాంకులు, వగైరాలు కాకుండా) 1,500 కోట్ల రూపాయలు. వాటిలో 1,100 కోట్లు ఫాక్టరీల్లోనూ, 30 కోట్లు గని పరిశ్రమలోనూ, 32 కోట్లు ఓడలు, విమానాల నిర్మాణ పరిశ్రమలోనూ, 70 కోట్లు విద్యుచ్ఛక్తి పరిశ్రమలోనూ పెట్టబడుతున్నాయి.* మరోలా చెప్పాలంటే, ప్రైవేటు పెట్టుబడి మదుపుల్లో 85 శాతం పరిశ్రమలో సాంద్రీకరింపబడ్డాయి. అవి

---

* *The First Five Year Plan*, New Delhi, 1952, p. 32.

పరిశ్రమలో ప్రభుత్వపు మదుపుల పరిమాణానికి 25 రెట్లు అధికం జాతీయాదాయ కమిటీ అంచనాల ప్రకారం ప్రభుత్వ పరిశ్రమల నికర ఉత్పాదితం 300 కోట్ల రూపాయలు. కాగా ప్రైవేటు పరిశ్రమల నికర ఉత్పాదితపు విలువ 8,800 కోట్ల రూపాయలు ఉంది *

1950/51లో జాతీయాదాయంలో ప్రభుత్వ పరిశ్రమల వాటా 3 శాతం మాత్రమే, కాగా ప్రైవేటు పరిశ్రమల వాటా 92 శాతానికి పైగా ఉంది.**

తన ఆర్థిక వనరులు అంత ఎక్కువగా లేనందున ప్రభుత్వం సహజంగానే ఆర్థిక వ్యవస్థ నిర్మాణాన్ని మార్చలేకపోయింది తత్పర్యవసానంగా, ప్రధానంగా ప్రభుత్వ రంగపు అభివృద్ధిని త్వరితంచేసే రూపాల కోసం, పద్ధతులకోసం అన్వేషించడంపైన తన ప్రయత్నాలను కేంద్రీకరించింది

స్వాతంత్ర్యపు తొలి సంవత్సరాల్లో, పరిశ్రమలో మదుపు పెరుగుదల చాలా నెమ్మదిగా జరిగి, దాని నిర్మాణం మారకుండా అలాగే ఉండిపోయింది. 1948/49లో పరిశ్రమ అన్ని శాఖల్లోనూ (చిన్న తరహా పరిశ్రమలతోబాటు) మొత్తం పెట్టుబడి మదుపులు 210 కోట్ల రూపాయలు ఉన్నాయి అవి 1951/52లో 250 కోట్లు మాత్రమే పెరిగాయి పెట్టుబడి మదుపులూ, ఉత్పత్తి ప్రధానంగా లఘు పరిశ్రమలో పెరిగాయి *** రెండవ ప్రపంచ యుద్ధం, రెండు

---

* *Final Report of the National Income Committee, February 1954*, Department of Economic Affairs, Ministry of Finance, Government of India, Delhi, 1954, p 109

** అదే పత్రం, అదే పేజి

*** D K Pangnekar, *Poverty and Capital Development in India*, Oxford University Press, London, 1958, p 224.

రాజ్యాలుగా దేశం విభజింపబడటం — వీటి పర్యవసానాలను అధిగమించ డంలో దేశం విశేషమైన కష్టాలను ఎదుర్కొంటోంది. ఈ పరిస్థితిలో ప్రధాన ఆర్థిక సమస్యల పరిష్కారంలో ప్రభుత్వం స్తబ్ధత వహించడం జాతీయ ప్రభుత్వపు రాజకీయాధికారానికి ఎసరుపెట్టుకోవడంతో సమానం.

ప్రభుత్వ రంగం ప్రధానంగా కొత్త పెట్టుబడి మదుపులతో అభివృద్ధిచెయ్యబదుతోంది. వాటి పరిమాణాన్నీ, దిశనీ పంచవర్ష ప్రణాళికలు నియంత్రితం చేస్తున్నాయి. 1949 డిసెంబరులో ప్రభుత్వం జవహర్లాల్ నెహ్రూ అధ్యక్షతన జాతీయ ప్రణాళికా కమిషన్‌ని (జా.ప్ర.క.) నెలకొల్పింది. ఆ కమిషన్ 1950 మార్చిలో తన కార్యకాలాపాలు మొదలుపెట్టింది. దేశపు పాదార్థిక, ద్రవ్య, శ్రమ వనరులను అంచనా వెయ్యడం, వాటి అత్యంత ఫలదాయక వినియోగానికి ఒక ప్రణాళికను రచించడం — యిదే ఆ కమిషన్ కర్తవ్యం.

భారతదేశం వంటి దేశంలో ప్రణాళికా రచన సోషలిస్టు దేశాల్లోని ప్రణాళికా రచననుంచి తన కర్తవ్యాల రీత్యా, వస్తుపర అవకాశాల రీత్యా గణనీయంగా విభేదిస్తుంది. ఈ కారణంగా, భారతదేశపు ప్రణాళికా రచనను సోషలిస్టు ప్రణాళికాబద్ధ ఆర్థిక వ్యవస్థలో వాస్తవంగా వుండే అవకాశాల దృష్ట్యా కాకుండా, ఒక వర్ధమాన దేశంలో ప్రణాళికా రచన పరిష్కరించగలిగిన కర్తవ్యాల దృష్ట్యా పరిశీలించాలి.

ప్రణాళికా రచన ప్రభుత్వ రంగ అభివృద్ధికి ప్రధాన పద్ధతీ, భారతదేశపు ఆర్థిక అభివృద్ధిమీద ప్రభుత్వ ప్రభావానికి ప్రధాన సాధనమూ అయింది. ప్రణాళికలు ఆర్థిక విధానపు దిశకీ, స్వభావానికీ నిర్దిష్ట రూపం యిచ్చి, జాతీయార్థిక వ్యవస్థలో ప్రభుత్వ జోక్యపు విస్తృతినీ, లోతునూ నిర్వచిస్తాయి. భారతదేశంలో ప్రణాళికా రచన దేశపు ఆర్థిక జీవితంలో ప్రభుత్వ జోక్యపు అవకాశంచేత పరిమితం చెయ్యబడినప్పటికీ,

దాని ప్రాముఖ్యం కేవల ప్రణాళికా రచనను దాటి చాలా ముందుకు వెళ్తుంది. ఎందుకంటే, ప్రభుత్వ రంగం ద్వారా ప్రైవేటు రంగాన్నీ, దేశమంతటి ఆర్థికాభివృద్ధికి సంబంధించిన ప్రధాన సమస్యలు పరిష్కరింప బడే మార్గాన్నీ అది గణనీయంగా ప్రభావితం చేస్తుంది. ఇక్కడ ముఖ్యమైన విషయం ప్రైవేటు రంగపు అభివృద్ధిని నిర్ణయించడానికి లేక నేరుగా పన్నులు, రుణాలు, టారిఫ్‌లు, వగైరాల ద్వారా (యివి కూడా ముఖ్యమైన పాత్ర వహిస్తాయి) నియంత్రించడానికి ప్రభుత్వానికి లభించిన అవకాశం మాత్రమే కాదు. మిశ్రమ ఆర్థిక వ్యవస్థ అనబడే దానిలో సాంఘిక నిధుల పునరుత్పత్తిమీద ప్రభుత్వ ఆస్తికి వుండే ప్రభావం కూడా ప్రాముఖ్యం వహిస్తుంది.

రెండు రంగాల — ప్రభుత్వ, ప్రైవేటు — పరస్పర ప్రభావం స్థిరంగా వుండిపోదు. అది అన్నింటికంటె ముఖ్యంగా ప్రభుత్వ రంగ ప్రమాణం చేత నిర్ణయింపబడుతుంది. దాని వాటా ఎంత ఎక్కువ వుంటే, ప్రైవేటు రంగంమీద దాని ప్రభావం అంత ఎక్కువగా వుంటుంది, యావత్తు జాతీయార్థిక వ్యవస్థపైనా ప్రణాళికా రచన ప్రభావం అంత ఎక్కువ సుసంగతంగానూ, లోతుగానూ వుంటుంది. ఈ కార ణంగా, నేరుగా ఆర్థిక వ్యవస్థలో ప్రభుత్వ మదుపుల ప్రమాణపు పెరుగుదలా, ప్రభుత్వ స్వామ్యపు విస్తరణా దేశం ఎదుర్కొంటున్న ఆర్థిక, రాజకీయ కర్తవ్యాల పరిష్కారంలో ఎంతో విశేషమైన ప్రాము ఖ్యం వహిస్తాయి. ప్రభుత్వ స్వామ్యం పెంపొంది, సంఘటితమవడంతో ఆర్థిక క్రమాలను మరింత ప్రగాఢంగా ప్రభావితంచెయ్యడంలో ప్రభు త్వానికి వున్న అవకాశాలు పెరుగుతాయి. ప్రణాళికా రచనా, నియంత్రణా మరింత ఫలదాయకమవుతాయి.

మొదటి పంచవర్ష ప్రణాళిక ప్రభుత్వ మదుపులను 2,380 కోట్ల రూపాయలుగా అంచనా వేసింది. అయితే, వాస్తవంలో పెట్ట బడిన మదుపులు 1,960 కోట్ల రూపాయలను మించలేదు. 1980–85

సంవత్సరాలకు సంబంధించిన ఆరవ పంచవర్ష ప్రణాళిక ఆర్థిక, సాంఘి కాభివృద్ధి కార్యకలాపాలకు 1,58,710 కోట్ల రూపాయల పెట్టుబడి మదుపులను కేటాయించింది. వాటిలో 97,500 కోట్లు లేక 61 శాతం ప్రభుత్వ రంగానికి వెళ్లవలసివుంది. ఐదవ పంచవర్ష ప్రణా ళికతో పోలిస్తే ప్రభుత్వ మదుపులు స్థిరమైన ధరల్లో దాదాపు 80 శాతమూ, ప్రస్తుత ధరల్లో 148 శాతమూ పెంచబడ్డాయి.*

ఆరవ పంచవర్ష ప్రణాళికలో పారిశ్రామిక మదుపుల్లో సగానికి పైగా ప్రభుత్వ రంగంలోకి మళ్లింపబడ్డాయి.

1976 అంకెలనుబట్టి భారీ పరిశ్రమలోని స్థిర పెట్టుబడిలో 60 శాతం, శ్రమశక్తిలో సగం ప్రభుత్వ రంగానికి చెందుతాయి. 1950/51–1978/79 మధ్య మొత్తం దేశీయ ఉత్పాదితంలో స్థిర పెట్టుబడిలో ప్రభుత్వ రంగపు వాటా 2.3నుంచి 9.2 శాతా నికి పెరిగింది. 1978లో మొత్తం జాతీయోత్పాదితంలో ప్రభుత్వ రంగపు వాటా (పరిపాలనా నిర్వహణతోబాటు) 17 శాతం, మొత్తం దేశీయ సంచయనంలో 22 శాతం ఉంది. 1980–85 దశకి దాని వాటా 22.9 శాతంగా నిర్ణయింపబడింది. 1970/71లో దేశపు పునరుత్పాదక జాతీయ సంపదలో అది 43 శాతం ఉంది.

దేశపు ఆర్థికాభివృద్ధికి నిర్ణయాత్మక ప్రాముఖ్యం కలిగిన 50 రకాల పారిశ్రామిక సరుకుల, సేవల ఉత్పత్తిలో ప్రభుత్వ రంగం ప్రముఖ స్థానం వహిస్తోంది. 1960/61–1978/79 మధ్య ఫ్యాక్ట రీల, గని పరిశ్రమల్లో చేర్చబడిన విలువలో ప్రభుత్వ పరిశ్రమల వాటా 8.1నుంచి 28.9 శాతానికి పెరిగింది. 1979లో 179 ప్రభుత్వ

---

* *The Sixth Five Year Plan...*, p. XIX; *Commerce Year-Book of Public Sector, 1976/77*, p. 32.

పరిశ్రమల్లో మొత్తం మదుపులు 15,600 కోట్ల రూపాయలను మించాయి.*

దీన్ని రాష్ట్ర ప్రభుత్వాల, స్థానిక అధికారుల అజమాయిషీలో జరిగే ఉత్పత్తితో కలిపితే, 600 భిన్న పరిశ్రమల్లో పెట్టబడిన ప్రభుత్వ మదుపుల వెరసి మొత్తం 25,000 కోట్ల రూపాయలు ఉంటుందని చెప్పవచ్చు. 1979 అంకెల ప్రకారం, ప్రభుత్వ పరిశ్రమకి సంబంధించిన అన్ని రంగాల్లోనూ 40 లక్షలమందికి పైగా నియుక్తులయ్యారు.**

ప్రభుత్వ మదుపులు ఇనుము, ఉక్కు, ఇంజనీరింగు, రసాయనిక పరిశ్రమల వంటి కీలక పరిశ్రమల్లోకి మళ్ళించబడ్డాయి. అన్ని రకాల శాస్త్రీయ పరిశోధనకీ అయ్యే వ్యయంలో 90 శాతాన్ని ప్రభుత్వం భరిస్తోంది. ప్రభుత్వ రంగం ఉత్పత్తి అంతర్ నిర్మాణంలో కూడా ప్రముఖ స్థానం వహిస్తోంది. ప్రభుత్వ మదుపులు ఉత్పాదక వస్తువులను తయారుచేసే శాఖల్లో ప్రాబల్యం వహిస్తున్నాయి. ఆ శాఖల్లో స్థిర పెట్టుబడిలో 80 శాతం సాంద్రీకరింపబడివుంది. శ్రామిక బలగంలో 40 శాతంమంది వాటిలో నియుక్తులై వున్నారు. ఉత్పాదక పరిశ్రమ నికర ఉత్పాదితానికి చేర్చబడే విలువలో 50 శాతానికి పైగా ఈ శాఖలు ఉత్పత్తి చేస్తున్నాయి.

ప్రభుత్వ రంగంలో ఉత్పత్తి, పెట్టుబడుల సాంద్రీకరణ చాలా త్వరితంగా పురోగమిస్తోంది. 1976లో 28 మిక్కిలి పెద్ద ప్రభుత్వ కంపెనీల సాలుసరి తిరగడ ప్రైవేటు రంగంలోని 20 మిక్కిలి పెద్ద గుత్త సంస్థల తిరగడను 1.4 రెట్లు అధిగమించింది. ఈ మిక్కిలి

---

* *Commerce*, Bombay, June 10, 1981, pp. 52—53.

** అదే పత్రికలో.

పెద్ద ప్రభుత్వ కంపెనీల మదుపులు మొత్తం మదుపుల్లో 80 శాతం ఉన్నాయి.*

ప్రభుత్వ పరిశ్రమ రూపొందడానికీ, అభివృద్ధికీ సాంఘిక శ్రమ విభజన క్రమంపైన, నిర్మాణగతమైన మార్పులపైన, పారిశ్రామికోత్పత్తి పెరుగుదల రేట్లపైనా, వీటికితోడు దేశీయ మార్కెట్ ఏర్పడి విస్తరించడంపైనా గణనీయమైన ప్రభావం ఉంది.

అయితే, ప్రభుత్వ మదుపులు వేగంగా పెరిగినప్పటికీ, ప్రభుత్వ ఆస్తిలో సాపేక్ష, పరమ పెరుగుదల, జాతీయార్థిక వ్యవస్థలో ప్రభుత్వ రంగపు వాటా ఈనాటికీ అంత మరీ ఎక్కువగా లేవు. ఆర్థిక వ్యవస్థ యొక్క మిక్కిలి పెద్ద శాఖ అయిన వ్యవసాయంలో – జాతీయాదాయంలో ఇది సుమారు సగాన్ని ఉత్పత్తిచేస్తుంది – ప్రభుత్వ ఆస్తి దాదాపు లేదు. ప్రభుత్వ పరిశ్రమల లాభదాయకత కూడా ప్రైవేటు రంగంలోని దానికంటె చాలా తక్కువ. చాలా కాలంపాటు ప్రభుత్వ రంగం నష్టాలపై నడుస్తోంది. దాని ఉత్పత్తి సామర్థ్యాలు ఈనాటికీ గణనీయంగా తక్కువగా వినియోగింపబడుతున్నాయి.

వీటన్నింటి మూలంగా ప్రభుత్వం సరుకుల ధరలను గట్టిగా ప్రభావితంచెయ్యడం, పెట్టుబడిని చొప్పించడం, దేశీయ మార్కెట్ యంత్రాంగం ద్వారా పరిశ్రమ పునర్నిర్మాణానికి దోహదంచెయ్యడం అసాధ్యం అవుతున్నాయి.

దీన్నిబట్టి ఈకింది నిర్ధారణలను చెయ్యవచ్చు:

1) ప్రభుత్వ మదుపుల మొత్తం పరిమాణం నిర్దిష్టార్థంలో వేగంగా పెరుగుతున్నప్పటికీ, దేశపు ఆర్థిక వ్యవస్థలో మౌలికమైన నిర్మాణగతమైన మార్పులను ప్రభుత్వం చెయ్యగలిగేందుకూ, మొత్తంగా జాతీయార్థిక వ్యవస్థలో ప్రభుత్వ రంగపు వాటాను గణనీయంగా పెంచగలిగేందుకూ యిప్పటికీ యింకా తక్కువగానే వుంది.

---

* *The Economic Times*, Bombay, March 12, 1977, p. 1.

2) ప్రభుత్వం అత్యంత పెట్టుబడి సాంద్రమైన, ఇప్పటికింకా తక్కువ లాభదాయకమైన పరిశ్రమల్లో పెట్టుబడి మదుపు పెట్టింది. ప్రభుత్వ పెట్టుబడి మదుపుల్లో అత్యధిక భాగం ఉత్పాదక సరుకుల పరిశ్రమల్లో వినియోగింపబడ్డాయి.

3) ఒకవైపున వ్యావసాయిక సమస్యలు ఇంకా అపరిష్కృతంగా ఉండి, పరిశ్రమ నిర్మాణం వెనుకబడి వున్న దృష్ట్యా ప్రభుత్వం దేశీయ మార్కెట్‌ను విధిగా అభివృద్ధిచెయ్యవలసివచ్చిన కారణంగా, ఆర్థిక ప్రగతి భారంలో అధికతర భాగం ప్రభుత్వ రంగంపైన పడుతుంది. నేటి భారతదేశంలో ప్రభుత్వ రంగంలో కేవలం దేశీయ మార్కెట్‌యొక్క సాపే క్షంగా సంకుచితమైన అవసరాలను తీర్చేందుకు ఉన్ముఖం చెయ్యబడిన చిన్నతరహా పరిశ్రమలను నెలకొల్పడం పొరపాటు అయివుండేది. ఆధునిక పరిశ్రమల నిర్మాణం, అనివార్యంగా మొత్తం ఆర్థిక వ్యవస్థ చట్రంలో, ప్రత్యేకించి ప్రభుత్వ రంగంలో ఉత్పత్తి సామర్థ్యాలను తగ్గించడం, తాత్కాలికంగా పెట్టుబడి మదుపుల ఫలదాయకతను తగ్గించడమే అయి వుండేది.

4) ప్రభుత్వ మదుపులు దేశంలో పారిశ్రామికంగా తక్కువ అభివృద్ధిచెందిన ప్రాంతాలకు మళ్లింపబడి, ప్రైవేటు పెట్టుబడి ప్రవా హానికి మార్గాన్ని సుగమంచేసింది. కొన్ని సందర్భాల్లో ముఖ్యమైన పారిశ్రామిక సంస్థలకు స్థలాల ఎంపిక, కేవలం ముడి పదార్థాల సాన్ని హిత్యం దృష్ట్యా కాకుండా, వెనకబడ్డ ప్రాంతాలను అభివృద్ధిచెయ్యాలన్న దృష్టితో జరిగింది. ఇది అనివార్యంగా పెట్టుబడి మదుపుల ఫలదాయక తను తగ్గించింది.

కాగా, ప్రభుత్వ పరిశ్రమల అభివృద్ధి, కార్యకలాపాలు జాతీయ కర్తవ్యాలకు ఉన్ముఖంచెయ్యబడ్డాయి. గతంనుంచి వారసత్వంగా పొందిన ఆర్థిక వ్యవస్థ పునర్నిర్మాణపు ప్రధాన భారాన్ని ప్రభుత్వ రంగం ఉద్దేశ పూర్వకంగా చేబట్టింది.

ఉన్నతమైన, స్థిరమైన పెరుగుదల రేట్లను సాధించేందుకు, విస్తృత జనబాహుళ్యపు జీవన ప్రమాణాన్ని పెంపొందించేందుకు, పేదతనాన్నీ, నిరుద్యోగాన్నీ నిర్మూలించేందుకు, సౌష్ఠవమైన సోషలిస్టు ఆర్థిక వ్యవస్థకు పాదార్థిక ప్రాతిపదికను రూఢిపరచేందుకూ గాను జాతీయార్థిక వ్యవస్థ నిర్మాణ స్వరూపాన్ని మార్చడమే ప్రణాళికా రచన, ప్రభుత్వ మదుపుల కర్తవ్యమని ఆరవ పంచవర్ష ప్రణాళిక పేర్కొంది. ప్రభుత్వ రంగపు మదుపులు ఆర్థిక వ్యవస్థ మొత్తం పెరుగుదలలో ఒక ముఖ్య పాత్ర వహిస్తాయనీ, అప్పుడే ఆర్థిక వ్యవస్థయొక్క మిగిలిన భాగం ప్రభుత్వ రంగపు పెరుగుదలతో సన్నిహితంగా ముడిపడుతుందనీ కూడా అది పేర్కొంది. ప్రభుత్వ రంగపు జాతీయ పాత్రకూ, జాతీయాభివృద్ధి కీలక కర్తవ్యాల పరిష్కారంలో, దేశపు ఆర్థిక, సాంఘిక పరివర్తనలో దాని కీలక పాత్రకూ సంబంధించిన యీ గుర్తింపు, దాని సామాజిక ప్రాముఖ్యాన్ని వక్కాణిస్తోంది.

2. పారిశ్రామిక విధానపు మౌలిక సూత్రాలు

భారతదేశపు పారిశ్రామికాభివృద్ధియొక్క సాధారణ వ్యూహం దేశపు బహుళ రంగ సాంఘికార్థిక నిర్మాణంలో సంభవిస్తున్న సంశ్లిష్ట, పరస్పర విరుద్ధ క్రమాలను ప్రభావితం చెయ్యగలిగిన రాజీ పరిష్కారాలను కనుగొనేందుకు ఉన్ముఖంచెయ్యబడిన దాని పారిశ్రామిక విధానంలో స్పష్టంగా ప్రతిబింబితమవుతోంది.

బహుళ రంగ ఆర్థిక వ్యవస్థలో, ఒకే ఉత్పత్తి రంగం లేనప్పుడు, తమ స్వతంత్ర, స్థిర పునరుత్పత్తి పరిమాణాలను నిలుపుకొనే విభిన్న సాంఘికార్థిక రూపాలను ఆర్థిక విధానం పరిగణనలోకి తీసుకోవలసివుం

టుంది బహువిధ సాంఘిక రూపాల సద్యోజనిత అభివృద్ధి, కొన్ని నిర్మాణాలకు కఠిన నియంత్రణ లేక మరికొన్ని నిర్మాణాలకు హాని కరంగా కొన్ని నిర్మాణాలకు అహేతుకమైన ప్రోత్సాహం ఆర్థిక, రాజకీయ జీవితంలో ప్రగాఢమైన సంక్షోభ అంశాలను పెంపొందించి, దేశవు సాపేక్షంగా స్థిరమైన ఆర్థిక, రాజకీయాభివృద్ధిని ఖాయపరచేందుకు విభిన్న నిర్మాణాల మధ్య అవసరమైన సమతూకాన్ని తలకిందులు చేస్తుంది.

భారతదేశ పారిశ్రామిక విధానపు సూత్రాలు ప్రభుత్వం ప్రచురించిన కొన్ని పత్రాల్లో వివ్వచింపబడ్డాయి.

1948 ఏప్రిల్లో, ప్రభుత్వం తన ఆర్థికాభివృద్ధి కార్యక్రమాన్ని రూపొందిస్తున్నప్పుడు, పారిశ్రామిక విధానంపై అదొక ప్రత్యేక తీర్మానాన్ని ఆమోదించింది. ఆ తీర్మానం పరిశ్రమను అభివృద్ధిచెయ్యడంలోనూ, జీవన ప్రమాణాన్ని పెంపొందించడంలోనూ ప్రభుత్వ కర్తవ్యాలను నిర్వచించింది. ఉన్న సంపద సరళ పునర్విభజన దారిద్ర్యపు పంపిణీగా మాత్రమే ఉంటుందన్న అవగాహనతో యీ కర్తవ్యాలు రూపొందించబడ్డాయి అందుబాటులో వున్న అన్ని సాధనాలనూ వినియోగించి ఉత్పత్తి పెరుగుదలమా, ఉత్పాదితాల న్యాయమైన పంపిణీనీ స్థిరపరచడమే క్రియాశీలమైన జాతీయ విధానపు కర్తవ్యం ఆ తీర్మానం ఆర్థిక వ్యవస్థలో ప్రభుత్వపు అసాధారణ పాత్రను గురించి యిలా నొక్కి వక్కాణించింది - ప్రభుత్వం వనరుల, నిపుణ కార్యకర్తల కొరత మూలంగా పారిశ్రామికాభివృద్ధిలో యిప్పటికింకా చురుకైన పాత్ర వహించలేకపోతున్న కారణంగా ప్రైవేటు రంగానికి తగినంత విస్తృతమైన అవకాశాలు కల్పింపబడినప్పటికీ, పరిశ్రమను అభివృద్ధిచెయ్యడంలో ప్రభుత్వం తన పాత్రను పెంచుకోవలసివచ్చింది ఆ తీర్మానంలోని భావాలే మొదటి పంచవర్ష ప్రణాళికకి ప్రాతిపదికగా రూపొందాయి

1956 ఏప్రిల్ 30న ఆమోదింపబడిన పారిశ్రామిక విధానం గురించిన తీర్మానం భారత ప్రభుత్వపు ఆర్థిక విధాన సూత్రాలను

నిర్వచించే మరొక అతి ముఖ్య పత్రం. మొదటి తీర్మానం ఆమోదింప బడిన దరిమిలా ఎనిమిదేళ్లలో దేశంలో గణనీయమైన మార్పులు జరి గాయి. ఆర్థిక పరిస్థితి కొంతవరకు స్థిరపడింది. పారిశ్రామికోత్పత్తి పరిమాణం పెరిగింది. కొన్ని పరిశ్రమల్లో ప్రభుత్వ రంగం తన స్థానాన్ని పటిష్ఠంచేసుకుంది. ప్రభుత్వం రెండవ పంచవర్ష ప్రణాళికను రూపొం దించింది. దానిలో ప్రధానమైన ఉటంకింపు పారిశ్రామిక, ప్రత్యేకించి ఉత్పాదక సరుకుల రంగంలో పెరుగుదలమీద యివ్వబడింది.

వీటన్నింటి మూలంగా, దేశంలోని నూతన పరిస్థితులకు అనుగు ణంగా 1948 నాటి నిర్వచనాలకు మరింత నిర్దిష్ట రూపం యివ్వడం అవసరమైంది.

దాదాపుగా రెండవ పంచవర్ష ప్రణాళిక ఆమోదింపబడిన కాలంలోనే, పారిశ్రామిక విధానం గురించి లోక్‌సభ ఒక కొత్త తీర్మానాన్ని ఆమోదిం చింది. అది, నూతన పారిశ్రామిక సంస్థలను నెలకొల్పడంలోనూ, పరి శ్రమయొక్క అతి ముఖ్య శాఖలనూ, రవాణానూ, ప్రభుత్వ వ్యాపా రాన్నీ అభివృద్ధిచెయ్యడంలోనూ ప్రభుత్వపు నిర్ణయాత్మక పాత్రను గురించి నొక్కిచెప్పింది. "సోషలిస్టు తరహా రాజ్యాన్ని" జాతీయ లక్ష్యంగా ఆమోదించేందుకు వ్యూహాత్మక, మౌలిక ప్రాముఖ్యం కలిగిన పరిశ్రమలన్నీ ప్రభుత్వ రంగంలో ఉండటం అవసరమని అది పేర్కొంది.

ప్రైవేటు రంగపు భయాలను నివారించేందుకు ఉద్దేశింపబడిన కొన్ని మినహాయింపులు నిర్దేశింపబడ్డాయి. ఉదాహరణకు, యీ రెండు రంగాలనూ విభజించే నిశితమైన రేఖ యేదీ లేదనీ, ప్రభుత్వపు గుత్త స్వామ్యంలో వున్న పరిశ్రమల్లో సైతం ప్రైవేటు సంస్థలు ఉత్పత్తిని నిర్వహించేందుకు కొన్ని సందర్భాల్లో అనుమతింపబడతాయనీ పేర్కొన బడింది. కొన్ని సరుకుల ఉత్పత్తిలో ప్రభుత్వ, ప్రైవేటు రంగాలు సహకరిస్తాయని తలచబడింది.

1956 నాటి తీర్మానం జాతీయకరణ గురించి ప్రస్తావించలేదు.

చిన్నతరహా, కుటీర పరిశ్రమలకు అన్ని రకాల తోడ్పాటునూ యివ్వ వలసిన అవసరం గురించీ, జాతీయోత్పత్తిలో వాటి పాత్రను గురించీ అది పేర్కొంది.

ఆ తీర్మానంలో నిపుణ సిబ్బంది, శ్రమకూ పెట్టుబడికీ మధ్య సంబంధాలు, అలాగే, దేశపు అన్ని భాగాల ఏకరీతి ఆర్థికాభివృద్ధి సమస్యలకి ప్రత్యేక స్థానం యివ్వబడింది.

ఆ తీర్మానం ప్రభుత్వ రంగాన్ని గణనీయంగా పటిష్ఠం చెయ్య డాన్ని నిర్దేశించి, దాని యితోధికాభివృద్ధికి ఒక కార్యక్రమాన్ని రూపొం దించింది. దేశపు ఆర్థికాభివృద్ధి దిశనూ, స్వభావాన్నీ ఎంపికచేసుకోవడంలో ప్రభుత్వపు నిర్ణయాత్మక పాత్రను అది నిర్వచించింది. ఆ తీర్మానం తన రాజకీయ, ఆర్థిక స్థానాన్ని పటిష్ఠం చేసుకోవడంపట్లా, వెనక బడిన పాక్షిక ఫ్యూడల్ ఆర్థిక వ్యవస్థను సాధ్యమైనంత త్వరితంగా ఆధునిక వ్యవస్థగా మార్చడంపట్లా భారత జాతీయ కాంగ్రెస్ ప్రభు త్వానికి వున్న వాంఛను ఆ తీర్మానం ప్రతిబింబించింది. ఈ లక్ష్యాన్ని సాధించడంలో అన్ని ప్రయత్నాలనూ కేంద్రీకరించడానికీ, ఆర్థిక వనరులను ప్రభుత్వపు చేతుల్లో సమీకరించి, వాటిని జాతీయార్థిక వ్యవస్థయొక్క నిర్ణయాత్మక శాఖల్లోకి మళ్లించడానికీ, తద్వారా యావత్తు ఆర్థికా భివృద్ధి ధోరణినీ నిర్ణయించేందుకూ ప్రథమగణ్య ప్రాముఖ్యం ఉంది. ప్రభుత్వం పారిశ్రామికీకరణ భారాన్ని చేబట్టింది కనుక, దేశీయ మార్కెట్ అభివృద్ధికీ, శీఘ్ర ఆర్థికాభివృద్ధిని రూఢిచేసే స్థిరమైన వాతావరణాన్ని సృష్టించడానికీ సంబంధించిన కొన్ని జరూరు సమస్యలను అది పరిష్కరించవలసివుంటుంది.

సోషలిస్టు తరహా సమాజమే జాతీయ లక్ష్యమని భారత జాతీయ కాంగ్రెసు ప్రకటించాక పారిశ్రామిక విధానంపైన 1956 తీర్మానం గురించి మరింత విస్తృతంగా వ్యాఖ్యలు చెయ్యబడ్డాయి. ప్రభుత్వ బాధ్యత పరిశ్రమ అన్ని శాఖలకీ విస్తరింపచెయ్యబడింది. ప్రభుత్వం

ఏ పరిశ్రమనైనా కీలక వ్యూహాత్మక ప్రాధాన్యం కలిగినదిగా పరిగణించి, దాన్ని ప్రభుత్వ రంగంలో చేర్చగలుగుతుంది ఇది 1961 నాటి పార్లమెంటరీ తీర్మానంలో ధృవీకరింపబడింది ఆ తీర్మానం సారభూతంగా పరిశ్రమల ప్రాముఖ్య స్థాయిపైన ఆధారపడి, ఆయా తరగతుల్లోకి వాటి లాంఛనపూర్వక విభజనను రద్దుచెయ్యడాన్ని ధృవీకరించింది. ఇది, ఏ దశలోనైనా సాంఘికార్థిక అభివృద్ధికి జాతీయ వ్యూహపు నిర్దిష్ట దిశపైనా, లక్ష్యాలపైనా ఆధారపడి అన్ని పరిశ్రమల అభివృద్ధినీ నియంత్రితం చేసేందుకు ప్రభుత్వానికి సావకాశం కల్పిస్తుంది.

ప్రభుత్వ తీర్మానాల్లోని, పంచవర్ష ప్రణాళికల్లోని మౌలిక సూత్రాలు, పెద్ద మార్పులేమీ లేకుండా, 1970 దశకం మధ్యదాకా భారతదేశపు ఆర్థికాభివృద్ధి వ్యూహాన్ని నిర్ణయించింది

భారత జాతీయ కాంగ్రెస్ పార్టీ స్థానంలో జనతా పార్టీ అధికారంలోకి వచ్చినప్పుడు ఆర్థిక విధానపు వక్కాణింపులో గమనీయమైన మార్పు వచ్చింది 1979లో ముగియవలసివున్న ఐదవ పంచవర్ష ప్రణాళిక నిలిపివెయ్యబడింది 1977 నవంబరులో ఆరవ పంచవర్ష ప్రణాళికకు (1978–83) ప్రాతిపదికగా రూపొందించబడిన ఆర్థిక విధానాన్ని గురించిన ఒక ప్రకటనను ప్రభుత్వం విడుదల చేసింది 1978 మార్చిలో జాతీయాభివృద్ధి మండలి ఆ 5 ఏళ్ల కాలంలో ఆర్థికాభివృద్ధికి సంబంధించిన ప్రధాన లక్ష్యాలను ఆమోదించింది

జనతా పార్టీ రూపొందించిన పద్ధతిలో ఆరవ పంచవర్ష ప్రణాళిక ప్రధాన లక్ష్యం ఉత్పత్తి సామర్థ్యాన్ని పెంపొందించి, ఉద్యోగావకాశాలను పెంచడం. ఈ లక్ష్య సాధనకోసం కొన్ని మదుపులను మళ్లించాలనీ, వాటి నిర్మాణాన్ని మార్చాలనీ ప్రతిపాదించబడింది

ఆరవ పంచవర్ష ప్రణాళిక ముసాయిదా పరిశ్రమలో 7 శాతం సగటు పెరుగుదల రేటును ఉద్దేశించింది ప్రథమంగానూ, ప్రధానంగానూ ఆర్థిక వ్యవస్థయొక్క శ్రమ సాంద్ర శాఖలైన వ్యవసాయం

లోను, కుటీర పరిశ్రమల్లోను, నీటి పారుదల నిర్మాణాల్లోను, అంతర్ నిర్మాణంలోను (ప్రత్యేకించి రోడ్ల నిర్మాణం), గృహ నిర్మాణంలోను మదుపులను గణనీయంగా పెంచడం ద్వారా ఇది సాధించబడాలి. ఇవన్నీ ఉద్యోగావకాశాలను పెంచేందుకు, వినిమయ వస్తువులకు, పాక్షిక తయారీ వస్తువులకు, ఉత్పాదక యంత్రసామగ్రికి మార్కెట్ విస్తరణకు ప్రేరణ నిచ్చేందుకు ఉద్దేశించబడ్డాయి.

పారిశ్రామికోత్పత్తి పెరుగుదల ఎక్కువ భాగం ఉన్న ఉత్పాదక సామర్థ్యాలను మరింత పూర్తిగా వినియోగించుకోవడం ద్వారా ఉత్పత్తి సామర్థ్యం తక్కువ వినియోగాన్ని సాధ్యమైనంత తగ్గించడం ద్వారా సాధించబడాల్సివుంది. ఉద్యోగావకాశాలను పెంచేందుకుగాను సాంకేతిక క్రమాల ఎంపికపై ప్రత్యేక శ్రద్ధ కేంద్రీకరించబడింది. భారీ ఉత్ప త్తితో పోలిస్తే చిన్న తరహా ఉత్పత్తిలో మదుపుల వాటాను పెంచాలని ప్రతిపాదించబడింది. చిన్న తరహా ఉత్పత్తియొక్క అన్ని రంగాల్లోనూ మదుపులు దాదాపు మూడు రెట్లు పెంచబడవలసివుండగా, భారీ ఉత్పత్తిలో మదుపులు 25నుంచి 19 శాతానికి తగ్గించబడవలసివుంది.

బడా జాతీయ, విదేశీ కంపెనీలకు సంబంధించి కూడా ఆ పంచ వర్ష ప్రణాళిక విధానాన్ని నిర్వచించింది. భారీ భారతీయ, విదేశీ వ్యాపారుల చేతుల్లో ఆర్థికాధికార సాంద్రీకరణను నివారించేందుకుగాను మధ్య రకం జాతీయ ప్రభుత్వ కంపెనీలకు మరిన్ని సౌకర్యాలు ఇవ్వ బడాలని వక్కాణించబడినప్పటికీ, ఆరోగ్యప్రదమైన పారిశ్రామికాభివృద్ధి ప్రయోజనాల దృష్ట్యా, ఈ అభివృద్ధి సమాజ ప్రయోజనాలకు వ్యతిరేకంగా వినియోగింపబడనంత కాలం, జాతీయ, విదేశీ పెట్టుబడి తగుమాత్రంగా పెరగవలసిన అవసరాన్ని గుర్తిస్తూ గణనీయమైన ఒక మినహాయింపు ఇవ్వబడింది. రుణ వ్యవస్థ యంత్రాంగాన్ని వినియోగించి, పాతగిలిన కీన్స్ పద్ధతుల ద్వారా బడా పెట్టుబడి పెరుగుదలను నియంత్రితం చెయ్యాలని ప్రతిపాదింపబడింది. అయితే, అభివృద్ధిచెందిన

పెట్టుబడిదారీ దేశాల అనుభవమూ స్వయంగా భారతదేశపు అనుభవమూ యీ పద్ధతి అంత ఫలవంతమైనది కాదన్న విషయాన్ని నిరూపించింది.

గత సంవత్సరాల ఆర్థిక విధానపు సాధారణ చట్రాన్ని లాంఛన ప్రాయంగా అట్టేపెడుతూనే, నూతన ప్రణాళిక వక్కాణింపు చిన్నతరహా ఉత్పత్తిపైకీ, వ్యవసాయంపైకీ మళ్ళింపబడింది. ప్రభుత్వ రంగపు కీలక పాత్ర గుర్తింపబడినప్పటికీ, పట్టణాల్లోనూ, గ్రామసీమలోనూ చిన్న తరహా ఉత్పత్తిపట్ల ప్రత్యేక శ్రద్ధ చూపబడింది. ఇది ప్రభుత్వం చేసే పునరుత్పత్తి నియంత్రణ క్రమాన్ని బలహీనపరచక తప్పదు, భారతదేశపు బహుళ సాంఘికార్థిక నిర్మాణానికి ప్రభుత్వ రంగపు చేర్పు అయిన ప్రణాళికా రచనపైనా, అనుపాతాలను కొనసాగించడంపైనా ఆక్షే పణగా పనిచెయ్యక తప్పదు. మరోలా చెప్పాలంటే, ఆర్థిక వ్యూహపు ఈ దిశాభిముఖత్వం ఆర్థిక వ్యవస్థ సమతూక అభివృద్ధికి ఒక అవసర షరతైన, ప్రభుత్వ రంగపు ప్రాధమ్య పెరుగుదల ప్రాతిపదికపైన సాధింపబడే ఆర్థిక వ్యవస్థ పటిష్ఠతను మందగింపజేసివుండేది. అది విచ్ఛిత్తి స్థాయిని కూడా పెంచివుండేది. అలా జరిగివుంటే అది మొత్తంమీద ఆర్థిక పెరుగుదల వేగాన్ని, దేశంలో సాంఘికార్థిక పున ర్వ్యవస్థీకరణ క్రమాలను ప్రభావితం చెయ్యకుండా ఉండేదికాదు. ఇంతకుముందే పేర్కొన్నట్లు సరిగా అదే జరిగింది.

ఆర్థిక విధానంలోని తప్పుడు అంచనాలు జనతా పార్టీ ప్రభుత్వ పాలన చివరి సంవత్సరంలో విషమ పరిణామాలకు దారితీశాయి. 1979/80లో ఆర్థిక పెరుగుదల రేటు 3 శాతానికి తగ్గిపోయింది.

1980 జనవరి ఎన్నికల్లో విజయం పొందిన తర్వాత ఇందిరా గాంధీ నాయకత్వాన భారత జాతీయ కాంగ్రెస్ ఆరవ పంచవర్ష ప్రణాళికను సవరించింది. ఆ ఏడాది జూన్ మాసంలో తన నూతన ఆర్థిక విధానంపైన అదొక తీర్మానాన్ని ఆమోదించింది. అది ఈ

విధానపు అనుస్యూతిని గురించీ, జాతీయార్థిక వ్యవస్థ పునర్నిర్మాణ సమస్యను మొదటి సారిగా ముందుకు తెచ్చిన 1956 తీర్మానంతో దాని సంబంధాలనూ ప్రత్యేకించి పేర్కొంది. జనతా పార్టీ ఆర్థిక భావనలను విమర్శించి, దేశపు ఆంతరిక వనరులను అత్యధిక స్థాయిలో సమీకరించవలసిన అవసరాన్నీ, జాతీయోత్పత్తిని విస్తరింపజేసి, శ్రమ ఉత్పాదకతను పెంపొందించి ఉపాధిని పెంపొందించవలసిన అవసరాన్నీ ఆ తీర్మానం పేర్కొంది. ఆ తీర్మానం దేశపు కొన్ని ప్రాంతాల అభివృద్ధిలో ఉన్న వ్యత్యాసాలను తొలగించవలసిన అవసరాన్నీ, వ్యావసాయిక–పారిశ్రామిక కాంప్లెక్స్‌లను అభివృద్ధిచేసి ఉత్పత్తి సాంకేతిక స్థాయిని పెంపొందించి, దిగుమతుల స్థానంలో ఆ వస్తువుల ఉత్పత్తిని దేశంలో విస్తరింపచెయ్యడంతోబాటు ఎగుమతి పరిశ్రమల అభివృద్ధి త్వరీకరణను రూఢీవరచవలసిన అవసరాన్ని గురించి కూడా పేర్కొంది. ప్రభుత్వ రంగాన్ని అభివృద్ధిచేసి, మెరుగుపరచి, దాని ఫలదాయకతను పెంచవలసిన ఆవశ్యకతపైన అది ప్రత్యేకమైన వక్కాణింపు యిచ్చింది. గుత్త ధోరణులను తిప్పికొట్టి, బడా బూర్జువావర్గపు ఒక చిన్న బృందం చేతిలో ఆర్థికాధికార కేంద్రీకరణను నివారించవలసిన అవసరం గురించి కూడా ఆ తీర్మానం పేర్కొంది. ఆంతరిక ధరల నియంత్రణ సమస్యను అది లేవనెత్తింది.

పరిశ్రమయొక్క అత్యంత ఫలవంతమైన నిర్మాణం, భారీ, చిన్న తరహా పరిశ్రమల ఉత్పత్తి, ఆర్థిక సంబంధాల సమస్యలపట్ల ఆ తీర్మానంలో ప్రత్యేక శ్రద్ధ చూపబడింది.

ఆరవ పంచవర్ష ప్రణాళిక (1980–85) దరహంమీద ఆర్థికాభివృద్ధికి 1,72,200 కోట్ల రూపాయలు, స్థిర పెట్టుబడిలో మొత్తం మదుపులకోసం 1,58,700 కోట్ల రూపాయలు కేటాయించింది. ప్రభుత్వ రంగపు మదుపు కార్యక్రమానికి 84,000 కోట్ల రూపాయలు కేటాయింపబడ్డాయి. ఈ మొత్తం యీ ప్రణాళికా కాలంలో

పూర్తిచెయ్యబడవలసివున్న ప్రాజెక్టులపైన ప్రస్తుత వ్యయంతో కలిసి 97,500 కోట్ల రూపాయలు అవుతుంది. ప్రైవేటు రంగపు పెట్టుబడి మదుపులు 74,710 కోట్ల రూపాయలుగా అంచనా వెయ్యబడ్డాయి. కాగా, మొత్తం మదుపుల్లో ప్రభుత్వ రంగపు మదుపులు 53 శాతం, ప్రైవేటు రంగపు మదుపులు 47 శాతం ఉంటాయి.

వెనకటి పంచవర్ష ప్రణాళికతో పోలిస్తే ప్రభుత్వ రంగపు అభివృద్ధికి కేటాయింపులు 148 శాతం పెరిగాయి. జాతీయ ఆదాయపు పెరుగుదల మొత్తం రేటు 5.2 శాతంగానూ, తలసరి ఆదాయపు రేటు 3.3 శాతంగానూ నిర్ణయింపబడింది. పంచవర్ష ప్రణాళిక అంతానికి 1979/80 ధరల ప్రకారం తలసరి ఆదాయాన్ని 1.749 రూపాయలకు అంటే, 17 శాతం పెంచాల్సి ఉంది.

ఏడవ పంచవర్ష ప్రణాళిక (1985/86–1989/90) ప్రకారం ప్రభుత్వ రంగానికి 1,80,000 కోట్ల రూపాయలు కేటాయింపబడ్డాయి.

మొత్తంమీద ఆర్థిక పెరుగుదల రేటును, ఆర్థిక వ్యవస్థలో మదుపులను, ప్రత్యేకించి దాని ప్రభుత్వ రంగంలో మదుపులను, పెంపొందించడంయొక్క లక్ష్యం: కొన్ని తక్షణ సమస్యలను పరిష్కరించేందుకు తోడ్పడటం, తద్వారా జాతీయార్థిక వ్యవస్థ మౌలిక రంగాల స్థిర, సమతులిత అభివృద్ధిని స్థిరపరచడం.

ప్రస్తుత ప్రభుత్వం తీసుకున్న చర్యల ప్రభావం దేశపు ఆర్థిక పరిస్థితిపైన, ప్రత్యేకించి పారిశ్రామికోత్పత్తిపైన పడటం మొదలైంది. 1980/81లో పారిశ్రామికోత్పత్తిలో పతనాన్ని నిలుపుదల చెయ్యడం మాత్రమే కాకుండా 4 శాతం పెరుగుదలను సాధించడంలో కూడా భారతదేశం విజయవంతమైంది.*

---

* *The Sunday Standard*, March 1, 1981.

ఆరవ పంచవర్ష ప్రణాళిక ఆర్థిక పురోగతిని సాంఘిక సమస్యల పరిష్కారంతో మేళవించింది. ఆర్థిక పెరుగుదల అన్నప్పుడూ సామాజిక ప్రగతికి పర్యాయం కాదు. కొన్ని సందర్భాల్లో పెరుగుదల రేటు సామాజిక అవసరాలను తీర్చేందుకు సరిపోదు. మరికొన్ని సందర్భాల్లో యీ పెరుగుదల నిర్మాణం యీ అవసరాలను పూర్తిగా పరిగణనలోకి తీసుకోవడంలో విఫలమైంది. భారతదేశంలో సాంఘిక సమస్యలు చాలా విశితంగా ఉన్నాయి.

జాతీయార్థిక వ్యవస్థను అభివృద్ధిచెయ్యడంలో నిర్దిష్టమైన పురోగతి సాధించబడినప్పటికీ, దేశం నిరుద్యోగం, జనాభాలో విస్తృత విభాగాల పేదతనం వంటి సమస్యల పరిష్కారంలో యింకా బాగా వెనకబడే వుంది. ఉత్పత్తి రంగంలో, ప్రత్యేకించి పారిశ్రామికోత్పత్తి రంగంలో భారతదేశం కొంత విజయం సాధించింది. అయితే సంపద, ఆదాయాల పంపిణీ, పునఃపంపిణీల అభివృద్ధి చాలా మందంగా సాగుతోంది.

ఏడవ పంచవర్ష ప్రణాళికలో (1985–1990) జాతీయార్థిక వ్యవస్థ అభివృద్ధిలో పెట్టుబడి మదుపుల్లో సాధారణ పెరుగుదల వుంటుందనీ, 1984–85 ధరల ప్రకారం యీ పెరుగుదల 3,20,000 కోట్ల రూపాయలు ఉంటుందనీ, యీ మొత్తంలో ప్రభుత్వ రంగపు వాటా 1,80,000 కోట్ల రూపాయలు ఉంటుందనీ ఊహించబడింది. ఆ ప్రణాళిక పొదుపు రేటును 26 శాతంగా ఊహించింది. ఇది గత ప్రణాళికలోని సూచికకంటె కొంచెం ఎక్కువ. ప్రణాళిక అమలుకు అవసరమైన ద్రవ్య వనరుల సమీకరణ విదేశీ పరపతి మూలాధారాలపై భారతదేశపు అధీనతనూ, లోటు ఫైనాన్సింగు ద్రవ్యోల్బణ ప్రభావాన్నీ కనీస స్థాయికి తగ్గించే పద్ధతుల్లో అమలుజరుగుతుందని తలచబడుతోంది. దీన్ని సాధించేందుకుగాను ప్రభుత్వ రంగ లాభార్జన సామర్థ్యం పెంపొందుతుందని అంచనా వేయబడుతోంది. పునరుత్పత్తి క్రమంలో స్థానిక వనరులు వినియోగించబడతాయి. రెవెన్యూ

వ్యవస్థ సామర్థ్యం పెంచబడుతుంది. సమాజంలోని సంపన్న విభాగపు అతిశయ వినియోగమూ, వివిధ అనుత్పాదక పాలనా సంబంధమైన వ్యయాలూ తగ్గింపబడతాయి.

ఏడవ పంచవర్ష ప్రణాళిక ఆర్థికాభివృద్ధి వ్యూహం ఉత్పత్తిలో గణనీయమైన పెరుగుదలతోబాటు ఉత్పత్తి పెట్టుబడి సాంద్రత తరుగుదలను సాధించవలసివుంటుంది. ప్రణాళికలో సూచించబడిన లక్ష్యాల పరిపూర్తికి ఆరవ పంచవర్ష ప్రణాళికలోనే సాధింపబడిన 5 శాతాన్ని మించిన ఆర్థిక పెరుగుదల స్థాయిని కొనసాగించడం అవసరం.

ఈ ప్రణాళిక సాంఘిక సమస్యలకి విశేష ప్రాముఖ్యం యిస్తోంది. సాంఘిక న్యాయం ఆర్థిక వ్యూహపు ప్రముఖ సూత్రంగా చాటబడింది. దీనిలో ఉద్యోగ కల్పన ప్రధానాంశం. పాదార్థిక ఉత్పత్తిలో – ప్రప్రథమంగా పరిశ్రమల్లో, వ్యవసాయంలోనూ – వినియోగింపబడిన మనుషుల సంఖ్యను పెంచడం సామూహిక బీదరికాన్ని నిర్మూలించే ప్రధాన సాధనం. ప్రణాళికా కర్తలు చెప్పేదాన్నిబట్టి అసలు పెరుగుదల నిర్మాణ రూపమే ఆదాయాల్లో పెరుగుదలను ఖాయం చెయ్యవలసివుంటుంది. ఈ కర్తవ్యాల పరిష్కారంలో ద్రవ్యోల్బణాత్మక క్రమాలను అదుపుకొని, నిరోధించే లక్ష్యంతో తీసుకోబడే చర్యలకి విశేష పాత్ర వుండాలి.

ఆర్థిక పెరుగుదలకీ సాంఘిక ప్రగతికీ మధ్య మరింత సన్నిహితమైన పరస్పర సంబంధాన్ని నెలకొల్పడం ద్వారా ప్రస్తుత పంచవర్ష ప్రణాళిక యీవిధంగా దేశపు ఆర్థిక, సాంఘిక అభివృద్ధి ప్రముఖ పాత్రను వక్కాణిస్తోంది.

ఏడవ పంచవర్ష ప్రణాళికను 2000వ సంవత్సరంవరకు గల దశలో సాంఘిక, ఆర్థిక రంగాల్లో దేశపు దీర్ఘకాలిక అభివృద్ధి దృష్ట్యా కూడా పరిశీలించవలసివుంటుంది. ప్రణాళిక ప్రధాన లక్ష్యాలు విజయవంతంగా సాధింపబడ్డాయన్నదానిమీద ఆధారపడి, శతాబ్ది అంతానికి దేశం ఆర్థిక నిర్మాణ రూపంలో గణనీయమైన మార్పుల్ని సాధిస్తుంది –

1985లో 36.9 శాతం వున్న వ్యవసాయపు వాటా 25.6 శాతానికి తగ్గుతుంది, జాతీయార్థిక వ్యవస్థ నికర ఉత్పత్తిలో ప్రాసెసింగ్ పరిశ్రమ 14.7 శాతంనుంచి రమారమి 20 శాతందాకా పెరుగుతుంది.*

రాబోయే మూడు పంచవర్ష ప్రణాళికల కాలంలో ఆర్థికాభివృద్ధి వ్యూహం ''స్వయంసమృద్ధ'' స్వభావాన్ని సంతరించుకొంటుందని, అంటే పునరుత్పత్తి క్రమం ప్రధానంగా జాతీయ ప్రాతిపదికమీద అమలుజరపబడుతుందని ఊహించబడుతోంది. ఇది తిరిగి తన వంతులో అంతర్జాతీయ ఆర్థిక సంబంధాల్లో దేశపు స్థానంపైన గణనీయమైన ప్రభావం కలిగిస్తుంది, అభివృద్ధికి సంబంధించిన బాహ్యాంశాల — ప్రైవేటు విదేశీ పెట్టుబడి, పెట్టుబడిదారీ రాజ్యాల ప్రభుత్వ రుణాల — ప్రతికూల ప్రభావాన్ని తగ్గిస్తుంది.

సాంఘిక విధానపు ప్రధాన లక్ష్యం దారిద్ర్యాన్ని తగ్గించడం. 1983/84లో జనాభాలో దారిద్ర్య రేఖకి దిగువన బతుకుతున్నవారు 37 శాతానికి పైగా వున్నారు. కాగా, శతాబ్దాంతానికి దీన్ని 26 శాతానికి తగ్గించాలని అంచనా వెయ్యబడుతోంది.**

దేశం ఎదుర్కొంటున్న సంక్లిష్ట, భారీ ఆర్థిక, సాంఘిక సమస్యల పరిష్కారానికి కేవలం వనరులను సమీకరించడమూ, వాటిని పొదుపుగా వాడటమే సరిపోదు. దేశంలోని ఆంతరిక రాజకీయ పరిస్థితిమీదా, ప్రపంచ ఆర్థిక, రాజకీయ సంబంధాల వ్యవస్థలో భారతదేశపు స్థానం ఏ దిశ తీసుకుంటుందన్నదానిమీదా చాలా మటుకు ఆధారపడుతుంది.

---

* *The Telegraph*, August 10, 1985.

** అదే పత్రిక, ఆగస్టు 11, 1985.

3. చిన్నతరహా ఉత్పత్తి నిర్మాణం

భారతీయ పరిశ్రమ ఆర్థిక నిర్మాణంలోని మార్పులు పెట్టుబడి దారీ అభివృద్ధి సద్యోజనిత క్రమాలచేతా, ప్రభుత్వపు క్రియాశీల ఆర్థిక కృషిచేతా ప్రభావితం చెయ్యబడతాయి.

దేశంలో పారిశ్రామిక విప్లవం ఎగుడుదిగుడుగా వుంది, అదింకా పూర్తి కాలేదు. ఈ విషయం పెట్టుబడిదారీ, పెట్టుబడిదారీ పూర్వ రూపాల సహజీవనంలో మాత్రమే కాకుండా, పెట్టుబడిదారీ ఆర్థిక వ్యవస్థ అత్యున్నత, అతి నిమ్న రూపాలను — రూపసామ్యం కలిగివున్న ప్పటికీ భిన్న పరిణత దశల్లో వున్న — సమ్మిళితంచేసే పారిశ్రామిక పెట్టుబడిదారీ వ్యవస్థ బహుముఖత్వంలో కూడా వ్యక్తమవుతుంది. అంతే కాకుండా, అది భారీ, చిన్నతరహా యాంత్రిక ఉత్పత్తికి సంబంధించిన అత్యున్నత రూపాల విభజనలో కూడా వ్యక్తమవుతుంది. వీటన్నింటి దృష్ట్యా దేశపు ఆర్థిక వ్యవస్థలోని మార్పులు స్పష్టంగా నిర్వచింప బడిన సామాజిక ధోరణి కలిగివుంటాయి.

ఉత్పత్తి సంబంధాల దృష్ట్యా ఇవి భిన్న రూపాలు కనుక, ఉత్పా దక శక్తుల స్థాయీ, వాటి అభివృద్ధీ భిన్నమైన తరహాలను అనుసరిస్తాయి. బహుళ రంగ ఆర్థిక వ్యవస్థలో పునరుత్పత్తి క్రమం అత్యంత వైరుధ్య పూరిత స్వభావాన్ని సంతరించుకుంటుంది.

స్వభావ రీత్యా క్రియాశీలమూ, విస్తరణాత్మకమూ అయిన పెట్టు బడిదారీ రంగం — ప్రత్యేకించి దాని మరింత పరిణత రూపాలు — బడా, గుత్త పెట్టుబడి తన ప్రభావ రంగాన్ని విస్తరింపచేసుకొనేటప్పుడు, సాంప్రదాయిక రూపాలను, కొన్ని సమయాల్లో తక్కువ పరిణతమైన పెట్టుబడిదారీ రూపాలను సైతం రూపుమాపేందుకు మొగ్గుచూపు

తుంది చాలా సందర్భాల్లో భగ్నచేయబడిన పాత రూపాల, సంబంధాల స్థానంలో కొత్తవి తగినంతగా రూపొందలేదు

ఈ పరిస్థితుల్లో చిన్నతరహా సరుకు ఆర్థిక వ్యవస్థలోనూ, చిన్నతరహా పెట్టుబడిదారీ రూపాల్లోనూ ప్రభుత్వ జోక్యం నిర్ణయాత్మక ప్రాధాన్యాన్ని సంతరించుకొంటుంది ఎందుకంటే, యధాతధమైన, రాడికల్ పద్ధతుల్లో మిక్కిలి నిమ్న సామాజికార్థిక రూపాలను పైకి లేపి, మరింత తక్కువ అభివృద్ధిచెందిన ఆర్థిక రూపాలను ఒకే పునరుత్పత్తి క్రమంలోకి లాగేందుకు తోడ్పడగలిగిన ఏకైక శక్తి అది మాత్రమే ప్రభుత్వపు ఆర్థిక కృషి రెండు ప్రధానమైన పంథాలను అనుసరిస్తుంది పెట్టుబడిదారీ పరిశ్రమ అత్యున్నత రూపాల విస్తరణను నిరోధించే పంథా, మరింత తక్కువ అభివృద్ధిచెందిన రూపాల పరిణామానికి సానుకూల పరిస్థితులను సృష్టించే పంథా

ఈనాటిదాకా పరిశ్రమ నిర్దిష్ట జాతీయ లక్షణాలు, ఆమాటకి వస్తే యావత్తు భారతీయ ఆర్థిక వ్యవస్థ నిర్దిష్ట లక్షణాలు చిన్నతరహా పరిశ్రమ విశిష్టతలచేత నిర్ణయింపబడుతున్నాయి ఆర్థిక వ్యవస్థలో దానికి చాలా పెద్ద వాటా ఉండటమే ఇందుకు కారణం. 1979/80లో అది 30,900 కోట్ల రూపాయల విలువైన వస్తువులను లేక మొత్తం పారిశ్రామికోత్పత్తి విలువలో 49 శాతాన్ని, చేర్చబడిన విలువలో 51 శాతాన్ని ఉత్పత్తిచేసింది అదే దశలో 2 కోట్ల, 33 లక్షలమంది చిన్నతరహా ఉత్పత్తిలో నియుక్తులు కాగా భారీ, మధ్య తరహా ఉత్పత్తిలో 45 లక్షలమంది నియుక్తులయారు. ప్రస్తుతం చిన్నతరహా పరిశ్రమలు దేశపు ఎగుమతుల్లో 3వ వంతును ఉత్పత్తిచేస్తున్నాయి.

స్వాతంత్ర్య సాధనసంతరం భారతీయ ఆర్థిక వ్యవస్థలో గణనీయమైన మౌలిక మార్పులు సంభవించినప్పటికీ, జాతీయార్థిక వ్యవస్థలో చిన్నతరహా పరిశ్రమ వాటా పెరుగుతూనే వుంది ఉదాహరణకు 1973/74కి

1979/80కి మధ్య చిన్నతరహా పరిశ్రమల ఉత్పత్తి విలువ 1979/80 ధరల ప్రకారం 10,000 కోట్ల రూపాయలకి పైగా పెరిగింది, 60 లక్షలమందికి పైగా అదనంగా ఉద్యోగాలు పొందారు.*

చిన్నతరహా ఉత్పత్తి ఆర్థిక నిర్మాణం దేశంలో అన్ని చోట్లా ఒకే మాదిరిగా లేదు. దానిలో విభిన్న ఆర్థిక రూపాలకి చెందిన విభిన్న సామాజిక పరిశ్రమ రూపాలు ఇమిడివున్నాయి. వివిధ రకాల చిన్నతరహా ఉత్పత్తికి సంబంధించి విభిన్న పరిస్థితులు ఉన్న విషయాన్ని, వాటి పునరుత్పత్తి వలయపు సాపేక్ష వేర్పాటును, భారీ ఉత్పత్తితో వాటి సంబంధాల వివిధ రూపాలను పరిమితులను మాత్రమే కాకుండా, ప్రభుత్వపు ఆర్థిక విధానంపట్ల విభిన్న ప్రతిస్పందనను కూడా యిది వివరిస్తుంది.

''చిన్నతరహా పరిశ్రమ'' అన్న పదం 20మందికి మించకుండా పనిచేసే యాంత్రికేతర పరిశ్రమలకీ, పదిమందికి తక్కువ పనిచేసే యాంత్రిక పరిశ్రమలకీ వర్తిస్తుంది. స్థిర పెట్టుబడి పరిమాణాన్ని బట్టి చేసే సమాంతరమైన వర్గీకరణ కూడా వుంది: 1953దాకా అది 1 లక్ష రూపాయలవరకు, 1956నుంచి 5 లక్షల రూ॥లవరకు, 1966నుంచి 7.5 లక్షల రూ॥లవరకు, ప్రస్తుతం స్థిర పెట్టుబడి 20నుంచి 25 లక్షల రూపాయలను మించనిది చిన్నతరహా పరిశ్రమ. అయితే, యీ సాధారణ గణాంక లెక్కలు చిన్నతరహా ఉత్పత్తి రకాల వైవిధ్యానికి గాని, దాని పరిణామానికి గాని సంబంధించిన తగినంత స్పష్టమైన చిత్రాన్ని యివ్వవు.

చిన్నతరహా ఉత్పత్తిని దాని సాంఘికార్థిక, పదార్థిక సాంకేతిక లక్షణాలనుబట్టి రెండు గ్రూపులుగా విభజించవచ్చు:

---

* *The Sixth Five Year Plan...*, p. 187.

1. కుటీర పరిశ్రమలు – సాంప్రదాయిక ఉత్పత్తి రూపం. వాటిని ప్రధానంగా చిన్న సరుకు ఉత్పత్తిగా పరిగణించవచ్చు. వాటిలో వేతన శ్రమ దాదాపుగా లేక అసలే వినియోగింపబడదు. వాటిలో ప్రధానంగా అతి సరళ పరికరాలతో అనిపుణ చేతి శ్రమ వినియోగింపబడుతుంది. కొందరు దళారీల ద్వారా ఒకొక్కప్పుడు తమ సరుకులకు అవి జాతీయ మార్కెట్‌లోనూ, చివరకు ప్రపంచ మార్కెట్‌లోనూ స్థానం పొంది నప్పటికీ, అవి ప్రధానంగా స్థానిక మార్కెట్ అవసరాలను తీరుస్తాయి.

కుటీర పరిశ్రమలు ప్రధానంగా గ్రామాల్లో సాంద్రీకరింపబడి వుండి, గ్రామసీమ ఆర్థిక వ్యవస్థలో ఒక భాగంగా వుంటాయి. అత్యధిక భాగం అవి భారతీయ గ్రామ సమాజపు సాంప్రదాయిక చేతివృత్తుల కొనసాగింపు. కుటీర పరిశ్రమలు రైతు క్షేత్రాల్లో పెట్టుబడిదారీ పూర్వ రూపాల్లో సృజించే అవసరమైన, అదనపు ఉత్పాదితపు పునరుత్పత్తికి తోడ్పడతాయి. వాటి ఉత్పాదితాలు ప్రధానంగా అతి సరళ పద్ధతుల్లో ఉత్పత్తిచెయ్యబడిన సాంప్రదాయిక సరుకులు. సాంప్రదాయిక రూపాల్లో పని నిర్వహణ, గిరాకీలో మార్పులేని స్థానిక, సామాన్యంగా గ్రామ మార్కెట్‌కి సంబంధించిన నిర్దిష్ట లక్షణాలు, అంతేకాకుండా కొన్ని సందర్భాల్లో ఉత్పత్తిచెయ్యబడిన వస్తువుల నాణ్యత పరిమాణాల నియంత్రణ – ఇవన్నీ జాతీయార్థిక వ్యవస్థలో కుటీర పరిశ్రమల స్థిరత్వానికి దోహదంచేసే అంశాలు. భారతదేశంలో పెట్టుబడిదారీ వ్యవస్థ అభివృద్ధి ఇటీవలే ఆధునిక ఫాక్టరీలకీ, సాంప్రదాయిక ఉత్పత్తి రూపాలకీ మధ్య మరింత సన్నిహితమైన సంబంధాల ఆవిర్భావానికి దారితీసింది. కుటీర పరిశ్రమల కొన్ని శాఖలు మార్కెట్ గిరాకీకి ప్రతివర్తించి ఆధునిక వస్తువులను ఉత్పత్తిచెయ్యడం మొదలుపెట్టాయి, తద్వారా సాంప్రదాయిక కుటీర పరిశ్రమయొక్క ఒక మాదిరి ఉప శాఖ ఏర్పడింది. 1979/80లో కుటీర పరిశ్రమల ఉత్పాదితపు విలువ 4,410

కోట్ల రూపాయలు ఉంది అది సుమారు 1 కోటి, 33 లక్షలమందికి ఉపాధి కల్పించింది *

2 చిన్నతరహా పెట్టుబడిదారీ పరిశ్రమలు — వేతన శ్రమపైన, యంత్రాలపైన ఆధారపడిన ఉత్పత్తి వాటి ఉత్పాదితం ప్రధానంగా జాతీయ, ప్రాంతీయ మార్కెట్లకు వెళ్తాయి కొన్ని సందర్భాల్లో ప్రపంచ మార్కెట్‌తో వాటి సంబంధాలు గణనీయంగా స్థిరంగా ఉంటాయి 1979/80లో వాటి ఉత్పాదితపు విలువ 22,300 కోట్ల రూపాయలకు పైగా ఉంది అది 75 లక్షలమందికి పైగా ఉపాధి కల్పించింది **

అది పారిశ్రామిక పెట్టుబడిలో ఒక భాగం అది పారిశ్రామిక పెట్టుబడి టర్నోవరుకి ప్రధానంగా తోడ్పడుతుంది ఈ పరిశ్రమలు ఏకరీతివి కావు

సాధారణంగా ఈ గ్రూపులోని మిక్కిలి అభివృద్ధిచెందిన పరిశ్రమలు పట్టణాల్లో నెలకొల్పబడతాయి అవి యంత్రాలనూ, వేతన శ్రమనూ విస్తృతంగా వినియోగిస్తాయి వాటికి జాతీయ మార్కెట్‌తో సంబంధాలు ఉంటాయి అవి ప్రధానంగా ఇంజనీరింగు, లోహ, రసాయనిక, తదితర ఆధునిక పారిశ్రామిక శాఖలకు చెందుతాయి వాటిలో 67 శాతం పారిశ్రామికంగా అభివృద్ధిచెందిన రాష్ట్రాల్లో నెలకొల్పబడ్డాయి తక్కువ అభివృద్ధిచెందిన చిన్నతరహా పెట్టుబడిదారీ పరిశ్రమలు చిన్న తరహా సరుకు ఉత్పత్తినుంచి చిన్నతరహా పెట్టుబడిదారీ ఉత్పత్తికి పరివర్తన దశలో ఉన్న కుటీర పరిశ్రమల భాగాన్ని ఎక్కువగా పోలి వున్నాయి. వాటిలో అత్యధిక భాగం గ్రామీణ ప్రాంతాల్లో లేక చిన్న

---

* *The Sixth Five Year Plan.* , p 187

** అదే పత్రం, అదే పేజి

పట్టణాల్లో ఉన్నాయి. అవి యంత్రాలను, వేతన శ్రమను మరింత చిన్న స్థాయిలోనూ, తగ్గు స్థాయిలోనూ వినియోగిస్తున్నాయి.

చిన్నతరహా ఉత్పత్తి వహించే స్థానమూ, ప్రాధాన్యమూ, పాత్రా అన్నిటికన్న ఎక్కువగా జాతీయ శ్రమ విభజన, వివిధ రంగాల మధ్య అంతస్సంబంధాల నిర్దిష్ట లక్షణాల ఫలితం. ఇవి ఈ తరహా ఉత్పత్తిని నాసిగా అభివృద్ధిచెందిన పెట్టుబడిదారీ ఆర్థిక వ్యవస్థలో ఒక ఆవశ్యక భాగాన్ని చేస్తాయి. వ్యవసాయానికీ పరిశ్రమకీ మధ్య ఉత్పత్తి సంబంధాలు ఏకముఖమైనవిగా ఉండి అంత బాగా అభివృద్ధిచెంద లేదు. వ్యవసాయం ప్రధానంగా ముడి పదార్థాల సరఫరాదారుగానే ఉంది గాని పారిశ్రామిక వస్తువుల వినిమయదారుగా లేదు. అంతేకాకుండా చిన్నతరహా పరిశ్రమతో (అత్యధిక భాగం కుటీర పరిశ్రమలు) దాని సంబంధాలు భారీ పరిశ్రమతో సంబంధాలకన్న దృఢతరమైనవి. వ్యవసాయం చిన్నతరహా పరిశ్రమ పాదార్థిక ఖర్చులలో సుమారు 50 శాతం భరిస్తుంది. ఉత్పత్తి వినిమయానికి ఉద్దేశింపబడిన దాని ఉత్పత్తిలో 35 శాతాన్ని తీసుకొంటుంది. అందుకు భిన్నంగా ఉత్పత్తి వినిమయానికి ఉద్దేశింపబడిన భారీ పరిశ్రమ ఉత్పాదితంలో 6 శాతం మాత్రమే తీసుకొంటుంది.

వ్యక్తిగత వినిమయ రంగంలో చిన్న తరహా పరిశ్రమ పాత్ర మరింత అధికంగా ఉంటుంది. భారీ పరిశ్రమ ఉత్పాదితంకంటె దాని ఉత్పాదితం మరింత ఎక్కువ నిర్ణయాత్మకంగా వినిమయ వస్తువుల మార్కెట్‌కి ఉన్ముఖం చెయ్యబడుతుంది. ఇది దేశీయ వినిమయదారీ మార్కెట్‌లో గిరాకీ నిర్మాణానికి పూర్తి అనుగుణంగా ఉంది. భారత దేశంలో వినిమయదారీ గిరాకీలో అత్యధిక భాగాన్ని వ్యవసాయం తీరుస్తోంది: ఈ గిరాకీలో ఆహార పదార్థాల గిరాకీ 55 శాతం. వీటిలో ఫాక్టరీ ప్రాసెసింగుకి గురికాని 45 శాతం ఆహార పదార్థాలు ఇమిడి వున్నాయి. వ్యక్తిగత వినిమయ నిధిలో 20 శాతం మాత్రమే కార్ఖానా

సరుకుల ద్వారా లభిస్తోంది. దీనిలో సగం చిన్నతరహా పరిశ్రమచేత సరఫరా చెయ్యబడుతోంది.

ఆర్థిక వెనుకబాటుతనాన్ని తొలగించేందుకు ఉత్పత్తియొక్క అత్యధిక అనుపాతాలూ, మరింత ఉన్నత సామర్థ్యమూ అవసరం. బహుళ రంగ ఆర్థిక వ్యవస్థలో ఆధునిక పారిశ్రామిక సంస్థల స్థాపన ద్వారా మాత్రమే, తదనుగుణమైన సాంప్రదాయిక పారిశ్రామిక, వ్యావసాయిక రూపాల పునర్నిర్మాణం లేకుండా, దీన్ని సాధించడం సంభవం కాదు. పెట్టుబడిదారీ పూర్వ, పాక్షిక పెట్టుబడిదారీ ఉత్పత్తి రూపాలను తుడిచిపెట్టేసేందుకు జరిగే ఏ ప్రయత్నమైనా కూడా, అది ఉద్దేశపూర్వకంగా చేసేదైనా, సద్యోజనితంగా చేసేదైనా, విభిన్న ఉత్పత్తి రూపాల మధ్యా, మొత్తంగా పునరుత్పత్తి క్రమంలోనూ అభివృద్ధిచెందిన సమతూకాన్ని తలకిందులుచేసేందుకు మాత్రమే దారితీస్తుంది. పాత ఉత్పత్తి రూపాల స్థానంలో కొత్తవాటిని ప్రవేశపెట్టకుండా పాత వాటిని నిర్మూలించడం అనివార్యంగా సంక్షోభానికీ, పతనానికీ, మాంద్యానికీ, సామాజిక శ్రమ ఉత్పాదకత బాగా తగ్గిపోవడానికీ, అధికతర నిరుద్యోగానికీ, ముందే తక్కువగా వున్న శ్రామిక ప్రజల జీవన ప్రమాణం మరింతగా పడిపోవడానికీ దారితీస్తుంది.

రాజకీయ స్వాతంత్ర్యం అన్ని రకాల పరిశ్రమలకీ సానుకూల అవకాశాలను ఆవిష్కరించినప్పటికీ, ఉన్నత స్థాయి విస్తృత పునరుత్పత్తితో కూడిన భారీ పరిశ్రమలు మాత్రమే అత్యధిక పురోగతిని సాధించాయి. చిన్నతరహా పరిశ్రమల్లో పెట్టుబడిదారీ రూపాలు మాత్రమే అత్యంత వేగంగా అభివృద్ధిచెందాయి. విస్తరిత పునరుత్పత్తి నమూనా కూడా యీ రూపాలకే వర్తిస్తుంది. 1974–80 దశలో చిన్నతరహా ఉత్పత్తి పెరుగుదల రేటు 6 శాతానికీ 8 శాతానికీ మధ్య ఊగిసలాడింది. ఆరవ పంచవర్ష ప్రణాళిక మొత్తంగా చిన్న తరహా పరిశ్రమకి 8 శాతం పెరుగుదల రేటును అంచనా వేసింది. సాంప్రదాయిక రూపాలకు

7 3 శాతం, ఆధునిక రూపాలకు 9.2 శాతం అభివృద్ధి రేటు దీనిలో యిమిడివుంది.*

పెట్టుబడిదారీ పరిశ్రమ, దాని సంస్థల పరిమాణంతో నిమిత్తం లేకుండా మరింత త్వరితంగా పురోగమిస్తుంది కనుక, మొత్తంమీద సమతూకం చిన్నతరహా ఉత్పత్తికి, దాని సాంప్రదాయిక, ప్రధానంగా పెట్టుబడిదారీ పూర్వ రూపాల్లో సానుకూలంగా వుండదు. మొదటి చూపులకు, మొత్తంమీద పారిశ్రామిక ధోరణి చాలవరకు స్పష్టంగా కనిపిస్తుంది. చిన్నతరహా సరుకు రూపం తొలగింపబడుతుంది లేక చిన్న తరహా పెట్టుబడిదారీ రూపాల్లోకి పరివర్తితం చెయ్యబడుతుంది. అదే సమయంలో చిన్నతరహా పెట్టుబడిదారీ రూపాలు క్రమంగా భారీ పరిశ్రమలుగా అభివృద్ధిచెందుతాయి లేక ఆధునిక భారీ ఉత్పత్తికి అను బంధితమవుతాయి అయితే యీ మొత్తం ధోరణి, బహుళ రంగ ఆర్థిక వ్యవస్థ యింకా ఒక వాస్తవంగానే ఉన్న కాలంలో, పారిశ్రామిక పెట్టుబడి పెరుగుదల త్వరీకృత గతి పర్యవసానంగా చిన్నతరహా ఉత్ప త్తికీ భారీ ఉత్పత్తికీ మధ్య తలెత్తే నిర్దిష్ట లక్షణాలనూ, నూతన సంబంధాలనూ, వైరుధ్యాలనూ ప్రతిబింబించడం లేదు.

మొట్టమొదట, చిన్నతరహా పరిశ్రమల విస్తృత ప్రమాణాన్నీ, వాటి సాపేక్ష స్థిరత్వాన్నీ పరిగణనలోకి తీసుకోవడం అవసరం ఎందు కంటే, వాటిని మార్చేందుకు ఏ సాధనాలు, ఏ ప్రయత్నాలు అవసర మవుతాయన్న అతి తీవ్ర సమస్యనూ, చిన్నతరహా పరిశ్రమకీ వ్యవసా యానికీ మధ్య ఉత్పత్తి సాధనాల, వినిమయ వస్తువుల సాపేక్షంగా స్థిరమైన సాంప్రదాయిక వస్తుమార్పిడి ప్రాతిపదికమీద అభివృద్ధిచెందిన పునరుత్పత్తి క్రమంలో ఏ కొత్త రూపాలు దాని స్థానాన్ని ఆక్రమించ గలవన్న సమస్యనూ అది ముందుకు తెస్తుంది చిన్నతరహా సరుకు,

---

* *The Sixth Five Year Plan*.., p 190

చిన్నతరహా పెట్టుబడిదారీ పరిశ్రమ సమస్య వ్యవసాయ సంబంధాల పరిణామ, పరివర్తనలకు సరైన పరిగణను యివ్వనిదే, అంటే మరింత సంక్లిష్టమైన సాంఘికార్థిక సంబంధాలతో కూడిన ఆర్థిక వ్యవస్థ యొక్క బృహత్తర శాఖలో జోక్యంచేసుకోనిదే పరిష్కరింపబడదని కూడా తేలుతుంది.

అభివృద్ధిచెందిన పెట్టుబడిదారీ దేశాల్లో చిన్నతరహా పరిశ్రమలు భారీ పరిశ్రమలతో సన్నిహితంగా ముడిపడి వుండి, వాటికి ఉపయోగ పడుతూ వుండగా, భారతదేశంలో చిన్నతరహా పరిశ్రమలు, ప్రత్యే కించి వాటి సాంప్రదాయిక రూపాలు, భారీ పరిశ్రమలకు మరింత దూరంగా నిలున్నూ, మరింత స్వయంసమృద్ధంగా వున్నాయి అదే సమయంలో, వాటికి ముడి పదార్థాల ప్రధాన సరఫరాదారూ, అవి ఉత్పత్తిచేసే వస్తువుల ప్రధాన వినిమయదారూ అయిన వ్యవసాయంతో వాటి పునరుత్పత్తి సంబంధాలు భారీ పరిశ్రమలతో వాటి సంబంధాల కంటె సాటిలేనంత సన్నిహితమైనవి మరోవైపున, చిన్నతరహా పరిశ్ర మలకీ, భారీ పరిశ్రమలకీ మధ్య ఉత్పాదిత వస్తువుల మారకం యిరు వైపులా జరిగే అభివృద్ధిచెందిన పెట్టుబడిదారీ దేశాల్లో మాదిరిగా కాకుండా, భారతదేశంలో చిన్నతరహా పరిశ్రమలకీ భారీ పరిశ్రమలకీ మధ్య పునరుత్పత్తి సంబంధాలు ఏకముఖంగా వుంటాయి భారీ పరిశ్ర మలో ఉత్పత్తి అయిన సరుకులు చిన్నతరహా పరిశ్రమలకేసి ప్రవహిస్తాయి, చిన్నతరహా పరిశ్రమల సరుకులు భారీ పరిశ్రమల్లోకి ప్రవహించడం ఎక్కువగా లేదు 1950, 1960 దశకాల్లో ప్రచురింపబడిన లెక్కల ప్రకారం, భారీ పరిశ్రమలు ఉత్పత్తిచేసే సరుకుల్లో 20 శాతం చిన్నతరహా పరిశ్రమలకి మళ్లింపబడుతున్నాయి దీని ద్వారా భారీ పరిశ్రమల వ్యయంలో దాదాపు 30 శాతం పూడుతోంది అదే సమ యంలో, ఉత్పత్తి ప్రయోజనాల నిమిత్తం చిన్నతరహా పరిశ్రమలనుంచి అది దాదాపు సరుకులను యేమీ గ్రహించడం లేదు

ఈ రెండు తరహాల పరిశ్రమలకీ మధ్య సంబంధాల యీ విశిష్ట లక్షణం, రైతుకీ చేతివృత్తిపనివాడికీ మధ్య వ్యావసాయిక, ఉత్పాదిత వస్తువుల మారకాలమీద ఆధారపడిన చిన్నతరహా సరుకు ఆర్థిక వ్యవస్థ పునరుత్పత్తి వలయపు ఏకాకి స్వభావానికి అనుగుణంగానే వుంది. ఈ అంతరిక పునరుత్పత్తి సంబంధాలు నిస్సందేహంగా చిన్నతరహా సరుకు ఉత్పత్తియొక్క అధికతర స్థిరత్వానికి దోహదం చేస్తాయి. అయితే అదే సమయంలో అవి భారీ యాంత్రిక ఉత్పత్తితో దాని పునరుత్పత్తి సంబంధాల విస్తరణను నిరోధిస్తాయి.

చిన్నతరహా ఉత్పత్తిని నిలుపుకొనేందుకు పెట్టుబడి తీవ్ర కొరతా, శ్రమ కావలసినదానికన్న ఎక్కువ ఉండటమూ కూడా దోహదంచేస్తున్నాయి. భారతదేశంలో చిన్నతరహా ఉత్పత్తి కనీస స్థిర పెట్టుబడిని గరిష్ఠమైన అనిపుణ లేక పాక్షిక నిపుణ శ్రమతో ఫలవంతంగా మేళవించడాన్ని సాధ్యం చేస్తోంది. దీనికి కొన్ని సరుకుల తీవ్ర కొరతను జోడించవలసివుంది. ఈ కొరత మూలంగా ఉత్పత్తి ఖర్చులు చాలా అధికంగా ఉన్నప్పటికీ, ఆర్థిక వ్యవస్థలో అసమతూకం ఉన్న కారణంగా ఏర్పడే మార్కెట్ సంవిధానపు నిర్దిష్ట లక్షణాల మూలంగానూ, కొన్ని సరుకులకు పరిమితమైన గిరాకీ ఉన్న మూలంగానూ సరుకుల అమ్మకం సాధ్యమవుతోంది. ఈ చివరి అంశం సరుకును అధిక ప్రమాణాల్లో ఉత్పత్తిచేసే లాభసాటి ఫాక్టరీ తరహా ఉత్పాదక సంస్థలను నెలకొల్పడం ద్వారా గిరాకీని తట్టుకోవడాన్ని కష్టసాధ్యం చేస్తుంది. మరోవైపున చిన్నతరహా ఉత్పత్తి ఈ గిరాకీని తీర్చగలుగుతుంది. ఎందుకంటే, దాని ఉత్పత్తి అధిక ప్రమాణాలతో నిమిత్తం లేకుండా అది లాభం సంపాదించగలుగుతుంది.

చిన్నతరహా సరుకు, చిన్నతరహా పెట్టుబడిదారీ ఉత్పత్తి రూపాల స్థిరత్వం విలువ, ఉత్పత్తి వ్యయం, ఉత్పత్తి లాభదాయకత వంటి ఆర్థిక భావనల అన్వయాన్ని మినహాయించే లేక పరిమితం చేసే ప్రత్యేక

మైన ఉత్పత్తి పరిస్థితులచేత కూడా నిలవబడుతోంది. భారతీయ అర్థశాస్త్రవేత్తలు వేసిన అంచనాలు చిన్నతరహా పరిశ్రమలు లాభసాటిగా లేవన్న విషయాన్ని ధృవీకరిస్తాయి. అయినప్పటికీ, చిన్నతరహా ఉత్పత్తిలో పెట్టుబడి మదుపుల ఫలదాయకత — యిది వెచ్చించబడిన పెట్టుబడికి విలువ చేర్చబడిన ఉత్పాదితవు నిష్పత్తిగా అంచనావెయ్యబడుతుంది — సాధారణంగా భారీ పరిశ్రమలోకంటె అధికంగా వుంటుంది. చిన్నతరహా పరిశ్రమలో ఉన్నతమైన ఉత్పత్తి సామర్థ్యం శ్రమ, పెట్టుబడుల వినియోగానికి అత్యుత్తమ పరిస్థితులను సృష్టించడం ద్వారా కాక, ఉన్నత పెట్టుబడి సాంద్రత, శ్రమ ఉత్పాదకతల ద్వారా కాక, ఉత్పత్తిదారు అవసరాలను కేవలం బతికేందుకు సరిపడే స్థాయికి తగ్గించడం ద్వారా, పరికరాలపైనా, ఉత్పత్తి సాధనాలపైనా కనీస వ్యయం చెయ్యడం ద్వారా సాధింపబడటమే దానికి కారణం. చిన్నతరహా పరిశ్రమలు ఉత్పత్తిచేసే వస్తువులకు, వాటి అసలు ఖరీదుతో నిమిత్తం లేకుండా, ధరలు నిర్ణయించడం, ఉత్పత్తిమీద ధరల (మార్కెట్) ప్రభావాన్ని కనీస స్థాయికి తగ్గించడం సాధ్యమవుతుంది.

చిన్నతరహా పరిశ్రమల ''సహజ'' స్థిరత్వానికి సంబంధించిన యీ అంశాలు, సాంప్రదాయిక కుటీర పరిశ్రమలకీ, చిన్న ఫాక్టరీలకీ కూడా తరతమ స్థాయిల్లో వర్తిస్తాయి. చిన్న పెట్టుబడిదారీ ఫాక్టరీలకు కూడా, అవి బడా పరిశ్రమలకు అనుబంధ సంస్థలు కాకపోతే, ఆర్థిక వ్యవస్థ అంతర్ రంగాల పరిమితుల ద్వారా, పునరుత్పత్తి సంకుచిత వలయం ద్వారా, భారీ పరిశ్రమలతో ప్రత్యక్ష పోటీనుంచి మార్కెట్‌ని వేరుచేయడం ద్వారా రక్షణ కల్పించబడుతుంది.

వీటన్నింటి మూలంగా చిన్న ఫాక్టరీలు పెద్దవాటితో సహజీవనం సాగించడం, కెమేరాలు, ఆప్టికల్ వస్తువులు, సెరమిక్సు, తోలు వస్తువులు, అల్లిక వస్తువులు, డబ్బాల్లో నిల్వచెయ్యబడిన ఆహార పదార్థాలు,

ఫర్నిచరు వంటి పాక్షికంగా సంశ్లిష్టమైన రకాల వస్తువుల ఉత్పత్తిలో స్థిరమైన స్థానాన్ని నిలుపుకోవడం సాధ్యమవుతుంది

అయితే, యీ స్థిరత్వం అఖండమైనది కాదు అది లోతులోనూ, విస్తృతిలోనూ పెట్టుబడిదారీ వ్యవస్థ అభివృద్ధి రేటుపైన ఆధారపడుతుంది ఎందుకంటే, అది బహుళ రంగ ఆర్థిక వ్యవస్థ ఉనికియొక్క మొత్తం రీతినీ, పరిస్థితులనూ ప్రభావితం చేస్తుంది పారిశ్రామికాభివృద్ధి క్రమంలో చిన్న పరిశ్రమల ఉత్పాదితంలో కొంత భాగం స్థానాన్ని పెద్ద ఫాక్టరీల ఉత్పాదితం ఆక్రమిస్తుంది లేక వెళ్లగొడుతుంది అదే సమయంలో, కొన్ని సందర్భాల్లో పెద్ద ఫాక్టరీలు కొత్త మార్కెట్లను సృష్టించుకున్నప్పుడు లేక పెరుగుతున్న గిరాకీని తీర్చలేక తమ మార్కెట్లను వాటికి వదిలినప్పుడు చిన్న పరిశ్రమల కొన్ని గ్రూపులు తమ ఉత్పత్తిని విస్తరింపజేసేందుకు ప్రేరణ పొందవచ్చు వివిధ ధోరణుల యీ పెనవేత, ఘర్షణ, కలయికలను అంతిమ విశ్లేషణలో చిన్నతరహా ఉత్పత్తి పెరుగుదల లేక తరుగుదల క్రమాలను నిర్ణయించే సద్యోజనిత శక్తుల దిశగా వర్ణించవచ్చు

అది భారీ పరిశ్రమతో ఒక నూతన శ్రమ విభజనలోకి యీడ్వబడకుండా నివారించిన ప్రభుత్వ ఆర్థిక విధానం చిన్నతరహా ఉత్పత్తి సాపేక్ష స్వాతంత్ర్యానికి దోహదం చేసే మరో అంశం జాతీయ శ్రమ విభజనలో చిన్నతరహా ఉత్పత్తి స్థానాన్ని నిర్వచించిన ఆరవ పంచవర్ష ప్రణాళికలో యీ పరిస్థితిలో కొన్ని మార్పులు సూచింపబడ్డాయి

విస్తృతిమా, ప్రత్యేకించి ప్రగాఢత్వంలోనూ పెట్టుబడిదారీ వ్యవస్థ అభివృద్ధి చిన్నతరహా ఉత్పత్తిని రూపుమాపే ఆంతరిక, బాహ్య ధోరణులను — యిప్పటిదాకా దాని సాపేక్ష స్థిరత్వాన్ని రూఢిపరచే అంశాలు ఉన్నప్పటికీ — తీవ్రతరం చేస్తుంది పరిశ్రమలోనూ, వ్యవసాయంలోనూ పెట్టుబడిదారీ వ్యవస్థ అభివృద్ధికి మార్గాన్ని సుగమంచెయ్యడం చిన్న తరహా ఉత్పత్తిదారు యితోధిక వినాశంతో ఏదో ఒక విధంగా అనివార్యంగా

ముడిపడివుంటుంది. ఈ దృష్ట్యా, పెట్టుబడిదారీ వ్యవస్థ బహుళ రంగాల ఆర్థిక వ్యవస్థ అంతర్వైరుధ్యాలు వ్యగ్రమయ్యేందుకూ, వివిధ ఆర్థిక రంగాల మధ్య సంబంధాలను బలహీనపరచేందుకూ, కొన్ని సంద ర్భాల్లో వాటి విచ్ఛిత్తికీ, చివరకు మొత్తంమీద పునరుత్పత్తి సహజ క్రమం భగ్నమయ్యేందుకూ దారితీస్తుంది. భారతదేశంలో సాంఘికార్థిక అభివృ ద్ధికి సంబంధించి వున్న సంక్లిష్టమైన, చిక్కు సమస్యల దృష్ట్యా, ఆ దేశానికి, యూరప్‌లోని స్వతంత్రమైన పెట్టుబడిదారీ దేశాలు తమ అభివృద్ధి క్రమంలోని యిదే మాదిరి చారిత్రక దశలో చేసిన ప్రమాణంలోనూ, పద్ధతిలోనూ పెట్టుబడిదారీ వ్యవస్థకి మార్గాన్ని సుగమం చెయ్యడం అసాధ్యం.

ఇదంతా చిన్నతరహా ఉత్పత్తిపట్లా, భారీ ఉత్పత్తిపట్లా, మొత్తంగా ఆర్థిక వ్యవస్థపట్లా ఒక క్రమబద్ధమైన వైఖరినే కాకుండా, ఆ క్రమంలో ప్రభుత్వపు క్రియాశీల జోక్యాన్ని అవసరంచేస్తోంది. ప్రభుత్వం సద్యో జనిత క్రమాల నిర్వహణకర్తగా, నియంత్రణకర్తగా వ్యవహరించి, ఆర్థిక వ్యవస్థ విభిన్న రంగాలు అసమానంగా అభివృద్ధిచెందే పరిస్థితిలో విభిన్న ఆర్థిక రంగాల మధ్య పరస్పర ప్రతివర్తన క్రియను ఖాయంచేసి, ఆ ప్రాతిపదికపైన పునరుత్పత్తి క్రమపు ఐక్యతను సమకూరుస్తుంది.

పారిశ్రామికీకరణ క్రమంలో ఉత్పన్నమయ్యే సంశ్లిష్ట, పరస్పర విరుద్ధ ఆర్థిక, సాంఘిక, రాజకీయ సమస్యలను గురించి పూర్తిగా తెలిసిన భారత ప్రభుత్వం, చిన్నతరహా ఉత్పత్తి పరివర్తనాభివృద్ధులకోసం ఒక విస్తృత కార్యక్రమాన్ని రూపొందించి, దాన్ని అమలుజరిపేందుకు కొన్ని ప్రత్యేక సంస్థలను నెలకొల్పింది.

అధికార పత్రాలూ, ఆర్థిక సర్వేలలో ఎక్కువ భాగమూ చిన్న తరహా ఉత్పత్తిని కాపాడి, అభివృద్ధిచెయ్యడం, భారీ యాంత్రిక ఉత్ప త్తితో దాన్ని సమరసంగా జోడించేందుకు గట్టి చర్యలు తీసుకోవడమూ అవసరమని సూచిస్తున్నాయి.

చిన్నతరహా ఉత్పత్తికి సంబంధించి ప్రభుత్వ ఆర్థిక విధానపు మౌలిక సూత్రాలనూ, ధోరణులనూ రూపొందించడం 1950 దశకం లోనే మొదలైంది ఉదాహరణకు, పారిశ్రామిక విధానంపైన 1956లో చెయ్యబడిన తీర్మానం చిన్నతరహా పరిశ్రమల కనీస పెట్టుబడి వ్యయంతో, అతి తక్కువ కాలంలో, ఉత్పత్తిని పెద్ద ఎత్తున విస్తరింపజెయ్యడాన్నీ, సామూహిక ఉద్యోగ కల్పననూ సాధ్యం చేసిందనీ, అది వనరుల మరింత ప్రయోజనకరమైన సమీకరణకూ, ఆదాయ, సంపదల మరింత సమాన పంపిణీకీ దోహదం చేసిందనీ పేర్కొంది రెండవ పంచవర్ష ప్రణాళిక చిన్నతరహా ఉత్పత్తిని ఆర్థిక వ్యవస్థలోనే కాకుండా, జాతీయ ప్రణాళికా రచనా సంవిధానంలో కూడా విడదీయరాని, స్థిర భాగంగా లభివర్ణిం చింది

దేశం అప్పట్లో తన సాధారణ ఆర్థిక వ్యూహాన్ని రూపొందించు కొంది మదుపులను యంత్రనిర్మాణ రంగంలో సాంద్రీకరించవలసిన అవసరం మూలంగా యీ వ్యూహం రూపొందింది అదే సమయంలో చిన్నతరహా పరిశ్రమలు వినిమయ వస్తువుల ఉత్పత్తి రంగంలో ప్రముఖ పాత్ర వహించవలసివుంటుంది ఎందుకంటే, చిన్నతరహా పరిశ్రమలో ఉత్పత్తి, శ్రమలు తక్కువ పెట్టుబడి సాంద్రత కలిగివుంటాయి

రెండవ, మూడవ పంచవర్ష ప్రణాళికల్లో మొత్తం పెట్టుబడి మదుపుల్లో వ్యవసాయం 21 శాతమూ, చిన్నతరహా పరిశ్రమ 25 శాతమూ మాత్రమే పొందాయి అయితే, వాటి అభివృద్ధి జాతీయాదా యంలో వరుసగా 51 శాతమూ, 61 శాతమూ, ఉపాధి పెంపుదలలో వరుసగా 42 5 శాతమూ, 54 5 శాతమూ ఉండవలసివుంది

రెండవ పంచవర్ష ప్రణాళిక, కొంత మేరకు మూడవ ప్రణాళిక ప్రధాన లక్ష్యం కూడా చిన్నతరహా ఉత్పత్తిని, ప్రత్యేకించి చిన్నతరహా సరుకు ఉత్పత్తిని అభివృద్ధిచెయ్యడంకంటె, దాన్ని నిలిపివుంచడమే ఆ ప్రణాళికల ఆర్థిక కార్యక్రమంలో ప్రాబల్యం వహించే ప్రత్యేక్ష

రక్షణవాద పద్ధతులు యీ విషయాన్ని తెలియజేస్తాయి. అయితే, మూడవ పంచవర్ష ప్రణాళికలో అప్పుడే ప్రభుత్వ ఆర్థిక విధానంలో నూతన ధోరణుల చిన్నెలు కానవచ్చాయి. చిన్న పరిశ్రమలకు రుణ పరపతి కల్పన, ద్రవ్య సహాయ వ్యవస్థను మెరుగుపరచడం, వాటి సాంకేతిక స్థాయినీ, శ్రమ ఉత్పాదకత స్థాయినీ పెంచడం, గ్రామీణ ప్రాంతాల్లోనూ, చిన్న పట్టణాల్లోనూ చిన్నతరహా పరిశ్రమ అభివృద్ధిని త్వరితంచెయ్యడం అనే కర్తవ్యాన్ని తన ముందు పెట్టుకుంది. అయితే, ఆ ప్రణాళిక చిన్నతరహా పరిశ్రమ సాంఘిక, శాఖా, సాంకేతిక పునర్నిర్మాణానికి సుస్పష్టమైన కార్యక్రమాన్ని రూపొందించలేదు.

నాల్గవ పంచవర్ష ప్రణాళికలో దేశపు సాంఘిక, ఆర్థిక పురోగతికోసం రూపొందించబడిన వ్యూహానికి అనుగుణంగా, చిన్నతరహా పరిశ్రమలు విస్తృత వైవిధ్యపూరితమైన, ఉన్నత నాణ్యత కలిగి, పోటీకి తట్టుకోగల ధరల్లో ఆధునిక వస్తువులను ఉత్పత్తిచెయ్యగలిగేందుకుగాను, ప్రధానంగా ఆయా రంగాల నిర్మాణాన్నీ, ఉత్పత్తి టెక్నాలజీనీ మెరుగుపరచడంపైన దృష్టి కేంద్రీకరింపబడింది. అదే సమయంలో, దేశంలో ఉత్పత్తిని మరింత సమానంగా పంచేలా చూడటం, ఆర్థికాధికార వికేంద్రీకరణ జరిగేలా చూడటం, ఆదాయాల్లో అసమానతను తగ్గించడమే నాల్గవ పంచవర్ష ప్రణాళిక లక్ష్యం. వెనకటి ప్రణాళికల్లో మాదిరిగా కాకుండా, నాల్గవ పంచవర్ష ప్రణాళిక ప్రభుత్వపు సాంఘిక, ఆర్థిక వ్యూహంలో చిన్నతరహా ఉత్పత్తికి ఒక ముఖ్య పాత్రను కేటాయించింది. క్రియారహిత అంశంగా ఉండేందుకు బదులు, ఆర్థిక పెరుగుదలలో అదొక క్రియాశీలమైన అంశం అవాలన్నమాట. అంతేకాకుండా కొంత మేరకు, ప్రభుత్వ పెట్టుబడికి పాదార్థిక ప్రాతిపదికా, సాంఘిక మూల స్తంభమూ అవాలి. అందుకే ప్రభుత్వపు ఆర్థిక విధానపు దిశలోనూ, పద్ధతుల్లోనూ కొన్ని మార్పులు ప్రతిపాదించబడ్డాయి: పక్కాణింపు పరోక్ష నియంత్రణ పద్ధతులపైకి మళ్లింపబడింది, చిన్నతరహా

ఫ్యాక్టరీ ఉత్పత్తిపైనా, చిన్నతరహా సరుకు ఉత్పత్తిని చిన్నతరహా పెట్టుబడిదారీ ఉత్పత్తిలోకి మార్చడంపైనా అధికతర శ్రద్ధ చూపబడింది.

నాల్గవ పంచవర్ష ప్రణాళికలో డబ్బు కేటాయించడం, పరపతి సౌకర్యాలను విస్తృతంచెయ్యడంపైనా, చిన్నతరహా పరిశ్రమలకి ముడి పదార్థాలనూ, యంత్ర పరికరాలనూ సరఫరాచెయ్యడంపైనా, నిర్వహణ పరిజ్ఞాన, సాంకేతిక సహాయాలనూ, సబ్సిడీలనూ చేకూర్చడంపైనా, పరోక్ష పనుల విచక్షణపైనా ప్రధానమైన శ్రద్ధ కేంద్రీకరింపబడింది. ఈ చర్యల అంతిమ లక్ష్యం చిన్నతరహా పరిశ్రమల పెరుగుదలకు దోహదం చేసి, వాటిని ఒకవైపున వ్యవసాయంతోనూ, మరోవైపున భారీ పరిశ్రమలతోనూ సన్నిహిత సంబంధం కలిగిన, మరింత లాభసాటి అయిన ఉత్పత్తి రంగంగా మార్చడమే అన్న విషయాన్ని ఆ ప్రణాళిక స్పష్టంగా పేర్కొంది.

ఈ పరిస్థితుల్లో, చిన్నతరహా ఉత్పత్తి ఆధునికీకరణ, నిర్మాణపర, సాంఘిక పరివర్తన మొత్తంగా సమాజ స్థాయిలో ఉత్పత్తి క్రమాలను ముమ్మరంచేసేందుకు ఒక ఆవశ్యక పద్ధతి అవుతుంది. ఇలా ముమ్మరం చెయ్యడం పరిశ్రమ అత్యున్నత, అతినిమ్న రూపాల సమ్మేళనపు వివిధ రూపాల ద్వారా సాధింపబడుతోంది.

అలాంటి ఆధునికీకరణ అవసరమన్న విషయం స్వయంస్పష్టం. అదే సమయంలో, దాన్ని సాధించే అవకాశాలు ప్రధానంగా ప్రభుత్వ పెట్టుబడిదారీ యంత్రాంగపు మొత్తం వ్యవస్థపైన ఆధారపడి, యీ నియంత్రణను అమలుజరపడంలో ప్రభుత్వ సామర్థ్యంచేత నిర్ణయింపబడతాయి. ప్రభుత్వం తీసుకునే చర్యల క్రమమూ, వాటి సాంఘికార్థిక సారాంశమూ వ్యవస్థచేత నిర్ణయింపబడతాయి. మొదట్లో యీ చర్యలు ప్రధాన కర్తవ్యాల పరిష్కారానికీ, పారిశ్రామికోత్పత్తి నిమ్నతమ దశల పరిరక్షణను రూఢిచేసేందుకూ ఉన్ముఖం చెయ్యబడతాయి. ఆటు తర్వాత మాత్రమే వాటి ఆధునికీకరణ సమస్య

చేబట్టబడుతుంది. చివరకు, విభిన్న ఆర్థిక నిర్మాణాల లోపల ఉత్పాదక శక్తుల క్రియాశీల అభివృద్ధిని సమ్మిళితం చెయ్యడాన్ని సాధ్యం చేసే నూతన ఆర్థిక నిర్మాణాలకోసం అన్వేషణ మొదలవుతుంది.

చిన్నతరహా పరిశ్రమలను ఆధునికం చేసే రెండవ ముఖ్య మార్గం దాని శాఖల నిర్మాణాన్ని వైవిధ్యపూరితం చెయ్యడం. ఇంతకుముందే పేర్కొన్నట్లు, చిన్నతరహా పరిశ్రమలు ప్రధానంగా వినిమయ వస్తు రంగంలో పనిచేస్తాయి. అదే సమయంలో, పట్టణాల్లోనూ, మరింత సంపన్న గ్రామవాసుల్లోనూ నాణ్యమైన, మన్నిక కలిగిన సరుకులకు వినిమయదారుల్లో నానాటికీ పెరుగుతున్న గిరాకీని అది దృష్టిలో పెట్టుకుంటుంది. చిన్నతరహా పరిశ్రమ అభివృద్ధిలో ఉత్పత్తి సాధనాల ఉత్పత్తి కూడా వెనకటికంటె అధికతర ప్రాముఖ్యాన్ని సంతరించుకుంటుంది. గతంలో పని రంగాలను విడదియ్యడం, ఒక్కొక్క రంగంలో ప్రత్యేకించి ఒకొక్క పనిని చేయించడం ప్రభుత్వ లక్ష్యం కాగా, యిప్పుడు వ్యవసాయంతో చిన్నతరహా పరిశ్రమల ఏకీకరణ వివిధ రూపాలకు ప్రాముఖ్యం ఇవ్వబడుతోంది. ప్రాసెస్ చెయ్యడం, వ్యవసాయానికి ఉత్పత్తి సాధనాలను సరఫరాచెయ్యడం, భారీ పరిశ్రమల కొత్త వస్తువులను సరఫరాచెయ్యడం ఈ ఏకీకరణ ఉద్దేశం.

ఇవన్నీ, వలసపాలన దినాలనుంచి వారసత్వంగా వచ్చిన భారత ఆర్థిక వ్యవస్థ పాదార్థిక, సాంఘిక నిర్మాణపు పునర్నిర్మాణారంభాన్నీ, నిర్దిష్ట సామాజికార్థిక రూపాల చట్రంతో దాదాపు పూర్తిగా ఏకీభవించిన పాత ఉత్పత్తి రూపాల విచ్ఛిత్తినీ ప్రతిబింబిస్తాయి. ప్రభుత్వం విభిన్న ఆర్థిక రంగాల మధ్య సమతల సంబంధాల స్థాపనకు దారి తీసే సద్యోజనిత ధోరణులను ప్రోత్సహించి, వాటి పనిని ముమ్మరం చేస్తుంది. తద్వారా అది వాటిని రూపాంతరీకరించేందుకూ, సామాజికోత్పత్తి ఫలదాయకతను పెంపొందించేందుకూ తోడ్పడుతుంది.

చిన్నతరహా ఉత్పత్తి రంగంలో ప్రభుత్వం చేబట్టిన నిర్దిష్ట చర్యలను ఈకింది మూడు అంశాలుగా క్రోడీకరించవచ్చు:

1) భారీ పరిశ్రమల పోటీ వినాశకర ప్రభావంనుంచి చిన్నతరహా పరిశ్రమలకు ఆర్థిక, చట్టపర రక్షణ;

2) సామాజికార్థిక అంశంగా చిన్నతరహా పరిశ్రమలను పదిలపరచి, అభివృద్ధిచేసేందుకుగాను, వ్యవసాయంతోనూ, భారీ పరిశ్రమలతోనూ దాన్ని ఏకీకరించేందుకుగాను సామాజిక పునరుత్పత్తి నిర్మాణాన్ని, పెరుగుదల రేటుని, అనుపాతాలని మార్చడం;

3) చిన్నతరహా పరిశ్రమల అభివృద్ధిలో ప్రభుత్వ ప్రత్యక్ష భాగస్వామ్యంతో పరోక్ష సహాయంతోబాటు, అంటే ప్రధానంగా తగిన అంతర్ నిర్మాణాన్ని సృష్టించడం (విద్యుచ్ఛక్తి, రవాణా, పౌర సేవలు, ఉత్పత్తి, గిడ్డంగి అవరణలు, సాంకేతిక పరిజ్ఞాన అభివృద్ధి, నిపుణ కార్మికుల శిక్షణ) ద్వారా ద్రవ్య, పరపతి, వాణిజ్య, నిర్వహణ, శాస్త్రీయ, సాంకేతిక సహాయం.

భారత ప్రభుత్వం చిన్నతరహా పరిశ్రమల అభివృద్ధికి సంబంధించిన తన కార్యక్రమాన్ని అమలుజరిపేందుకుగాను జాతీయ, రాష్ట్ర స్థాయిలలో ప్రత్యేక కౌన్సిళ్లను నెలకొల్పింది.

మొత్తంమీద ఈ సంస్థలన్నింటికీ మార్గదర్శకత్వం వహించే బాధ్యత జాతీయాభివృద్ధి మండలిపైన, జాతీయ ప్రణాళికా కమిషన్ పైన, వాటివాటికి సంబంధించిన మంత్రిత్వ శాఖలపైన, రాష్ట్ర ప్రభుత్వాలపైన ఉంటుంది.

చిన్నతరహా పరిశ్రమ అభివృద్ధికోసం చేసే కేటాయింపులు ఒక్కొక్క ప్రణాళిక గడిచేకొద్దీ పెరుగుతున్నాయి. మొదటి పంచవర్ష ప్రణాళిక కాలంలో ఈ కేటాయింపులు 40 కోట్ల రూపాయలు కాగా, రెండవ ప్రణాళికలో అవి 160 కోట్లకు, మూడవ దానిలో 240 కోట్లకు, నాల్గవ దానిలో 290 కోట్లకు, ఐదవ దానిలో 540

కోట్లకు, ఆరవ దానిలో 1,780 కోట్ల రూపాయలకు పెరిగింది.*

భారతదేశంలో పరపతి వ్యవస్థ ద్వారా అదనపు విలువను సేకరించే అవకాశాలు పరిమితంగా ఉన్నాయి. రుణాల విషయంలో, ప్రత్యేకించి దీర్ఘకాలిక రుణాల విషయంలో ఆర్థిక వ్యవస్థయొక్క పెరుగుతున్న అవసరాలను బాంకులు పూర్తిగా తీర్చలేకపోతున్నాయి. పారిశ్రామిక పెట్టుబడి టర్నోవరులో చిన్నతరహా సరుకు రంగం ఇప్పటికీ చాలా తక్కువగానే నిమగ్నమై వుంది. అందుచేత దానికి పెట్టుబడిదారీ రుణ రూపాలతో దృఢమైన సంబంధాలు లేవు. 1969 సం॥వరకు అత్యధిక సంఖ్యాక రుణ సంస్థలు, ప్రత్యేకించి వాణిజ్య బాంకులు ప్రైవేటు యాజమాన్యం చేతుల్లో ఉన్న కారణంగా ఈ పరిస్థితి ప్రత్యేకించి ఇలా ఉండేది.

ఈ కారణంగా, ప్రభుత్వ రుణ సంస్థలు ఎప్పుడూ ఆర్థిక వ్యవస్థ యొక్క ఈ రంగంలో ముఖ్య పాత్ర వహించి, దాన్ని ఏదో ఒక విధంగా ప్రభుత్వ రంగంతో కలుపుతూ వచ్చాయి.

1948లో భారతదేశం పారిశ్రామిక ఫైనాన్స్ కార్పొరేషన్‌ని నెలకొల్పుకుంది. అది చిన్నతరహా పరిశ్రమలకు రుణాల విస్తరణకి కొంతమేరకు సౌలభ్యం కల్పించింది. 1951లో ఆయా విడి రాష్ట్రాల్లో కూడా ఫైనాన్స్ కార్పొరేషన్లు నెలకొల్పబడ్డాయి. అవి చిన్నతరహా పరిశ్రమదారులకు మధ్యకాలిక రుణాలను యిచ్చే ఏర్పాట్లు చేశాయి. 1956లో స్టేట్ బాంక్ ఆఫ్ ఇండియా కూడా చిన్నతరహా పరిశ్రమలకు రుణాలు ఇవ్వనారంభించింది. పారిశ్రామిక రంగంలోని ఈ విభాగానికి రుణాలను సమన్వయం చేసే బాధ్యత రిజర్వు బాంక్ ఆఫ్ ఇండియాకి అప్పగించబడింది.

అయితే, మొదటి 3 పంచవర్ష ప్రణాళికల కాలంలో చిన్నతరహా

---

* *The Sixth Five Year Plan...*, p. 190.

పరిశ్రమకు రుణాల సమస్య సంతృప్తికరంగా పరిష్కరింపబడలేదు. ఇటీవలి కాలందాకా పట్టణాల్లోని, గ్రామాల్లోని వడ్డీ వ్యాపారులు మాత్రమే వాటికి ప్రధాన రుణదాతలుగా ఉంటూ వచ్చారు. వడ్డీ వ్యాపారుల స్థానం కుటీర పరిశ్రమల విషయంలో ప్రత్యేకించి బలంగా ఉంది.

ప్రస్తుతం, చిన్నతరహా పరిశ్రమకీ, బాంకులకీ, ప్రధానంగా ప్రభుత్వ రుణ వ్యవస్థ చట్రం లోపల, చాలవరకు స్థిరమైన సంబంధాలు నెలకొల్పబడ్డాయి.

చిన్నతరహా పరిశ్రమల జాతీయ కార్పొరేషను, రాష్ట్రాల ఫైనాన్స్ కార్పొరేషన్లు, అంతేకాక నేరుగా రాష్ట్ర ప్రభుత్వాలూ స్థిర పెట్టుబడిని జమచేశాయి. స్టేట్ బాంక్ ఆఫ్ ఇండియా, పారిశ్రామికాభివృద్ధి బాంకు, వాణిజ్య బాంకులు, రుణాలకు పూచీదారుగా ఉండే రిజర్వు బాంక్ ఆఫ్ ఇండియా నిర్వహణ పెట్టుబడిని సమకూరుస్తాయి.

1969లో జాతీయంచెయ్యబడిన వాణిజ్య బాంకులకి చిన్నతరహా పరిశ్రమలకి స్వల్పకాలిక రుణ కల్పనలో పాత్ర పెరుగుతోంది. వాటి జాతీయకరణకి పూర్వం ఆ బాంకులు యీ విషయంలో చేసినది చాలా తక్కువ. 1968లో చిన్నతరహా పరిశ్రమలకు ముట్టిన రుణాలు 190 కోట్ల రూపాయలను, అంటే పరిశ్రమలకు యివ్వబడిన మొత్తం రుణాల్లో 6 శాతాన్ని మించలేదు. ఆ బాంకుల జాతీయకరణ తర్వాత రుణాల మొత్తం విశేషంగా పెరిగింది. అది 1979లో 2,630 కోట్ల రూపాయలను లేక పరిశ్రమలకు యివ్వబడే రుణాల మొత్తంలో 11 శాతాన్ని మించింది. 1968లో వాణిజ్య బాంకులనుంచి 39,000 చిన్నతరహా పరిశ్రమలు మాత్రమే రుణాలు పొందగా, 1977 నాటికి వాటి సంఖ్య 4,86,000ను మించింది.

కాగా, మొత్తంమీద చిన్నతరహా పరిశ్రమకి రుణ కల్పననూ, ద్రవ్య సహాయాన్నీ విస్తరింపజేసే ధోరణి అమల్లోకి వచ్చింది. అయితే,

అత్యధిక సంఖ్యాక వృత్తిపనివారూ, చేతిపనివారూ, ప్రత్యేకించి జనాభా లోని మిక్కిలి పేద విభాగాలకు చెందినవారు చిన్న పట్టణాల్లోనూ, గ్రామాల్లోనూ నివసిస్తూ, బాంకులిచ్చే రుణాలను వినియోగించుకోలేని స్థితిలో వున్నారు.

అందుకని, రుణాల వెరసి మొత్తమూ, వాటి స్వరూపమూ మాత్రమే కాక, అవి ఎవరికి ముట్టుతున్నాయన్నది కూడా ముఖ్యం. ఎందుకంటే, రుణ, ద్రవ్య సహాయాల విస్తరణ యీనాటికీ ప్రధానంగా చిన్నతరహా ఫాక్టరీ పరిశ్రమకి మళ్లింపబడుతూండగా, చిన్నతరహా పరిశ్రమయొక్క విస్తృత రంగానికి, అంటే గ్రామీణ ప్రాంతాల్లోని గృహ, చేతి వృత్తుల పరిశ్రమకి చాలా తక్కువగా అందుతోంది.

చిన్నతరహా పరిశ్రమల అభివృద్ధికి సానుకూల పరిస్థితులను కల్పించేందుకుగాను మరో రంగంలో — వర్తకంలో — ప్రభుత్వపు కార్యకలాపాలు కూడా చాలా ముఖ్యం. ముడి పదార్థాల, యంత్ర పరికరాల సరఫరాకి మాత్రమే కాకుండా చిన్నతరహా పరిశ్రమల ఉత్పాదితాల కొనుగోలుకు కూడా యిది వర్తిస్తుంది.

సన్నకారు ఉత్పత్తిదారుకు అతని వస్తువులను అమ్ముకునే విషయంలో చాలా ఆటంకాలు ఎదురవుతాయి: వస్తువుల ప్రమాణాలు తగినంత ఉన్నతంగా లేకపోవడం, మార్కెట్ ధరలకు సంబంధించిన సమాచార లోపం, భారీ పరిశ్రమలనుంచి పోటీ, గిడ్డంగుల కొరత, ముఖ్యంగా దళారీలపైనా, లాభార్జనపరులపైనా ఆధారపడవలసిరావడం. "ఆరవ పంచవర్ష ప్రణాళిక"లో యిలా పేర్కొనబడింది: "పలువురు చేతిపనులవారూ, వృత్తిపనివారూ ముడి పదార్థాల, పనిముట్ల సరఫరా కోసమూ, తమ వస్తువుల అమ్మకంకోసమూ దళారీలపైనే యీనాటికీ ఆధారపడుతున్నారు. వారి లాభాల్లో అత్యధిక భాగాన్ని ఆ దళారీలే కాజేస్తున్నారు."*

* *The Sixth Five Year Plan...*, p. 194.

చిన్నతరహా పరిశ్రమలకు తోడ్పడేందుకుగాను, ప్రభుత్వం వాటి ఉత్పాదితాన్ని టోకుగా కొనేస్తుంది కేవలం చిన్నతరహా పరిశ్రమల నుంచే ప్రభుత్వం 379 రకాల వస్తువులను కొంటోంది మిగిలినవాటికి, భారీ పరిశ్రమలు తయారుచేసే అవే మాదిరి వస్తువులకుకంటె 15 శాతం ఎక్కువ చెల్లిస్తుంది ఐయితే, యీ చర్యలు ఆశింపబడిన ఫలితాలను యింకా కలిగించలేదు ఆరవ పంచవర్ష ప్రణాళిక "సహకార సంఘాల స్థాపన ద్వారా, ప్రభుత్వ నియమిత సంస్థల ద్వారా ముడి పదార్థాల సరఫరాకూ, ఉత్పాదితాల మార్కెటింగుకూ ఒక సమీకృత పద్ధతిని రూపొందించాలి"* అని ప్రతిపాదించింది

ప్రస్తుతం, చిన్నతరహా పరిశ్రమలకు ముడి పదార్థాలనూ, యంత్ర పరికరాలనూ సరఫరాచేసి, ప్రభుత్వంచేత దాని ఉత్పాదితాల కొనుగోలు లావాదేవీలను జాతీయ చిన్నతరహా పరిశ్రమల కార్పొరేషన్ నిర్వహిస్తోంది ఈ కార్పొరేషన్ ప్రత్యేకించి యిందుకోసమే నెలకొల్పబడింది ఇటీవలి సంవత్సరాల్లో విదేశీ మార్కెట్లలో అమ్మకాలకోసం చిన్నతరహా పరిశ్రమ ఉత్పాదితాలను కొనుగోలుచేసే విషయంలో విశేషమైన శ్రద్ధ చూపబడుతోంది

చిన్నతరహా పరిశ్రమలను ఆధునికం చేసేందుకూ, చిన్నతరహా పారిశ్రామిక రంగ నిర్మాణంలో వైవిధ్యం సాధించేందుకూ, దాని సాంకేతిక స్థాయిని పెంచేందుకూ ఉద్దేశింపబడిన ప్రభుత్వ విధానం, మొత్తంగా ఆర్థిక వ్యవస్థ ఫలదాయకతను పెంపొందించేందుకు ఉద్దేశింపబడిన ప్రభుత్వపు మొత్తం ఆర్థిక కార్యక్రమంలో ఒక భాగం తత్పర్యవసానంగా, ప్రభుత్వ చర్యల ఫలదాయకత ప్రభుత్వపు మొత్తం ఆర్థిక విధానంనుంచి విడదీయరానిది.

దేశపు ఆర్థికాభివృద్ధియొక్క మొత్తం క్రమంపై చిన్నతరహా

---

* అదే పత్రం, అదే పేజి.

పరిశ్రమల ప్రభావం అన్నింటికంటె ముఖ్యంగా, అది పెట్టుబడి వన రులను పొదుపుచెయ్యడంలో, శ్రమ వనరులను సమీకరించడంలో ఇమిడి వుంది. అంటే ఒకవైపున, అది నిరుద్యోగాన్నీ, పాక్షిక నిరుద్యోగాన్నీ తొలగించేందుకు తోడ్పడుతుంది; మరోవైపున, ఆది వస్తువుల కొరతను తొలగిస్తుంది. తత్పర్యవసానంగా, ప్రస్తుత దశలో, చిన్నతరహా పరిశ్రమల విస్తరణ ద్వారా భారతదేశ ఆర్థిక వ్యవస్థను విస్తృతంగా అభివృద్ధి చెయ్యడం పరమావసరం. జాతీయార్థిక వ్యవస్థ దృష్ట్యా, అది తక్కువ ఫలవంతమైనదేమీ కాదు, కొన్ని పరిమితుల్లోపల భారీ పరిశ్రమల అభివృద్ధిపట్ల ఏకపక్షమైన మొగ్గుకంటె కూడా అది మరింత ఫల దాయకమైనది. ప్రస్తుత పరిస్థితుల్లో మొత్తంగా ఆర్థిక వ్యవస్థ గరిష్ఠ ఫలదాయకతను రూఢిపరచగల ఒకేఒక సరైన అభివృద్ధి వ్యూహం ఏమిటంటే, చిన్నతరహా, భారీ పరిశ్రమల, విస్తృత, ముమ్మర పెరుగు దల అంశాల అత్యంత లాభసాటి కలయికను కనుక్కోవడం.

అదే సమయంలో, ప్రభుత్వపు ఆర్థిక చర్యల ఫలదాయకతను సాధింపబడిన పెట్టుబడి సామర్థ్య స్థాయి, శ్రమ ఉత్పాదకతల వంటి సూచికల ద్వారా, లేక జాతీయార్థిక వ్యవస్థలో ఆయా రంగాల అను పాతాల సరిదనం ద్వారా మాత్రమే నిర్ణయించడం సాధ్యం కాదు. సామాజిక అంశాలను కూడా పరిగణనలోకి తీసుకోవాలి.

ఈ దృష్ట్యా, చిన్నతరహా పరిశ్రమల త్వరిత అభివృద్ధి, ఆధుని కీకరణల దిశాభిముఖత్వానికీ, దాని శాఖా, సాంకేతిక, సాంఘిక పునర్ని ర్మాణానికీ అసాధారణ ప్రాముఖ్యం వుంది.

అయితే, దేశపు సాంఘిక, ఆర్థిక పురోగతి కేవలం చిన్నతరహా పరిశ్రమల మెరుగుదలమీద మాత్రమే ఆధారపడివుంటుందని అనుకోవ డమూ, జాతీయ పునర్నిర్మాణానికి దాన్నే సర్వరోగ నివారిణిగా పరిగణిం చడమూ పొరపాటే అవుతుంది.

భారీ పరిశ్రమలకు హానిదాయకంగా చిన్నతరహా పరిశ్రమలపైన

అతి వక్కాణింపు ఆర్థిక వ్యవస్థలో తీవ్రమైన అసమ తూకానికి దారి తియ్యగలదు.

భారీ స్థాయి ఉత్పత్తిపైన చిన్నతరహా ఉత్పత్తికి ప్రాథమ్యం యివ్వడం, అంటే ప్రస్తుత పారిశ్రామిక ఉత్పాదక శక్తుల స్థాయికి అనుగుణంగా వుండి, శాస్త్ర, సాంకేతిక పురోగతినుంచి లబ్ధిపొందగల ఉత్పత్తి రూపాల అభివృద్ధికి ప్రాథమ్యాన్ని తిరస్కరించడం ఆర్థిక పెరుగుదలను కుంటుపరచి, ఆర్థిక వ్యవస్థయొక్క వెనకబాటు నిర్మాణాన్ని నిలిపి వుంచుతుంది.

భారీ పారిశ్రామికోత్పత్తియొక్క మిక్కిలి పురోగామి రంగాలు వెనకబడివుండటం చిన్నతరహా పరిశ్రమ సాంకేతిక, పాదార్థిక పునాదిని కూడా కుదింపజేస్తుంది. అది దాని ప్రగతిశీల పునర్నిర్మాణాన్ని జాగు చేసి, శ్రమ ఉత్పాదకత తగ్గుదలకూ, మొత్తంగా జాతీయార్థిక వ్యవస్థలో పునరుత్పత్తి క్రమపు గుణాత్మక పరిమాణాలకూ భంగం కలిగిస్తుంది.

ఆరవ పంచవర్ష ప్రణాళిక చిన్నతరహా పరిశ్రమల విషయంలో ప్రతిపాదించేది రక్షణవాద చర్యలు కావు, ఆర్థిక, సాంఘిక కార్యక్రమం; సాంకేతిక నిర్మాణపర పునర్నిర్మాణవు, పరిశ్రమల్లో ఏకీకరణ క్రమపు త్వరీకరణల ప్రాతిపదికపైన చిన్నతరహా పరిశ్రమల స్థిర పెరుగుదలను రూఢిచెయ్యగల నమూనాల అన్వేషణ.

ఈ కార్యక్రమంలో ఎక్కువ భాగం ఏదో ఒక రూపంలో వెనకటి ఆర్థిక, సాంఘిక కార్యక్రమాల్లో వుంది. అయితే, దానిలో కొన్ని విశిష్ట లక్షణాలు కూడా ఉన్నాయి. 1980 జూలై నాటి పారిశ్రామిక విధాన పత్రం "ప్రభుత్వం గ్రామసీమలో ఆర్థిక స్వయంపోషకత్వాన్ని ఉత్పన్నం చెయ్యగల మాదిరి పారిశ్రామికీకరణను దేశంలో ప్రవేశపెట్టాలని కృతనిశ్చితంగా ఉంది"* అని పేర్కొంది.

* *The Sixth Five Year Plan...*, p. 190.

ఆరవ పంచవర్ష ప్రణాళిక మరింత స్పష్టంగా వుంది: ''ఏకీకృత పారిశ్రామికాభివృద్ధి దిశగా సకల ప్రయత్నాలూ చేస్తూనే, పారిశ్రామికంగా వెనకబడినదిగా గుర్తింపబడిన ప్రతి ఒక జిల్లాలోనూ కొన్ని కేంద్ర కర్మాగారాలను నెలకొల్పడం ద్వారా ఆర్థిక సమాఖ్యతత్వానికి దోహదం చెయ్యాలనీ, సాధ్యమైనంత ఎక్కువ సంఖ్యలో వాటి శాఖలనూ, చిన్న, గృహ పరిశ్రమలనూ నెలకొల్పాలనీ ప్రతిపాదించబడింది.''*

ప్రభుత్వ రంగానికి చెందిన ఒక పెద్ద పారిశ్రామిక సంస్థ కేంద్రకంగా అన్ని జిల్లాలకూ ఒక ఏకీకరణ పథకాన్ని విస్తరింపజెయ్యాలని సూచింపబడింది. ప్రభుత్వ రంగం ద్వారా పారిశ్రామిక పెట్టుబడి టర్నోవరులో చిన్నతరహా ఉత్పత్తిని, ప్రత్యేకించి దాని చిన్నతరహా పెట్టుబడిదారీ రూపాలను నిమగ్నంచెయ్యడానికి కేవలం ఆర్థిక పార్శ్వం మాత్రమే కాకుండా, రాజకీయ పార్శ్వం కూడా వుంది. ప్రభుత్వ రంగం ద్వారా అంతర్ పారిశ్రామిక సంబంధాల స్థాపన ప్రభుత్వపు సామాజిక పునాదిని చాలా విస్తృతం చేసి, దృఢపరచి, జాతీయ ప్రయోజనాల నిమిత్తం చిల్లర సరుకుల, చిన్నతరహా పెట్టుబడిదారీ పరిశ్రమలను మరింత ఫలవంతంగా వినియోగించేందుకు పరిస్థితులను కల్పిస్తుంది.

ఈ నమూనా విజయవంతంగా అమలుజరపబడినట్లయితే, అప్పుడు ప్రభుత్వ రంగానికి సామాన్యమైన లక్షణాలు, ప్రత్యేకించి దామాషా, ప్రణాళికాబద్ధ అభివృద్ధి జాతీయార్థిక వ్యవస్థలో మరింత ముఖ్యమైన పాత్ర వహిస్తుంది. ప్రత్యక్ష ప్రభుత్వ పెట్టుబడిదారీ నియంత్రణకు గురి అవడం ద్వారా చిన్నతరహా ఉత్పత్తి క్రమంగా, ప్రధానంగా సహకార దశ గుండా గడవడం ద్వారా, ప్రభుత్వ రంగ నిర్మాణంలో ఒక అంశం కాగలదు.

అభివృద్ధికి సంబంధించిన యీ ప్రత్యామ్నాయం చిన్నతరహా ఉత్ప

---

* అదే పత్రం, పేజీలు 190–91.

త్రివి భారీ, మధ్య స్థాయి ప్రైవేటు రంగంనుంచి వేరుచేస్తుంది ఈ వేర్పాటుకు దేశంలో పెట్టుబడిదారీ సంబంధాల పరిమాణంమీద గణనీయమైన ప్రభావం ఉండగలదు.

4 ప్రైవేటు పారిశ్రామిక పెట్టుబడి అభివృద్ధిచెందిన రూపాలు ఏర్పడటం

భారతదేశం స్వాతంత్ర్యం పొందిన దరిమిలా సంవత్సరాల్లో జాతీయ పెట్టుబడి దేశపు ఆర్థిక వ్యవస్థలో తన స్థానాన్ని పటిష్ఠం చేసుకుంది. ఉత్పత్తి కేంద్రీకరణా, సాంద్రీకరణా పెరిగాయి గుత్త ధోరణులు మరింత అభివృద్ధిచెందాయి

బడా బూర్జువావర్గపు స్థితి యిలా పటిష్ఠం కావడమూ, గుత్త ధోరణుల యీ పెరుగుదలా, యింతకుముందే వున్న గుత్త సంస్థలు బలపడటమూ – కేవలం కొద్దిమంది చేతుల్లో అధికారమూ, సంపదా కేంద్రీకృతమవడాన్ని నిరోధించాలని ప్రభుత్వం ఎన్ని ప్రకటనలు చేసినప్పటికీ, సంభవించాయి ఆర్థికాధికార కేంద్రీకరణ జరగకుండా, గుత్త ధోరణులు తలెత్తకుండా చూస్తూ దేశపు ఆర్థికాభివృద్ధిని స్థిరపరిచేందుకు ఏ పద్ధతులను అవలంబించాలన్న సమస్య ప్రైవేటు రంగపు పెరుగుదల మూలంగా గత పదేళ్ల కాలంలో ముందుకు వచ్చినట్లు మూడవ పంచవర్ష ప్రణాళికలో పేర్కొనబడింది అయితే, శీఘ్రంగా అభివృద్ధిచెందుతున్న ఆర్థిక వ్యవస్థలో బూర్జువావర్గపు మిక్కిలి సంపన్న విభాగాలు తమ స్థానాలను బలపరుచుకోవడం సహజమేననీ, పెద్ద పారిశ్రామిక సంస్థల పరిమితమైన పెరుగుదల దేశపు ఆర్థిక పురోగతికి దోహదం చేస్తుందనీ అధికార పత్రాల్లో అంగీకరింపబడింది అధికార పత్రాల్లోని యీ పరస్పర వైరుధ్యాలు ఒకవైపున పెటీబూర్జువావర్గంనుంచీ, మరో

వైపున బడా బూర్జువావర్గంనుంచీ ఒత్తిడికి గురి అవుతున్న రాజకీయ ఉపరినిర్మాణపు నిర్దిష్ట లక్షణాలను ప్రతిబింబిస్తాయి.

ఆర్థికాభివృద్ధి వ్యూహాన్ని నిర్వచించేటప్పుడు, ప్రత్యేకించి యీ వ్యూహాన్ని అమల్లోపెట్టేటప్పుడు ఒక రాజీ పద్ధతిని కనుగొనేందుకు యిందుకే అది ప్రయత్నించింది.

ప్రభుత్వపు రక్షణవాద, పన్నుల విధానమూ, అలాగే ప్రభుత్వ రుణ విధానాన్ని అభివృద్ధిచెయ్యడమూ, మరికొన్ని యితర చర్యలూ జాతీయ ఫాక్టరీ ఉత్పత్తి స్థాపన, అభివృద్ధుల్లో ముఖ్య పాత్ర వహించాయి.

భారతదేశం స్వాతంత్ర్యం పొందిన తొలి సంవత్సరాల్లోనే (1949లో) నెలకొల్పబడిన ఫిస్కల్ కమిషన్ దేశంలో పెంపొందుతున్న కీలక, ఆధునిక పరిశ్రమలకు టారిఫ్ రక్షణ కల్పించవలసిన అవసరం గురించి పేర్కొంది. 1952లో, ఆ కమిషన్ చేసిన సిఫారసుల మేరకు భారతీయ పరిశ్రమకు టారిఫ్ రక్షణ వ్యవహారాలు చూసేందుకుగాను ఒక స్థాయీ టారిఫ్ కమిటీ నెలకొల్పబడింది. దాని సిఫారసుల మేరకు ప్రభుత్వం పరిశ్రమయొక్క వివిధ శాఖలకు టారిఫ్ రక్షణ సమకూర్చి, తద్వారా విదేశీ పోటీనుంచి వాటిని కాపాడింది. జాతీయ పరిశ్రమయొక్క చాలా శాఖల అభివృద్ధికి యిది చాలా ముఖ్యం.

ఈ రక్షణ విధానాన్ని తమ ప్రయోజనాలకు వినియోగించుకున్న వారిలో మొదటివారు బడా పరిశ్రమదారులు. దేశీయ మార్కెట్పైన అజమాయిషీని సాధించుకోవడంలో వారు మరింత విస్తృతమైన అవకాశాలు పొందారు.

ప్రభుత్వపు ఫిస్కల్ విధానం బడా పెట్టుబడి స్థానాన్ని పటిష్ఠం చేసేందుకు తోడ్పడింది. కొత్తగా నెలకొల్పబడిన కంపెనీలు వివిధ కాల పరిమితులకు పన్నుల చెల్లింపునుంచి పూర్తిగా మినహాయించబడ్డాయి. చాలా కంపెనీలు పన్నుల విషయంలో యితర మినహాయింపులు పొందాయి.

అవసరమైనప్పుడు, కొత్త పారిశ్రామిక సంస్థల విషయంలో తరుగుదలకి సంబంధించిన షరతులు సగం తొలగింపబడ్డాయి శాస్త్రీయ పరిశోధన వ్యయంపైన కూడా పన్ను మినహాయించబడింది ఈవిధంగా భారతదేశపు పారిశ్రామిక బూర్జువావర్గం (ప్రధానంగా బడా బూర్జువావర్గం) ప్రభుత్వపు తోడ్పాటుతో పెట్టుబడి మార్కెట్‌యొక్క, వెనకబడ్డ బాంకింగ్ వ్యవస్థయొక్క బలహీనతను అధిగమించగలిగింది

స్వాతంత్ర్యపు తొలి దినాలనుంచీ ప్రభుత్వపు ఆర్థిక విధానం ప్రైవేటు రంగపు స్థానాలను సుదృఢం చేసేందుకు దోహదం చేసి, ఆర్థిక వ్యవస్థయొక్క వలస నిర్మాణంనుంచి ఉత్పన్నమయ్యే యిబ్బందులను అధిగమించేందుకు దానికి తోడ్పడింది ప్రైవేటు రంగపు లాభాలు వేగంగా పెరిగాయి.

1950 దశకపు చివరి సంవత్సరాల నాటికే ప్రైవేటు వాటా కంపెనీల నికర లాభాలు దేశపు జాతీయాదాయంలో 2 శాతం ఉన్నాయి ప్రైవేటు రంగం ప్రభుత్వ రుణాలను, ప్రభుత్వపు ప్రత్యక్ష భాగస్వామ్యాన్ని, బాంకు రుణాలను, విదేశీ సహాయాన్ని వినియోగించుకుంది

ఇవన్నీ ప్రైవేటు రంగపు పెట్టుబడి మదుపుల శీఘ్ర పెరుగుదలకు దోహదంచేశాయి మొదటి పంచవర్ష ప్రణాళికా కాలంలో పరిశ్రమలో వాటి మొత్తం 230 కోట్ల రూపాయలు ఉంది ఆరవ పంచవర్ష ప్రణాళికా కాలంలో ప్రైవేటు పెట్టుబడి మదుపులు 74,710 కోట్ల రూపాయలకు లేక మొత్తం మదుపుల్లో 47 శాతానికి పెరిగాయి వాటిలో అధికతర భాగం పరిశ్రమల్లోకి వెళ్లింది

మొత్తంగా పారిశ్రామిక బూర్జువావర్గపు స్థానం పటిష్ఠమవడంతో బాటు దాని మధ్యస్థ విభాగమూ, ప్రత్యేకించి దాని మిక్కిలి సంపన్న విభాగం కూడా మరింత త్వరితంగా పెంపొందాయి దీనికితోడు ఉత్పత్తి, పెట్టుబడుల అధికతర కేంద్రీకరణ కూడా జరిగింది

ఆధునిక ఫాక్టరీ అంత మరీ ఎక్కువ అభివృద్ధిచెందని వలస

పాలన రోజుల్లో సైతం భారతదేశంలో ఒక మోస్తరు ఉన్నత స్థాయి ఉత్పత్తి కేంద్రీకరణ వుంది. 1948 అంకెల ప్రకారం, 1,000 మందికి పైగా కార్మికులు వున్న ఫాక్టరీలు మొత్తం ఫాక్టరీల్లో 7 శాతం వున్నాయి. మొత్తం శ్రామిక బలగంలో 70 శాతానికి పైగా వాటిలో నియుక్తులై వున్నారు. మొత్తం ఫాక్టరీ పరిశ్రమ ఉత్పాదితంలో 70 శాతానికి పైగా అవి ఉత్పత్తిచేస్తున్నాయి. పనిలో పెట్టుకునే కార్మికుల సంఖ్యనుబట్టి కాక, వాటి ఉత్పాదక పెట్టుబడినిబట్టి ఫాక్టరీలను వర్గీకరించాలంటే, వాటి ఉత్పత్తి కేంద్రీకరణ సంఖ్యలు మరింత ఉన్నతంగా వుంటాయి. 1948 నాటి అంకెలు 25 లక్షల రూపాయలకు మించిన ఉత్పాదక పెట్టుబడి కలిగిన బడా పారిశ్రామిక సంస్థలు మొత్తం పారిశ్రామిక సంస్థల్లో 9.1 శాతం వున్నాయనీ, అవి భారతదేశపు మొత్తం ఫాక్టరీ ఉత్పాదితపు విలువలో 90 శాతాన్ని ఉత్పత్తి చేస్తున్నాయనీ తెలియజేస్తున్నాయి. దీనిలో 30 శాతానికి పైగా విలువ 1 కోటినుంచి 5 కోట్ల రూపాయలవరకు పెట్టుబడి కలిగిన మిక్కిలి పెద్ద పారిశ్రామిక సంస్థలనుంచి వచ్చింది (మొత్తంలో 1.3 శాతం). భారతదేశపు పారిశ్రామికోత్పాదితంలో 60 శాతానికి పైగా కేవలం 134 పారిశ్రామిక సంస్థలనుంచి లభించింది.* ఉత్పత్తియొక్క యీ అధిక సాంద్రీకరణకు వెనకబడిన పరిశ్రమయొక్క వలసవాద నిర్మాణపు ప్రత్యక్ష ఫలితం.

ఏదో ఒక పారిశ్రామిక శాఖలో బాగా పెద్ద ఫాక్టరీలు కొద్దిగా గుత్త సంస్థలయ్యాయి. ఈవిధంగా, 1950/51లో మూడు కర్మాగారాలు మొత్తం దుక్క ఇనుమునూ, రోల్డు ఉక్కునూ ఉత్పత్తి

---

* S. R. Mohnot, *Concentration of Economic Power in India*, Chaitanya Publishing House, Allahabad, 1962, p. 117.

చెయ్యగా, రెండు ఫాక్టరీలు మొత్తం అల్యూమినంమా, రెండు ఫాక్టరీలు అన్ని కార్లనూ, ఒక్క ఫాక్టరీ అన్ని రైలు ఇంజన్లనూ ఉత్పత్తిచేశాయి సోడా, సైకిళ్ళు, ఓడలు, పెట్రోలియం ఉత్పాదితాలు, సిమెంటు, డీసెల్ ఇంజన్ల విషయంలో కూడా దాదాపు యిదే పరిస్థితి వుంది. సాపేక్షంగా బాగా అభివృద్ధిచెందిన వినిమయ వస్తువుల పరిశ్రమల్లో ఉత్పత్తి సాంద్రీకరణ అంత గణనీయంగా లేకపోగా, తక్కువ అభివృద్ధి చెందిన ఉత్పాదక వస్తువుల ఉత్పత్తి రంగంలో ఉత్పత్తి సాంద్రీక రణ ఎక్కువగా వుండటం గమనీయమైన విశేషం ఈవిధంగా, మిక్కిలి పెద్ద ఫాక్టరీలు జౌళి పరిశ్రమలో మొత్తం ఉత్పాదక సామ ర్థ్యంలో సుమారు 16 శాతాన్ని, జనపనార పరిశ్రమలో 15 శాతాన్ని, పంచదార పరిశ్రమలో 30 శాతాన్ని, సబ్బుల పరిశ్రమలో 39 శాతాన్ని, పాదరక్షల్లో 74 శాతాన్ని, కాగితంలో 66 శాతాన్ని, పెయింట్లు, వార్ని షుల్లో 50 శాతాన్ని కలిగివున్నాయి ఉత్పత్తి సాంద్రీకరణ స్థాయిలోని ఆ తారతమ్యం భారతదేశంలోని పెట్టుబడిదారీ పరిశ్రమాభివృద్ధి పునాది మిక్కిలి సంకుచితమైనదనేందుకు తిరుగులేని రుజావు

వలసవాదులు మరీ అంత ఎక్కువ బలవంతంగా నిరోధించని పెట్టు బడిదారీ పరిశ్రమ శాఖల్లో, పెట్టుబడిదారీ వ్యవస్థ బాగా త్వరితంగానే పెంపొందగలిగిన శాఖల్లో ఉత్పత్తి సాంద్రీకరణ స్థాయి మరింత తక్కు వగా ఉంది.

ఇందుకు భిన్నంగా, వలస పాలన మరింత ఎక్కువ ఆటంకాలు కల్పించిన భారీ పరిశ్రమలో బడా పారిశ్రామిక సంస్థలు తలెత్తి, విదేశీ పోటీని తట్టుకోగలిగాయి అవి ఏదో ఒక సరుకు తయారీలో గుత్త ఉత్పత్తిదారులయ్యాయి అలాంటి సందర్భంలో ఉత్పత్తి సాంద్రీ కరణ చాలా అధికంగా ఉందే తప్ప, జాతీయ స్థాయిలో మొత్తం ఉత్పత్తి పరిమాణం బాగా తక్కువగా ఉంది

స్వాతంత్ర్యానంతరం మొదటి తొమ్మిది సంవత్సరాలూ (1947–

1956) మొత్తం పరిస్థితిలో తెచ్చిన మార్పు తక్కువ. పెద్ద కంపెనీల వాటా పెట్రోలియం సరుకుల పరిశ్రమ (సగం), సైకిళ్లు, సిమెంటు, డీసెల్ ఇంజన్ల పరిశ్రమ (మూడింట రెండు వంతులు) వంటి కొద్ది పరిశ్రమల్లో మాత్రమే తగ్గింది.

స్వాతంత్ర్యం పొందాక తొలి సంవత్సరాల్లో పరిశ్రమలో పెట్టుబడి మదుపు సాపేక్షంగా తక్కువ. ఏదైనా పెరుగుదల వుంటే అది ఉత్పత్తి పాత శాఖల్లో మాత్రమే వుంది. కొత్తవి నెమ్మదిగా అభివృద్ధిచెందాయి. అదే సమయంలో దేశీయ మార్కెట్ సంకుచితత్వమూ, దాని మందగతి విస్తరణా భారతదేశ పరిశ్రమల ప్రధాన శాఖల్లో నూతన పారిశ్రామిక శాఖలను తెరవడాన్ని నిరోధించాయి. ఈ ప్రధాన పారిశ్రామిక శాఖలు చిరకాలంగా జాతీయ పెట్టుబడి ఆక్రమణలో, అజమాయిషీలో ఉన్నాయి. వాటిలో ఉత్పత్తి సాంద్రీకరణ పాత స్థాయిలోనే ఉండిపోయింది. కొత్త పరిశ్రమల్లో (పెట్రోలియం సరుకులు, ఇంజనీరింగు, మరికొన్నింటిలో), వాటి ఉత్పాదితానికి గిరాకీ పెరిగి, విదేశీ పెట్టుబడి వాటా తరగడంతో, కొత్త కంపెనీలు అవతరించాయి. జాతీయ పెట్టుబడి అన్వయ రంగం విస్తరింపజెయ్యబడింది. ఈ పరిశ్రమల మిక్కిలి వెనకబాటుతనాన్ని మాత్రమే తెలియజేసే ఉత్పత్తి సాంద్రీకరణ ప్రాథమిక ఉన్నత స్థాయి పడిపోనారంభించింది. ఈ క్రమం యీనాటికీ కొనసాగుతూనే వుంది.

అయితే మొత్తంమీద, భారతదేశంలో ఉత్పత్తి సాంద్రీకరణ స్థాయి ఉన్నతంగానే ఉంటోంది, పారిశ్రామిక పెట్టుబడి సాంద్రీకరణ, కేంద్రీకరణలను నియంత్రితంచేసే పెట్టుబడిదారీ ఉత్పత్తి విధానపు నియమాల ఫలితంగా మరింత ఉన్నతంగా పైతం ఉండగలదు.

భారతదేశంలో పెట్టుబడి సాంద్రీకరణా, పరిశ్రమపైనా, మొత్తం ఆర్థిక వ్యవస్థపైనా బడా, గుత్త బూర్జువావర్గపు అజమాయిషీ రంగపు విస్తరణా వాస్తవం అనే విషయంలో ఎలాంటి సందేహం ఉండ

జాలదు. ఉన్నత పెట్టుబడి సాంద్రీకరణ, ప్రత్యేకించి మిక్కిలి పెద్ద కంపెనీల గ్రూపులో భారతదేశానికి సామాన్యమైన విషయం.

జాయింట్ స్టాక్‌లో అత్యధికం భారత బూర్జువావర్గపు గుత్త విభాగాలకు ప్రాతినిధ్యం వహించే కొద్దిపాటి భారీ పారిశ్రామిక-ఫైనాన్స్ గ్రూపుల చేతుల్లో సాంద్రీకరింపబడివుంది. 1951లో 20 భారతీయ గుత్త గ్రూపులకు 240 కోట్ల రూపాయల పెట్టుబడి కలిగిన 483 కంపెనీల్లో వాటాలు ఉన్నాయి. 1969లో వాటి వాటాలు 2,500 కోట్ల రూపాయలు ఉండగా, 1976 నాటికి అవి 4,500 కోట్ల రూపాయలకి అంటే దాదాపు రెట్టింపుకి పెరిగాయి.*

తాతా, బిర్లా, సింఘానియా, థాపర్, కిర్లోస్కర్, బంగూర్, వగైరా గుత్త సంస్థలు ప్రత్యేకించి వేగంగా పెరిగాయి. స్వాతంత్ర్యానంతర సంవత్సరాల్లో వాటి కార్యకలాపాలను నిరోధించేందుకు చట్టపరమైన ప్రయత్నాలు జరిగినప్పటికీ, అవి త్వరితంగా పెంపొంది, జాతీయార్థిక వ్యవస్థలో తమ స్థానాన్ని గణనీయంగా పటిష్ఠం చేసుకున్నాయి. ఈవిధంగా, బిర్లా గ్రూపు ఆస్తులు 1966/67లో 450 కోట్ల రూపాయలు ఉండగా, 1975/76లో 1,060 కోట్ల రూపాయలకు పెరిగాయి. 1976లో ఆ కంపెనీ మొత్తం లాభాలు 130 కోట్ల రూపాయలు వున్నాయి. అదే దశాబ్దంలో తాతా కంపెనీ ఆస్తులు 520 కోట్లనుంచి 970 కోట్ల రూపాయలకు పెరగ్గా, దాని మొత్తం లాభాలు 10 కోట్ల రూపాయలు వున్నాయి. మఫత్‌లాల్ గుత్త సంస్థ ఆ దశాబ్దంలో తన ఆస్తులను మూడు రెట్లకు – 100 కోట్ల

---

* *The Economic Times*, Bombay, February 25, 1977, p. 1.

నుంచి 280 కోట్ల రూపాయలకు – పెంచుకుంది.* మిగతా బడా కంపెనీల విషయంలో కూడా పరిస్థితి దాదాపు యిలాగే వుంది.

భారతదేశంలో పెట్టుబడిదారీ అభివృద్ధియొక్క అసమానత్వం మూలంగానూ, పరస్పర విరుద్ధ స్వభావం మూలంగానూ బూర్జువా వర్గం ఒక వర్గంగా రూపొందే క్రమం దానిలో శత్రు వైరుధ్యాన్ని పెంపొందిస్తుంది, కొన్ని ప్రధాన ఆర్థిక, రాజకీయ అంశాలపైన బూర్జువావర్గపు వివిధ విభాగాల మధ్య వైరాన్ని వ్యగ్రంచేస్తుంది. స్వాతంత్ర్య సంవత్సరాల్లో మరింత శీఘ్ర గతిలో సాగిన పెట్టుబడి సాంద్రీకరణ గుత్త గ్రూపుల స్థానాన్ని దృఢపరచి, వాటి అజమాయిషీని విస్తరింపజేసి, కొత్త గుత్త సంస్థల అవతరణకు పరిస్థితులను సృష్టించింది. అదే సమయంలో పాత గుత్త సంస్థల పెట్టుబడిలో నిర్మాణపరమైన కొన్ని మార్పులు సంభవించాయి, అవి తమ కంపెనీల పైన కొత్త అజమాయిషీ రూపాలను నెలకొల్పాయి. పారిశ్రామిక పెట్టుబడి వాటా పెరుగుదల, దాని స్థానాన్ని పటిష్ఠం చెయ్యడమూ గుత్త సంస్థల లోపలా, వెలుపలా అసమంగా సాగింది. పారిశ్రామిక పెట్టుబడి రూపధారణ ప్రభుత్వ రంగంలో మిక్కిలి త్వరితంగా సంభవించింది. కాని, దేశపు ఆర్థిక పునర్నిర్మాణం గుత్త పెట్టుబడి నిర్మాణంపైన కూడా ప్రభావం కలిగించకుండా ఉండలేకపోయింది.

స్వాతంత్ర్య సంవత్సరాల్లో పెట్టుబడిదారీ వ్యవస్థ అభివృద్ధి పారిశ్రామిక పెట్టుబడిలోకి వర్తక పెట్టుబడి పరివర్తనను త్వరితంచేసింది. పెట్టుబడి మదుపుపెట్టే కంపెనీలు గుత్త గ్రూపుల్లో నానాటికీ అధికతర పాత్ర వహించనారంభించాయి.

భారతదేశంలోని మిక్కిలి పెద్ద గుత్త గ్రూపులు యిప్పుడిక ఎంతమాత్రం వాటిలో భాగస్వాములైన కంపెనీల వర్తక, రుణ నిర్వహణకు సంబంధించిన కేవల కేంద్రీకరణ రూపం మాత్రమే కాదు. పరిశ్రమ

---

* అదే పత్రికలో.

వాటి ప్రధాన కార్య రంగమూ, పారిశ్రామిక పెట్టుబడి పునరుత్పత్తి వాటి ఉనికిలో నిర్ణయాత్మక అంశమూ అయ్యాయి. పెట్టుబడియొక్క పెరుగుతున్న కేంద్రీకరణ, సాంద్రీకరణలు ప్రస్తుతం గుత్త గ్రూపు ల్లోపల పెట్టుబడి స్వతస్సిద్ధ సంపుటి పెరుగుదలతో ముడిపడివున్నాయి. గ్రూపుయొక్క పెరిగిన ఆస్తులు అవి కేవలం అజమాయిషీ వహిస్తున్న పారిశ్రామిక సంస్థల సంఖ్యలో పెరుగుదలను మాత్రమే కాకుండా, ఉత్పత్తి సాంద్రీకరణను అంతకంతకు ఎక్కువగా ప్రతిబింబిస్తాయి. బిర్లా, మఫత్‌లాల్ గ్రూపులకు యిది సామాన్య విషయం. గ్రూపు లోపల పారిశ్రామిక కంపెనీల ప్రాధాన్యం పెరిగి, నిర్ణయాత్మకమయ్యేకొద్దీ, వివిధ పెట్టుబడి మదుపు సంస్థల పాత్ర, ప్రభావాలు కూడా పెరిగాయి. దానితో ఆ గ్రూపులు క్రమక్రమంగా అధీన కంపెనీలపై పాత వర్తక, వడ్డీ అజమాయిషీ పద్ధతులనూ, దోపిడి పద్ధతులనూ పరిత్యజించాయి.

ఈవిధంగా, భారత జాతీయ ఆర్థిక వ్యవస్థలో సంభవిస్తున్న మౌలిక మార్పుల మూలంగా వలస పాలన యుగంలో అభివృద్ధిచెందిన సాంప్రదాయిక పెట్టుబడి నిర్వహణ రూపాలు నాణ్యం రీత్యా కూడా మారాయి. పరిశ్రమ ఉన్నత స్తరాల అభివృద్ధిలో భారతదేశం నానాటికీ స్పష్టంగా పాశ్చాత్య పెట్టుబడిదారీ దేశాలకు సామాన్యమైన పద్ధతినే అనుసరిస్తోంది. అయితే, పెట్టుబడిదారీ ఆర్థిక వ్యవస్థ నిర్మాణం మాత్రం యింకా పూర్తి కాలేదు. అది పెట్టుబడిదారీ వ్యవస్థ అభివృద్ధి బహుళ రంగ వ్యవస్థలో సంశ్లిష్టమైన మౌలిక మార్పులకు కారణభూతమవుతోంది. పెట్టుబడిదారీ వ్యవస్థ అసమంగా అభివృద్ధి చెందుతుంది కనుక, వర్తక, వడ్డీ లావాదేవీలనుంచి పరిశ్రమకు పెట్టుబడి బదిలీ, పారిశ్రామిక పెట్టుబడి రూపొందడంతోపాటు (పెట్టుబడి సంచయనపు ప్రాథమిక దశకు సామాన్యమైన లక్షణాలు) ఫైనాన్సు పెట్టుబడి ఏర్పడటం—వీటి మొదటి చిహ్నాలు పొడచూపుతున్నాయి. రుణాల రంగంలో లేక పరిశ్రమల్లో గుత్త గ్రూపుల రంగంలో బాంకుల

పూర్తి ప్రాబల్యాన్ని రూఢీపరచేందుకు భారతదేశపు పెట్టుబడిదారీ అభివృద్ధి స్థాయి యింకా సరిపోదు. అయితే, అలాంటి గుత్త సంస్థ రూపొందించ బడుతోంది, అది ఫైనాన్సు పెట్టుబడి ఉవరి రూపాల ఆవిర్భావానికి పరిస్థితులను సృష్టిస్తుంది.

కొన్ని సమయాల్లో, కొన్ని పరిస్థితుల్లో బూర్జువావర్గపు ఉన్నత శ్రేణులు దేశపు ఆర్థికాభివృద్ధి వ్యూహం, అంతరంగిక విధానాలు రూపొం దడంపైన తమ ఒత్తిడిని పెంచగలిగివుంటాయి. భారతదేశంలో ప్రజా తంత్ర శక్తులు ప్రతిఘటిస్తున్నప్పటికీ, కొన్ని సమయాల్లో వర్తకులు, రాజకీయవేత్తలు, సివిల్ ఉద్యోగులు, మేనేజర్లతో కూడిన ఒక పార — ఒక మాదిరి పాలక ప్రభువర్గం — రూపొందడాన్ని బలపరిచే ఒక ధోరణి నిలిచివుంది, ఒకొక్కప్పుడు అది బలం పుంజుకొంటుంది. దాని ప్రాముఖ్య, ప్రభావాలు పెరుగుతున్నాయి.

ప్రకరణం 6

ప్రపంచ ఆర్థిక సంబంధాల వ్యవస్థలో భారతదేశపు స్థానం

వలస పాలన కాలంలో భారతదేశానికి స్వతంత్రంగా అభివృద్ధిచెందే అవకాశం దాదాపు ఏమీ లేకపోయింది వలసదేశంపైన సామ్రాజ్యవాద ఆర్థిక, రాజకీయ పెత్తనం దాని మొత్తం అభివృద్ధి క్రమాన్ని, దాని ఆంతరిక సామాజికార్థిక నిర్మాణాన్నే కాకుండా, ప్రపంచ ఆర్థిక వ్యవస్థలో దాని స్థానాన్ని కూడా నిర్ణయించింది

వలస పాలన యుగంలో అమల్లో వున్న అంతర్జాతీయ శ్రమ విభజన అభివృద్ధిచెందే ప్రపంచ ఆర్థిక వ్యవస్థ వస్తుపర ఆవశ్యకతల ఫలితం కాదు, అది సామ్రాజ్యవాద పెత్తనం పర్యవసానమే సామ్రాజ్యవాదులు స్వదేశపు మరింత అభివృద్ధిచెందిన, పరిణత ఆర్థిక వ్యవస్థకు అనుగుణంగా వలసదేశాల జాతీయార్థిక వ్యవస్థలను అన్వయించుకున్నారు అలా చెయ్యడంలో వారు దాన్ని విరూపంచేసి, వలస, పరాధీన దేశాల్లోని పునరుత్పత్తి క్రమపు దిశనూ, పెరుగుదల రేటునూ, అనుపాతాలనూ, అంతే కాకుండా, వాటి ఉత్పాదక శక్తుల నాణ్యతనూ, వాటి అభివృద్ధియొక్క సామాజికార్థిక తరహానూ ముందే నిర్ణయించారు

ఈనాటి ప్రపంచంలో ఏ దేశపు సామాజిక పునరుత్పత్తి ఫలదాయకత అయినా, అంతర్జాతీయ శ్రమ విభజనలోనూ, ప్రపంచ ఉత్పత్తి,

మారకాల్లోనూ దాని భాగస్వామ్యపు స్థాయీ, స్వభావాలపైనా నానాటికీ ఎక్కువగా ఆధారపడుతోంది.

ఏ దేశమూ, మిక్కిలి పెద్ద, మిక్కిలి అభివృద్ధిచెందిన దేశం సైతం, యీనాడు పూర్తిగా ''వివృత'' లేక పూర్తిగా ''సంవృత'' వ్యవస్థగా ఉండజాలదు. అంటే, తన ఆర్థిక వ్యవస్థను కేవలం దేశీయ మార్కెట్‌కి లేక విదేశీ మార్కెట్‌కి ఉన్ముఖం చెయ్యలేదు. ప్రపంచ ఆర్థికాభివృద్ధి సాధారణ ధోరణి అధికతర అంతర్జాతీయ శ్రమ విభజనే. దీనిలో ప్రపంచ ఉత్పత్తికన్న పెట్టుబడి, వస్తువుల అంతర్జాతీయ ప్రవాహం మరింత వేగంగా పెరుగుతుంది.

వర్ధమాన దేశాలకు సంబంధించి బాహ్య ఆర్థిక అంశాలకు ప్రత్యేక ప్రాముఖ్యం వుంది. ఎందుకంటే, యంత్రాలనూ, టెక్నాలజీనీ (సాంకేతిక పరిజ్ఞానాన్ని), పారిశ్రామిక ముడి పదార్థాలనూ దిగుమతి చేసుకోనిదే ఆ దేశాలకు విస్తృత పునరుత్పత్తి సాధ్యం కాదు. పైపెచ్చు, వాటిలో భారతదేశంతోపాటు అత్యధిక దేశాలకు తగినంత పెద్ద దేశీయ మార్కెట్ లేదు. అలాంటి మార్కెట్ ఉన్నప్పుడే ఆర్థిక పెరుగుదలకి సంబంధించిన జాతీయ, అంతర్జాతీయ అంశాల హేతుబద్ధ సమ్మేళనం ప్రాతిపదికపైన అవి తమ జాతీయార్థిక సత్తాను నిర్మించుకోగలుగుతాయి.

వలస బానిసత్వ రాజకీయ వ్యవస్థ కూలిపోయినప్పటికీ, దాని ఆర్థిక పునాదులు దొలిచివెయ్యబడినప్పటికీ, పెట్టుబడిదారీ ఆర్థిక వ్యవస్థ చట్రం లోపల వారసత్వంగా పొందిన అంతర్జాతీయ ఆర్థిక సంబంధాల రూపాలు వర్ధమాన దేశాల్లో యిప్పటికీ నిలిచివున్నాయి.

పెట్టుబడిదారీ అంతర్జాతీయ శ్రమ విభజన వ్యవస్థ — దీని ప్రధాన సూత్రాలు వలసవాద యుగంలో రూపొందించబడ్డాయి — తమ దోపిడిని విస్తరింపజేసి, వర్ధమాన దేశాలపైన తమ అజమాయిషీని పటిష్ఠం చేసుకోవాలన్న సామ్రాజ్యవాదుల వాంఛతో అనివార్యంగా ముడిపడివుంటుంది. విముక్త దేశాల సాంఘికార్థిక పరివర్తన వస్తుపర అవసరాలకు

యిది భిన్నంగా సాగుతుంది అంతర్జాతీయ ఆర్థికాభివృద్ధి యంత్రాంగాన్ని మార్చే సమస్యను కూడా, విదేశ సంబంధాలను ఆర్థిక పెరుగుదలకి సంబంధించిన ఒక అంశాన్ని చేసే పద్ధతిలో అది ముందుకు తెస్తుంది.

భారతదేశంలో పునరుత్పత్తి స్వభావంపైనా, ఆర్థిక పెరుగుదల ఖర్చు అనుపాతంపైనా, ఉత్పత్తి పరిమాణ అనుపాతంపైనా ప్రపంచ పెట్టుబడిదారీ ఆర్థిక వ్యవస్థ గణనీయంగా ప్రభావం కలిగిస్తుంది ఈ ప్రభావపు యంత్రాంగం సంశ్లిష్టమైనది దాని గుణాత్మక, పరిమాణాత్మక పార్శ్వాలను సరిగ్గా అంచనావెయ్యడం ఎల్లప్పుడూ సాధ్యం కాదు అయితే, భారతదేశ ఆర్థికాభివృద్ధియొక్క ఒక దీర్ఘ దశ విశ్లేషణ కొన్ని స్థిరమైన ధోరణులనూ, సంబంధాలనూ, పార్శ్వాలనూ గుర్తించడాన్ని సాధ్యం చేస్తుంది

ప్రపంచ ఆర్థిక సంబంధాల వ్యవస్థలో భారతదేశం వహించే పాత్ర అన్నింటికంటె ముందు, దేశాభివృద్ధిపైన బాహ్య అంశాల పెరుగుతున్న ప్రభావాన్ని ప్రతిబింబిస్తుంది ఇది ప్రపంచ ఆర్థిక వ్యవస్థ అంతర్జాతీయకరణ దిశగా సాగే ధోరణికి అనుగుణమైన వస్తుపరమైన ఒక క్రమం.

1 భారత ఆర్థిక వ్యవస్థలో విదేశీ పెట్టుబడి

ప్రపంచ పెట్టుబడిదారీ ఆర్థిక వ్యవస్థలో భారతదేశపు ఆర్థిక స్థానం ప్రధానంగా అంతర్జాతీయ పెట్టుబడి, వస్తువుల చలనంలో దాని స్థానాన్నిబట్టీ, పాత్రనిబట్టీ నిర్ణయింపబడుతుంది

విదేశీ పెట్టుబడి చలనం ఉత్పత్తితో, అదనపు విలువను సొంత పరచుకోవడంతో ప్రత్యక్షంగా లేక పరోక్షంగా ముడిపడివుంటుంది ఒక

వర్ధమాన దేశంలోకి దాని రాకకు లాభాలూ, వడ్డీ చెల్లింపులూ — యివి తరచు వచ్చేవాటికంటె అధికంగా వుంటాయి — పైకి పోవడమనే తిరుగులేని అర్థం. తత్పర్యవసానంగా, పెట్టుబడి రాక విముక్త దేశంలో ఉత్పాదక శక్తులను అభివృద్ధిచేసేందుకు తోడ్పడినప్పటికీ, అదే సమయంలో అది దోపిడి రంగాన్ని విస్తృతం చేసి, యీ దోపిడిని తీవ్రంచేస్తుంది. ప్రపంచ ఆర్థిక వ్యవస్థ అభివృద్ధి వివిధ దశల్లో దోపిడి పరిధీ, తీవ్రతలకు వాటి సొంత గుణాత్మక లక్షణాలూ, పరిమాణాత్మక పరిమితులూ ఉంటాయి.

మిక్కిలి ప్రాథమిక దశల్లో, ఆదిమ సంచయన కాలంలో, వలస దోపిడి వర్తకంతోనూ, బానిస దేశాల సైనిక దోపిడితోనే తప్ప పెట్టుబడి ఎగుమతితో ముడిపడిలేదు. భారతదేశం యిందుకొక సామాన్య ఉదాహరణ. పారిశ్రామిక పెట్టుబడి యుగంలో వలస దేశాలు సామ్రాజ్య దేశపు సరుకులకు మార్కెట్‌గానూ, ముడి పదార్థాలకు ఒక మూలాధారంగానూ మార్చబడ్డాయి. అదిగో అప్పుడే వలస దోపిడి యంత్రాంగం రూపొందింది. అయితే పెట్టుబడి ఎగుమతి అప్పటికింకా పెద్ద పాత్ర వహించలేదు.

యూరప్‌లోని ప్రధాన దేశాల్లోనూ, అమెరికాలోనూ పెట్టుబడిదారీ వ్యవస్థ అభివృద్ధిచెంది, స్థిరపడేకొద్దీ, పెట్టుబడిదారీ ప్రపంచ ఆర్థిక వ్యవస్థ పనిలోని ప్రధానాంశాల్లో పెట్టుబడి అంతర్జాతీయ చలనం ఒకటైంది. అయితే, సామ్రాజ్యవాద దశలో మాత్రమే పెట్టుబడి ఎగుమతి వలన, పరాధీన దేశాల దోపిడి ప్రధాన, ప్రబల రూపం — సామ్రాజ్యవాదపు మూల స్తంభాల్లో ఒకటి — అయింది.

సామ్రాజ్యవాద ఆర్థిక వ్యవస్థలో పెట్టుబడి ఎగుమతి యీనాటికీ ప్రముఖ స్థానం ఆక్రమిస్తోంది. కాని, పెట్టుబడి ఎగుమతి ప్రపంచ ఆర్థిక వ్యవస్థలోని గణనీయమైన నిర్మాణపర మార్పులచేత గట్టిగా ప్రభావితం చెయ్యబడుతోంది. పెట్టుబడి ఎగుమతి గతిక్రమ,

నిర్మాణాలు వర్ధమాన దేశాల రాజకీయ, ఆర్థిక స్వాతంత్ర్యం పటిష్ఠమవడంచేతా, వాటి ఉత్పాదక శక్తుల పెరుగుదలచేతా, వాటిలో వచ్చే సాంఘిక మార్పులచేతా గణనీయంగా ప్రభావితం చెయ్యబడుతున్నాయి.

రెండవ ప్రపంచ యుద్ధం దరిమిలా వర్ధమాన దేశాలకు పెట్టుబడి ఎగుమతి గతిక్రమ, నిర్మాణాలకు సంబంధించి రెండు దశలను స్పష్టంగా నిర్వచించవచ్చు: మొదటిది 1940 దశకం మధ్యనుంచి 1960 దశకం మధ్యవరకు, రెండవది 1960 దశకం మధ్యనుంచి, యీనాటి వరకు. యుద్ధానంతరం ఇరవై సంవత్సరాల్లో వర్ధమాన దేశాలకు ప్రైవేటు పెట్టుబడి ఎగుమతి ప్రవాహం మందగతిలో సాగింది, కొన్ని సంవత్సరాల్లో అది తగ్గింది కూడా.

వర్ధమాన దేశాలకు పెట్టుబడిదారీ దేశాలనుంచి వచ్చిన పెట్టుబడి మొత్తం దీర్ఘకాలిక పెట్టుబడి మొత్తంలోనూ, దీర్ఘకాలిక రుణాలు, గ్రాంట్లు, సబ్సిడీల రూపంలో యివ్వబడిన ప్రభుత్వ ''సహాయం''లోనూ నిరపేక్షంగానూ, సాపేక్షంగానూ కూడా ప్రాబల్యం వహించినది ప్రభుత్వ పెట్టుబడే. ప్రైవేటు పెట్టుబడి మదుపుల్లో తగ్గుదల అంతర్జాతీయ పెట్టుబడి చలనంలో నానాటికీ ఎక్కువ క్రియాశీల భాగస్వామి అయిన ప్రభుత్వ ''సహాయపు'' పెరుగుదలతో పూడ్చబడింది. ప్రైవేటు పెట్టుబడి రాకలో మాంద్యానికి యీకింది రాజకీయ, ఆర్థిక అంశాలు కారణం: వెనకటి వలస దేశాల ప్రజలు తమ జాతీయ విముక్తికోసం జరిపే పోరాటం తీవ్రతరమవుతున్న దృష్ట్యా, సంభావ్య మదుపుదారులు తమ పెట్టుబడిని గురించి భయపడ్డారు, నూతన శాస్త్ర, సాంకేతిక పురోగమనాల పర్యవసానంగా అభివృద్ధిచెందిన పెట్టుబడిదారీ దేశాల్లో పెట్టుబడి మదుపుకి మరింత విస్తృతమైన అవకాశాలు ఏర్పడ్డాయి.

1960 దశకం మధ్యనాటికి రాజకీయ పరిస్థితి స్థిరపడి, విదేశీ పెట్టుబడిపట్ల వర్ధమాన దేశాల వైఖరి స్పష్టపడిన కారణంగా, వర్ధమాన దేశాల్లో విదేశీ ప్రైవేటు పెట్టుబడి మదుపులు పెరగ

సాగాయి. పైపెచ్చు, అప్పటికి పారిశ్రామికంగా అభివృద్ధిచెందిన దేశాల్లో దేశీయ పెట్టుబడి మార్కెట్‌లో ఒక మాదిరి సంతృప్తి స్థితి ఏర్పడటంతో, వాటిలో పెట్టుబడి మదుపు అవకాశం తగ్గింది. సామాజికార్థిక సంస్కరణలు, ఆర్థిక అంతర్ నిర్మాణపు ఏర్పాటు, జాతీయ సిబ్బంది నైపుణ్యం పెంపొందడం, దేశీయ మార్కెట్ విస్తరణ, దేశీయ గిరాకీలో నిర్మాణపరమైన మార్పుల పర్యవసానంగా వర్ధమాన దేశాల్లో పెట్టుబడి మదుపు వాతావరణం కూడా మెరుగుపడింది. ఈ అంశాలన్నీ అభివృద్ధిచెందిన పెట్టుబడిదారీ దేశాలనుంచి పెట్టుబడి మరింత ముమ్మరంగా వచ్చేందుకు దోహదంచేశాయి. ప్రపంచ పర్యావరణ, ముడిపదార్థ, ప్రత్యేకించి ఇంధన సమస్యల వ్యగ్రత కూడా వర్ధమాన దేశాలకు పెట్టుబడి ఎగుమతికి ప్రేరణనిచ్చాయి.

ఈ ధోరణులన్నీ భారతదేశంలో ప్రతిబింబించాయి. స్వాతంత్ర్యపు తొలి దినాలనుంచీ భారత ప్రభుత్వం ప్రైవేటు పెట్టుబడి మదుపుల రూపంలో విదేశీ వనరులను, ప్రభుత్వ రుణాలనూ ఆకర్షించవలసిన అవసరాన్ని గుర్తించింది. దేశంలో పెట్టుబడి సంచయన స్థాయి తక్కువగా ఉండటం, శాస్త్ర, సాంకేతిక పరిజ్ఞానం, శీఘ్ర ఆర్థికాభివృద్ధికి అవసరమైన ఆధునిక టెక్నాలజీ లేకపోవడమే యిందుకు కారణం.

తదుపరి మూడు దశాబ్దాల కాలంలో విదేశీ పెట్టుబడి మదుపుదారులకు సంబంధించి భారతదేశ విధానపు మౌలిక సూత్రాలు దేశంలో విదేశీ పెట్టుబడి కార్యకలాపాలను నియంత్రితంచేసే కొన్ని చట్టాలు చెయ్యబడినప్పటికీ (1951, 1969, 1973 సంవత్సరాల్లో చెయ్యబడిన చట్టాలు) ఆచరణలో మార్పులేకుండా అలాగే ఉండిపోయాయి.

1948కీ 1961కీ మధ్య దేశంలోకి వచ్చిన విదేశీ ప్రైవేటు పెట్టుబడి 120 కోట్ల రూపాయలు మాత్రమే. ఇది అంతర్జాతీయ పెట్టుబడి ప్రవాహ దిశలో మార్పులను పూర్తిగా ప్రతిబింబించింది. ఆ కాలంలోనూ, దరిమిలానూ విదేశీ కంపెనీల ఆస్తుల పెరుగుదల

భారతీయ ఫైనాన్స్ వర్గాలనుంచి ప్రభుత్వ వనరులతోబాటు, జాయింట్ స్టాక్, రుణాలు, రుణపత్రాల రూపంలో ఆర్థిక వనరులను ఆకర్షించడం ద్వారా జరిగినంత ఎక్కువగా విదేశీ వనరుల రాక ద్వారా జరగలేదు.

నూతన విదేశీ ఉప, అనుబంధ కంపెనీల ఏర్పాటుకి సంబంధించిన గణాంక లెక్కలనుబట్టి నూతన విదేశీ పెట్టుబడి రాక రేటు తక్కువగా ఉన్న సంగతిని తెలుసుకోవచ్చు. 1974లో విదేశీ కంపెనీల 550 ఉప, అనుబంధ కంపెనీలు భారతదేశంలో పనిచేస్తున్నాయి. వాటిలో 320 బ్రిటిష్, 88 అమెరికన్, 17 జపనీజ్, 12 పశ్చిమ జర్మన్, 11 స్విస్, 8 ఫ్రెంచి, 5 డచ్ కంపెనీలు. 1978 నాటికి వాటి సంఖ్య 320కి తగ్గింది. బ్రిటిష్ కంపెనీలు 100కి పైగా తగ్గిపోగా, అమెరికన్ కంపెనీలు 24, పశ్చిమ జర్మన్ 7, స్విస్ 6, జపనీజ్ 4 తగ్గాయి. అంతర్జాతీయ కార్పొరేషన్ల ఉప కంపెనీల్లో అత్యధిక సంఖ్యాకం, వాటిలో 217 పరిశ్రమ, రవాణా, నిర్మాణాల్లో పని చేస్తున్నాయి.

1969కీ 1979కీ మధ్య భారతదేశంలోని అనుబంధ కంపెనీల సంఖ్య — వీటి పెట్టుబడిలో 50 శాతానికి పైగా విదేశీ పెట్టుబడి మదుపుదారులకు చెందుతుంది — 233నుంచి 125కి పడిపోయింది.

భారతదేశంలో లావాదేవీలు సాగిస్తున్న అంతర్జాతీయ గుత్త సంస్థల మిక్కిలి పెద్ద ఉప కంపెనీలు 46లో 1950కి ముందు 28 రిజిస్టరు చెయ్యబడ్డాయి. మరో 12 వాటి ఆధారంగా నెలకొల్పబడ్డాయి. 1950కీ 1975కీ మధ్య భారతదేశంలో 5 విదేశీ ఉప కంపెనీలు మాత్రమే నెలకొల్పబడ్డాయి.*

---

* *Mainstream*, v. XVIII, No. 26, New Delhi, February 23, 1980, p. 33.

1960 దశకం మధ్యలో, ప్రైవేటు విదేశీ మదుపుల నామక మొత్తం 940 కోట్ల రూపాయలు ఉంది. 1960 దశకపు రెండవ మధ్య భాగంలో విదేశీ మదుపుల రాక వేగం పుంజుకొని, 1978/79 నాటికి అది రెట్టింపుకి పైగా పెరిగి, 2,400 కోట్ల రూపాయలకు (ద్రవ్యోల్బణం కారణంగా రూపాయి విలువ తరుగుదల సరిదిద్దుబాటు లేకుండా) చేరుకుంది. పెట్టుబడిలో అత్యధిక భాగం పారిశ్రామిక, వాణిజ్య సంస్థల్లో మదుపు పెట్టబడగా, తక్కువ భాగం బాంకుల్లోకీ, ఇన్స్యూరెన్సు కంపెనీల్లోకీ వెళ్లింది. అందుకని, 1948కీ, 1978/79కీ మధ్య విదేశీ ప్రైవేటు పెట్టుబడి మదుపుల నామక మొత్తం 8 రెట్లు పెరిగింది. రూపాయి విలువ తరుగుదల మూలంగా, వాస్తవ పెరుగుదల సహజంగానే తక్కువగా ఉంది. ఎందుకంటే, ప్రత్యక్ష మదుపుల్లో 73 శాతం విదేశీ పెట్టుబడి అజమాయిషీలో వున్న కంపెనీలకూ, 26.5 శాతం విదేశీ కంపెనీల శాఖలకూ వెళ్లింది.

1970 దశకంలో భారీ పరిశ్రమలోని పెట్టుబడి మదుపుల మొత్తం పరిమాణంలో విదేశీ పెట్టుబడి 25 శాతం ఉంది లేక 1948లో ఉన్నదానిలో సగం వుంది.

ఆయా రంగాల్లో విదేశీ పెట్టుబడి మదుపుల నిర్మాణంలో కూడా గణనీయమైన మార్పులు వచ్చాయి. అవి దేశంలో ఆర్థిక పరిస్థితినీ — ఉత్పాదక శక్తుల నూతన వ్యవస్థ స్థాపననీ — శాస్త్ర, సాంకేతిక విప్లవ ప్రభావంలో పెట్టుబడి ఎగుమతి నిర్మాణంలో మార్పులనూ ప్రతిబింబించాయి. వలస యుగంతో పోల్చినప్పుడు, వెనకటి వలస అన్వయ రంగాల్లో మదుపుల పరమ ప్రమాణం తగ్గించబడి, కొత్త పరిశ్రమల్లో మదుపులు పెంచబడ్డాయి. యంత్రాలను ఉత్పత్తిచేసే రంగంతో బాటు, పారిశ్రామికోత్పత్తిలో మరింత పెట్టుబడి పెట్టబడింది. మొత్తంమీద, విదేశీ పెట్టుబడి దేశీయ మార్కెట్ అభివృద్ధికి మరింత ఎక్కువ అనుగుణంగా వుంది (వెనకటి దశాబ్దంలో ప్రత్యక్ష విదేశీ

మదుపుల్లో 90 శాతానికి పైగా ప్రోసెసింగ్ పరిశ్రమలోకి మళ్లింప బడ్డాయి).

విదేశీ మదుపుదారుల మధ్య సమతూకం కూడా మారింది 1974లో బ్రిటిష్ ప్రైవేటు మదుపులు భారతదేశంలోని మొత్తం ప్రైవేటు మదుపులో 35 శాతం మాత్రమే వుండగా, అమెరికా తన వాటాను 27 శాతానికి పెంచుకుంది, పశ్చిమ జర్మనీ మదుపు 9 3 శాతం, ఇటలీ మదుపు 4 3 శాతం వున్నాయి *

ఆయా రంగాల్లో విదేశీ మదుపుల నిర్మాణంలో మార్పులు వచ్చినప్పటికీ, ప్రభుత్వ రంగపు, జాతీయ పెట్టుబడుల స్థానాలు దృఢతరమైనప్పటికీ, భారతదేశం యింకా సామ్రాజ్యవాద దోపిడికి గురి అవుతూనే వుంది దేశంలో సృజింపబడుతున్న అదనపు విలువలో గణనీయమైన భాగాన్ని లాభాల రూపంలోనూ, రుణాలమీద వడ్డీ రూపంలోనూ విదేశాలకు తరలించక తప్పనిసరి పరిస్థితిలోనే యింకా వుంది విదేశీ పెట్టుబడి లక్ష్యాలూ, దాని పునరుత్పత్తి పరిధీ అత్యధిక భాగం మారకుండా అలాగే వున్నాయి.

ప్రైవేటు విదేశీ మదుపులు ప్రోసెసింగ్ పరిశ్రమలకు మళ్లింపబడిన ఫలితంగా, జాతీయ మార్కెట్‌తోనూ, భారతదేశంలో పునరుత్పత్తి క్రమంతోనూ వాటి సంబంధాలు యితర వర్ధమాన దేశాల్లో మాదిరిగానే నిస్సందేహంగా దృఢతరమయ్యాయి అయితే విదేశీ మదుపుల్లో అధిక భాగం యింకా పరివేష్టిత తరహాలోనే ఉన్నాయి. తవ్వకం పరిశ్రమల ఘాట బ్రటుంచి, ప్రోసెసింగ్ పరిశ్రమల్లో సైతం, *పరిమిత*మైన శాఖలు మాత్రమే – వేటి ఉత్పాదితాలు అభివృద్ధిచెందిన పెట్టుబడిదారీ దేశాల మార్కెట్‌లోనే ప్రధానంగా విక్రయింపబడతాయో

---

* *Reserve Bank of India Bulletin*, Bombay, March 1978, p 175

ఆ శాఖలు – అభివృద్ధిచెయ్యబడ్డాయి. విదేశీ పెట్టుబడిమీద వచ్చే లాభాల్లో పెద్ద భాగం, అంటే పెట్టుబడి విలువ ఎగుమతి గణనీయంగా మించిన భాగం, అభివృద్ధిచెందిన పెట్టుబడిదారీ దేశాలకు బదలాయించబడుతోంది.

వర్ధమాన దేశాల పారిశ్రామికోత్పాదితాల్లో దాదాపు 20 శాతం పైనా, ఎగుమతుల్లో 40 శాతంపైనా అజమాయిషీ కలిగివున్న బహుళ జాతి, అంతర్జాతీయ కార్పొరేషన్లు భారతదేశంలోనూ, తదితర వర్ధ మాన దేశాల్లోనూ ప్రైవేటు విదేశీ పెట్టుబడి స్థానాన్ని నిర్ణయించ డంలో ఒక ముఖ్యాంశంగా వున్నాయి ఈ గుత్త సంస్థల కార్యకలాపాల విస్తరణకు విదేశీ మదుపుల నిర్మాణంపైనా, వర్ధమాన దేశాల ఆర్థిక వ్యవస్థలో వాటి పాత్రపైనా విశేషమైన ప్రభావం ఉంది. ఏదైనా ఒక అంతర్జాతీయ గుత్త సంస్థలో భాగమైనప్పటికీ, యితర దేశాల్లో వున్న విడి పారిశ్రామిక సంస్థలూ, ఉత్పత్తి సముదాయాలూ ఆ గుత్త సంస్థకి చెందిన తదితర పారిశ్రామిక సంస్థలతో, అవెక్కడున్నా యన్నదానితో నిమిత్తం లేకుండా, సాంకేతికంగానూ, ఆర్థికంగానూ ముడిపడివుంటాయి తప్ప, తమ సొంత దేశపు ఆర్థిక వ్యవస్థతో ముడిపడివుండవు. ఈ కారణం మూలంగా, గుత్త సంస్థల శాఖలు వర్ధమాన దేశాల్లో సాంప్రదాయిక పునాదిమీద ఒక మాదిరి ఉపరినిర్మా ణంగా వుంటాయి. అవి యీ పునాదిని మార్చడంకంటె వదిలవరు స్తాయి అవి ముడిపదార్థాలను, ద్రవ్య వనరులను, అత్యుత్తమ నిపుణ శ్రామిక బలగాన్నీ జాతీయ ఉత్పత్తినుంచి దూరంగా మళ్ళిస్తాయి.

గత దశాబ్దంలో బహుళజాతి గుత్త సంస్థలు వర్ధమాన దేశా ల్లోంచి కేవలం లాభాల రూపంలో సుమారు 8,000 కోట్ల డాలర్ల మేరకు, లేక ప్రపంచపు యీ భాగంలో దాదాపు అవి పెట్టిన మొత్తం మదుపులకు సమానంగా తరలించుకుపోయాయి ప్రైవేటు మదుపుల పైన లాభాల రూపంలో తరలింపబడిన మొత్తం వర్ధమాన దేశాలకు పశ్చిమ దేశాలు యిచ్చిన ప్రభుత్వ ''సహాయం'' మొత్తాన్ని మించి

పోయింది. దీనికి, కొత్త టెక్నాలజీకోసం వర్ధమాన దేశాలు చెల్లించే మొత్తాన్ని – యిది సాలీనా 300–500 కోట్ల డాలర్లు – కలపవలసి వుంటుంది.

ఇది వర్ధమాన దేశాలు భరిస్తున్న నగదు నష్టాల మిక్కిలి ఉజ్జాయింపు అంచనా మాత్రమే. తమ జాతీయార్థిక వ్యవస్థల పునర్నిర్మాణంకోసం విదేశీ ప్రైవేటు పెట్టుబడిని ఆకర్షించవలసివున్న కారణంగా వర్ధమాన దేశాలు యీ నష్టాలను భరించక గత్యంతరం లేకపోతోంది.

బహుళజాతి కంపెనీలు తమ పారిశ్రామిక సంస్థల్లోని సాంకేతిక క్రమాన్ని, అత్యంత శ్రమ సాంద్రమూ, పర్యావరణ కాలుష్యం రీత్యా మిక్కిలి హానిదాయకమూ అయిన ఉత్పాదక ప్రక్రియలు వర్ధమాన దేశాల్లో ఉండేలా పంపిణీ చేస్తాయి. ఈవిధంగా అవి తమ ఉత్పత్తి ఖర్చులను తగ్గించుకుంటాయి. వర్ధమాన దేశాల్లో శ్రమ మరింత చౌకగా లభించడం, తమ మదుపుల ఫలదాయకతను పెంచడమే యిందుకు కారణం. అఖిల భారత ట్రేడ్‌యూనియన్ కాంగ్రెస్ అంచనా ప్రకారం, విదేశీ పెట్టుబడికి చెందిన లేక దాని అజమాయిషీలోని పారిశ్రామిక సంస్థల్లో భారతీయ కార్మికుడి సగటు వేతనం, అదే మాదిరి పారిశ్రామిక సంస్థలో అమెరికన్ కార్మికుడి వేతనంలో సుమారు 10 శాతం మాత్రమే వుంది.

బహుళజాతి కార్పొరేషన్ల లావాదేవీల ఫలితంగా ఉత్పన్నమయ్యే ప్రత్యేక తరహా అంతర్జాతీయ శ్రమ విభజన, వర్ధమాన దేశాలు తమ జాతీయ పునర్నిర్మాణాన్నీ, ఆర్థిక స్వాతంత్ర్యాన్నీ సాధించుకునే మార్గాల్లో పెట్టుబడిదారీ ప్రపంచ ఆర్థిక వ్యవస్థ నిర్మించే ఒక నిర్దిష్ట అవరోధంగా వ్యవహరిస్తుంది.

భారతదేశం తన జాతీయాభివృద్ధి ప్రయోజనాలను కాపాడుకొనేందుకూ, విదేశీ పెట్టుబడి విస్తరణను నిరోధించేందుకూ ఉద్దేశించబడిన చట్టాలను ఆమోదించింది. ప్రథమంగానూ, ప్రధానంగానూ

అలాంటి విస్తరణకు ఒక ఆర్థిక అవరోధంగా వ్యవహరించేది ప్రభుత్వ రంగమే. ఎందుకంటే, జాతీయార్థిక వ్యవస్థ కీలక రంగాలను అదే అజమాయిషీ చేస్తుంది. అలాగే పెరుగుతున్న ప్రైవేటు జాతీయ పెట్టుబడి శక్తిని సైతం తక్కువ అంచనా వెయ్యకూడదు. దేశీయ మార్కెట్లో తన స్థానాలను అది నియంత్రితమూ, సుదృఢమూ చేసు కొంటుంది, విదేశీ పెట్టుబడి మదుపుల నిర్మాణాన్నీ, దిశనీ అత్యధి కంగా ప్రభావితంచేసేది దేశీయ మార్కెటే. భారతదేశానికి అదనపు ద్రవ్య వనరులూ, కొత్త టెక్నాలజీ అవసరం, అందుకే అది తన జాతీయార్థిక వ్యవస్థనుంచి విదేశీ పెట్టుబడిని పూర్తిగా మినహాయించే పరిస్థితిలో లేదు. అదే సమయంలో, జాతీయ ప్రైవేటు పెట్టుబడి, ప్రత్యేకించి దాని గుత్త గ్రూపుల పెరుగుదల, దేశాన్ని అనివార్యంగా పెట్టుబడి అంతర్జాతీయకరణ సాధారణ క్రమంలోకి నెట్టుతుంది.

భారతదేశమూ, తదితర వర్ధమాన దేశాలూ రాజకీయ స్వాతం త్ర్యాన్ని సంపాదించుకున్నప్పుడు సామ్రాజ్యవాద గుత్త సంస్థలు వాటి జాతీయార్థిక వ్యవస్థలను ప్రభావితం చేసే అవకాశాలు తగ్గించ బడ్డాయి. మిగిలిన చాలా విముక్త దేశాల మాదిరిగానే భారతదేశం విదేశీ పెట్టుబడి విస్తరణనుంచి తన జాతీయార్థిక వ్యవస్థను కాపాడుకొనే క్రియాశీల విధానాన్ని అనుసరిస్తోంది. ఈ ప్రయత్నంలో అది చాలా వరకు జయప్రదమైంది.

అయితే, సామ్రాజ్యవాద రాజకీయ పెత్తనపు రద్దు, దానంతటదే ఆర్థిక విముక్తికి హామీ కల్పించదు. సామ్రాజ్యవాద గుత్త సంస్థల విస్తరణ తత్వానికి వ్యతిరేకంగా ఏళ్ల తరబడి నిష్ఠుర పోరాటం జరప డమూ, గతంనుంచి వారసత్వంగా సంక్రమించిన ప్రపంచ ఆర్థిక సంబం ధాల పునర్నిర్మాణానికి విశేష కృషి జరపడమూ అవసరం. అప్పుడే అందరికీ సమానమైన అవకాశాలను రూఢిచేసే ప్రపంచ ఆర్థిక సంబం ధాల ప్రజాతంత్ర వ్యవస్థ ఏర్పడుతుంది.

అయితే ప్రస్తుత పరిస్థితుల్లో సైతం విదేశీ పెట్టుబడిని జాతీయార్థిక వ్యవస్థ ప్రయోజనాలకోసం అత్యధికంగా వినియోగించుకోవడం పూర్తిగా సాధ్యం. ఇది జాతీయ ప్రభుత్వానికి సంబంధించిన విషయం. ఎందుకంటే, విదేశీ పెట్టుబడి లావాదేవీలను అరికట్టగలిగినదీ, ప్రాకృతిక, శ్రమ వనరుల దోపిడి ప్రమాణాన్నీ, స్థాయినీ తగ్గించగలిగినదీ, అన్నింటికంటె ముఖ్యంగా, దేశీయ పెట్టుబడి వనరుల సంచయనాన్ని సమీకరించగలిగినదీ అదే. ఈవిధంగా సత్వర భవిష్యత్తులో భారమైన లేక అసమ షరతులపైన విదేశీ వనరులను ఆకర్షించడం అనవసరమవుతుంది.

ప్రైవేటు పెట్టుబడి చలనానికి భిన్నంగా, ప్రభుత్వ పెట్టుబడి ఉత్పత్తితోనూ, అదనపు విలువను సొంతపరచుకోవడంతోనూ ప్రత్యక్షంగా ముడిపడిలేదు. ప్రభుత్వ పెట్టుబడిలో అత్యధిక భాగం యిప్పుడు ప్రధానంగా ఋణాలు, అడ్వాన్సులు, సబ్సిడీల రూపంలో వర్ధమాన దేశాల్లోకి మళ్లింపబడుతోంది. అందులో పెట్టుబడి విలువ చలనానికీ, ఋణాల తిరిగి చెల్లింపూ, వడ్డీ చెల్లింపుల ఎదురు ప్రవాహానికీ మధ్య సమతూకం యింతవరకు వర్ధమాన దేశాలకు అనుకూలంగా వుంది. తద్వారా, ప్రైవేటు పెట్టుబడి లావాదేవీలపైన వచ్చే నష్టాలను కొంతవరకు అది భర్తీచేస్తోంది.

ప్రభుత్వ పెట్టుబడి పునరుత్పత్తి లక్ష్యాల, పరిమితుల విస్తృతి, చలనశీలతల దృష్ట్యా, దాని వినియోగం జాతీయ ప్రభుత్వంచేత అదుపు చెయ్యబడేటప్పుడు ఆయా రంగాల్లో దాని నిర్మాణం వర్ధమాన దేశాల ఆంతరిక అవసరాలను మరింత సమగ్రంగా తీరుస్తుంది.

అయితే, ప్రభుత్వ పెట్టుబడి చలనం పరిమితం చెయ్యబడకూడదని గాని, ప్రభుత్వపు విదేశీ ఋణాల భారాన్ని అనంతంగా పెరగనివ్వాలని గాని దీని అర్థం కాదు. ఈ రెండు అంశాలూ ఋణాలిచ్చే దేశాల, ఋణాలు పుచ్చుకునే దేశాల రాజకీయ దిశాభిముఖత్వంచేత మాత్రమే

నిర్ణయింపబడవు. అన్నింటికంటె ముఖ్యంగా అవి పునరుత్పత్తి క్రమానికి సంబంధించి సాధారణ పరిస్థితులచేతా, దాని అంతిమ ఫలితాల చేతా, ప్రత్యేకించి ప్రైవేటు విదేశీ పెట్టుబడి పునరుత్పత్తితోనూ, విదేశీ వ్యాపార చెల్లింపుల శేషం పరిస్థితితోనూ, దాని సంబంధంచేతా నిర్ణయింపబడతాయి. అందుకని, ప్రభుత్వ ఋణాలు మంజూరు చెయ్యబడే ప్రమాణమూ, షరతులూ మరింత ఉదారంగా ఉన్నప్పటికీ, అవి వర్ధమాన దేశాల వాస్తవావసరాలకు అనుగుణంగా ఉన్నాయని చెప్పేందుకు ఎంతమాత్రం వీల్లేదు, పైపెచ్చు వాటి వినియోగం తిరిగి చెల్లించేందుకు సంబంధించిన సమస్యలను కూడా ఉత్పన్నంచేస్తుంది.

పెట్టుబడిదారీ దేశాలనుంచి ప్రభుత్వ పెట్టుబడి రాక ప్రాముఖ్యాన్ని పరిమాణాత్మకంగా మాత్రమే మనం అంచనా వెయ్యలేము. పెట్టుబడిదారీ దోపిడి యంత్రాంగంలో దాని పాత్ర, దేశాల ఒక బృందంతో మరొకదానికి, కరెన్సీలో లేక తదితర కొలమానాల్లో, విలువ చలనానికి అనురూపంగా లేదు.

శాస్త్ర, సాంకేతిక విప్లవం పారిశ్రామికంగా అభివృద్ధిచెందిన దేశాల ఉత్పాదక శక్తులను నూతనమూ, ఉన్నతమూ అయిన స్థాయికి పెంచగా, ఆర్థికంగా వెనకబడిన దేశాలపైన యీ విప్లవ ప్రభావం దాదాపు ఏమీ లేదు. అందుకని, యీ రెండు దేశ బృందాల్లోనూ పెట్టుబడి అన్వయ పరిస్థితుల్లోని అసమానత్వం కేవలం మరింత ప్రస్ఫుటమైంది. సామాజిక పెట్టుబడి హీన వ్యవస్థీకృత సంపుటి, ఆర్థిక వ్యవస్థలో ఏ మదుపు లావాదేవీలచేతా ప్రభావితం కాకుండా ఉండిపోయిన సాంప్రదాయిక రంగపు ఉనికి, వెనకబడిన అంతర్ నిర్మాణం, సంకుచితమైన దేశీయ మార్కెట్, నిపుణ శ్రామిక బలగపు కొరత — వీటన్నింటికీ విదేశీ పెట్టుబడి మదుపుల ఫలదాయక వినియోగాన్ని రూఢిచేసే పారిశ్రామికోత్పత్తిని వ్యవస్థీకరించేటప్పుడు అదనపు వ్యయం అవసరం.

సోషలిస్టేతర దేశాలనుంచి మిక్కిలి పెద్ద మొత్తాల్లో ప్రభుత్వ

ద్రవ్య వనరులను పొందుతున్న దేశాల్లో భారతదేశం ఒకటి. దీర్ఘకాలిక రుణాలు, సబ్సిడీలు, వ్యాపారిక ఉత్పాదితాల సరఫరాలు, పేటెంట్లు, లైసెన్సుల అమ్మకాలతోబాటు సాంకేతిక సమాచారపు సప్లయ్‌ల రూపంలో ఆ వనరులు వస్తాయి. వీటిలో అత్యధిక భాగం (మొత్తం వనరుల్లో 90 శాతానికి పైగా) దీర్ఘకాలిక రుణాల రూపంలో వస్తాయి. 1950కీ 1979కీ మధ్య భారతదేశం రుణాలు, సబ్సిడీలు, ఆహార సహాయం రూపంలో 18,680 కోట్ల రూపాయలకు పైగా పొందింది.* రుణాల పైన చెల్లింపులు పెరిగేకొద్దీ, అర్థికాభివృద్ధికి తక్కువ ఆర్థిక వనరులు లభిస్తాయి, వాటిలో అంతకంతకు ఎక్కువ భాగం విదేశీ వ్యాపార చెల్లింపుల శేషంలో లోటును భర్తీచేసేందుకు వినియోగింపబడుతుంది.

పెట్టుబడిదారీ దేశాలనుంచి ''అభివృద్ధి నిమిత్తం వచ్చే'' ప్రభుత్వ సహాయంకోసం భారతదేశం అధిక మూల్యం చెల్లించవలసివస్తున్నట్లు వాస్తవాలు తెలియజేస్తున్నాయి. భారతదేశం విదేశాలనుంచి పొందే వనరుల్లో దాదాపు సగం రుణ వాయిదాల, వడ్డీల చెల్లింపుకోసం వెచ్చింపబడవలసి వస్తోంది. వనరులు యిలా బయటకి పోవడం ఎగుమతుల ద్వారా లభించే ఆదాయాన్ని తగ్గిస్తుంది, దేశపు విదేశీ కరెన్సీ నిల్వల పరిస్థితిని దెబ్బతీస్తుంది.

పెట్టుబడిదారీ దేశాలనుంచి విదేశీ రుణాల, అడ్వాన్సుల సాయంతో తన తక్షణ సమస్యల్లో కొన్నింటిని పరిష్కరించుకొనేందుకు చేసే ప్రయత్నం ద్వారా భారతదేశం తనని తాను ఆర్థిక కష్టాలకూ, బహుశా రాజకీయ యిబ్బందులకూ గురిచేసుకొంది. కాలం గడిచేకొద్దీ ఈ యిబ్బందులు మరింత ముదురుతాయి. రుణ భారం పెట్టుబడి సంచయనపు రేటునూ, దేశీయ అభివృద్ధి మూలాధారాల ఫలదాయక వినియోగ అవకాశాలనూ గణనీయంగా దెబ్బతీస్తుంది. విదేశీ రుణాలపైన ఆధార

---

* *Economic Survey, 1979/80*, New Delhi, 1980.

పడటం అసలు అభివృద్ధి క్రమాన్నే తీవ్రంగా దెబ్బతియ్యగలుగుతుంది. ఆర్థిక, రాజకీయ కారణాల రీత్యా, విదేశీ సహాయం అభివృద్ధిని మందగింప జెయ్యగలుగుతుంది.

రుణ స్థాయి ఆమోదిత సూచియే రుణ తీర్మాన గుణకం, అంటే రుణాల చెల్లింపుల ప్రమాణానికీ, ఎగుమతి సంపాదనలకీ మధ్య నిష్పత్తి. చాలామంది అర్థశాస్త్రవేత్తలు రుణ తీర్మాన గుణకం 15–20 శాతాన్ని మించితే ప్రమాదకరమైనదని భావిస్తారు. ఎందుకంటే, అప్పుడిక రుణం ఆర్థిక వ్యవస్థ గతిక్రమంలో ఒక ప్రతికూల అంశం అవుతుంది. 1971/72కీ 1978/79కీ మధ్య భారతదేశంలో రుణతీర్మాన గుణకం నాల్గవ పంచవర్ష ప్రణాళికా కాలంలోని 27 శాతానికీ, 1978/79లోని 15.4 శాతానికీ మధ్య మారుతూ వచ్చింది.*

1978/79లో విదేశీ రుణ చెల్లింపులు జాతీయాదాయంలో దాదాపు 2 శాతం వున్నాయి. భారతదేశంలో తలసరి జాతీయాదాయాన్ని పరిగణనలోకి తీసుకున్నప్పుడు, యిది బాగా ఎక్కువ. మొదటి పంచవర్ష ప్రణాళికలో దిగుమతుల ద్రవ్య చెల్లింపులో విదేశీ వనరుల వాటా 4.9 శాతం వుంది. అలాంటిది మూడవ ప్రణాళిక నాటికి అది 37 శాతం, ఐదవ ప్రణాళికలో అది 12.8 శాతం వుంది.**

మిగిలిన విముక్త దేశాల మాదిరిగానే, రాజకీయ స్వాతంత్ర్యం సాధించుకున్న మీదట భారతదేశం తన కష్టాలను అధిగమించి, తన జాతీయార్థిక వ్యవస్థను అభివృద్ధిచేసుకుంటోంది, ప్రపంచ ఆర్థిక సహకారంలో పురోగతి సాధిస్తోంది. వర్ధమాన దేశాలు నానాటికీ అధికంగా ఆర్థికంగా స్వతంత్రమవడం, ప్రపంచ మారకాలలో సమాన హోదాకోసం వాటి పోరాటమూ పెట్టుబడిదారీ పశ్చిమ దేశాలు తమ ఆర్థిక వ్యూహాన్ని

---

* *The Sixth Five Year Plan...*, p. 6.

** అదే గ్రంథం, అదే పేజి.

రూపొందించుకొనేటప్పుడు వాటికి నూతన సమస్యలను తెచ్చిపెడతాయి. ఈ సమస్యలు ప్రథమంగానూ, ప్రధానంగానూ ఎగుమతికీ, పెట్టుబడిని తిరిగి పొందేందుకూ సంబంధించిన పరిస్థితులతో ముడిపడివుంటాయి. ప్రపంచ ఆర్థిక వ్యవస్థ నిర్మాణంలో ప్రగతిశీల మార్పులు ఉత్పన్నం చేసిన కొత్త సమస్యలను పరిష్కరించవలసిన యీ అవసరం ప్రభుత్వ పెట్టుబడి ఎగుమతి రూపాలనూ, షరతులనూ మార్చేలా పెట్టుబడిదారీ దేశాలను నిర్బంధిస్తుంది.

నానాటికీ పెరుగుతున్న రుణతీర్మాన చెల్లింపుల భారమూ, జాతీయార్థిక వ్యవస్థలపైన వాటి తీవ్ర ప్రభావమూ పెట్టుబడిదారీ దేశాలు వాటి సొంత ఆర్థిక కర్తవ్యాలనూ, లక్ష్యాలనూ సాధించుకోవడాన్ని కష్టతరం చేస్తాయి. దివాళా తీసిన దేశం ఒక రాజకీయ భాగస్వామిగానూ ఉండజాలదు, లాభాలకు మూలాధారంగానూ ఉండజాలదు. పెట్టుబడి మదుపుకి అదొక లక్ష్యమూ కాజాలదు, ఎగుమతి సరుకులకు ఒక మార్కెట్టూ కాజాలదు. అందుకని, ప్రభుత్వ పెట్టుబడి ఎగుమతి రంగంలోని సంక్షోభ పరిస్థితినుంచి — యీ సంక్షోభానికి స్వయంగా పెట్టుబడిదారీ దేశాలదే బాధ్యత — బయటపడే మార్గంకోసం యీ వెతుకులాట.

అంతకంతకు పెరుగుతున్న రుణభారం రుణాలను పునర్వర్గీకరించుకోవలసిన, సాపేక్షంగా సానుకూలమైన షరతులపైన రుణాల పరోక్ష ద్రవ్య సహాయం (re-financing)కోసం అప్పులు యివ్వడానికి సంబంధించిన సమస్యను ముందుకు తెచ్చింది. అయితే పరోక్ష ద్రవ్య సహాయ వ్యవస్థ రుణాలు లేకుండా చెయ్యదు. అది పెట్టుబడిదారీ దేశాలపైన ఆర్థికంగా వర్ధమాన దేశాల ద్రవ్యపర పరాధీనతను పొడిగిస్తుంది.

ప్రపంచ పెట్టుబడిదారీ ఆర్థిక వ్యవస్థ లోపల వర్ధమాన దేశాలను నిలిపివుంచడమనే తమ ప్రధాన లక్ష్యాన్ని సాధించే ప్రయత్నంలో

పెట్టుబడిదారీ దేశాలు తమ యితర సమస్యలన్నింటికంటె యీ సమస్యకు ప్రాధాన్యం యిస్తాయి. కొన్ని సందర్భాల్లో అవి ప్రభుత్వ రుణాలు, అరువులపట్ల వాణిజ్య వైఖరిని విసర్జిస్తాయి. ప్రస్తుత పరిస్థితుల్లో పెట్టుబడిదారీ వ్యవస్థ మార్కెట్లను విస్తరింపజెయ్యడం, ప్రైవేటు, ప్రభుత్వ పెట్టుబడి ఎగుమతి ప్రాతిపదికపైన వెనకటి వలసదేశాల దోపిడిని పెంచడం ఏక కాలంలో సాధ్యం కాని విషయమైంది. తనకు అత్యంత లాభసాటి అయిన షరతులను వెదికి, దేశంలో సృజింపబడే అదనపు ఉత్పాదితంలో అధికతర భాగాన్ని తనే వశంచేసుకొనేందుకు ప్రయత్నించే జాతీయ పెట్టుబడిదారీ వ్యవస్థయొక్క పెరుగుతున్న బలాన్ని పై అంశానికి జోడించుకోవలసివుంటుంది. వీటన్నింటి దృష్ట్యా, ఆర్థికాభివృద్ధికి కొత్తగా సమకూర్చబడే ప్రభుత్వ సహాయానికి సంబంధించిన షరతులు మారుతున్నాయి. వడ్డీ రేటు తక్కువ, తిరిగి చెల్లించేందుకు కాలవ్యవధి పెంచబడుతోంది, రుణాలు, అడ్వాన్సుల్లో కొంత భాగాన్ని జాతీయ కరెన్సీల్లో తిరిగి చెల్లించే అవకాశం కల్పించబడుతోంది.

సామ్రాజ్యవాదులు పెట్టుబడిదారీ దోపిడి వ్యవస్థనూ, స్వాధీనపరచుకొనే పద్ధతినీ పదిలంగా ఉంచాలనీ, పెట్టుబడిదారీ ఆర్థిక మండలాన్ని యథాతథంగా అట్టేపెట్టాలనీ లేక దాన్ని విస్తరింపచెయ్యాలనీ కోరుకుంటారు కనుక, వాళ్లు కొన్ని సందర్భాల్లో పాత పీడన, కొల్లదారీ పద్ధతులను పరిత్యజించవలసివుంటుంది.

పెట్టుబడి మదుపుల, ముడి పదార్థాల మూలాధారాల రంగాలకోసం సామ్రాజ్యవాద రాజ్యాల మధ్య పోటీ జరుగుతోంది. ఈ పోటీ యిటీవలి సంవత్సరాల్లో ఇంధన, ముడి పదార్థాల కొరత మూలంగా మరింత వ్యగ్రమైంది. వర్ధమాన దేశాలు విదేశీ ప్రభుత్వ రుణాలను పొందే సాధారణ షరతులను మార్చడంలో ఈ పోటీ ఒక ముఖ్య పాత్ర వహిస్తుంది.

అయితే, ఆర్థిక సహాయం అనబడేదాని మారిన షరతులకు అభివృద్ధి చెందిన పెట్టుబడిదారీ దేశాలు గణనీయమైన నష్టాలు పొందుతా

యని ఎంతమాత్రం అర్థం కాదు. సామ్రాజ్యవాదులు యిప్పటికీ భారీ ప్రమాణంలో వున్న తమ పాత అధిక వడ్డీ రుణాల, బాకీల నిల్వలనూ, మొత్తం సహాయ పరిమాణంలో సబ్సిడీలనూ, గ్రాంట్లనూ తగ్గించడం ద్వారా రుణ ద్రవ్యంలో తమ వాటాను పెంచుకునే అవకాశాలనూ కలిగివున్నారు. ఉదాహరణకు, పశ్చిమ జర్మనీ యిచ్చే రుణాల్లో అత్యధిక భాగంపైన సాలుసరి వడ్డీ రేటు 3–6 శాతం, ఆస్ట్రియా, బ్రిటన్‌లు – 5.5–6 శాతం, కెనడా, ఇటలీలు – 6 శాతం, ఫ్రాన్సు – 6.9 శాతందాకా, జపాను – 5–6 శాతం, అమెరికా 5 శాతందాకా వుంది.* 5 శాతానికి మించిన వడ్డీ రేటుతో యివ్వబడే రుణాలన్నీ తిరిగి చెల్లించబడవలసిన పెట్టుబడి రుణం మొత్తం 20 ఏళ్ల కాలంలో రెట్టింపవుతుందని మామూలు లెక్కలనుబట్టి తేలుతోంది. పెట్టుబడిదారీ దేశాలు యిచ్చే రుణాలపైన సగటు వడ్డీ రేటు 5 శాతాన్ని మించివుంటుంది కనుక, వాటి ఉన్నతమైన ప్రతిఫలం రేటుకీ, సబ్సిడీలు, గ్రాంట్లతోబాటు అన్ని విదేశీ వనరుల సాధారణ ఆర్థిక లాభదాయకతకీ హామీ ఏర్పడుతుంది.

విదేశీ ద్రవ్య వనరులను సమకూర్చడంలో పెట్టుబడిదారీ దేశాలు సాంఘిక, రాజకీయ లక్ష్యాలను కూడా దృష్టిలో పెట్టుకొంటున్నాయి. సామ్రాజ్యవాద పోరాటం వ్యగ్రమైన కారణంగా బాంకర్లు, దౌత్యవేత్తల కృషి సమన్వయం అవసరమవుతుంది. ఈ పోరాటంలో ప్రభుత్వ రుణాలు శక్తివంతమైన ఒక ఆయుధంగా వాడబడ్డాయి. ప్రభుత్వ పెట్టుబడి ఎగుమతి వాణిజ్య పార్శ్వం ఎన్నడూ ప్రధానమైనదిగా లేదు. రుణాలకీ, పరపతికీ ఎప్పుడూ రాజకీయ బంధనాలు ఉంటూవచ్చాయి. ఆర్థిక సాధనాల ద్వారా అంతిమ రాజకీయ లక్ష్యాలు సాధింపబడవలసి ఉన్నం

---

* *Commerce*, Bombay, September 19, 1964, p. 494.

దున, రుణాలను, అరువులను సమకూర్చడానికి సంబంధించిన విధానాన్ని అమలుజరిపేటప్పుడు వస్తుపరమైన వైరుధ్యాలు ఉత్పన్నమవుతూంటాయి. భారతదేశం పొందిన విదేశీ వనరుల్లో గణనీయమైన భాగం ప్రభుత్వ రంగంలోకి మళ్లింపబడుతున్నాయి. అది దేశపు ఆర్థిక పురోగతిలో విదేశీ పెట్టుబడికి వాంఛనీయంకాని ధోరణులను ఉత్పన్నంచేస్తోంది. ప్రాథమిక దశల్లో మాత్రమే విదేశీ వనరుల్లోని అధికతర భాగం భారతదేశపు అంతర్ నిర్మాణంలోకి మళ్లింపబడ్డాయి· తరువాత దశల్లో విదేశీ వనరులు అంతకంతకు అధికంగా పారిశ్రామిక సంస్థల నిర్మాణానికి వినియోగింపబడ్డాయి.

ఆదిలో పెట్టుబడిదారీ దేశాలు భారతదేశంలో ప్రభుత్వ రంగానికి తోడ్పాటునిచ్చేందుకు మిక్కిలి అయిష్టత చూపాయి. భారతదేశ ఆర్థిక స్వాతంత్ర్య సాధనను ఆలస్యంచెయ్యాలని అవి కోరుకోవడమే ఇందుకు కారణం. ఉదాహరణకు, అమెరికా ప్రతినిధుల సభ బొకారోలో ప్రభుత్వ లోహకార కర్మాగారాన్ని నిర్మించాలన్న ప్రతిపాదనను, అది దేశంలో సోషలిజం వ్యాప్తికి దోహదం చేస్తుందన్న కారణంపైన తిరస్కరించింది. అయితే క్రమంగా ప్రభుత్వ రంగంపట్ల యీ ప్రతికూల వైఖరి స్థానంలో చాలవరకు సానుకూల వైఖరి చోటుచేసుకుంది. వర్ధమాన దేశాలకు ఆర్థిక సాధనాలను సమకూర్చడాన్ని పరిమితం చేసుకోవడం ద్వారా రుణగ్రహీత దేశాల ఆర్థిక వ్యవస్థపైన, రాజకీయాలపైన పరోక్షమే అయినప్పటికీ గట్టి ప్రభావాన్ని కలిగించే అవకాశాన్ని కోల్పోతున్నామన్న విషయాన్ని సామ్రాజ్యవాదులు గ్రహించారు.

విదేశీ ప్రభుత్వ ద్రవ్య వనరులు భారతదేశపు ఆర్థిక ప్రణాళికల ద్రవ్య వనరుల్లో ఒక ముఖ్య అంశీభూత భాగం అయ్యాయి.

ప్రభుత్వ పెట్టుబడి ఎగుమతి విదేశీ వాణిజ్యంమీదా, తద్వారా పారిశ్రామికోత్పత్తిమీదా గణనీయమైన ప్రభావం కలిగివుంటుంది. ఈ క్రమంలో "బంధింపబడిన"వి అనబడే రుణాలకు ప్రత్యేక ప్రాముఖ్యం

వుంది. ఈ రుణాల ప్రకారం ఎగుమతిచేసే దేశపు సరుకుల జాబితా ముందుగా నిర్ణయింపబడుతుంది. ఇది ఆదినుంచి అభివృద్ధిచెందిన వర్ధమాన దేశాల మధ్య పరాధీన సంబంధాలను కల్పిస్తుంది. ఇరు పక్షాల దేశాల మధ్య కఠినమైన ఈ సంబంధాల పర్యవసానం ఏమిటంటే, వర్ధమాన దేశాల దిగుమతి నిలువుకోవడం. కొనుగోళ్లు ప్రధానంగా అయా దేశాల ధరల ప్రకారం జరగడమే దానికి కారణం. ఆ ధరలు మామూలుగా ప్రపంచ ధరలకంటె ఎక్కువగా వుంటాయి. పెట్టుబడి దారీ దేశాల దిగుమతి ఎగుమతి సరుకుల ధరల అభివృద్ధి క్రమాన్ని పోల్చి చూస్తే నూనె ఎగుమతిచేసే కొద్ది దేశాలు మినహాయించి, వర్ధమాన దేశాల బాహ్య ఆర్థిక పరిస్థితి క్షీణిస్తుందని తెలుతోంది.

పెట్టుబడిదారీ మార్కెట్ ప్రతికూల పర్యవసానాలు భారతదేశం తన ఆర్థిక వ్యవస్థలోని ఉత్పత్తి, ఖర్చులకు సంబంధించిన పాత నిర్మాణాలను ఆధునికంచేసుకోకుండా నిరోధిస్తూ, పేదతనాన్ని రూపుమాపడానికీ, ఉపాధి సౌకర్యాల పెంపకానికీ ఆటంకమవుతున్నాయి.

అదే సమయంలో, చాలా సందర్భాల్లో గుత్త సంస్థలకు లోబడి వుండటానికి సంబంధించి వారసత్వంగా సంక్రమించిన రూపాలనూ, ధరలనూ, అంతర్జాతీయ వరవడిని రూపొందించే నిర్దిష్ట లక్షణాలను పదిలపరచే పెట్టుబడిదారీ ప్రపంచ ఆర్థిక వ్యవస్థతో వున్న ఆర్థిక సంబంధాల స్వభావం, అంతే కాకుండా కరెన్సీ సంక్షోభాల ప్రభావమూ — విదేశాలనుంచి పొందేవాటికి చెల్లించవలసిన మూల్యాన్నీ, ఉత్పత్తి వ్యయాన్నీ చాలా ఎక్కువగా పెంచి, దేశపు ఆర్థిక అభివృద్ధి వేగాన్ని మందగింప చేస్తాయి.

భారతదేశపు ఎగుమతి వ్యవస్థలో మార్పులకీ, ఎగుమతుల్లో కొత్త సరుకుల వాటా పెరుగుదలకీ అనుగుణంగా ధరలు పెరగలేదు. అయినా కూడా యీ సరుకుల ఉత్పత్తి ఖర్చులు చాలా ఎక్కువగా ఉంటాయి. ఎందుకంటే, ఎగుమతి పరిశ్రమలు దిగుమతి చేసుకోబడిన యంత్రాలనూ,

ముడి పదార్థాలనూ విస్తృతంగా ఉపయోగిస్తాయి. వీటి మూలంగా జాతీయార్థిక వ్యవస్థకీ, ప్రపంచ మార్కెట్‌కీ మధ్య తలకిందులు సంబంధాలు అనబడేవి ఏర్పడతాయి: ఎగుమతుల యితోధిక పెరుగుదలకూ, ప్రపంచ ఆర్థిక సంబంధాల్లో ఒక సమాన భాగస్వామిగా దేశపు స్థానానికీ కీలకమైన అత్యంత ప్రగతిశీల పరిశ్రమల లాభదాయకతను దిగుమతులకు అయే ఖర్చు నిర్ణయిస్తుంది. పైగా, యీ పరిస్థితి ఎగుమతి సబ్సిడీల నిరంతర విస్తరణను అవసరం చేస్తుంది. ఇది జాతీయార్థిక వ్యవస్థయొక్క యితర శాఖల అభివృద్ధికి వనరుల అందుబాటును తగ్గిస్తుంది. అందుకని, భారతదేశమూ, తదితర వర్ధమాన దేశాలూ సంశ్లిష్టమైన కొన్ని సమస్యలను పరిష్కరించి, ప్రపంచ మారకపు లావాదేవీల్లో దేశ భాగస్వామ్యపు ఆర్థిక ఫలదాయకతను రూఢి చెయ్యగలిగేందుకుగాను ఎగుమతి ఉన్ముఖమైన ఉత్పత్తికీ, దేశీయ ఉత్పత్తికీ మధ్య వనరుల అత్యంత లాభసాటి అయిన, పొదుపైన పంపిణీ పద్ధతిని వెతకవలసివుంటుంది.

2. సోవియట్ యూనియన్‌తోనూ, తదితర సోషలిస్టు దేశాలతోనూ ఆర్థిక సహకారం

సోషలిస్టు దేశాలతో సహకారం బంధనాలతో కూడిన పాత దోపిడి రూపాల భారాన్ని వదిలించుకునేందుకూ, పశ్చిమ రాజ్యాల నయావలసవాద విధానానికి శక్తివంతమైన అవరోధాలను నెలకొల్పేందుకూ భారతదేశానికి తోడ్పడుతుంది. సోషలిస్టు దేశాల తోడ్పాటుపైన ఆధారపడి, భారత దేశం తన సొంత వనరులను మరింత క్రియాశీలంగా సమీకరించుకోగలగడమే కాకుండా, పెట్టుబడిదారీ దేశాలు యిచ్చే సహాయాన్ని తన

జాతీయ ప్రయోజనాలకోసం మరింత విస్తృతంగా వినియోగించు కోగలుగుతుంది.

సోషలిస్టు దేశాలకీ భారతదేశానికీ మధ్య ఆర్థిక, శాస్త్రీయ, సాంకేతిక సహకారంలో యీకింది రంగాలు యిమిడివున్నాయి: విదేశీ వర్తకం, దీర్ఘకాల రుణాలు, ఉత్పత్తి స్పెషలైజేషను, సహకారం, పరిశోధన, అభివృద్ధి కృషి, అంతే కాకుండా జాతీయార్థిక వ్యవస్థ ప్రధాన రంగాలకూ, శాస్త్ర-బోధన సంస్థలకూ సిబ్బంది శిక్షణ.

సోషలిస్టు దేశాల విదేశీ ఆర్థిక విధానం భారతదేశంతో వర్తకపు టర్నోవరు క్రమ విస్తరణ దిశగా ఉన్ముఖం చెయ్యబడుతోంది. అవి భారతదేశానికి దాని ఆర్థిక పురోగతికి అవసరమైన సరుకులను — పారిశ్రామిక యంత్ర పరికరాలు, యంత్రాలు, ఆయన లోహాల రేకులు — సప్లయ్ చేస్తాయి. విదేశీ వర్తక సంబంధాలు భారతదేశానికి దాని సాంప్రదాయిక, నూతన ఎగుమతి వస్తువులకు స్థిరమైన మార్కెట్‌కి హామీ కల్పించే దీర్ఘకాలిక ఒప్పందాలపై ఆధారపడివున్నాయి.

సోవియట్ యూనియన్‌కీ, భారతదేశానికీ మధ్య వర్తకం ప్రత్యేకించి త్వరితంగా అభివృద్ధిచెందుతోంది. 1953లో యీ రెండు దేశాలూ తమ తొట్టతొలి ఐదేళ్ల వర్తక ఒప్పందం చేసుకున్నాయి. ఆ ఒప్పందం వాటి మధ్య వర్తక సంబంధాలకి శ్రీకారం చుట్టింది. 1976–1980 దశకి సంబంధించిన ఐదవ పంచవర్ష ఒప్పందంపైన 1976లో సంతకాలు జరిగాయి. 1951/52కీ 1978/79కీ మధ్య యీ రెండు దేశాలకీ మధ్య వర్తకపు పరిమాణం 24 రెట్లకి పైగా పెరిగి, 1,100 కోట్ల రూపాయల స్థాయికి చేరుకుంది. భారతదేశపు ఎగుమతుల్లో 13 శాతం సోవియట్ యూనియన్‌కి వెళ్తూండగా, సోవియట్ యూనియన్‌నుంచి దాని దిగుమతులు యించుమించు 10 శాతం వున్నాయి.

సోవియట్ యూనియన్ భారతదేశానికి నూనె, పెట్రోలియం సరు

కులు, ఆయసేతర లోహాలు, సిమెంటు, ఎరువులు, నిర్మాణ ప్రాజెక్టు లకు యంత్రాలు సప్లయ్ చేస్తోంది. సోవియట్–భారత్ వర్తక సంబంధాల విజయవంతమైన అభివృద్ధి భారతదేశపు ఎగుమతులను వైవిధ్య పూరితం చేసేందుకు తోడ్పడి, పెట్టుబడిదారీ మార్కెట్‌పైన భారతదేశం ఆధారపడివుండటాన్ని తగ్గించింది.

తను సాంప్రదాయికంగా ఎగుమతి చేసే టీ, కాఫీ, పొగాకు, తివాసీలు, సుగంధ ద్రవ్యాలు, జనపనార, తోలుతో చేసిన సరుకులతోబాటు భారత దేశం సోవియట్ యూనియన్‌కి ఇంజనీరింగు సరుకులు, విద్యుత్ పరికరాలు, పనిముట్లు, చేతిపని వస్తువులు, క్రీడా వస్తువులూ సరఫరాచేస్తోంది.

భారతదేశానికీ, సోవియట్ యూనియన్‌కీ, తదితర సోషలిస్టు దేశాలకీ మధ్య వర్తక సంబంధాల ఫలవంతమైన అభివృద్ధి, విభిన్న సామాజికార్థిక వ్యవస్థలను కలిగిన దేశాలు, వాటి మధ్య సంబంధాలు పరస్పర గౌరవ, సమానత్వ, పరస్పర ప్రయోజనాలమీద నెలకొల్పబడినప్పుడు ఏమి సాధించ గలవో అన్న దానికి ప్రస్ఫుటమైన రుజువుల సమకూరుస్తున్నాయి.

1971 ఆగస్టులో కుదుర్చుకోబడిన 20 ఏళ్ల శాంతి, మైత్రీ, సహకార ఒడంబడిక సోవియట్–భారత్ సంబంధాల్లో ఒక మైలురాయి. భారతదేశానికీ సోవియట్ యూనియన్‌కీ మధ్య ఆర్థిక, శాస్త్ర, సాంకేతిక రంగాల్లో సర్వతోముఖ సహకారం సమానత్వ, పరస్పర లాభ దాయకత్వ ప్రాతిపదికపైన మరింత విస్తృతమూ, పటిష్ఠమూ అవాలని ఆ ఒడంబడిక వక్కాణించింది. ఆ ఒడంబడిక ప్రాతిపదిక సూత్రాలు 1973 నవంబరులో న్యూఢిల్లీలో కుదుర్చుకోబడిన "సోవియట్ యూనియన్‌కీ భారతదేశానికీ మధ్య ఆర్థిక, వర్తక సహకారపు యితోధికాభివృద్ధి ఒప్పందం"లో మరింతగా అభివృద్ధిచెయ్యబడ్డాయి. ఒక దేశపు సార్వభౌమత్వంపట్లా, ప్రాదేశిక సమగ్రతపట్లా మరొక దేశపు గౌరవ భావం, ఒక దేశపు ఆంతరిక వ్యవహారాల్లో మరొకటి జోక్యం చేసుకోకపోవడం, సమానత్వం, పరస్పర లాభదాయకత్వం అన్న సూత్రాలపైన పై

రెండు పత్రాలూ ఆధారపడివున్నాయి. అయితే, 1973 నాటి పత్రం ఆర్థిక సంబంధాల దిశను కూడా నిర్ణయించి, భవిష్యత్తులో దీర్ఘ కాలాన్ని దృష్టిలో పెట్టుకొని, కొన్ని గుణాత్మకమైన మార్పులను ప్రవేశపెట్టింది.

సోవియట్ యూనియన్ భారతదేశానికి 1,000 కోట్ల రూపాయలకి పైగా దీర్ఘకాలిక రుణాలు యిచ్చింది. సోవియట్ తోడ్పాటుతో భారతదేశంలో 70కి పైగా పారిశ్రామిక సంస్థలు నిర్మించబడ్డాయి, నిర్మాణంలో ఉన్నాయి లేక డిజైన్ చెయ్యబడుతున్నాయి. అవి భారత దేశపు ఆధునిక విద్యుచ్ఛక్తి ముడి పదార్థాలు, పారిశ్రామిక సముదాయాలకు ప్రాతిపదికగా వున్నాయి. సోవియట్ సహాయంతో భారతదేశంలో నిర్మించబడ్డ సంస్థలు దేశపు విద్యుచ్ఛక్తిలో 20–30 శాతం, ఉక్కులో 20–30 శాతం, నూనెలో 70 శాతం, పెట్రోలియం ఉత్పాదితాల్లో 30 శాతం, విద్యుచ్ఛక్తి పరిశ్రమకు యంత్ర పరికరాలలో 60 శాతం, గని తవ్వకం, ఇనుము, ఉక్కు పరిశ్రమల యంత్ర పరికరాల్లో 80 శాతం ఉత్పత్తి చేస్తున్నాయి. సోవియట్ నిపుణులు భారతదేశానికి అంతరిక్ష ఉపగ్రహాలను ప్రయోగించడంలో తోడ్పడుతున్నారు.

తృతీయ ప్రపంచ దేశాల్లో పారిశ్రామిక సంస్థల నిర్మాణానికి యంత్రాల సరఫరాలోనూ, సేవలు సమకూర్చడంలోనూ భారత–సోవియట్ భాగస్వామ్యానికి కూడా 1973 ఒడంబడిక అవకాశాలు కల్పిస్తోంది. వాటి మధ్య గుణాత్మకంగా నూతనమైన సంబంధాలు వాటి ప్రణాళికా రచనా సంఘాల మధ్య — సోవియట్ యూనియన్ ప్రభుత్వ ప్రణాళికా సంఘం, భారతదేశ ప్లానింగ్ కమిషన్ — సహకారానికి దారి తీసింది.

ఆర్థిక, శాస్త్ర, సాంకేతిక సహకారం విషయంలో సోవియట్–భారత ప్రభుత్వాల సంయుక్త కార్యకలాపాల కమిషన్ యీ రెండు

దేశాల మధ్యా పరస్పర లాభదాయక ఆర్థిక సహకారాభివృద్ధిపైన నానాటికీ అధికతర ప్రభావాన్ని కలిగిస్తోంది.

కీలకమైన అంతర్జాతీయ సమస్యలపైన తమ అభిప్రాయాల ఏకత్వాన్ని లేక సామ్యాన్ని సోవియట్ యూనియన్, భారతదేశమూ పునరుద్ఘాటించాయి, ఉద్రిక్తత ఉపశమనాన్ని ప్రగాఢం చెయ్యాలని విజ్ఞప్తి చేశాయి, ఆయుధ పోటీని వ్యతిరేకించాయి, వివాదాంశాలన్నింటినీ శాంతియుత పద్ధతుల ద్వారా పరిష్కరించుకోవాలని విజ్ఞప్తి చేశాయి. భారత–సోవియట్ రాజకీయ, ఆర్థిక సంబంధాలను విస్తృతమూ, ప్రగాఢమూ చేసుకోవడాన్ని రూఢిచేసేందుకు ఉద్దేశింపబడిన ముఖ్యమైన కొన్ని పత్రాలపైన సంతకాలు జరిగాయి. ఇవి: ఆర్థిక, సాంకేతిక సహకార ఒప్పందం, 1981–85 సంవత్సరాలకు వర్తక ఒప్పందం, 1981–82 సంవత్సరాల్లో సంస్కృతి, విజ్ఞానశాస్త్ర, విద్యా రంగాల్లో ఆదానప్రదానాల కార్యక్రమం, సినిమా పరిశ్రమలో సహకారంపై ఒప్పందం.

సోవియట్ యూనియన్‌కీ భారతదేశానికీ మధ్య శాంతి, మైత్రీ, సహకార ఒడంబడిక రెండు దేశాల ప్రజల ప్రయోజనాలకీ, అంతర్జాతీయ శాంతి భద్రతల పరిరక్షణకీ అనుగుణంగా సోవియట్ – భారత మైత్రీపూర్వక, పరస్పర లాభదాయక సహకారాన్ని పటిష్ఠం చేస్తోంది.

సోవియట్ యూనియన్‌కి ఎగుమతిచేసేందుకు ఉద్దేశింపబడిన సరుకులను తయారుచేసే భారతీయ పారిశ్రామిక సంస్థల సంఖ్య విశేషంగా పెరిగింది.

రెండు దేశాల మధ్యా ఉత్పత్తి సహకారం, సోవియట్ సహాయంతో పారిశ్రామిక సంస్థలు నిర్మింపబడుతున్న తృతీయ దేశాలకు యంత్రాలను సరఫరా చెయ్యడంలో అవి సంయుక్తంగా పాల్గొనేందుకు అవకాశం కల్పిస్తోంది. ఈ ఒప్పందం శాస్త్ర, సాంకేతిక సహకారపు యితోధికాభివృద్ధికీ, అతిముఖ్యమైన ఆధునిక పరిశ్రమల నిర్మాణాభివృద్ధుల్లో భారతదేశానికి తోడ్పడేందుకూ అవకాశాలు కల్పిస్తుంది.

1982 సెప్టెంబరులో భారత ప్రధాని ఇందిరా గాంధీ సోవియట్ పర్యటన సందర్భంగా సంతకాలు జరిగిన పత్రాలు సోవియట్—భారత సంబంధాల అభివృద్ధిలో ముఖ్యమైన ఒక ముందంజ.

సోవియట్—భారత సంయుక్త ప్రకటనలో ఉద్ఘాటింపబడినట్లు, రెండు దేశాలకూ అమూల్యమైన బహుముఖ సహకారపు సామర్థ్యం విషయంలో సోవియట్ యూనియన్, భారతదేశాలు ప్రగాఢమైన సంతృప్తిని ప్రకటిస్తున్నాయి. సోవియట్—భారత సంబంధాలు సార్వభౌమత్వం, సమానత్వం, స్వాతంత్ర్యం, పరస్పర గౌరవం, ఒక దేశపు వ్యవహారాల్లో మరొక దేశం జోక్యం కల్పించుకోకపోవడం అన్న సూత్రాలను కచ్చితంగా పాటించడంపైన ఆధారపడివున్నాయని ఆ ప్రకటన పేర్కొంది. ఆర్థిక, శాస్త్ర, సాంకేతిక రంగాల్లో ఉన్నత స్థాయి సహకారానికి ఉన్న విశేషమైన అవకాశాలను కూడా ఆ ప్రకటన గుర్తిస్తోంది.

ఆర్థిక సహకారంపై సంయుక్త సోవియట్—భారత ప్రభుత్వ కమిషన్ కార్యకలాపాలను, ప్రత్యేకించి రెండు దేశాల మధ్యా ఆర్థిక, శాస్త్ర, సాంకేతిక సంబంధాల విషయంలో నూతన రూపాలను కనుగొనడంలో యీ కమిషన్ చేసిన కృషినీ ప్రకటన ఉన్నతంగా అంచనావేసింది. ''వివిధ రంగాల్లో స్వయంసమృద్ధిని సాధించుకునేందుకు భారతదేశం చేస్తున్న ప్రయత్నాలకు సోవియట్ యూనియన్ చేస్తున్న గణనీయమైన దోహదాన్ని భారత పక్షం విశేషంగా అభినందిస్తోంది'' అని ప్రకటన పేర్కొంది.

1985 మేలో భారత ప్రధాన మంత్రి రాజీవ్ గాంధీకీ సోవియట్ యూనియన్ కమ్యూనిస్టు పార్టీ కేంద్ర కమిటీ ప్రధాన కార్యదర్శి ఎం. ఎస్. గొర్బచోవ్‌కీ మధ్య జరిగిన సంభాషణలు బహుముఖమైన సోవియట్—భారత సంబంధాల అభివృద్ధిలో మరొక పెద్ద ముందంజ. శిఖరాగ్ర సంభాషణల క్రమంలో సోవియట్ యూనియన్‌కీ భారత రిపబ్లిక్‌కీ మధ్య 2,000వ సంవత్సరంవరకు వున్న

దశకు ఆర్థిక, వర్తక, శాస్త్ర, సాంకేతిక సహకారపు ప్రధాన పార్శ్వాలను గురించి ఒప్పందంమీద సంతకాలు జరిగాయి. ఆ పత్రంలో సహకార పరిమాణపు గణనీయమైన విస్తరణనూ, సహకార రూపాల యితోధిక మెరుగుదలనూ, దాని సామర్థ్యపు పెరుగుదలనూ సూచిస్తోంది. ఆ సమావేశ ఫలితాలపైన సోవియట్–భారత సంయుక్త ప్రకటన "ఆర్థిక సహకారంలో గణనీయమైన పెరుగుదలను యిరు పక్షాలూ సంతృప్తితో గుర్తించాయి" అని పేర్కొని, 1985 మే 22న మాస్కోలో సంతకాలు జరిగిన పత్రాలు సోవియట్ యూనియన్‌కీ భారతదేశానికీ మధ్య ఆర్థిక సంబంధాలను యితోధికంగా విస్తరింపజేసి, మరింత ప్రగాఢం చేస్తాయన్న విశ్వాసం వ్యక్తంచెయ్యబడింది. పరస్పర సరుకుల మార్పిడి ఉన్నత పెరుగుదల రేట్లను గుర్తించిన రెండు దేశాలూ యీ రేట్లను భవిష్యత్తులో కూడా కొనసాగించాలన్న దృఢ సంకల్పాన్నీ, అంతే కాకుండా సరుకు సరఫరాల విస్తరణ వైవిధ్యాల ప్రాతిపదికపైనా, నూతన సహకార రూపాలను ప్రవేశపెట్టే ప్రాతి పదికపైనా ద్వైపాక్షిక వర్తక సామర్థ్యాన్ని యితోధికంగా పెంపొందించే మార్గాలను కనుగొనాలన్న దృఢ సంకల్పాన్నీ వ్యక్తంచేశాయి. రెండు దేశాల్లోనూ ఉత్పాదక శక్తులను యితోధికంగా మెరుగుపరచి, జాతీ యార్థిక వ్యవస్థకు సంబంధించిన సంశ్లిష్ట కర్తవ్యాలను పరిష్కరించుకు నేందుకు తోడ్పడే విజ్ఞాన, సాంకేతిక శాస్త్రాల్లో సహకారపు ఎడ తెగని విస్తరణను కూడా రెండు పక్షాలూ గుర్తించాయి. 1984 ఏప్రిల్‌లో విజయవంతంగా జరిగిన సోవియట్–భారత సంయుక్త అంతరిక్ష ప్రయాణం యీ సహకారపు సాఫల్యానికి ఒక సుస్పష్ట నిదర్శనం.

భారత్, సోవియట్ యూనియన్‌లు సంస్కృతి, విజ్ఞానశాస్త్రం, ఆరోగ్య సేవలు, సామూహిక వార్తా ప్రసార సాధనాలు, టూరిజం, క్రీడా రంగాల్లో తమ సహకారాన్ని భవిష్యత్తులో అభివృద్ధిచేసుకొని,

యితోధికంగా దృఢపరచుకోవాలన్న తమ సంకల్పాన్ని సంయుక్త ప్రకట నలో ధృవీకరించాయి.

దేశపు ఆర్థిక సామర్థ్యాన్ని పటిష్ఠం చేసుకోవడంలోనూ, తన శాస్త్ర, సాంకేతిక ప్రగతిని త్వరితం చెయ్యడంలోనూ సోవియట్ యూని యన్ చేసిన దోహదాన్ని భారతదేశం సమున్నతంగా అంచనా వేసింది. సోవియట్ యూనియన్ తన వంతులో, భారతదేశం తన జాతీయార్థిక వ్యవస్థనూ, తదితర కీలక ప్రాముఖ్యం కలిగిన రంగాలనూ సుదృఢం చేసుకొని అభివృద్ధిచేసుకోవడంలో భారతదేశానికి సర్వతోముఖ సహాయాన్ని కొనసాగించే విషయంలో, సంసిద్ధతను పునరుద్ఘాటించింది.

పాఠకులకు మనవి

ఈ పుస్తకం గురించీ, దీని అనువాదాన్ని గురించీ, కూర్పును గురించీ మీ అభిప్రాయాలను "ప్రగతి" ప్రచురణాలయానికి తెలుపండి

చిరునామా:

Progress Publishers
17, Zubovsky Boulevard
Moscow, USSR

మా ప్రచురణలు దొరికే చోట్లు:

విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్
విజ్ఞానభవన్ 4–1–425
బ్యాంక్ స్ట్రీట్
హైదరాబాదు – 500001

విశాలాంధ్ర బుక్ హౌస్
సుల్తాన్ బజారు
హైదరాబాదు – 500001

విశాలాంధ్ర బుక్ హౌస్
ఏలూరు రోడ్డు
విజయవాడ – 520002

విశాలాంధ్ర బుక్ హౌస్
కాలేజి రోడ్డు
అనంతపురం – 515004

విశాలాంధ్ర బుక్ హౌస్
11–1 – 37 గాంధీ రోడ్డు
తిరుపతి – 517501

విశాలాంధ్ర బుక్ హౌస్
సూపర్ బజారు ఎదుట
మెయిన్ రోడ్డు
విశాఖపట్నం – 530002

విశాలాంధ్ర బుక్ హౌస్
రమ్యన్ షాపింగ్ కాంప్లెక్స్
స్టీల్ ప్లాంట్ టౌన్‌షిప్
విశాఖపట్నం – 530039

విశాలాంధ్ర బుక్ హౌస్
మెయిన్ రోడ్డు
హనుమకొండ
వరంగల్ – 506011

విశాలాంధ్ర బుక్ హౌస్
మెయిన్ రోడ్డు
అరండల్ పేట
గుంటూరు – 522002





అంతర్జాతీయ ఆర్థిక సంబంధాల్లో నిపుణుడైన రచయిత యీ పుస్తకంలో భారతదేశ చరిత్రనీ, ఆర్థిక వ్యవస్థనీ సింహావలోకనం చేశాడు. వలస పూర్వ దశనుంచి యీనాటివరకూ భారతదేశపు ఆర్థికాభివృద్ధిలో ఎదురైన ప్రధాన సమస్యలనూ, ఘట్టాలనూ రచయిత విశ్లేషించి, భారతదేశపు ఆర్థికాభివృద్ధిలోని ప్రధాన ధోరణులనూ, దేశపు వివిధ చారిత్రక ఘట్టాల్లో అవి పొందిన మార్పులనూ చిత్రించాడు.

వ్యవసాయ సంబంధాలు, వ్యవసాయ సంస్కరణలు, పరిశ్రమ సాంఘికార్థిక నిర్మాణం, పునరుత్పత్తి క్రమపు బాహ్య, ఆంతరిక పరిస్థితులు అనే అంశాల అధ్యయనంపట్ల రచయిత విశేషమైన శ్రద్ధ చూపాడు.

ఈ పుస్తకం భారతదేశ ఆర్థిక విషయాలపట్ల ఆసక్తి వున్న పాఠకులను ఉద్దేశించి రచింపబడింది.